సిరి దివ్వెలు

శ్రీ బాలాజలధీశ్వర వైభవము



సహజకవితా కళాభిజ్ఞ, కావ్యకళాప్రపూర్ణ
డా. చింతలపాటి మోహన మురళీకృష్ణ

SIRI DIVVELU

SreeBaalaa JaladheeSwarasvaami Vaibhavamu

Author: Dr. Chintalapati Mohana Murali Krishna.,

April, 2022

Copies :500

Copies can be had from:
The Author

Price Rs. 200/-

Printer : ఫోన్ : **0883-2462565**

మోహన్ పబ్లికేషన్స్

అజంతా హెూటల్ ఎదురుగా, కోటగుమ్మం,
రాజమహేంద్రవరం - 1.

DEVULLU.COM

సిరిదివ్వేలు

శ్రీబాలాజలధీశ్వరస్వామి వైభవము

పద్యప్రబంధము(తాత్పర్య సహితము)

రచన

సహజకవితా కళాభిజ్ఞ , కావ్యకళాప్రపూర్ణ

డా. చింతలపాటి మోహనమురళీకృష్ణ .,

#23/175- A., రామానాయుడుపేట :: మచిలీపట్నం -521001



రచయిత జననీ జనకులు :

సంస్కృతకావ్యవ్యాఖ్యానమహోదధి, కవిశిఖామణి,

పండితరత్న, విద్వాన్ ,

కీ.శే. శ్రీ చింతలపాటి లక్ష్మీ నరసింహశాస్త్రి గారు

కీ.శే. శ్రీమతి చింతలపాటి కామేశ్వరి గారు

ఘంటసాల



సిరిదివ్వెలు కావ్యముద్రణకు ద్రవ్యదాతలు :

శ్రీ బండి పరాత్పర రావుగారు.,B.Tech.

శ్రీమతి బండి ధనలక్ష్మి గారు

ఘంటసాల

శ్రీ బండి పరాత్పరరావు, శ్రీమతి బండి ధనలక్ష్మి గారల దాతృత్వము

శ్రీబండి పరాత్పరరావు గారిది కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామం. వీరి తల్లితండ్రులు వెంకటరంగయ్య రత్నమాణిక్యం గారలు. తాత రామయ్య గారు. వారి అర్ధాంగి శ్రీమతి ధనలక్ష్మిగారు. వీరికిఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె డాక్టర్ శ్రీమతిరమ్య(పిల్లల డాక్టర్). రెండవ కుమార్తె శ్రీమతి శ్రావ్య MBA (గృహిణి). పరాత్పర రావుగారు ఇంజనీరింగ్ పట్టభద్రులు. ప్రస్తుతం ఘంటసాలలోనే ఉంటూ వ్యవసాయం మరియు వ్యాపారం చేసుకుంటున్నారు. పూర్వము ఉయ్యూరుచక్కెరపరిశ్రమనందు కొంతకాలం పనిచేశారు. తదుపరి కొన్ని ప్రవేటు సంస్థలయందు పనిచేశారు. వారి తండ్రి వెంకట రంగయ్య గారు సిరిదివ్వెలు కావ్య రచయితకు చిన్ననాటినుండిపరిచయస్తులు. కీ.శే. శ్రీ చింతలపాటి శాస్త్రిగారికి అత్యంత సన్నిహితులు. ఆప్తులు. ఎల్లవేళలా ఆత్మీయులుగా మెలిగినవారు. చింతలపాటివారికీ,ఘంటసాలగ్రామంలోనిబండివారికీదగ్గరస్నేహసంబంధాలున్నాయి. పరాత్పరరావుగారి పెదతండ్రి శ్రీ బండి వెంకటరత్నం గారు ఘంటసాల ఉన్నత పాఠశాల లో అవిచ్ఛిన్నంగా 40 సంవత్సరాలపాటు గణితశాస్త్ర ఉపాధ్యాయులుగా సేవలందించి నేటికీ 98 సం. ల వయసులో విద్యా ప్రమాణాల పెంపుదలకు కృషిచేస్తున్నారు. శ్రీ బండి వెంకటరత్నంగారుహైస్కూలుతరగతులలోచింతలపాటిమురళీకృష్ణగారికిగణితశాస్త్రాన్ని బోధించిన గురువులు. శ్రీ వెంకటరత్నం గారి కుమార్తె శ్రీమతి విజయలక్ష్మి, కుమారుడు విష్ణువర్ధన్ మురళీకృష్ణగారికి హైస్కూలు తరగతుల్లో సమకాలీనులు.

పరాత్పరరావుగారిదిమొదటినుండిసమాజహితవుకుపాటుబడేమనస్తత్వం. పదిమందికోసం పనిచేసేస్వభావంగల ఆలోచనాపరులు. సనాతనసంప్రదాయాలపట్ల,

భాషాసంస్కృతులపట్ల అపారమైనఅభిమానంకలవారు. విద్యావంతులు. వీరి సహధర్మ చారిణి శ్రీమతిధనలక్ష్మిగారు వీరికితగినఇల్లాలు. వీరిప్రోత్సాహంతోనే పరాత్పరరావు గారు అనేకసామాజికసంక్షేమకార్యక్రమాలకుసహకరిస్తూఉంటారు. ఘంటసాల గ్రామం లోని శ్రీ బాలాపార్వతీ సమేత జలధీశ్వర స్వామివారి పట్ల అత్యధిక భక్తివిశ్వాసాలు గల దంపతులు వీరు.

ఆస్ట్రేలియాలోని తెలుగుసంఘం-తెలుగుమల్లివారి ప్రోత్సాహంతో సిరిదివ్వెలు కావ్యం గురించి కావ్య రచయిత మురళీకృష్ణగారు అంతర్జాలంలో చేసిన ఉపన్యాసాలను వినిస్పందించి,శ్రీస్వామివారిపైఇంతటిమహత్తరకావ్యాన్నివ్రాసినందుకుతాముపులకితుల మయ్యామని రచయితనుఅభినందిస్తూ ఈ కావ్య ముద్రణకు తాము పూర్తిగా అవసరమైన ద్రవ్యాన్ని సమకూరుస్తామని, ఇది శ్రీ బాలాజలధీశ్వరస్వామి వారి కైంకర్యంలో భాగంగా తాము భావిస్తామనీ చెప్పి స్వామి కార్యంగా భావించి అండగా నిలబడ్డారు.

ఇప్పటికే ఆస్ట్రేలియాలో తెలుగుమల్లి వ్యవస్థాపకులు శ్రీ కొంచాడ మల్లికేశ్వరరావు గారు, వారిమిత్రులు, సహచరులైన తెలుగువారు, ఈ కావ్యముద్రణకు అన్ని ఏర్పాట్లూ చేస్తూ, కావ్యంపై పండితులు పెద్దల ముందుమాటల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో అనుకోకుండా మాఘపౌర్ణమినాడు ఘంటసాలలో శ్రీ జలధీశ్వరస్వామి వారికి గుడిలో కళ్యాణం జరుగుతుండగా శ్రీ బండి పరాత్పరరావుగారికి సంకల్పం కలిగి వెంటనే ఆస్ట్రేలియాలోని ఈకావ్య రచయితకు రాత్రి 12.30 గంటలకు ఫోన్ చేసి తమ నిర్ణయాన్ని తెలియజేసిఈమాటప్రకారంజరిపించండనికోరారు.ఇదిఈశ్వరసంకల్పంగానే తోచింది. ఇప్పటివరకుశ్రీకొంచాడరావుగారిని వెన్నుతట్టిన శ్రీ స్వామి ఒక్కసారిగా ఇలా ఘంటసాల నుంచే ప్రతిపాదనను పంపటం ఆ సమయాన్ని బట్టి దైవికంగానే తోచింది. ఎప్పటినుంచో ఈ కార్యక్రమంపట్ల పథకరచన చేస్తూ శుభకృత్ ఉగాదికి ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ నగరంలో సిరిదివ్వెలు కావ్యాన్ని ఆవిష్కరించాలని కోరుకున్న శ్రీ కొంచాడ

రావుగారుశ్రీ స్వామిసంకల్పాన్నికాదనలేకఅంగీకరించారు. అయితేపరాత్పరరావుగారే ముద్రింపించినా ముందు అనుకున్న ప్రకారం ఈ కావ్యాన్ని మెల్బోర్న్ లో కూడా ఆవిష్కరిద్దామని కోరారు. శ్రీ జలధీశ్వర స్వామి అనుగ్రహవిశేషానికి ఇదికూడా ఒక నిదర్శనంగా భావిస్తూ ఈ నిర్ణయాన్ని శిరోధార్యంగా స్వీకరిస్తున్నాను.

శ్రీ స్వామివారి దయకు ఈ విధంగా పాత్రులైన శ్రీ బండి పరాత్పరరావు, శ్రీమతి ధనలక్ష్మిగార్లకు, ఇందుమూలంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ఈ కావ్యాన్నిఇంతవరకుతీసుకువచ్చినిస్స్వార్థమైన భక్తిభావంతో ముద్రణాకార్యక్రమం వరకుతెచ్చిన మంచిమనిషి,చిరునవ్వుతోఅందరినీపలకరించే మృదుస్వభావి శ్రీ కొంచాడ మల్లికేశ్వరరావుగారికి పద్యవికాసం సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటు న్నాను.

21,Feb ,2022. బుధజనవిధేయుడు,

బ్రేకెన్ రిడ్జ్, **డా. చింతలపాటి**

క్వీన్స్ లాండ్ -ఆస్ట్రేలియా

సిరిదివ్వెలు-హృదయావిష్కరణ

"సిరిదివ్వెలు" కృష్ణాజిల్లా ఘంటసాలలో ఒకే పీఠంపై వెలసిన శ్రీ బాలా పార్వతీసమేత జలధీశ్వరస్వామివారి లీలావిశేషాల గురించిన వర్ణనాపూర్వకమైన భక్తి కావ్యం. ఇందులో మూడు ఆశ్వాసాలలో ముగ్గురు భక్తుల కథలు చెప్పబడినవి. ఆ క్రమంలో పార్వతీపరమేశ్వరుల మహిమలు వర్ణించబడినవి. ఇది ప్రబంధంగా వ్రాయబడింది కనుక సందర్భోచితంగా ప్రకృతి వర్ణనలు చేయబడినవి.

ప్రారంభంలోకావ్యంఎందుకువ్రాయబడిందో అవతారికలో చెప్పబడింది. 'శ్రీజలధీశ్వరుండొసగు సేవలగూర్చి రచింపుమంచు నుత్తేజితుజేయుచున్ పలికె దివ్య మహత్త్వముగల్గు బాల విద్యాజయశీల". అమ్మయనుజ్ఞమేరకు వ్రాయబూనితిని. సంప్ర దాయం ప్రకారం షష్ట్యంతాలలో బాలాపార్వతీ సమేత జలధీశ్వరస్వామివారికి ఈ కావ్య సమర్పణం చేసినట్లు వ్రాశాను.

కావ్యాన్నిగణపతిబీజాక్షరంతోప్రారంభించాను.బాలాజలధీశ్వరులకరుణార్ద్రదృష్టిని కొన్నిపద్యాలలోవర్ణించాను.ఆసందర్భంలోమహాన్యాసంలోనిపంచముఖధ్యాన శ్లోకాలను స్వేచ్ఛానువాదంగా తెలుగులోకి తెచ్చాను. కొంత తాత్త్వికచింతనను కూడా చేశాను. విగ్రహారాధనను గురించి, ఈశ్వరునికి లింగాకృతి గురించి చర్చించాను. వేదాంతార్థాన్ని క్లుప్తంగాపరిశీలించాను.బాలాంబనుకవిరాజవిరాజిత, మానినీ మందాక్రాంతా, శిఖరిణీ, మత్తేభ,శార్దూలవృత్తాల్లో కీర్తించాను. అంతలో శ్రీజలధీశ్వర స్వామికి భక్తులు సుప్రభాత సేవచేస్తుంటే స్వామినిసేవించటానికి మహాసరస్వతివిచ్చేసి వీణపై మంత్రపుష్పాన్ని వినిపి స్తుంది. అప్పుడు ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, పంచచామరాల్లో వాగ్దేవీ వర్ణన చేశాను.అప్పుడు సూర్యోదయవర్ణనను లయగ్రాహి,ఉత్సాహ,చంపకమాల,ఉత్పలమాల, సీసం,శార్దూలం,మానినివృత్తాల్లోలయబద్ధంగానర్తనానుకూలంగావర్ణించాను.తరువాత

ఘంటసాల పురవర్ణన చేశాను. ఆ ఊరిలో ఒక కామందు ఉండేవాడు. అతడు ఆడింది ఆట పాడిందిపాటగాసాగుతుండేది. అతడు గొప్పరసలోలుడు. బాగా పిసినారి. పిల్లికైనా బిచ్చంపెట్టడు. ఎంతోమంది సేవకులుపనులు చేస్తున్నా వారికి జీతాలివ్వడు. జలధీశ్వర స్వామి అర్చనలకైనా చిల్లిగవ్వ ఇచ్చేవాడు కాదు. ఏ ఒక్క అతిథినీ ఆదరించినవాడు కాదు. అతనివద్ద చెప్పుకోదగిన ఒక్కసుగుణంకూడా లేదు. కంటబడిన ఆడవాళ్ళని విడిచి పెట్టడు. అటువంటికీచకుడు. నాస్తికవాది.ఎవ్వరినీనమ్మడు. పెద్ద చుప్పనాతివాడు. చాలా తెలివిగలవాడు. మరి ఇటువంటి దుర్మార్గుని కథను చెప్పటానికి ఎందుకు ఎన్నుకున్నా వయ్యా అంటే: **'వీడొకండిట్టనరాదు. వీనివలె నెందరొనుండిరి.వీడు మచ్చుకే'**. అని సమాధానం.ఇలాధనగుప్తుడనేపేరుగలఆవ్యక్తినిగురించి చెబుతుంటే ఆ మహిళ ఆలయానికి వచ్చింది. ధనగుప్తుడు అక్కడే ఉండి ఆమెను చూశాడు. అంతే సింహంలేడినివేటాడినట్టు ధనగుప్తుడు ఆ మహిళను గుడిఆవరణలోనే ఎంగిలిచేసేశాడు. ఆమె తప్పించుకోలేక శ్రీ జలధీశ్వరుణ్ణిఆర్తితోమనస్సులో నిలుపుకొంది. అప్పుడు ఒకపెద్దదండం పట్టుకొని ప్రచండభానునివలె మండిపోతూ మీసాలుదువ్వుకుంటూ యమధర్మరాజులా వచ్చి ఆ ధనగుప్తుణ్ణి విసవిసా మోదేశాడు. అతడుఎవరో తెలియదు. మన్మథుణ్ణిహరించివేసినశివుడో!యముడో! కాలరుద్రుడో!ఆవనితపరమేశ్వరుడే తనను కాపాడాడనినమస్కారాలుసమర్పించుకుంటూ ఆదుర్మార్గుడికి శాపనార్థాలుపెడుతూ వెళ్ళిపోయింది. కానీ ఆగంతకుడు కొట్టినదెబ్బలకు ధనగుప్తుడు నోటమాటలేకుండా కుప్పకూలిపోయాడు.చేసినకర్మము చెడనిపదార్థము. చేరును నీవెంట అన్నట్లు ధనగుప్తుడు చేసిన పనికిఫలం అప్పటికప్పుడే అందుకున్నాడు. ఈశ్వరుడే యమునిగా వచ్చి తననుమోదాడేమోనని ధనగుప్తుని మనస్సులో అనిపించింది. ఇంకచేసేదిలేక కుప్పకూలినతనదేహాన్నిఎదురుగాఉన్న జలధీశ్వరస్వామిసన్నిధికి పాము దేహంగా ఈడ్చుకుంటూలాక్కెళ్ళాడు.వాడులేచినిల్చోలేడు.చేతులెత్తలేడు.నోట మాటలేదు. నీళ్ళు

త్రాగలేడు.ఆకలిదప్పులతోకనలిపోతున్నాడు.పట్టించుకున్నవాళ్ళులేరు.చావుబ్రతుకుల సందులోనలిగిపోతున్నాడు. అప్పటివాడి అవస్థ దయనీయంగా సీసాల్లో, మత్తకోకిల ల్లోను, మత్తేభశార్దూలల్లోనూ, ఉత్పలచంపకమాలల్లోనూ, వర్ణించబడింది. అప్పుడు వాడి మనస్సులో శంకరుణ్ణి గురించి రకరకాల భావాలు ఉప్పొంగాయి. లోకంలో తానొక్కడే తప్పుచేసినవాడనా అంటూ ఎంతో వాదంతో చర్చించుకుంటాడు. అయినాకూడా తనకు ఒకలాభమే జరిగిందనుకుంటాడు. తనదృష్టినిఇకపై అమ్మ వారిపైన, ఈశ్వరునిపైనే లగ్నం చేస్తానుఅనుకుంటాడు. ఆలా వాడు రెప్ప వాల్చకుండా జలధీశ్వరస్వామినేచూస్తూ చింతిస్తూ ఎక్కిఎక్కిఏడుస్తూఉంటాడు. అప్పుడు వాయువర్ణన చేయబడింది. కొంత గాలిపాటు తరువాత అమ్మవారు: **"నాథా వీనిన్ కడతేర్చుమెట్లయిన! సంత్రాసంబునన్ వీడు నిన్నే వీక్షించుచు నుండె నిత్తరిని వీనిన్ జంపినన్ వీడు దివ్యావాసంబును పొందునేమొ గనుమా"** అంటుంది. వీడుభయంతోనిన్నే చూస్తున్నాడు. వీణ్ణి చంపితే వీడు నీ దివ్యావాసాన్నిపొందుతాడు.కనుకవీణ్ణిఎలాగోఒడ్డుకుచేర్చు-అనిఅమ్మవారు అయ్యవారికి చెప్పింది. అంతలో సూర్యాస్త మయం అయింది. రాత్రి ఎలాఉందో వర్ణించబడింది. మనం అందరం సామాన్యంగా ఉంటే మనకు ప్రకృతిలో ప్రత్యేకత ఏమీ కనిపించదు. కానీ మనం బాధలో ఉంటే ప్రకృతి దానికి ప్రతిఫలిస్తుంది. కనుక రాత్రులు అందరకూతెలిసినవే అనుకోరాదు. **ఒక్కరోజును పోలి మరొక్కరోజు ఆకసంబున కనుపింప దనుట నిజము!.** చీకటియొక్క ప్రత్యేకత వర్ణించ బడింది**.** ఆ ఆరువాత చంద్రోదయవర్ణన చేయబడింది**.** ఆరాత్రివేళధనగుప్తునికి ఒకకలవచ్చింది**.** ఆకలలో జలధీశ్వరుడే కనిపించి **ఈశ్వరసన్నిధానమనియింతయుజంకకకావరమ్మునన్ నశ్వరమైన వాంఛ గొని నాశము నొందదలంచితేమొ! నిన్ శాశ్వతమైన రీతి యమసన్నిధి నిల్పెద; కానిజాలితోనీశ్వరినిన్నుగావు మనియెంతయుజెప్పదయన్ వహించితిన్** అంటాడు.నా సన్నిధానం లో నీవుచనిపోతే పుణ్యగతులు పొందుతావు. కనుక నువ్వు చేసినపనికి ఫలంగా నీకు పూర్ణాయువును

ఇస్తున్నాను. ఈ దురవస్థతో ఇలా అనుభవిస్తూ యమబాధలను ఇక్కడే అనుభవించుమని చెప్పి శివుడు మాయ మయ్యాడు.వాడు బాధతో దిక్కులు చూస్తూండగా తెల్లవారుతోంది.గ్రామంలోనిభక్తులుఒకొక్కరేవచ్చిస్వామికిసుప్రభాతంపాడటం మొదలు పెట్టారు. ఇక్కడ స్వామి సుప్రభాతం అనుష్టుప్, వసంతతిలకం, మంజుభాషిణి, తోటకం,భుజంగప్రయాతంఛందస్సుల్లో 58పద్యాలలో వర్ణించబడింది. ఎండఎక్కిన కొలదీ ధన గుప్తుడుగుటకలుమింగుతూచావుబతుకులమధ్య కొట్టుకొంటున్నాడు. వాణ్ణి చూసిన వాళ్ళు కర్మఅనుభవించకతప్పుతుందా అనుకోవటం మొదలుపెట్టారు. వాడు మాత్రం గొంతెత్తి ఏడుస్తున్నాడు. అంతలోఒక జంగమదేవుడు అటుగా వచ్చాడు. వాడికి తారక మంత్రాన్ని ఉపదేశించి వెళ్ళాడు. వీడి బాధ చూడలేక ఈశ్వరుడే ఇలావచ్చి సహాయంచేశాడని భక్తులు అనుకొన్నారు. వాడికి అన్నోదకాలిచ్చారు. వాణ్ణి ఇంటికి చేర్పించారు. దేవుడు అనుమతిస్తే ఆదరణకు తక్కువేముంటుంది? క్రమంగా వాడి దెబ్బలు తగ్గాయి. కుంటితనం పోయింది. ఇంకా వాడు తన దృష్టినంతా శివునిమీదనే లగ్నం చేశాడు. పంచాక్షరీమంత్రాన్ని తదేకదీక్షగా జపించటం మొదలుపెట్టాడు. కొన్నాళ్ళలో నడవటం మొదలుపెట్టాడు. కోలుకున్నాడు. తన ఆస్తినంతటినీ జలధీశ్వరస్వామి గుడికిరాసిచ్చాడు. ఇక్కడమానిని, భుజంగప్రయాతం, స్రగ్విణీ,వనమయూరం, మహాస్రగ్ధర, మంగళమహాశ్రీ వృత్తాలుచెప్పబడ్డాయి. వీడి కథవిని,చూసిభక్తులంతాబాలాజలధీశ్వరస్వామి అనుగ్రహాన్ని వినుతించారు. దీనితో మొదటి ఆశ్వాసం పూర్తవుతుంది.

భక్తులు జలధీశ్వరస్వామిని సేవిస్తూఉన్న సందర్భంతో రెండవ ఆశ్వాసం మొదలవుతుంది. ఆలయంలో జరుగుతున్న పూజలను చూశాక జీవాత్మ, పరమాత్మల వివేకాన్ని గురించిన తాత్త్వికచింతన కొంత కలుగుతుంది. భక్తులు చేసే పరమాత్మస్తుతి చాలా ఆర్ద్రంగా ఉంటుంది.

మాయాజాలము నీదలేనుర శివా మన్నించి కాపాడరా-నీయందే మది లగ్నమై నిలువగా నీరూపు యోజించి నిన్నే యర్చించుచు నుంటి పల్కుల భవానీశక్తి మంత్రార్చనా-ధ్యాయంబొప్పగ నాశిషమ్ము లిడరా తద్భావ మేపారగన్ అంటూభక్తితో స్వామిని కీర్తించే భక్తుల్ని చూస్తే పారమార్థికచింతన పరాకాష్ఠకు చేరుతుంది. . **దేహమనన్ రథమ్ము; గుణధీయుతి సారథి; ఇంద్రియమ్ములే -గ్రాహక గుఱ్ఱముల్; మనసు కళ్ళెము;నాత్మ రథిప్రకారమై-దేహముతోలుచుండు; నిది తిన్నగ నేగిన మోక్షగామియై- మోహపథమ్మువీడి యనుమోదమునొందును యాత్మ దైవమై!** అని చెప్పిన ఉపనిషత్ వాక్యానుసారంగా ప్రతివారిలోనూ ఈ దేవాలయానికి వచ్చేసరికి ఆధ్యాత్మ చింతన కలుగుతుంది. ఇక్కడ సాధారణంగా వాడే ఛందస్సులతోపాటుక్రౌంచపదం(కొంగలకుటిలగతి),లాక్షణీ,వంటి ప్రత్యేకఛందస్సులు అందం గాఒదిగిపోయాయి.ఇలారెండవ ఆశ్వాసంలో శివభక్తి పూరితం గా 50 పద్యాలవర్ణనజరిగింది. తరువాత జలధీశ్వరాలయంలో అర్చనచేస్తున్న భక్తుల్ని నాస్తికత్వం బలిసిన ఒక మూర్ఖుడు గాలినాయుడనేవాడు నిందించ సాగాడు. **పూజల్ గీజల నేమియౌను**? అంటూ రకరకాలుగా ఆక్షేపించాడు.ఐహికభోగాలనుఅనుభవిస్తూజీవితాన్ని ఉపయోగించుకోవాలిగానీ మునీశ్వరుల్లా ముక్తి అంటూ దిగులుపడుతూ కూర్చుంటే లాభమేమిటి? పైకి ఎవరైనా ఎన్నయినా కథలు చెబుతారు. అలా చెప్పాలి. అంతవరకే గానీ నిజంగా దానికోసం సుఖాలన్నీ వదిలేస్తామా? అంటూ భోగలాలసత్వాన్ని కొనియాడుతాడు. లోకంలో అనుభవించాలంటే రాజకీయాలు మంచి లాభసాటి వ్యాపారం అని వాడు రాజకీయాల్లోకి వస్తాడు. ఇక్కడ ఉత్సాహవృత్తాలు వర్ణించబడినాయి. మంచి ప్రణాళికతో వాడు రాజకీయాల్లో అత్యున్నత స్థాయికి చేరాడు. తన వ్యాపారాలన్నిటినీ పెంచుకున్నాడు. బాగా ధనసంపాదన చేశాడు. మందు-పొందు సంస్కృతికి బాగా బానిస అయ్యాడు. తాను చూసినకాంతను సుఖపెట్టకుండా విడువని నైజాన్ని అలవాటు చేసుకున్నాడు. ఇక్కడ మత్తకోకిల వృత్తాల్లో వాడి ఆగడాలను వర్ణించాను. వీడికి ఒక కొత్తరోగం వచ్చింది. **కొత్తరోగము వచ్చినంతనె కూడరాదట ఎవ్వరిన్ -హత్తుకొన్నను మాయరోగము అంటునంట సరాసరిన్** అంటూ ఆ రోగతీవ్రతను చెబుతూ **ఇట్టిరోగము వచ్చినంతనె ఇంటనుండవలెన్ సదా** అంటూ

ప్రస్తుతం వచ్చిన కరోనా ప్రసక్తిని తొమ్మిదేళ్ళ క్రిందట ఇక్కడ చెప్పటం జరిగింది. ఇంకా ఇక్కడ లాటీవిటం, ధ్రువకోకిల, మత్తకోకిల ఛందస్సులలో గాలినాయుడి సుఖానుభవాల్నీ, వ్యాధి బాధల్ని వర్ణించాను. చివరికి వాడు నరాలపటుత్వాన్ని కోల్పోయాడు. ఎందుకూ పనికిమాలిన వాడుగా తయారయ్యాడు. ఎన్నిరకాలవైద్యాలు చేయించినా వాడికి ఫలితం కలగలేదు. ఒళ్ళంతా కృశించిపోయింది.అయ్యోపాపంఅనేవాళ్ళులేకపోయారు.దేవుడా-గీవుడాఅనితిమ్మిరెక్కి మాట్లాడిన మాటలఫలం అనుభవంలోకివచ్చింది. మంత్రిపదవులు, అధికారాలు అన్నీ దూరమయ్యాయి. వాణ్ణి కాపాడేనాథుడులేకపోయాడు. అంటే ఇక్కడగాలినాయుడు ఒకపాత్ర మాత్రమే. ఇలాంటి వాళ్ళు లోకంలో ఎందరో ఉన్నారు. వాళ్ళకి ప్రతిగా ఈ పాత్ర అనుభవాలు చెప్పాను. అటువంటి వాడు ఎక్కడా దిక్కూ మొక్కూలేక చివరికి జలధీశ్వరుడే దిక్కని స్వామిగుడిలోకి చేరాడు. ధ్వజస్తంభందగ్గరకూర్చునిశివశివా అంటూ ధ్యానంచేయటం మొదలుపెట్టాడు. సంఘమంతా ఛీకొట్టటంతో పశ్చాత్తాపానికి లోనయ్యాడు. ఒళ్ళంతా పుండ్లయి దేహం ఛిద్రమైపోయింది. తన గతచరిత్రను తలచుకొని ఎంతగానో పరితపించాడు. ఇక్కడ అభినవ తామరసము(తోవకము), పాలాశదళము, మణిగణ నికరము, వంశస్థమువంటి నూతన ఛందస్సులను వ్రాశాను. ఇంకా దిక్కులేదనుకొని, జలధీశ్వరస్వామిని మనసులో నిలుపుకొన్నాడు. గుడిలో భక్తులు చదువుతున్న మంత్రార్థాలను శ్రద్ధగాఆలకించి బుర్రకెక్కించుకున్నాడు. భక్తులు చేసే హోమాలలో తాదాత్మ్యాన్ని పొందాడు. తానేచేస్తున్నట్లు మనసునుకలిపాడు. కాలానుగతంగా కలిసివచ్చిన శివరాత్రీ మహోత్సవంలో శివరాత్రీవ్రతాన్ని గ్రహించాడు. అదంతా అతని పూర్వజన్మకర్మ ఫలం. ఇప్పటికి అతని బుద్ధి సరైనదారికి మళ్ళింది. కానీ దేహం నిలిచే స్థితిలో లేదు. కూలిపోయాడు. అయినా శివనామస్మరణం మానలేదు. అప్పుడు వాడికి మనస్సులో ఒక సిద్ధుడు కనిపించాడు. గతజన్మ లో ఈ గాలినాయుడు మహాశివుణ్ణిభక్తితోసేవించి స్వామిని తనకు స్వర్గసుఖాలు కావాలని కోరుకొన్నాడు. అన్నీ అనుభవించి చివరకు శివుణ్ణి చేరుకోవాలని కోరుకొన్నాడు. దాని ఫలితంగా ఈ

జన్మలో ఇవన్నీ లభించాయనీ, కానీ భోగలాలసతలోపడి ఈశ్వరుణ్ణి మరిచిపోయి తూలనాడాడని గుర్తుచేశాడు.మహాపాపాలుచేసినగోరింట పూర్వపుణ్యఫలంగాస్త్రీలచేతులపైరక్తిమ పొందే వరం పొందినట్లు గాలినాయుడు కూడా కొంత ఫలాని పొందాడనిచెప్పి అంతర్థానమయ్యాడు. తెల్లవారాక వాడి మనసు చాలా చైతన్యమైంది. వానిలోనిఆత్మ వాడికి శివపంచాక్షరీదీక్షను స్ఫురింపజేసింది. ఆ మంత్రాన్ని వాడు గుడిలోనే ఒకచోట కూర్చుని ఎన్నేళ్ళు జపించాడోగానీ చివరకు వాడిరోగాలన్నీ తగ్గిపోయాయి. వాడిదేహం ఆరోగ్య వంతమైంది. బాలా జలధీశ్వరులను అలాభక్తితోసేవించటంవలన వాడు తిరిగి కోలుకున్నాడు. ఇక్కడ తురగము, కమలవిలసితము, మంగళమహాశ్రీ వంటి ప్రత్యేక ఛందస్సులను వ్రాశాను. మళ్ళీ ఇలాంటి తప్పులు చేయకుండా జాగ్రత్తగాఉండమనిబాలాజలధీశ్వరులువాణ్ణిదీవించారు.దీనితో రెండవ ఆశ్వాసం పూర్తయింది.

ఇక మూడవ ఆశ్వాసం కూడా ఈశ్వరస్తుతితోనే మొదలుపెట్టాను. ప్రత్యేకత ఏమంటే ఇక్కడ పంచాక్షరీ స్వరూపవర్ణనం న,మ,శి,వ,య లలోని అంతరార్థాన్ని వివరించాను. **ఓం నమో భగవతే రుద్రాయ** అనటంలోని విశేషాన్నికూడా వివరించాను. పరమాత్మ దర్శనంకోసం విలపించే భక్తహృదయాన్ని ఆవిష్కరించాను. ఏకాగ్రచిత్తంతో ఆత్మదర్శనాన్ని పొందాలని వర్ణించాను. మహాన్యాసంలోని ధ్యానశ్లోకం **ఆపాతాళ నభస్థలాంత భువనవ్యాపిని** దర్శించే మార్గాన్ని చర్చించాను.మానవమేధాశక్తినివివరించాను.అహంకారంతోచెలరేగిపోతూఅహంఅంటే ఎవరో తెలుసుకోలేకపోవటంమంచిదికాదన్నాను.కులమతభేదాలతోవాదులాడుకుంటూ కాలహరణం చేయటంతగదన్నాను. ఆశలకులొంగటంమంచిదికాదన్నాను. లోకం పోకడను విమర్శించాను.

ఇలాఅరవైపద్యాలలోప్రస్తావించాను.అప్పుడుశివశర్మఅనేఆధ్యాత్మవిదునికథనుప్రారంభించాను నిత్యరుద్రార్చనా నిపుణుడైన అతనికి ఐహిక వాంచలు లేవు. ఆస్తిపాస్తులు లేవు. రోజు గడిచే దారిలేదు. అయినా చింతలేక ఉంటేతినటం. లేకపోతే పస్తులుండటం. అభిమానించినదాతలు

పోనీలే పుణ్యాత్ముడని తమకున్నంతలో శివశర్మఇంటికి పదార్థాలు పంపేవారు. ఎలాగో రోజులు గడిచిపోతున్నాయి. కానీ జలధీశ్వరునికి ఒక ఆలోచన కలిగింది. శివశర్మను పరీక్షించాలను కున్నాడు. అతనికి భక్తజనం అందించే పదార్థాల సరఫరాను నిలిపివేసే బుద్ధి పుట్టించాడు. పైగా ప్రజలు అతణ్ణి విమర్శించేలా బుద్ధి పుట్టించాడు. శివశర్మకు ఈ వస్తువులు, ఆహారం ఎంత మాత్రం అందటం లేదు. అయినా శివశర్మ తన నిత్యదీక్షను విడువలేదు. అన్నపానీయాలకోసం ఎవరినీ అర్థించలేదు. తన భార్యనుకూడా పట్టించుకోలేదు. ఆవిడకూడా భర్తమార్గంలోనే నడిచే ఇల్లాలు. తానుకూడా ఉపవాసాలుండటం చేసేది. కొన్నాళ్ళలో ఇద్దరూ పూర్తిగా నీరసించి పోయారు. కానీ శివదీక్షను మానలేదు. చివరికి ప్రాణాలు పోయే పరిస్థితివచ్చింది. అయినా అతడుమౌనంగా శివదీక్షతో మసలసాగాడు. శివునికి దయకలిగింది. అమ్మవారి అనుజ్ఞయైంది. శివశర్మ భౌతికదేహాన్ని విడిచివెళ్ళిపోయాడు.అతనిఇల్లాలుకూడా దేహాన్నివిడిచి భర్తను అనుస రించింది. ఈలోపు ప్రజలలో మార్పువచ్చింది. తాముతప్పుచేశామని గుర్తించారు. మహాభక్తుణ్ణి అవమానపరిచామని తెలుసుకున్నారు. తప్పుదిద్దుకోవటానికి ఇనుమిక్కిలిగా పదార్థాలను శివశర్మకుపంపారు. కానీ అప్పటికే శివశర్మ శివసాయుజ్యాన్ని పొందాడు. భక్తితో జలధీశ్వరుణ్ణి నమ్మినశివశర్మనుభక్తులు,ప్రజలుకొనియాడారు. జలధీశ్వరుని భక్తత్రాణపరాయణతను వేనోళ్ళ స్తుతించారు. ఈ కథాసందర్భంలో విశేషమేమంటే శివశర్మ చేసిన స్తోత్రంగా తెలుగు ఛందస్సు లో లేనిది- సంస్కృతానికే ప్రత్యేకతను తెచ్చిన ఛందస్సు అశ్వధాటీ వృత్తం. తెలుగు-సంస్కృత ఛందోగ్రంథాలలో చాలాచోట్ల దీనివిశేషంలభ్యంకాలేదు.అలాంటి వృత్తరచనకు అమ్మవారు నన్ను ప్రేరేపించి వ్రాయించుకుంది. ఇదినాస్వీయఅనుభవం. మొత్తం మీద సాధారణ ఛందస్సు లతో కలిసి 36 రకాల ఛందస్సులను ఈ కావ్యంలో ప్రయోగించాను. ఇందువలన ఈ కావ్యం పాడుకోవటానికి అనువుగా సమకూరింది. చక్కని కథావిశేషంతోపాటు గొప్ప ఆధ్యాత్మిక భావన అడుగడుగునా ప్రకృతివర్ణనలతో సరళమైన తెలుగు భాషలో అందరికీ అందుబాటులో ఉండేలా పేరుకుపద్యమైనా సులభగ్రాహ్యంగాసాగినరచన శ్రీబాలాసమేత

జలధీశ్వరస్వామి వారి అనుగ్రహ తత్త్వం . సకలలోకాలకు దివ్యానుభవ మహత్త్వం. తృప్తిగా చదివి ఆనందించండి.

బ్రేకేన్ రిట్జ్, క్వీన్స్ లాండ్-ఆస్ట్రేలియా.

భవదీయుడు,
డా. చింతలపాటి.

సిరిదివ్వెలు

ప్రథమాశ్వాసం

పద్యసంఖ్య

రెండవ ఆశ్వాసం

మూడవ ఆశ్వాసం

ఈకావ్యంలోని3ఆశ్వాసాలలో ఉపయోగించినఛందస్సులను- తొలిగా ఉపయోగించిన సందర్భంలోతాత్పర్య వివరణలో వాటిలోనిఛందోవిశేషాలువివరించబడినవి. మరియు గ్రంథాంతమున ఈ ఛందస్సులన్నీ వివరించబడినవి.

డా. మండలి బుద్ధప్రసాద్
మాజీ ఉపసభాపతి, మాజీ మంత్రి
ఆంధ్రప్రదేశ్

Ph.Off.:08671-272056
Cell: 98487 80872
గాంధీక్షేత్రం, అవనిగడ్డ-521121,
కృష్ణాజిల్లా

Dr.MandaliBuddha rasad
Former Deputy Speaker &
Former Minister,Andhra Pradesh

Gandhi Kshetram
Avanigadda-521121
Krishna District



డా. మండలి బుద్ధప్రసాద్
పూర్వపు ఉపసభాపతి:: ఆంధ్రప్రదేశ్

దివి సిరులు:: సిరిదివ్వెలు

శ్రీలు పొంగే సిరులు చిందే భాగ్యసీమ మాదివిసీమ. సంగీత సాహిత్యాలకు, లలితకళలకు, పట్టుగొమ్మ. దివిసీమ రత్నాలుగా వెలుగొందుతున్న కవులు, గాయకులు, కళామూర్తులు తరతరాలుగా ఎందరెందరో విశ్వవిఖ్యాతులైనారు. దివిసీమలోని కొన్ని గ్రామాలకు ప్రపంచమహానగరాలకు మించిన ప్రసిద్ధి, కీర్తిప్రతిష్ఠలు లభించాయి.వేదపురాణఇతిహాసచరిత్రలలో అవి ధ్రువతారలుగా వెలుగొందుతున్నాయి. వాటిల్లో పేర్కొనదగిన ఘంటసాలగ్రామానికి ఎన్నోప్రత్యేకతలున్నాయి. ఎందరో ప్రముఖు లున్నారు. జలధీశ్వరస్వామివారు, బాలాపార్వతీఅమ్మవారు ఒకేపీఠంపై దర్శనమిచ్చే శివ శక్తిపీఠం దేశంలోనే మరెక్కడా లేదు. ఆఊరు ఒకప్పుడు సముద్రవ్యాపారానికి ముఖ ద్వారం. అమరగాయకుడు ఘంటసాలవంశపెద్దలు జలధీశ్వరస్వామి గుడిలో అర్చ కులు. శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారు, శ్రీచింతలపాటి లక్ష్మీనరసింహశాస్త్రిగారు మొదలైన మహాత్ములు ఆ ఊరివారే. మానాన్నగారికి ఆత్మీయులే. మానాన్నగారికి ప్రియమిత్రులైన

చింతలపాటివారికుటుంబంతోమాది తరతరాలఅనుబంధం. సత్కవులైన శ్రీ చింతలపాటి మురళీకృష్ణగారు సిరి శీర్షికతో మాసీమక్షేత్రచరిత్రవిశేషాలు కావ్యాలుగా రచించి సుప్రసిద్ధ లైనారు. మానాన్నగారికి, నాకు వానిలో కొన్ని అంకితం ఇచ్చిన ఆత్మీయులు చింతలపాటివారు. ఇప్పుడు వారి స్వగ్రామమైన ఘంటసాల క్షేత్ర విశేషాలను వివరిస్తూ రచించిన సిరిదివ్వెలు ప్రబంధాలక్షణాలతో చక్కని వర్ణనలతో ఆధునిక ప్రబంధంగా వెలుగొందుతోంది. పద్యసాహిత్యంలో ప్రబంధం రారాజు. వివిధ ఛందస్సులలో భావనా బంధురంగా ప్రబంధరచనచేయటం పద్యసాహిత్యానికి పట్టంగట్టటం అభినందనీయం. తెలుగుభాషాసంస్కృతులవైభవాన్నితెలిపే ఖండకావ్యరచనలపోటీలలో చింతలపాటివారి కావ్యానికి బహుమతి లభించినందుకు మండలి ఫౌండేషన్ వారికి అభినందనలు తెలుపు తోంది. తెలుగుభాషాసంస్కృతుల పునరుజ్జీవనానికి చింతలపాటివారు వారి ఖండకావ్యం లో ఎన్నో సూచనలు చేశారు.


సిరిదివ్వెలు ప్రబంధాన్ని తాత్పర్యసహితంగా ముద్రించటం చాలా బాగుంది. ముందు తరాలవారికి పద్యపఠనానికి తాత్పర్యం మార్గదర్శకంగా ఉంటుంది. తెలుగు భాషా సంస్కృతులు, చరిత్ర మొదలైనవన్నీ తెలుగుపద్యంలో నిక్షిప్తమై ఉన్న కారణంగా ప్రవాసాంధ్రులు, నివాసాంధ్రులు ఎన్నివందల వేల సంవత్సరాలకైనా తెలుగు పద్యాన్ని వదలకూడదు. ఘంటసాల క్షేత్ర మాహాత్మ్యాన్ని ప్రబంధంగా అందిస్తున్న ఆత్మీయులు బ్రహ్మశ్రీ చింతలపాటి మురళీకృష్ణగారికి అభినందన మందారాలు.మరిన్ని రచనలతో వారు ఆంధ్రసాహిత్యక్షేత్రాన్ని సస్యశ్యామలం చేయాలని నా ఆకాంక్ష. శుభాకాంక్ష!!

అభినందనలతో -

22-02-2022

మండలి బుద్ధప్రసాద్

గాంధీక్షేత్రం, అవనిగడ్డ,



ఆస్ట్రేలియా తెలుగుసంఘం-తెలుగుమల్లి : **మల్లికేశ్వర రావు కొంచాడ**

సాహి వాజ్మికి నీరాజనం

2020 లో వంగూరి ఫౌండేషన్ వారు నిర్వహించిన ఏడవ ప్రపంచ సాహితీ సదస్సు సందర్భంగా ఆస్ట్రేలియా మరియు న్యూ జిలాండ్ ప్రతినిధిగా నన్ను నియమించడం జరిగింది. అప్పట్లో ఒక సాహితీ ప్రతినిధిగా ఇదివరకు నిర్వహించిన బాధ్యతే గదా అని ఒక సదవకాసాన్ని అందిపుచ్చుకొని నా ప్రయాణం మొదలుపెట్టాను. యాదృచ్ఛికంగా ఈగ్రంథకర్తడా.చింతలపాటిమోహనమురళీకృష్ణగారుఆస్ట్రేలియాలో ఉండటం మూలాన సదస్సు నడానికినన్నుసంప్రదించడంజరిగింది. ఆశుభఘడియలు మా ప్రయాణా నికి మహోజ్వలమైన బాట వేస్తాయని ఊహించనే లేదు. సుమారు ఏడాదిన్నర కాలంలో శ్రీచింతలపాటివారిసాహచర్యంలో తెలుగుమల్లి అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు నా సాహితీజీవితంలోమరపురానిమైలురాళ్లు.అలాగేవారిద్వారా పద్యరచన లో నేర్చుకున్న మెళుకువలు కోకొల్లలు.

ఆస్ట్రేలియా మరియు న్యూ జిలాండ్ దేశాలలోని తెలుగువారు గత తొమ్మిదేళ్ళుగా తెలుగుమల్లిని ఆదరిస్తూ, అభిమానిస్తూ సాహితీ విలువలను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకొని సాహిత్యంలోమెళకువలుతెలుసుకుంటూముందుకునడుస్తున్నారు. ఈ ప్రక్రియ లో గతరెండేళ్లుగాసాగుతున్నపద్యరచన ఒకసుమధురఘట్టం.అయితేపద్యరచన మరింత పటిష్టంగా రసవత్తరంగా జరగడానికి మంచి పదజాలం మరింత

తోడ్పడుతుందని కావ్య ప్రవచనాలు వినడంద్వారా ఈకోరికను తీర్చుకోవచ్చన్న ఆకాంక్షఅందరిలోనూ కలిగింది. ఈ నేపథ్యంలో శ్రీ చింతలపాటివారు ముందుకొచ్చి తెలుగు పంచకావ్యాల ప్రవచనం నాలుగు నెలలు ఏకధాటిగా నిర్వహించి ఇక్కడి తెలుగు వారందరినీ ఉత్సాహ పరిచారు. కావ్యరసామృతాన్ని అందించి కృతకృత్యులయ్యారు.

ఈ పరంపరలో శ్రీ చింతలపాటి వారు వ్రాసిన "సిరిదివ్వెలు" కావ్యం ప్రస్తావన రావడంజరిగింది. సాధారణంగా పూర్వ కవులు వ్రాసిన కావ్యాలు ఆధునిక కవులు వివిధ మాధ్యమాల ద్వారా వివరించడం జరుగుతుంది. స్వీయ రచనలో 2,000 సంవత్సరాల చరిత్ర కలిగి పార్వతీపరమేశ్వరులు ఒకే పీఠంపై ఉన్న శ్రీ బాలా సమేత జలధీశ్వర స్వామి వారిపై అనన్యసామాన్యమైన భక్తిప్రపత్తులతో606 పద్యాలకావ్యం 'సిరిదివ్వెలు'ను వారు చెప్పగావినాలని శ్రోతలందరూ అడుగగారెండునెలలు ఈకావ్యప్రవచనం జరిగింది.

ఈ కావ్యంలోని పద్యశిల్పం, కథాగమనం, పదబంధం, ఛందస్సుతీరు, వర్ణనాంశాలు – ఇలా ఎన్నోవిధాలుగా శ్రోతలప్రశంసలు అందుకొని ఆ వాఙ్మయే చేయిపట్టి వ్రాయించి నట్లుంది. ఈ కావ్యంలోని 36 చందస్సులు (కొన్ని సామాన్యంగా వాడుకలో లేవు) వాటి నడకవిని శ్రోతలందరూ పులకించిపోయి పునీతులయ్యామని పరవశించి పోయారు. ఇంతటి మహోత్కృష్టమైన భాషకు వారసులమని ఎంతో ఆనందించారు. కళ్ళనీళ్ళ పర్యంతమై పెదవి దాటని మధురానుభూతులను వ్యక్తం చేసారు. ఈ కావ్యం సాహితీ విలువలను సంతరించుకొని భక్తి తత్వానికి పరాకాష్ఠగా నిలిచింది.

ఆధునిక కవి యని అపోహలో ఉన్నవారందరూ ఈ కావ్యంలోని పద్యాలు విన్న తరువాత శ్రీచింతలపాటివారు తప్పకుండా మన పూర్వకవుల కోవకు చెందినవారేనని ఈ కావ్యం ముద్రితమై తప్పకుండా ప్రతీ ఒక్కరూ చదవవలసినదేనని పదే పదే అన్నారు.

తెలుగుమల్లి ఈకావ్య ముద్రణబాధ్యతను తీసుకొని శుభకృత్ ఉగాదికి ఆవిష్క రించాలనిసంకల్పించింది. అయితే ఈశ్వరసంకల్పం వల్ల ఈ సదవకాశాన్ని ఘంటసాల

స్థానికులు, భక్తులు శ్రీ బండి పరాత్పరరావుగారు కోరటంతో తెలుగుమల్లి వారికి ఈ అవకాశాన్ని అందించి ఇతరత్రా సహాయ సహకారాలకు తెలుగుమల్లి సిద్ధంగా ఉందని తెలిపింది. ముందు అనుకున్న ప్రకారంగా తెలుగుమల్లి ఆధ్వర్యంలోనే శుభకృత్ ఉగాదికి మెల్బోర్న్ నగరంలో ఈ కావ్యాన్ని ఆవిష్కరించాలని నిర్ణయించాం. ఈ అవకాశాన్ని మాకు ఇచ్చిన గ్రంథకర్త 'కావ్యకళాప్రపూర్ణ' శ్రీ చింతలపాటి మోహన మురళీకృష్ణగారికి కృతజ్ఞతాభినందనలుతెలుపుకుంటున్నాము.ఈకావ్యంవెలుగు చూడటంలో సహకరించి, ప్రోత్సహించి,చేయూతనందించిన మాపద్యవికాస సభ్యులందరికీ కృతజ్ఞతలు.

24-02-2022., **మల్లికేశ్వర రావు కొంచాడ**

మెల్బోర్న్ ., **తెలుగుమల్లి సంపాదకులు, ఆస్ట్రేలియా**



గొర్రెపాటివెంకట రామకృష్ణ ., **ఘంటసాల**

పూర్వపుఉపాధ్యక్షులు, 18-02-2022.

కృష్ణాజిల్లా పరిషత్.

బాలా జలధీశ్వరుల చిరునవ్వులు-ఈ సిరిదివ్వెలు

సిరిదివ్వెలు కావ్యం ఘంటసాలగ్రామానికి చెందిన పండితకుటుంబ వారసుడుగా ప్రపంచంలో ఉన్నటువంటి తెలుగుగానీ,హిందీగానీ,ఇంగ్లీషుగానీ భాషల్లో అనర్గళంగా మనకావ్యాలను చెప్పగలిగినటువంటి పండితులు డా. చింతలపాటి మురళీకృష్ణగారిచే విరచిత సిరిదివ్వెలు కావ్యం గురించి రెండుముక్కలు చెప్పటం నాకు చాలాచాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా ఘంటసాల గ్రామం అత్యంత పురాతనమైన గ్రామం. దాదాపుగావేలాది సంవత్సరాలనాడే ఇది ఒకమహానగరంగా వెలిగి సముద్రపు ఒడ్డున ఉండి అగస్త్యమహామునిచే ప్రతిష్టించబడినటువంటి శ్రీ బాలాపార్వతీసమేత జలధీశ్వర స్వామివారు ఏకపీఠంమీద ఉన్నటువంటిచరిత్రను ఈరోజున ఆవిశేషాలను మహాత్మ్యాలను అన్నిటినీకూడా పొందుపరిచి సిరిదివ్వెలు అనే పుస్తకానికి రూపకల్పన చేసినటువంటిమాగ్రామపండితులుమురళీకృష్ణగారికి మరొక్కసారి శుభాభినందనలు తెలుపుతూ జలధీశ్వరస్వామి దేవాలయం గురించికూడా చెప్పటం ఈగ్రామంలో ఉన్నటువంటి ఒక స్ఫూర్తివంతమైనఅంశం. ఈదేవాలయమాహాత్మ్యం గురించి నావ్యక్తిగతమైన అనుభవం చెప్పటం నాబాధ్యత. నేను1960లోపుట్టాను. మేంమా చిన్నతనం నుంచీ ఈ దేవాలయం వద్ద ఆడుకునేవాళ్లం. కానీ భక్తులు ఎవ్వరూకూడా ఇక్కడకు రాని పరిస్థితి. ఏమాత్రం

ఆదరణలేని పరిస్థితి. నాకు 40 ఏళ్ళు వచ్చేసరికి, అంటే 2000 సంవత్సరం వచ్చేసరికి దీనిమీద ఏదైనా దృష్టిపెట్టాలి. ఈఊళ్ళో పుట్టినందుకు ఏమైనాచేయాలి అని నేను నా మిత్రులవద్ద అన్నప్పుడు చాలామంచిది అని ప్రోత్సహించారు. అప్పట్లో ఈ గుడి ముందు గ్రామపంచాయతీ కార్యాలయం, లైబ్రరీ భవనం, సహకారసంఘభవనం, ఇంకా పబ్లిక్ ఆడిటోరియంఅన్నీఉండేవి.వీటన్నిటినీకూడాతీస్తేమళ్ళీఈదేవాలయానికి పూర్వ వైభవం వస్తుందని 2000 సంవత్సరంలో మొదలుపెట్టినఅభివృద్ధిపనుల్లోభాగంగా ప్రభుత్వ కార్యాలయాలుఎన్నిఉన్నా, నిబంధనలు ఎలాఉన్నా వాటిని తోసిరాజని, అవన్నీ వేరేచోటికి మార్పు చేయించాం. ఇందుకు భగవంతుడు సహకరించాడు. అదేకాకుండా మేం ఏదాతనీకూడా ప్రత్యేకంగా ఇంత అని అడగకుండాఉన్నా దాతలు చాలామంది ముందుకొచ్చి, దాదాపుగా ఈనాటికి కోటి రూపాయలతో దేవాలయంలో అన్ని నిర్మాణాలు, ప్రభుత్వాలనుంచి యేరకమైన సహాయమూ లేక పోయినా కేవలం భక్తుల విరాళాలతోనే ఈరోజున దేవాలయం అన్ని సౌకర్యాలతోనూ సుందరంగా వెలుగొందు తోంది. ప్రస్తుతంతెలుగురాష్ట్రాలనుంచేగాకుండా తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాల నుంచి కొద్దిమంది నార్త్ ఇండియా నుంచి కూడా భక్తులు స్వామివారి దర్శనానికి వస్తు న్నారు. వారికి కావాల్సిన పూజలు చేయించుకొని వెడుతున్నారు. ఇందువల్ల మేం చాలా తృప్తిని పొందుతున్నాము. ఈ విశేషాలన్నిటినీ సిరిదివ్వెలు కావ్యంద్వారా మా గ్రామస్థులు డా.చింతలపాటివారు వివరించినందుకు వారికి ప్రత్యేకించి ధన్యవాదాలు తెలుపు కుంటు న్నాము.ఈగ్రామంలోజన్మించినందుకుస్వామివారినివారుతమరచనలద్వారాసేవించారు మేముమాకుచేతనైనరీతిలో సేవించుకుంటున్నాం.2001లో నేను కృష్ణాజిల్లా పరిషత్తుకు ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యే పరిస్థితుల్లో ఈ దేవాలయానికివచ్చి మొక్కుకున్నప్పుడు నేను ఎన్నికవుతానని, అనంతరం గుడికి ఏదో చేయాలనీ ఆదేశించినట్టుగా అనిపించింది. ఆ ఆదేశం మేరకు నాకున్న ప్రభుత్వ పదవిని ఆసరాగాపెట్టుకొని ఈ దేవాలయం ముందున్న

రకరకాల కట్టడాలని వేరేచోటికి తరలించి ఈ గుడికి మంచి దర్శనం కలిగేలా చేయగలిగాను.2021నుంచి మేం కొంతమందిమి దేవాలయ అభివృద్ధి కమిటీగా ఏర్పడి భక్తులకు కావలసిన సౌకర్యాలను మా దృష్టికివచ్చినవాటిని మేం చేయగలిగినవాటిని చేస్తున్నాము.

ధన్యవాదాలతో –

ఘంటసాల., మీ

18-02-2022. *గొర్రెపాటి వెంకట రామకృష్ణ,.*



ప్రవచన రాజహంస, పద్యకళాతపస్వి, అవధాన ప్రాచార్య,
అభినవ మల్లినాథ, భాషాప్రవీణ, విద్యాప్రవీణ, అష్టావధాని,
కాశీకృష్ణాచార్య పురస్కారగ్రహీత,విశ్రాంతాచార్య
అభినవ వాల్మీకి, ఆధ్యాత్మిక రత్న, mob: 9494002247
e mail: mahadevpurna@gmail.com

వేంకటేశ్వర అపార్ట్ మెంట్స్
బ్లాక్ ఎ 2/3, కృష్ణనగర్
రాజమహేంద్రవరం-533 104
ఫోన్:0883-2473926,

డా. ధూళిపాళ మహాదేవమణి గారు

M.A., (Telugu)., M.A., (Sanskrit)., Ph.D.,

: శివరంజని :

ఇది మహాశివునిపై ఒక భక్తి కావ్యం. బాలా సమేత శ్రీ జలధీశ్వర స్వామి మహిమా విలాసాలశ్రవ్యకావ్యం. పురాణవాఙ్మయాన్నిపద్యపారిజాతాలతో మలిచిన దివ్యప్రబంధం. ప్రాచీన సంప్రదాయాలతో పలురసవంతమైన వర్ణనలతో సంతరించుకొన్న ఆధునిక యుగంలో వెలసిన ప్రాచీన ప్రబంధం.

కావ్యంపేరు "సిరిదివ్వెలు". కవయిత కావ్యకళాప్రపూర్ణ డా. చింతలపాటి మోహన మురళీకృష్ణ గారు. కావ్యంపేరు వికృతిపదాలతో తేలిగ్గా ఉన్నా భావం మాత్రం చాలా చిక్కనైనది. సిరి అంటే లక్ష్మి, శోభ మున్నగు అర్థాలు చాలా ఉన్నా ఇక్కడ ఈ రెండింటినీ సమన్వయంచేసుకోవాలి.మంచి**శోభించేదీపం**అనిప్రకృత్యర్థం.ఎవరాదీపం? కవిదృష్టిలో పరమాత్మ. కృష్ణాజిల్లా ఘంటసాలలో ఒకేపీఠంపై వెలసిన బాలాపార్వతీసమేత "శ్రీజలధీశ్వరస్వామి". నాదృష్టిలో ఈ జీవాత్మయైన శ్రీ చింతలపాటి కవివర్యుడే. ఆయనే జిజ్ఞాసువుల పాలిటముముక్షు; భక్తజనులపాలిట ఒకఅఖండ దీపం.ఈదీపం3 ఆశ్వాసాల విభాగంతో ఎన్నెన్నోపద్యదీపాల్ని వెలిగించి మార్గదర్శనం చేయిస్తోంది. ఈ

అఖండ భక్తి దీపం నుండి పలు 'సిరిదివ్వెలు"ఎన్నో ఈ కావ్యంలో ప్రకాశిస్తున్నాయి. అవన్నీ చిన్న చిన్న జ్ఞానదీపాలే. ఇలా అనేక 'సిరిదివ్వెల"కు మూలమైన ఈ పెనుదివ్వె పేరే శ్రీ చింతలపాటి మోహనమురళీకృష్ణ.

వీరిది అఖండమైన పాండిత్యం.అనూపమైన కావ్యకళాలాలిత్యం.అద్వితీయమైన భావ సౌరభ సౌమనస్యం. ఆంధ్రోపాధ్యాయులుగా అధ్యాపనకర్మ అనన్యంగా సాగించిన పాండితీ శౌండీర్యం వీరిది. ఆస్ట్రేలియాలో ఉంటున్నా, జన్మభూమిపట్ల ప్రేమానురాగాలు అణువణువునా జీర్ణింపజేసుకున్న మనీషులు.సర్వ కావ్యవిలోచనాధర్మ మర్మజ్ఞులు వీరు. పఠనసమ్మోహనంగా పద్యప్రబంధాన్ని సాధికారికంగా సృజించిన మోహనమురళి వీరు. అక్షరాలా సహజకవితా కళాభిజ్ఞులు వీరు. ప్రబంధకవుల్లో ఇంతగా సరళగ్రాహకమైన భాషను ఉపయోగించటం అందరికీసాధ్యం కాదు. ఈకాలంలో భాష ఇలా ఉంటేనే ఆదర పాత్రం అవుతుందన్న మర్మజ్ఞులువీరు. ఇందులో 36 ఛందస్సులు వాడానని వీరు ముందే ప్రస్తావించి ఉన్నారు.

సాధారణంగా విరళంగా అందరూవాడే ఛందస్సులు మహాఅయితే 15 వరకు ఉంటాయి. వీరు అతివిరళమైన అశ్వధాటిధాటిని ఇందులోహాయిగా అందుకోగలిగారు. స్రగ్ధర,మహాస్రగ్ధరలతో అమ్లానమైనపూలమాలల్ని కట్టగలిగారు. చక్కని పంచచామరాల తో శివపరమాత్మను హాయిగా సేవింపగలిగారు. శిఖరిణీ శిఖరాలను అధిరోహింప గలి గారు. మత్తకోకిలల్ని కుత్తుకబంటిగా తినిపించి శ్రావ్యంగా కూయింపగలిగారు. మందా క్రాంతల మాంద్యాన్నీచైతన్యపరచారు.వసంతతిలకాల్నివసంతాయమానం చేశారు. ఇలా కొంగ్రొత్త ఛందోహయాల్ని స్వారీచెయ్యటం మాటలుకాదు. శార్దూలాల్నీ, మద గజాల్నీ, క్రౌంచపదాల్నీ(కొంగలకుటిలగతి)అదుపుచేసి'రింగ్ మాస్టర్"గాఆడించారు. ఛందస్సు మీద మంచి అదుపూ,శబ్దాలపైన మంచిపట్టు, ప్రాచీనవాఙ్మయసారాన్ని ఆపోసనపట్టిన గట్టూ,గుట్టూ లేకపోతేఇంతటిప్రజ్ఞావిశేషాలతో,ప్రతిభావిన్యాసాలతో, ఈశైవ ప్రబంధాన్ని

నడిపించటంసాధ్యంకాదు.ఇందులోప్రతిపద్యమూ ఆరితేరిన నృత్యవిలాసమే. ప్రతివర్ణనా అమోఘమే. అయినా కొన్ని మచ్చుకు ఉదహరిస్తాను:

1.వర్ణనానైపుణి:

శా. శూలంబొప్పెడి పాణి; పింగళజటా శోభాకృతుల్ దివ్య నా
గాలంకారము లక్షమాలలు శుభాకారంబు చేకూర్చి సౌ
ఖ్యాలంగూర్చు ; నుమాభవాని సహదేహంబై విరాజిల్లి జే
జే లొందన్ వృషభంబు నెక్కు నభవున్ సేవింతు నెవ్వేళలన్(1. ఆశ్వా.11)

శా . శుద్ధ స్ఫాటికమూర్తి పంచముఖుడై శోభిల్లు ముక్కంటి సం
శుద్ధాత్ముండు శశాంకమౌళి విబుధశ్లోకుండు గంగాధరుం
డిద్ధవ్యాఘ్రపు చర్మధారి ఫణి నాగేశోపవీతుండు సు
శ్రద్ధాయోగి వినీలకంఠు నభవున్ సంపూజితున్ జేసెదన్!(1ఆశ్వా.10)

చక్కని వర్ణన. శివమూర్తిని కళ్ళముందు నిలబెడతాయి ఈ పద్యాలు.

2.పూర్వకవులశైలి:

శా . వేదాంతమ్మున కర్థ మెవ్వడు ! జగద్వృత్తమ్ము శాసించి స
మ్మోదంబొందెడి వాడెవండు ! యెవడా ముక్తి ప్రదాతృండు ! ని
ష్ఖేద బ్రహ్మ పదార్థ మెవ్వడు ! సదా కీర్తింప సంతృప్తుడై
యేదివ్యాత్ముడు వెల్గునో యతని“పాహీ” యంచు సేవించెదన్!(1ఆశ్వా.21)

శా . ఎవ్వాడీ జగమున్ సృజించె నెవడీ యీశుండు లోకంబులం
దెవ్వాడందరి యాత్మరూపుడయి పాలించున్ జగంబంతటన్ !
నెవ్వాడీ భువనాధినాయకుడు ! వర్ణింపన్ ప్రభుండెవ్వడో
యవ్వానిన్ మదిలో దలంతు భవదాస్యంబెల్ల పో నాడగన్ !(1ఆశ్వా.20)

పోతనగారు ఈ పద్యాల్లో పరుగెట్టుకొని వస్తారు.

3.వృత్త వైవిధ్యాల సరణి:

ఈకావ్యంలో అద్భుతమైనశైలిలో అనేకవృత్తాలు తమంతతాముగా ఒదిగిపోయాయి. ప్రథమాశ్వాసంలో 23 వపద్యం నుండి 31 వ పద్యం వరకు కవిరాజ విరాజితాలు విరాజితాలయ్యాయి. అదే ఆశ్వాసంలో 32 నుండి 36 వరకు మానినులు మాననీయాలయ్యాయి.

కవిరాజవిరాజితము : లలితవిలాసిని లాస్య వినోదిని లక్షణరూపిణి లక్ష్మిమయీ
జలరుహలోచని! జాగృతకారిణి! జన్మవిమోచని!జైత్రరథా!
చలిమల కన్యక! సాంద్ర దయామృత సారవిశిష్ట సుసాధ్యవతీ!
పలుకవె తల్లి! శుభప్రదమౌనటు భాగ్యవతీ! వరభానుమతీ! 28

మానిని. నీదయనొందిన నిత్యజయమ్మది నిశ్చయమౌ జననీ!ద్యుమణీ !
యేది యసాధ్యము కాదు జగంబున నించుక నీవు సహించునెడన్
నీ దరహాసధునిన్ బడియాడిన నిన్నెదనిల్పిన నీకృపయే
వేదనబాపును ;వేడుకసేయును; విజ్ఞతగూర్చు నభీష్టయుతిన్ !! 34

మానిని. నామదినుండు సనాతనరూపిణి! నన్ నడిపింపు మనారతమున్
నీమముతో మది నిను ధరింతును నిత్యముగావవె నిండుదయన్
సేమముతోడి ప్రసిద్ధినిగూర్పవె సిద్ధ మనస్విని శీలవతీ !
నామములన్ మననంబొనరించెద! నాదమయీ!కరుణార్ద్రమయీ! 36

ఇలాఈకావ్యంలోఉత్సాహవృత్తాలుఉత్సాహశైలినీ,పంచచామరాలుఆహ్లాదాన్నిపండించ టంలోను, మంగళమహాశ్రీలు మంగళాంత ఆశీస్సులుగానూ, ఇలా ఏ క్రొత్త ఛందమైనా చింతలపాటివారికిఅలవోకగాగళంనుండిజారిపడ్డాయి.మనస్సులోపుట్టినిర్గతాలయ్యాయి

4.పదప్రయోగాల ప్రౌఢిమ:

శబ్దం సరైనభావాన్ని అందించినప్పుడే దానిశోభ. పదాలపోహళింపు ఎంత సముజ్వలంగా ఉన్నా భావసౌరభాన్ని అందింపలేకపోతే ఆ కావ్యం సార్థకమైనట్లు కాదు. దయాసౌరభ్యం,(2ఆ-3ప)., శృంగారార్భటి(2ఆ-141ప).,మున్నగు పదాలు వీరి పద సమాసవివేకాన్ని తెలుపుతాయి.

5.శయ్యాసౌభాగ్యం:

పద్యం కొందరి రచనల్లో కుంటుపడుతుంది. శబ్దపటాటోపం చేస్తుంది. గతుకుల రోడ్లపై ఎడ్లబండిలా నడుస్తుంది. కానీ శ్రీ చింతలపాటివారి పద్యరచనాలావణ్యమూ, ధావనమూ అమోఘం. పద్యం అవిచ్ఛిన్న నూనెధారలా, మకరందధారలా ఒకతీగవలె

సాగుతుంది. ఇటువంటి శయ్యాసౌభాగ్యం(తీగవలె, గొలుసుకట్టువలె పద్యధార నిలిపే నైపుణ్యం)అందరికీ లభింపదు.ఈకాలంలో అయితే చెప్పనేఅక్కరలేదు. ఈసౌభాగ్యానికి కారణం : గణపతే !!

శా . **గంగంగం గణనాథ ! విఘ్నముల నుక్కాడించి నా వ్రాత సా**
గంగా సాయము జేయుమయ్య ! కవితా గంగా ప్రవాహమ్ము పా
రంగా జేయుము ; పాఠకావళియు నుత్క్రాంతిన్ వినోదించి స్వ
ర్గంగా వాహినిగా దలంచి దనియంగాజేయుమో దేవరా ! (1ఆ.2 ప)

'గం''బీజంతో స్వామిని ఇంతగా ప్రార్థించి వర్ణగంగని స్వాధీనం చేసుకొన్నారు మురళీ కృష్ణ గారు.

6.ఆర్తభక్తుడు: మురళీకృష్ణగారు మంచి ఆర్తభక్తుడు.

సీ. పరమేశ్వరా నీదు పాదాలవద్దనే
పడియుంటి నీతోడ పలుకుచుంటి
సర్వేశ్వరా నీదు సన్నిధానమునందు
సాగిలబడియుంటి శరణమంటి
విశ్వేశ్వరానిన్ను విడలేకభక్తితో
గుడిముందునిలచి నే కొలుచుచుంటి
జలధీశ్వరా నీవె యిలనాకుదిక్కని
తలచుచుంటిని నిన్ను పిలుచుచుంటి
గీ. నమ్మికొల్చెడివారి వినమ్రుల నిల
కాచుకొన్నను విడచి చీకాకువడిన
దిక్కునీవని నమ్మిన దీనుడనుర
బాలజలధీశ్వరా! పాహిపాహి కనర! (2 ఆ. 13. ప)

మ. జడతత్వమ్మున మొద్దుబారితిని; నీ సాన్నిధ్యమున్ జేరి నీ
యొడిలోనన్ కడదాకనిల్చిన మహద్యోగంబు చేకూర్చు దే
వుడవీవేయిక నాకు దిక్కు శివశంభో! పార్వతీవల్లభా
కడకంటన్ దయజూడరా యనుచు నాకాంక్షింతు భక్తిన్ మదిన్(2.ఆ.15ప)

ఈ మున్నగు వీరి ఆవేదన పరమాత్మనువీడి యుండలేని జీవాత్మ ఆవేదనే. తల్లిని వీడలేని

లేగదూడేవీరు. చిన్నతనంలో అమ్మఅంకాన్ని మరెవ్వరికీ పంచని పసిపాప పట్టుదలే కనిపిస్తుంది వీరిలో!

7. వేదాంతవిజ్ఞానం ఇందులో విహరించింది :

మ. అనుబంధమ్ములు దుఃఖహేతువులు; కాయంబెన్నడో డుల్లిపో
వును; జీవంబది గల్గినంత భవ శంభో యంచు కైలాస వా
సుని కీర్తించుచు చింతలన్ విడచి దాసోహమ్మనన్ జీవుడా!
ఘనమౌ మోక్షపదమ్ము లభ్యమగు నాకాంక్షల్ ఫలించున్ ధరన్(2-36)

ఉ. దేహమనన్ రథమ్ము; గుణధీయుతి సారథి; ఇంద్రియమ్ములే
గ్రాహక గుఱ్ఱముల్;మనసు కళ్ళెము;నాత్మ రథిప్రకారమై
దేహముతోలుచుండు; నిది తిన్నగ నేగిన మోక్షగామియై
మోహపథమ్మువీడి యనుమోదమునొందును యాత్మ దైవమై!(2-34)

ఇలా ఇటువంటి పద్యాలు ఇందులో కోకొల్లలు.

8. లోకపుతీరు:

సీ. సుఖసంపదలతోడ శోభావహమ్మైన
పదవులనెన్నియో బడయవచ్చు
చిరభాగ్యములతోడ చెన్నారు విశ్వాస
పాత్రమౌ సేవల బడయవచ్చు
ధనవిస్తృతినిజూపి తరుణీమణుల మాన
పానమానుచు తృప్తి బడయవచ్చు
భాగ్యసంచయమున్న పడగెత్తు కోట్లచే
వాంఛితార్థములన్ని బడయవచ్చు

గీ. సమ్మతింపగ గోరుచు సొమ్ములిచ్చి
మతవిశేషము గడియలో మార్చగలరు
సొమ్ములుండిన కలగని శోభ లేదు
ధరణి నేలును ధనము విస్తారగతిని ! (3-56)

నేటి సమాజాన్ని అద్దంలో చూపిస్తూ అన్నీ ఉండి, అఖిలలోక సంపన్నుడైన శివుణ్ణి చూస్తే :

ఉ. అన్నియు తానయై కనులకందనియాకృతిగల్గువాడు; సం
పన్నుడునైన భిక్షకుడు;పంచముఖుం డభవుండు; వాసుకిన్
పన్నుగదాల్చువాడు; సతి బాలనుజేరిన లింగమూర్తి; యా
పన్నులభాగ్యవర్తి; జనవందితశక్తి; దయామృతాబ్ధియౌ ! (3-3)

అన్నీఉన్నశివుడు సంపన్నుడైన భిక్షకుడుసుమా అని సిద్ధాంతవాక్యం పలుకుతూ ఎంత ఉన్నా మిడిసిపడకుండా"శివ పరమాత్మ"ను చూసి నేర్చుకోండని బోధచేశారిందులో !!

ఇందులో 3 ఆశ్వాసాలలో 606 పద్యాలు అందగిస్తున్న మహా ప్రబంధం ఇది. ప్రబంధం అంటే వర్ణనముఖ్యం.ఇందులోవీరుచీకటివర్ణన, సూర్యోదయవర్ణన మున్నగునవి మనోహరంగా రచించి "**వర్ణణా నిపుణః కవిః**" అని తనను తాను ఋజువుచేసుకొన్నారు.

౯. మంచి తాత్త్వికత:

కవి పక్షపాతధోరణిలేకుండా సమాజహితాన్ని బోధించాలి.ముక్తిమార్గంలో ప్రవేశపెట్టే ప్రయత్నంచెయ్యాలి. మురళీకృష్ణగారు అందులోనూ తీసిపోలేదు. తన పద్యాల మురళీస్వరంతో పాఠకుల్ని తత్త్వార్థమోహనం చేశారు.

ఉ. ఏ మతసారమైన నిదియే; జనులందరి జాగృతంబున్
కామకలాకలాప మతిగాఢతమంబగునిద్ర-మూడిటన్
బామిచరించు నాల్గవయవస్థ తురీయ మిదేరహస్య వి
ద్యామయమైన దివ్యపరతత్వమహత్వసుఖానుభూతియౌ ! (2-10)

ఉ. లోపలనున్న జీవుని విలోకనజేసిన వాని వర్ణమున్
రూపము తత్వమున్ గని విరుద్ధఫలంబులదేల్చ యే మతం
బో పరిశీలనావిధిని పోల్చి వచింపగ సత్యధర్మముల్
దాపరికమ్ములేక నిజతత్వముతో కనిపించు నెయ్యెడన్ ! (2-11)

"బాహ్యమైన రూపం, జాతి చూసి అందరూ అజ్ఞానంలో పడుతున్నారు. కులమతాల కుంపట్లు రాజేస్తున్నారు. అందరిలోనూ ఉండే ఆత్మచైతన్యం ఒక్కటే కదా! దానికి కులమత భేదాలు లేవు కదా!"అనిఎంతోరమ్యంగా తత్త్వోపదేశం చేశారు డా.చింతలపాటివారు. వీరి ఇంటిపేరు

పరమేశ్వర చింతనతో పరిఢవిల్లింది. అసలుపేరు ఒకకావ్యానికి ఉండవలసిన సల్లక్షణాలతో సాహిత్యలోకాన్ని ఎలా సమ్మోహనం చేయవచ్చో తెలుపుతోంది.

ఇందలి అధికశాతం పద్యాలు నన్నెంతో ఆకట్టుకున్నాయి. ఆ పద్యాలన్నీ రసమంజులమైన వ్యాఖ్యలుచేయదగినవి. కానీమరింత గ్రంథంఅయిపోతుంది.ఈ భక్తికావ్యాన్ని కవిసమానహృదయంతో చదవాలి. కళ్ళతోకాదు. నాచేత ఆమూలాగ్రం చదివించిన వీరికి నా ధన్యవాదాలు. 3ఆశ్వాసాల్లోనూ 3 భక్తోపాఖ్యానాలద్వారా శివుడు ఎంతకారుణ్యమూర్తియో, శివ భక్తి ఎంతమహిమాన్వితమైనదోఉట్టంకించారు.ఈకావ్యం చదవడమూ, చదివించటమూ కూడా ఒక మంచిఫలం. ముద్రించిపదిమందికీఅందజేసేవారి పుణ్యాధిక్యం కూడా అద్భుతం. పాఠకుల కు మంచి శివానందాన్నిచ్చేకావ్యం ఇది.

శివానుగ్రహమస్తు!!

17-ఫిబ్రవరి,2022. శుభాకాంక్షలతో -

రాజమహేంద్రవరం. **ధూళిపాళ మహాదేవమణి**

———

శతావధానిశేఖర, కాశీకవి, విద్యావారిధి
అసమానఅవధానసార్వభౌమ, ఎనుకుదురాటగండ,
త్రిగళావధానస్రష్ట,కళారత్న, అవధానభారతి,
విశ్వావధానపద్మాకర, తొలిఅచ్చతెలుగుఅవధాని

మంగళగిరి,
23-02-2022.



డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారు.,

సిరిదివ్వెలు-సరిమువ్వలు

చం. సిరికవియై యనేకము రచించిరి చింతలపాటివారు భా
సురతర కావ్యముల్ ఘనయశోనిధులై యిది ఘంటసాల స
త్పుర జలధీశవైభవము దోసిటబట్టిన పద్యపారిజా
త రుచుల సత్ప్రబంధముగ తామిడిరీ 'సిరిదివ్వెలన్'’బళీ!

కవిత్వంలో సిరులను సొంతం చేసుకున్న "**సిరికవి**" బ్రహ్మశ్రీ '**కావ్యకళాప్రపూర్ణ**" చింతలపాటి మురళీకృష్ణగారు జగత్ప్రసిద్ధులు. రససిద్ధులు. శ్రీకాకుళక్షేత్ర పౌరాణిక చారిత్రక విశేషాలతో కావ్యరచనచేసినట్టే సుప్రసిద్ధమూ, పౌరాణిక చారిత్రకప్రాధాన్యమూ గల ఘంటసాల క్షేత్రాన్ని ప్రబంధనియమాలతో "**సిరిదివ్వెలు**" ప్రబంధంగా రచించారు. శివుడు జలధీశ్వరుడుగా అమ్మవారితో కలసి ఏకాత్మకంగా ఆవిర్భవించటం ఈ క్షేత్ర ప్రత్యేకత.ఆ ప్రత్యేకతలను అమ్మవారిఅయ్యవారి ఘనతను, మహిమలను మూడుఆశ్వాసాలుగా బాలాత్రిపురసుందరీ ఆదేశంతో కవిరచించిన ఈ"**ప్రబంధం**" భక్తికవితా పారిజాత సుగంధం.

ఆఱువందల ఆఱు పద్యాలతో మూడు ఆశ్వాసాలుగా ఉన్న ఈ ప్రబంధంలో ఎన్నో విశేష ఛందస్సులు: భుజంగప్రయాతం, స్రగ్విణీ, వనమయూరం, మానిని, మహాస్రగ్ధర, మంగళమహాశ్రీవంటివి ఒకటోరెండోకాక ఎక్కువసంఖ్యలో సందర్భానుసారంగా వ్రాయటం ఈప్రబంధంలోని ఛందోవిశేషం. బాలాపార్వతీసమేత శ్రీ జలధీశ్వరస్వామివైభవం ఒక సామాన్యపౌరుని కథ ఇతివృత్తంగా ఈ కావ్యంలో వర్ణితమైంది. అలంకారశాస్త్రాను

గుణంగా కావ్యరచనాసంప్రదాయంలో, శివభక్తిపారమ్యంతో, నమకచమక మహాన్యాసాది రుద్రసూక్తవిశేషాలు ఎన్నో దీనిలో వివరించబడ్డాయి. ముప్పది యాఱు ఛందస్సుల ముఖద్వారంగా ఈ ప్రబంధం విరాజిల్లుతోంది. మొత్తం ఆఱువందల పద్యాలకావ్యంలో అన్ని ఛందస్సులు వాడటం విశేషం.

మ. సిరిపూర్వమ్మగు శీర్షికన్ పలుగుణాశ్లిష్టమ్ములౌ కావ్యముల్
నిరతిన్ వ్రాసితి నింతకున్ మునుపు కానీ యాశ్వరానుగ్రహ
మ్మరయన్ బోలుచు ఘంటసాల జలాధీశానుగ్రహమ్మెట్టిదో
విరచింపందగునంచు నీశ్వరుడు నన్ ప్రేరేచె తా నర్మిలిన్

అంటూ జలధీశ్వరానుగ్రహమూ, ఆదేశంతో కవిగారు ఈ అద్భుత రచన చేశారు. బాలానుగ్రహం, అనుజ్ఞలతో ఈ కావ్యసృష్టి జరిగింది.

శా. చారిత్రాత్మకమైన దేవళములో సాంబయ్యతో బాల చె
న్నారన్ ముద్దుగ నేకపీఠికపయిన్ నన్యానురాగాత్మయై
చేరన్ చూడగముచ్చటౌను మహిలో చిత్రమ్మిదే ఘంటసా
లారామమ్మును చేరి కొల్చు నెడలన్ లాభమ్ము చేకూరెడిన్

ఈక్షేత్రప్రత్యేకతను,మహిమలను,మహిలోచిత్రమైన ఘంటసాలారామంలోని విశేషాలను కల్పితకథారూపంగా ఆవిర్భవించిన 'సిరిదివ్వెలు''ప్రబంధంలోని విశేషాలను పాఠకుల కోసంముచ్చటిస్తే పీఠికాప్రయోజనంనెరవేరుతుంది.శ్రీబాలాజలధీశ్వరానుగ్రహం కలుగు తుంది.

శా . ఆద్యంతమ్ము లెరుంగలేము ; ప్రళయోద్యద్వహ్ని తేజస్వియై
విద్యున్మాలల మించి తత్పురుషుడై వెల్గొందుచున్ స్వర్ణ వ
ర్ణ ద్యుమ్నంబగు పింగళంపు జడలన్ నాగావళీ హేలచే
హృద్యోదాత్తత నొంది ప్రాఙ్ముఖ భవుండిచ్చోట గన్పించెడిన్ !

అనే పద్యంలో తత్పురుషముఖంతో ఈశ్వరుడు తూర్పుముఖంగా ఉండటం ఇక్కడి

విశేషంగా చెప్పబడింది. ఈ విధంగా స్వామివారి ముఖాలు అయిదూ వాని తత్త్వాలతో ప్రత్యక్షమైనాయి.

శా . శుద్ధ స్ఫాటికమూర్తి పంచముఖుడై శోభిల్లు ముక్కంటి సం
శుద్ధాత్ముండు శశాంకమౌళి విబుధశ్లోకుండు గంగాధరుం
డిద్ధవ్యాఘ్రపు చర్మధారి ఫణి నాగేశోపవీతుండు సు
శ్రద్ధాయోగి వినీలకంఠు నభవున్ సంపూజితున్ జేసెదన్ !

అనేపద్యంస్వామి సమగ్రరూపసాక్షాత్కారం. సాకారోపాసన,విగ్రహారాధనలను నిందించే వారినికవిగట్టిగాఖండించారు.**బ్రహ్మాండప్రతిరూపమైనిలచుదివ్యాంగమ్ము లింగమ్మగున్** అని శివలింగతత్త్వాన్నిస్పష్టంచేశారు. శివలింగ విశేషాలను ఎన్నిటినో కావ్యరచనలో ఆవిష్క రించారు.

శా. శ్రీ బాలాజలధీశ్వరుండు మహదాశీర్వాద సంపన్న వి
ద్యాబుద్ధుల్ దయసేయ భక్తిమెయి తాత్పర్యమ్ము సంధిల్లగా
నా బంధుండని యాత్మనెంచితిని; విజ్ఞానాబ్ధి బాలాంబ వా
ణీ బంధంబు బిగింప కొల్తునిట నన్నేలన్ దయా సింధువై !

అంటూ కవిరాజవిరాజితం, మందాక్రాంత, శిఖరిణీ, వృత్తాల్లో అమ్మవారిని స్తుతించారు. సుప్రభాతం, మంత్రపుష్పం మొదలైన ఆలయోపచారాలన్నీ సరస్వతీరూపంగా అమ్మ వారికి సమర్పించారు. సూర్యోదయవర్ణనలో పన్నెండు పద్యాలు ఆత్మశక్తి 'జీవకోటికి చిగురింప చేవనొసగు"తున్నాయి. ఆతరువాత "పురవర్ణన"లో యుగయుగాల వైభవాన్ని తొమ్మిది పద్యాలలో **వేలయుగాలనాడిది కుబేరుని కోటయొ ! శ్రీనివాసమో!** అంటూ **ఈనేలన్ జలధీశ్వరుండనప్రతిష్ఠించెన్ శివున్ నిష్ఠతో మౌనీంద్రుండగు కుంభసంభవుడు** అనిఅగస్త్యమహర్షి చేసిన లింగప్రతిష్ఠను, మాహాత్మ్యాన్ని వివరించారు. ఈ రెండువర్ణనల అనంతరం ధనగుప్తుని వృత్తాంతంతో కథాప్రారంభం జరిగింది. ధనగుప్తుని దుర్గుణా లను వివరించారు. వాడు

'పిల్లికి బిచ్చమీయని కుబేరుడు." అటువంటివాడు కావ్య నాయకుడు ఎలా అయ్యాడని కవి తానే వివరిస్తూ ఇటువంటివారు లోకంలో చాలామంది ఉన్నారని చమత్కరిస్తూ వాడి దుర్మార్గానికి గుడి ప్రాంగణంలోనే పరమేశ్వరుడు ఎలా బుద్ధిచెప్పాడో **కుప్పగకూలినట్టి ధనగుప్తుడు నోటను మాటలేక** అని చూపించారు. దెబ్బతిన్న ధనగుప్తుడు ఏడుస్తూ పలికిన **ఐం**కారం వల్ల వాణ్ణి అమ్మ దయతలచింది. దేవీ భాగవతంలోని ఈ బీజాక్షరమహిమ ఇక్కడ చూపించారు. వాడు శివలింగం ముందు ఏడ్చాడు.

ఈ ప్రబంధంలో **వాయువర్ణన** ప్రత్యేకం.

మెల్లని మందహాసమది మేనునుదాకినయట్లు; చెంత హ
త్తిల్లగ చేరు ప్రేయసి మదిన్ గిలిగింతలు పెట్టినట్లు; జా
బిల్లి కళాంశురాగములు పిల్లనగ్రోవినియూదినట్లుగా
చల్లని పిల్లగాలులు రసార్ద్రత నింపుచు వీచెనయ్యెడన్

ఇలా ప్రథమాశ్వాసంలో ధనగుప్తునికథ, వానిలో పరివర్తన: వసంతతిలకం, తోటకం, అనుష్టుప్ వంటి విశేషచ్ఛందస్సులలో వాడు చేసిన స్తోత్రాలు, స్వామివారికి, అమ్మవారికి పరమభక్తుడై వాడు శివలోకాన్ని చేరటంతో మంగళమహాశ్రీ వృత్తంతో ఇది రెండో ఆశ్వాసానికి దారితీసింది.

రెండవ ఆశ్వాసం :

గుడిలో భక్తులు చేసిన స్తోత్రాలు, స్తుతులతో ఆరంభమై అద్భుతంగా సాగింది.

ఉ. తామరపాకుజేసిన సుధర్మమదేమి? జలాధివాసియై
నీమముబూనినట్టులొక నీటికణంబును మీదనంటదే!
ప్రేమరహించి మించినను పెద్దరికంబున నాట్యమాడి యా
పై మమకారశూన్యముగ భాసిలుటన్ గమనింపు డాత్మలో

గొప్పపద్యం.ఇక్కడక్రౌంచపదం,లాక్షణీవంటి అరుదైన ఛందస్సులు ఉపయోగించారు. భక్తివేదాంతాలు, సామాజిక విశేషాలు, ఎన్నెన్నో ఇక్కడ వివరించారు.

చం. చిరు చలచిత్రముల్ గనుచుచిందులువైచెద మాతడెందునన్
పరుగునబోయి నాయికను ఫక్కునకౌగిలిలోన హత్తగా
నురకలువైచి పాడెదము నూగుచు పానము నందుకొంచు సం
బరములతేలియాడెదము! భాగ్యమిదేకద జీవితమ్ములో!

అంటూ చిరంజీవి సినిమాలప్రస్తావన, మద్యపానం, ధూమపానం వంటి చెడు అలవాట్ల లోబడి దైవభక్తిని విమర్శించటం సరికాదంటూ అలాంటిపాత్ర '**గాలినాయుడిని**'' ప్రవేశ పెట్టారు. ఇటువంటి గాలినాయుళ్ళు ఈనాడు ఎందరో ఉన్నారు. అటువంటివారు రాజకీయాలలో చేరటంగురించిచెబుతూ ఈనాటిరాజకీయాల కుళ్ళును కడిగేశారు. గాలినాయుడు నాయకుడై చేసిన లీలలను, దుర్మార్గాలను వివరిస్తూ, వాడికి వచ్చిన వింతరోగాన్ని వివరిస్తూ మత్తకోకిల, లాటీవిటం, ధ్రువకోకిల వంటి ఛందస్సులలో వాని దుశ్చర్యలను వర్ణించారు.

"దేవుడగీవుడా యనుచు తిమ్మెరలాడిన గాలినాయుడే'' అంటూ అటువంటి గాలినాయుడికి దేవుడు గుర్తొచ్చాడని దైవమహిమను చెప్పారు. కామక్రోధాలతో దెబ్బ తిన్న పూర్వపుధనగుప్తుడు, ఇప్పటిగాలినాయుడు వంటివారికీ తప్పకుండా బుద్ధివస్తుంది. వాడుఅభినవతామరసం, పాలాశదళం, మణిగణనికరం, వంటి ఛందస్సులలో స్వామిని స్తుతించాడు. నేలకూలిన గాలినాయుడికి సిద్ధుడు కనపడి అన్నీ తెలియజెప్పాడు. నేనే నీ ఆత్మను అని సత్యదర్శనం చేశాడు. కోలుకున్న గాలినాయుడు మహాభక్తుడై జలధీశ్వరుని మహిమను వ్యక్తపరిచాడు.

మూడవఆశ్వాసంలో

భక్తిజ్ఞాన వైరాగ్యాలతో శివతత్త్వ విశ్లేషణ విశేషంగా ఉంది. పంచాక్షరీ స్వరూప వర్ణన మొదలైన శివారాధనలతో '**శివశర్మ వృత్తాంతం**'' మూడవ కథగా ప్రత్యక్షమైంది.శివశర్మ పేదబ్రాహ్మణుడు. సజ్జనుడు. దంపతులిరువురూ శివభక్తితో జపదీక్షలతో జీవిస్తున్నారు.

వారికి ప్రజలందరు అన్నీఇస్తూ గౌరవిస్తున్నారు. ఇక్కడ వనమయూరం, మహాస్రగ్ధర, వంటి అనేకచ్ఛందస్సులలో జలధీశ్వరమహిమలు వర్ణించబడ్డాయి. అనుప్రాసలతో అపు రూపమైన అశ్వధాటీచ్ఛందస్సులో పదిపద్యాలు విశేషం. శివశర్మను జలధీశ్వరుడు పరీక్షించదలచి ప్రజలు అతణ్ణి అసహ్యించుకునేట్లు చేశాడు. శివశర్మ అన్నిటికీ ఓర్చు కున్నాడు. శివుడు కరుణించాడు. ప్రజలు తప్పు తెలుసుకున్నారు. గౌరవించారు. శివ శర్మనుస్వామి తనలో విలీనంచేసుకున్నాడు. శివశర్మజీవుడు పంచచామరంలో స్వామిని స్తుతించాడు.మందాక్రాంతవృత్తంలో బాలాంబాజలధీశ్వరస్తుతితో అద్భుతంగా ముగిసిన ఈకావ్యం కాశీఖండం,శివరాత్రిమాహాత్మ్యంవంటి మహా కావ్యాలసరసనచేరి ఘంటసాల క్షేత్ర మాహాత్మ్యాన్ని రాబోయే తరాలకు కలకాలం తెలియ జేసేవిధంగా ఛందో వ్యాకరణాలంకార విశేషాలతో వివరించిన “**కావ్యకళాప్రపూర్ణ**” బ్రహ్మశ్రీ చింతలపాటి మురళీకృష్ణగారు ఆయురారోగ్య భోగభాగ్యాలతో మరిన్నిసిరులను కురిపించి దివిసీమ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని శ్రీ బాలాపార్వతీసమేతజలధీశ్వరస్వామివారిని ప్రార్థిస్తూ

....

స్వస్తి -



"EXCELLENT WORK, AND UNIQUE OF ITS KIND IN THE WORLD"
-DR. SHANKAR DAYAL SHARMA, FORMER PRESIDENT OF INDIA
(APRIL,1995)

"సంస్కృతమిత్ర", "వాచస్పతి" 'సంస్కృతసేవావ్రతి"

డా.రేమెళ్ళ అవధానులు గారు

M.Sc.,(Nuclear Physics)**., M.A.,Ph.D.,(**Sanskrit).,**M.A.,Ph.D.**,(Jyothisham) **D.Litt**(Hon)., **Deputy Director** (Computers) Retd., **Nizam's Institute of Medical Sciences**, Hyderabad

ముందుమాట

'కావ్యకళాప్రపూర్ణ" **డా.చింతలపాటిమోహనమురళీకృష్ణగారు** రచించిన సిరిదివ్వెలు అనే గ్రంథాన్ని ఆమూలాగ్రంగా అవలోకించటం జరిగింది. అప్పుడు నాకు కలిగిన అనుభూతిని సంగ్రహంగా చెప్పాలంటే-సరస్వతీమాత అక్షరరూపంలో ఆంధ్ర భాషామతల్లికి అందించిన తన దివ్యకంఠాభరణమే ఈ 'సిరిదివ్వెలు" ప్రబంధం! సహస్ర వర్షాధిక కవితావిస్తృతి కలిగిన తెలుగునాట విలసిల్లిన కవులందరూ ఏకకంఠమై నినదిస్తే శ్రవణపేయమైన ఆ నాదాన్ని గ్రహించి అక్షరరూపంలోకి మార్చి, ఏర్చి, పేర్చి, కూర్చి 'అక్షరపురుషుని" కంఠసీమలో అలంకరించిన ఒక సుమనోహర సౌరభపుష్పమాల ఈ గ్రంథం. ఈపద్య ప్రబంధంలోని పదవిన్యాసం, ఛందోబద్ధత, భావప్రకటన, అన్నింటినీ మించిన రచనాశైలి, ప్రతిపాఠకుని హృదయంలోను సుస్థిరమైన ముద్రలను వేస్తాయి.

ప్రబంధరచనకు కృష్ణాజిల్లా ఘంటసాలగ్రామంలో వెలసిన శ్రీ జలధీశ్వరస్వామి, బాలాపార్వతీఅమ్మవారికరుణావిశేషాలగురించి,అనుగ్రహంగురించి,మూడు ఆశ్వాసాల రూపంలో కథాసంవిధానాన్ని రూపొందించి, భావాంబరవీథుల్లో విహరింపజేశారు.

ఈమూడు కథలద్వారా ఒకవైపు నాస్తికతత్త్వాలకు "అతి" లేదు-"గతి" లేదు అని చూపిస్తూ, వేరొకవైపు ఆస్తికతత్త్వాలకు "హద్దులులేవు", "ఆనందానికి అవధులులేవు" అని విస్పష్టంగాప్రకటించారు. రసానుభూతినికలిగించారు. కథాగమనానికి చక్కటి ఛందస్సులను ఎన్నుకున్నారు.

"ఛందస్సు"అంటే ఆహ్లాదాన్ని కలిగించేది అనిఅర్థం. ప్రసిద్ధిపొందిన ఉత్పలమాల, చంపకమాల,శార్దూలవిక్రీడితం, మత్తేభవిక్రీడితం, మాత్రమే గాకుండా విరళంగా, చాలా తక్కువ సందర్భాల్లో ప్రయోగించినవి-1. మహాస్రగ్ధర, 2. మంగళమహాశ్రీ, 3. క్రౌంచ పదం, 4. లాక్షణి, 5. లాటీవిటం, 6. ధ్రువకోకిల (తరలము),7. అభినవతామరసము (తోవకము),8.పాలాశదళము, 9. మణిగణనికరము, 10. వంశస్థము, 11. తురగము, 12. కమలవిలసితము, 13. అశ్వధాటి వంటి చాలా ఛందస్సులను వీరు అలవోకగా వినియోగించటం జరిగింది. చాలామంది వీటి పేర్లైనా విని ఉండరు. ఆ విధంగా వీరు ఈ ఛందస్సుల ప్రయోగవిధానాలను మనకు తెలియజేసి మహోపకారం చేశారు.

"**మహాత్మనో యేన గతాః స పంథాః**"-మహాత్ములు ఏ మార్గంలో వెళ్ళారో, ఆ మార్గమే అనుసరించతగినది అని నానుడి ఉంది. సంస్కృతసాహిత్యంలో మహోజ్వలం గా ప్రకాశించే యోగీశ్వరులైన పూజ్యశ్రీ శంకరభగవత్పాదులవారిని, వాల్మీకి, వ్యాస, కాళిదాసాదులను, తెలుగు సాహిత్య వినీలాంబరంలో విరాజమానులైన నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, పోతన మొదలైనవారిని,ఛందస్సులు, కథాంశములు మొదలగు విషయములలో అనుసరించి, పూర్వకవులందరికీ మనందరిపక్షాన కృతజ్ఞతలుతెలిపారు. ఉదాహరణలు అనేకం ఉన్నాయి.వాటిలో కొన్ని:

జగద్గురువులు, పరమపూజనీయులు శ్రీశంకర భాగవత్పాదులవారిద్వారా భక్తప్రపంచానికి అందిన రత్నాలహారంవంటి 'మహిషాసురమర్దిని"కి చెందిన శ్లోకాల ఛందస్సుతో:

"అయి జగదంబిని హాసవిలాసిని హైమవతీ పరమాత్మశివా"

అంటూ అలరారేపద్యాలు ఇక్కడ దర్శనమిస్తాయి. అట్లాగే 'భజగోవిందం" స్ఫూర్తిగా రచించిన పద్యాలుకూడా కనిపిస్తాయి.

మహాకవి కాళిదాసు మేఘసందేశమహాకావ్యంలో ప్రయోగించటం వలన ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మందాక్రాంతవృత్తాన్ని వీరి గ్రంథంలో ఇట్లా ఉపయోగించారు:

మూలాధారా!భువనజననీ !ముక్తిమార్గమ్ము నీవే
లీలాకేళీ విలసితముఖీ! క్లీంకృతామోదవర్తీ!

ఈ విధంగా వినియోగించటంద్వారా అమ్మవారి చూడామణిని జ్ఞప్తికి తెస్తుంది.

అత్యద్భుత తెలుగుభాషాసౌధ ప్రారంభకనిర్మాతయైన నన్నయ్యగారి ఆంధ్రమహాభారతంలోని మొట్టమొదటి పద్యం **శ్రీవాణీగిరిజాశ్చిరాయ దధతః** అంటూ ప్రారంభమైంది. ఈ ప్రబంధంలోని మొదటిపద్యంకూడా **శ్రీవాణీ గిరిజా ప్రసాద గరిమన్ శ్రీచిద్విలాసమ్ము**గా ఉంటూ తెలుగుతల్లికి శోభాయమాన కిరీటాన్ని అందించినట్లయింది. పోతనగారిని వదిలే ప్రసక్తిలేదని, "లోకంబులు లోకేశులు" పద్యాన్ని అనుసరిస్తూ ఉన్న పద్యం :

లోకమ్ముల్ నడిపించుయోగ్యుడెవరో లోకస్థులన్ బ్రోచు హ్యా లోకేశుండెవరో

అట్లే, యజుర్వేదం తైత్తిరీయోపనిషత్తులోని భృగువల్లియొక్క సారాంశమూ, పోతన గారిచే రచించబడిన పద్యమూ అయిన "ఎవ్వనిచే జనించు" ను అనుసరించిన పద్యం ఈ విధంగా ఉంది:

ఎవ్వాడీ జగమున్ సృజించె నెవడీ యాశుండు లోకంబులం
దెవ్వాడందరి యాత్మరూపుడయి పాలించున్ జగంబంతటన్

మహాన్యాసంలో మహాదేవుని వర్ణించిన పంచముఖధ్యానం, పంచాక్షరీ న్యాస ధ్యానాదులు ఎంతో హృదయంగమంగా ఉన్నాయి.

ఆద్యంతమ్ము లెరుంగలేము, ప్రళయోద్యద్వహ్ని తేజస్వియై

విద్యున్మాలల మించి తత్పురుషుడై వెల్గొందుచున్.... .....

జాతీయాలను,తెలుగుజాతిపలుకుబడులనుసందర్భోచితంగాపద్యరూపంలో ప్రకటించిన సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి.

చమురులుండినయంతకాలము చక్కగా నొక దీపమున్
తమముజీల్చి వెలుంగులిచ్చు నుదారతత్త్వము బూనుచున్

ఈ విధంగా ఈ గ్రంథంలో అనర్ఘరత్నాలు అనంతంగా ఉన్నాయి. వ్యాసవిస్తరణ భీతితో ఇంతటితో సరిపెట్టటం జరుగుతోంది.**చివరిగా కొన్నిమాటలు**:-

సంస్కృతాంధ్ర మహాకవీశ్వరుల విభిన్నకవితాభంగిమలను ఒక్క గ్రంథంలో చూడాలని ఉంటే "సిరిదివ్వెలు" ఒక్కటి చాలు! చందశ్శాస్త్రంపై పరిశోధనాత్మకంగా కృషిచేసేవారికి ఈప్రబంధం "లక్షణగ్రంథం" గా ఉపకరిస్తుంది. భక్తిభావనతో పరమేశ్వరీ పరమశివుల కటాక్షంతో జీవనశాఫల్యాన్ని పొందాలను కునే ముముక్షువులకు ఇది సులభతర తరణి అవుతుంది. "తల్లి సమస్తభాషలకు సంస్కృత భాష" అని జగత్ప్రసిద్ధిగాంచిన సంస్కృతభాషను అలంకరించిన మహాకవుల, మహాయోగులరచనావిషయాలను విధానాలను, విశేషాలను "పిల్లలలోన యాంధ్రియను పేరిటిదెంతయు ముద్దులాడి" అని మురిపించేతత్త్వంగల తెలుగుభాషాసారస్వత విభాగానికి యథాశక్తి గౌతమీకృష్ణాప్రాంతంలో ప్రవహింపజేసి ఈ దేశాన్ని,ఈ సంస్కృతిని, సనాతనధర్మాన్నీ సుసంపన్నం చేసిన డా. మురళీకృష్ణగారు ధన్యజీవులు!

ఇంతచక్కటిప్రబంధాన్ని అందించిన డా. మురళీకృష్ణగారికి సారస్వతాభి మాను లంతా సర్వదా, సర్వధా కృతజ్ఞులై ఉంటారనటంలో సందేహం లేదు!

అభివందనములతో, అభినందనలతో......

21-02-2022 **రేమెళ్ళ అవధానులు**

హైదరాబాదు.



సాహిత్యవిద్యాప్రవీణ, చీరాల.,

భాషాప్రవీణ, వైద్యవిద్వాన్, 27-02-2022

హిందీ విశారద, శ్రీ హనుమదుపాసకులు

డా.అన్నదానం చిదంబర శాస్త్రి గారు.,

M.A.,(Tel),M.A.,(Sanskt).,Ph.D.,

Reader in Telugu(Retd)

ఓం శ్రీరామ -జయహనుమాన్

మహిమాన్వితం

ఇది క్షేత్ర మహిమాన్విత రచన. ఆంధ్ర వాఙ్మయంలో క్షేత్రమాహాత్మ్యాలు ఒక ప్రత్యేకమైన శాఖ. శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం, ఘటికాచలమాహాత్మ్యం, పాండురంగ మాహాత్మ్యం, ఆముక్తమాల్యద, కాశీఖండం,వంటి అనేక కావ్యాలు ఈకోవకు చెందినవి. అట్టి క్షేత్రమాహాత్మ్యశాఖకు చెందినదే ఈ సిరిదివ్వెలు అనేకావ్యం. ఇది కృష్ణాజిల్లా ఘంటసాలలోని బాలాపార్వతీసమేత శ్రీ జలధీశ్వరస్వామి క్షేత్రమాహాత్మ్యం. పద్యకావ్య రచన తగ్గిపోతున్న ఈ కాలంలో ఆశ్వాసత్రయంతో ఆఱువందల పద్యాలతో ప్రబంధ రచనా విధానాన్ని పాటిస్తూ డా. చింతలపాటి మోహనమురళీకృష్ణ గారు రచించిన గ్రంథ మిది. ఇతివృత్త నిర్మాణంలో కూడా దక్షత చూపి వీరు ఈ రచన గావించారు. రాబోయేకాలంలో ఈకావ్యమే ఆ క్షేత్రానికి స్థలపురాణం కావచ్చు.

శ్రీ జలధీశ్వరస్వామిని సేవించుకొనే భాగ్యం నాకు కలిగింది. ఆ స్వామి సన్నిధిలో 2016 లో నా ఉపన్యాసాలు జరిగాయి.అలా ఎన్నోచోట్ల జరిగినా ఈక్షేత్రకార్యక్రమం నాకు మరపురానిది. ఎందుకంటే నా ఆ ఆధ్యాత్మికప్రసంగాలలో ప్రసక్తానుప్రసక్తంగా

హిందూధర్మవిశిష్టత చెప్పాను. క్రైస్తవమతాన్ని స్వీకరించటానికి సిద్ధమైనవారు మైకులో నా ప్రసంగం విని తాము మతం మారే ఆలోచనను మానుకొన్నారట. స్వయంగా ఆ వ్యక్తులే చెప్పినట్లు కార్యక్రమనిర్వాహకులు నాకు చెప్పారు. నా ప్రసంగాలను సఫలం చేసినందుకు జలధీశ్వరునకు మోకరిల్లాను.ఆ నా అనుభవం వలన ఈ కావ్యమందలి వస్తువుకు కూడా ప్రాతిపదిక ఎడియో ఉండియుండుననే భావిస్తున్నాను.

ఈ కావ్యంలో చాలాప్రత్యేకతలున్నాయి. స్తోత్రాదులందు సంస్కృతభాషాపటిమ చూపినా కావ్యమంతటా తెనుగుదనం చూపిన సూచనగా '**సిరిదివ్వెలు**" అని అచ్చతెలుగులో తమకబ్బానికి పేరుపెట్టారు. ఆశ్వాసాంతములందు ప్రత్యేక ఛందస్సుల రచన చేయటం పరిపాటికాగా 36 ఛందస్సులను అపృథగ్యత్నకృతములుగా కావ్యంలో వెదజల్లి తమరచనాపాటవాన్ని ప్రదర్శించారు. 36 అంటే 3+6=9 పూర్ణసంఖ్యతో వ్రాసి ఛందఃపూర్ణకావ్యం చేశారు. సందర్భోచితంగా ఆ ఛందస్సులు స్వీకరించటం కూడా చూస్తాము. సూర్యోదయవర్ణనలో సూర్యుడు ఏడుగుఱ్ఱాలు పూన్చినరథంపై వచ్చుటలో "ఉత్సాహం" చూపారు.సుప్రభాతమునకు ఆశువుగా 'వసంతతిలకము" దిద్దారు. మాటమంచితనం చెప్పవలసినచోట మత్తకోకిలతో (2-101) పలికారు. పంచముఖ పరమేశ్వరుని బహుముఖంగా వర్ణించి, స్తుతించి కావ్యానికి శివపారమ్యత కూర్చారు.

శా . బ్రహ్మాండమ్ము సృజించి దానికదియే వర్తిల్ల తానేలుచున్
బ్రహ్మాండమ్మున జీవకోటి బ్రతుకుల్ భద్రంబుగా గాచుచున్
బ్రహ్మత్వమ్మున వెల్గు నీశ్వరుని సంభావించు రూపమ్మునై
బ్రహ్మాండ ప్రతిరూపమై నిలచు దివ్యాంగమ్ము లింగమ్మగున్ (1-15) అని

శివలింగాన్ని బ్రహ్మాండంగా వర్ణించారు. తెలుగుకావ్యంలో అనుష్టుప్ వంటి ఛందస్సుల్ని అందించటం విశేషం.

సీ. లేచి నిల్చొనలేడు లేశమాత్రము శివ
లింగ సన్నిధి జేరలేనివాడు

చేతులెత్తగలేదు చేసినపాపాలు
భీకొట్టి దునుమ నశించువాడు
నోటబిల్వగలేదు నిండునకృత్యాలు
పండిన దుర్నీతిపరుడు వాడు
నీరుద్రావగలేదు నిరుపమదాహార్తి
నిలువెల్ల దహియింప నలుగువాడు
గీ. కడుపులోచిచ్చు కాల్చగా కనలువాడు
దెబ్బ లింతింత పీడింప నుబ్బువాడు
చావుబ్రతుకులసందులోసరసమాడు
కుమతియమకింకరునిధనగుప్తుడతడు. (1-89)

సీ. నాకన్న కాముకుల్ నాకన్న లోభులున్
ననుమించి మత్తిల్లు నరులు గలరు
నాకన్న నాస్తికుల్ నాకన్న మత్సరుల్
నను మించు నికృష్ట జనులు గలరు
నాకన్న దుర్జనుల్ నాకన్న దుర్మతుల్
ననుమించు దుష్టాత్మఘనులు గలరు
నాకన్న హీనులున్ నాకన్న దోషులున్
ననుమించు పాపాల నటులు గలరు
గీ. అట్టివారిని క్షమియించి యవల విడచి
పుట్టి ముంచుచు నన్నేల పూడ్చదలచి
కొట్టినావయ్య? యెముకలగూడు చెదర
బాదజేసితి విది నీకుపాడియగునె ! (1-98)

వంటి సీసపద్య రచనలో శోభచూపారు.

శా . ఎవ్వాడీ జగమున్ సృజించె నెవడీ యీశుండు లోకంబులం
దెవ్వాడందరి యాత్మరూపుడయి పాలించున్ జగంబంతటన్ !
నెవ్వాడీ భువనాధినాయకుడు ! వర్ణింపన్ ప్రభుండెవ్వడో
యవ్వానిన్ మదిలో దలంతు భవదాస్యంబెల్ల పో నాడగన్ ! (1-20)

అని శివుణ్ణే సృష్టి స్థితి లయకారునిగా చెప్పారు. పద్యంలో పోతనామాత్యుని 'ఎవ్వనిచే జనించు జగము"అన్న పద్యస్ఫూర్తి కానవస్తుంది.

శ్రీ చింతలపాటి మోహనమురళీకృష్ణగారు ఈ కావ్యాన్ని సులభశైలిలో రచించికూడా ఆబాలగోపాలమూ అర్థంచేసుకొని ఆనందించాలని భావాన్ని చక్కని వచనంలో నిర్వచించారు. కానీ నిజానికి ఇది నిర్వచనకావ్యం. ఇలా బహుముఖప్రజ్ఞను ప్రదర్శిస్తూ ఆంధ్రలోకానికీ, ఆధునిక కాలానికీ సలక్షణమైన మంచి కావ్యాన్ని అందించిన శ్రీ మోహనమురళీకృష్ణ కవిగారు ప్రశంసార్హులు. ప్రతిభాశాలియైన వారిచే మరిన్ని మంచి కావ్యాలు వ్రాయించుటకుగాను ఆ పరమేశ్వరుడు వారికి ఆయురారోగ్యాది శక్తులను సమకూర్చగలందులకు వానిని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు
సుజన విధేయుడు
[illegible]

చీరాల,

శ్రీ ప్లవ మాఘము

కృతజ్ఞతలు

సిరిదివ్వెలు కావ్యం ఒక దశాబ్దం తరువాత ముద్రణకు నోచుకొంటున్నది. ఈ పుణ్యం ఘంటసాలగ్రామస్తులు శ్రీ బాలాజలధీశ్వరస్వామివారి భక్తులు శ్రీబండి పరాత్పర రావుగారికిదక్కింది.వారు స్వామివారికి ఏదోసేవ చేయాలనిఎన్నాళ్ళుగానో ఆలోచిస్తుండ గా యూట్యూబులో సిరిదివ్వెలు కావ్యప్రవచనాలను చూసి విని స్పందించి ఇలాంటి మహా కావ్యాన్నిముద్రింపించినట్లైతే ఆపుణ్యఫలితంతనకులభిస్తుందనిఆలోచించినట్లు చెప్పారు. వారికి, వారి సతీమణి శ్రీమతి బండి ధనలక్ష్మిగారికి కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను.

విదేశాలలోఉంటూ, తెలుగుభాషపై మక్కువతో తెలుగునుప్రచారంచేస్తూ, తెలుగు పద్యాలు వ్రాయటం నేర్చుకుంటూ , తెలుగుకావ్యాలపై ఉపన్యాసాలు ఏర్పాటుచేసి వారం వారం జూమ్ నెట్ వర్క్ ద్వారా విశ్వవ్యాప్తం అయ్యే విధంగా కార్యక్రమాలను ఏర్పాటు చేసి ఈ కావ్యకర్తను ప్రోత్సహించి , సిరిదివ్వెలు కావ్యాన్ని రెండుమాసాలపాటు ప్రవచనం గాచెప్పించి తెలుగువారందరికీ ఆసక్తినికలిగించి , ఆస్ట్రేలియాలోని పద్యవికాసంబృందం వారిసంకల్పంతో సిరిదివ్వెలుకావ్యాన్ని తామేముద్రించి వెలుగులోకితేవాలని ఆలోచించి న ఆస్ట్రేలియా తెలుగుమల్లి, అధ్యక్షులు మల్లికేశ్వరరావు, కొంచాడ వారికి , వారితోపాటు ఈ కావ్యాన్ని విని ముద్రణకు ప్రోత్సహించిన మెల్బోర్న్ తెలుగు పద్యవికాసం బృందానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

నేను అడిగినవెంటనే ఎన్నిపనులున్నా అన్నిటినీ పక్కనపెట్టి శివరంజనిని అనుగ్ర హించిన ప్రవచనరాజహంస, అభినవమల్లినాథ,పద్యకళాతపస్వి,శ్రీధూళిపాళ మహాదేవ మణిగారికి, సిరిదివ్వెలు-సరిమువ్వలు ధ్వనించిన శతావధానశేఖర, త్రిగళావధానస్రష్ట, ఎనుకుదురాటగండ శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారికి, ముందుమాట పలికిన వేదభారతి వ్యవస్థాపకులు,వాచస్పతి,సంస్కృతమిత్ర, డా. రేమెళ్ళ అవధానులు గారికి,

మహిమాన్వితం అంటూ ముందుమాటను అనుగ్రహించిన హనుమదుపాసకులు శ్రీ అన్నదానం చిదంబరశాస్త్రి గారికి, వాట్సాప్ తో పలకరించి కావ్యముద్రణావిషయాన్ని అడుగగానేఅభిమానంతోస్పందించిఅంతేఅభిమానంతోసకాలంలో అందంగా ముద్రించి ఇచ్చిన రాజమహేంద్రవరం మోహన్ పబ్లికేషన్స్ వారికి, చక్కని స్పందనతో నావెన్నంటి నడుస్తూనాకుఅన్నివేళలాసహకరిస్తూన్న పెద్దలు మండలిబుద్ధప్రసాద్ గారికి, ఘంటసాల శ్రీబాలాజలధీశ్వరస్వామి ఆలయట్రస్ట్ ఛైర్మన్ వేమూరిబలరాం గారికి (స్వాతి బలరాం), శ్రీగొర్రెపాటి వెంకటరామకృష్ణగారికి,నాకుకొండంత చేయూతనిచ్చిన మిత్రులు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలను తెలుపుకుంటున్నాను.

రచయిత

సిరిదివ్వెలు

ఘంటసాల శ్రీ బాలాజలధీశ్వరస్వామి మాహాత్మ్యము

★ ★ ★

శా. శ్రీవాణీ గిరిజా ప్రసాద గరిమన్ శ్రీ చిద్విలాసమ్ము నా
భావార్థమ్ముల నిల్పి మించి కులుకన్ వార్ధీశుమాహాత్మ్య గా
థా వైదగ్ధ్య విశేషకావ్యరచనా తాత్పర్యభావమ్ములన్
భావింతున్ గణనాయకున్ తొలుత సంభావించి ప్రార్థించుచున్ 1

:అవతారిక:

ఉ . ఏనొనగూర్చుకొన్న మహనీయపురాకృతపుణ్యమేమొ ల
క్ష్మీ నరసింహశాస్త్రి వరసిద్ధకవీంద్రునకున్ సుతుండనై
జ్ఞానగుణాదులన్ బడసి శబ్దవిధంబులనేర్చి కావ్య వీ
థీ నిపుణుండనౌచు సిరిదివ్వెలు నే సృజియించి చూపెదన్ 2

ఉ . ఈశ్వరుడే కవిత్వమొక యించుక వ్రాసెడి శక్తిమత్వమున్
శశ్వదనంత సంపద ప్రసాదముగా లభియింపజేయ కా
మేశ్వరి తల్లియై వర సమృద్ధ సుధారసధారలెల్లెడన్
శాశ్వతమై స్రవింప నను సత్కృపతో గనె నాంధ్రి సేవకున్ 3

మ . "సిరి" పూర్వమ్మగు శీర్షికన్ పలు గుణాశ్లిష్టమ్ములౌ కావ్యముల్
నిరతిన్ వ్రాసితి నింతకున్ మునుపు కానీ యీశ్వరానుగ్రహ
మ్మరయన్ బోలుచు ఘంటసాల జలధీశానుగ్రహమ్మెట్టిదో
విరచింపందగునంచు నీశ్వరుడు నన్ ప్రేరేచె నాత్మీయతన్ 4

ఉ . వ్రాయుటకున్ దొడంగినను వైఖరి తెల్లము కాకపోయె గా
నీ యనువైనవృత్తముల నీశ్వరుడే సమకూర్చి వ్రాసె మా
నాయన నేర్పు ఛందముల నవ్యపథంబుల తీర్చిదిద్ది భ
ద్రాయతమూర్తియై రస విధానమునెల్ల రహింపజేయుచున్ 5

ఉ . శ్రీ జలధీశ్వరుండొసగు సేవలగూర్చి రచింపుమంచు న
న్తేజితుజేయుచున్ పలికె దివ్యమహత్త్వముగల్గు తల్లి వి
ద్యా జయశీల "బాల" మహిమాన్విత శబ్దవచోమృతాబ్ధి మౌ
నీజనవంద్య మంత్రమయి నిక్కముగా నన్బ్రోచు మాతయై 6

ఉ. అమ్మయనుజ్ఞమేరకు మహావిభవమ్ముగ వ్రాయబూని నీ
మమ్ముగ రేబవళ్ళు పరమాత్మునిలీల దలంచుకొంచు భా
వమ్మున కల్పనాకథల వర్ణన జేసితి కావ్యమందు ని
క్కమ్ముగ శర్వులీలల ప్రకారము నే నెరిగింపలేనయా 7

శా. చారిత్రాత్మకమైన దేవళములో సాంబయ్యతో బాల చె
న్నారన్ ముద్దుగ నేకపీఠిక పయిన్ నవ్యానురాగాత్మయై
జేరన్ చూడగ ముచ్చటౌను మహిలో చిత్రమ్మిదే ఘంటసా
లా రామమ్మును చేరి కొల్చు నెడలన్ లాభమ్ము చేకూరెడిన్ 8

ఉ. ఎందరు భక్తులో యిచట నీశ్వరుగొల్చి సుఖించినార లిం
కెందరొ నాస్తికత్వమున నెంతయుమీరి యడంగినారు ; వీ
రందరికన్న మిన్నగ నహంకృతి జూపిన భాగ్యశాలురున్
కొందలమందు రోగులును కూడి ప్రశాంతిని బొందిరిచ్చటన్ 9

ఉ. వందలయేండ్లక్రిందట శుభప్రదలీల నగస్త్యమౌని మె
ప్పొందుచు సింధుతీరమున పొల్పుగ బాలనుగూడి నిల్చె నీ
సందడి ఘంటసాలపుర సన్నిధిలో జలధీశ్వరాఖ్యుడై
యందరి కోర్కెలున్ సఫలమౌనటు నిచ్చుచు విందుజేయుచున్ 10

ఉ. ఆ మహనీయ తత్త్వమును నందరికిన్ ప్రకటింపజేయగా
నీమముబూని కావ్యమును నిర్మితిజేసితి శంకరయ్య న
న్నోమగ బాలతల్లియు మహోన్నతశక్తి యొసంగ దీక్ష
కామనలెల్ల తీర ననుగన్న పురంబు ఋణంబు తీర్చుచున్ 11

షష్ఠ్యంతములు:

కం. అరయ చతుర్దశ భువనము
లిరవుగ నెవ్వాని దలచి యాశ్రితముల నీ
ధరణిని గడియించునొ నా
పురహరునకు శంకరునకు పూజార్హునకున్ 12

కం. ఎవ్వడు పార్వతిదయతో
నెవ్వగలనుబాపునిచట నిలచుచు పీఠం
బివ్వసుధను నొక్కటిపై
నవ్వానికి మనకుతోడునగు శంకరుకున్ 13

కం . లోకులమేలు గణించుచు
తేకువ హాలాహలమ్ము తిరముగ నెవ్వం
డాకట మ్రింగెనో వానికి
నాకార గుణాతిశాయి యగు నీశునకున్ 14

కం . హరహర శంకర యనుచును
మొరలిడు భక్తులనుబ్రోచు ప్రోడ యెవండో
ధరపై నతనికి గురుతర
కరుణామతి శంకరునకు కమనీయునకున్ 15

సిరిదివ్వెలు

శా . శ్రీ గౌరీశ్వర నందనా ! గణపతీ ! చిద్రూప తేజోమయా !
యోగీశా ! వరసిద్ధి బుద్ధి గుణ సంయోగాభివృద్ధ్యాత్మకా !
వాగర్థ ప్రతిభా సమన్విత ఝురీ ! ద్వైమాతురా ! శీఘ్రమై
ధీ గంభీర మహత్వశక్తి నిడుచున్ దీవింపు మెవ్వేళలన్ ! **1**

శ్రీ గౌరీ పరమశివులను ఆనందపరచు కుమారుడవైన ఓ గణపతీ ! నీ తల్లియైన పరమేశ్వరి నుండి నీవు చిచ్ఛక్తిని పొందినావు . దానిచేతనే తేజోమయుడవైనావు. సిద్ధి , బుద్ధి గుణాలచేత నిన్ను ఉపాసించిన వారికి అభివృద్ధిని ప్రసాదించువాడవైనావు . గొప్ప యోగీశ్వరునిగా ప్రసిద్ధిని పొందావు . అర్థవంతమైన వాక్ప్రవాహాన్ని ప్రతిభతోసహా మాకుఅనుగ్రహించేవాడవు నీవు . గంగాగౌరీ మాత లిద్దరికీ ముద్దుబిడ్డడవు స్వామీ! గొప్పబుద్ధివలన మహిమాన్వితమై ప్రకాశించేశక్తిని నాకుఅనుగ్రహిస్తూ ఎల్లవేళలా నన్ను దీవించవయ్యా !

గౌరీదేవి అంటే పార్వతీదేవి కదా ! ఆవిడ పర్వతరాజు కుమార్తె. పర్వతాలూ, వాటిపై మొలిచే చెట్టు చేమలూ మన కంటికి కనిపించే సమస్తమూ ప్రకృతి. అది ఆ అమ్మవారి స్వరూపం. అంటే గౌరీదేవి స్వరూపం. గౌరీనందనుడు గణపతి. అంటే ఆతడు ప్రకృతినుంచి ఆవిర్భవించినవాడు. ప్రపంచం లో ప్రకృతీ పురుషుడూ కలిస్తేనే సృష్టి ఏర్పడుతుంది. అలాకాకుండా కేవలం ప్రకృతినుంచి మాత్రమే ఉద్భవించినదానికి లయంఉండదు. అదిశాశ్వతమైంది. జీవులు మరణానంతరం ప్రకృతిలో కలిసి పోతాయి . అయినప్పుడు ప్రకృతిలోనుంచి పుట్టినది ప్రకృతిలోనే ఉంటుంది. దానికి నాశనం ఉండదు. కానీ అది చైతన్యవంతం కావటానికి పురుషుని ప్రోద్బలం కావాలి. లేకుంటే దానికి చేతనత్వం కలగదు. అందుచేత అది పురుషుణ్ణి జయించలేదు. కనుకనే గౌరీసుతుడు ఈశ్వరుణ్ణి జయించలేకపోయాడు. ప్రాకృతికమైన అవతారానికి పురుషకారాన్ని జతచేయటానికే ఈశ్వరుడు ఉమాసుతుని శిరసు ఖండిం చాడు. పునః ప్రాణప్రతిష్ఠ జరిగినతరువాత అతడు అమేయబలసమన్వితుడైనాడు. పూజావిధానంలో ప్రాణప్రతిష్ఠకు ఇంతటి ప్రాధాన్యత ఉంది. అలాగే గణపతిని ఏకవింశతి పత్రితో పూజించటానికి కూడా ఇదేకారణం ఈ విధంగా శివశక్తుల తేజస్సంభూతునిగా ఆవిర్భవించిన గణపతికి మహా మహిమో పేతమైన శక్తులు ఉన్నాయి కనుక ఎల్లవేళలా ఆ శక్తిలో కొంత నాకు అనుగ్రహించి నన్ను దీవించ వయ్యా అని కావ్యాదిలో గణపతిని ప్రార్థించు కొంటున్నాన.

శా . గంగంగం గణనాథ ! విఘ్నముల నుక్కా డించి నా వ్రాత సా
గంగా సాయము జేయుమయ్య ! కవితా గంగా ప్రవాహమ్ము పా
రంగా జేయుము ; పాఠకావళియు నుత్క్రాంతిన్ వినోదించి స్వ
ర్గంగా వాహినిగా దలంచి దనియంగాజేయుమో దేవరా ! **2**

ఓ గణాధిపా ! నీ మంత్ర బీజాక్షరాలను స్మరించుకుంటున్నాను. నేను చేసే ప్రయత్నంలో ఎదురయ్యే విఘ్నాలను అణచిపెట్టు. నాకావ్యరచన ఎటువంటి ఆటంకమూ లేకుండా ముందుకు సాగేలా సహాయం చేయవయ్యా ! నా కావ్యరచన ఒక గంగా ప్రవాహంలా పరుగులు పెట్టేలా చేయుమయ్యా ! ఈ కావ్యాన్ని చదివే పాఠకులు ఆసక్తితో , వినోదిస్తూ ఇది ఒక ఆకాశగంగా ప్రవాహం అని భావించి తృప్తి చెందేలా చేయుమయ్యా !

ఉ . శ్రీ గణనాయకా ! రస విశిష్ట గుణధ్వనిరీతి యుక్తమై
యాగమసారమెల్ల పరమాత్మ పదార్థముగా రహించి ఛం
దో గమకమ్ము లింపొసగ తుష్టియు పుష్టియు సిద్ధి బుద్ధులున్
వాగనుసారమై నడువ వర్ధిలజేయుము నాదు కావ్యమున్ !! **3**

శ్రీ మహాగణపతీ ! నా కావ్యం వర్ధిల్లేటట్లు చేయుమయ్యా ! దీనిలో రసం, గుణాలు, ధ్వని ,రీతి మొదలైన సమస్త కావ్యలక్షణాలూ చక్కగా కుదురుకోవాలి . ఆగమసారమంతా దీనిలో పరమాత్మ పదార్థంగా దర్శనమీయాలి . రకరకాల ఛందస్సులు మనోహరంగా కదలిరావాలి . నాకావ్యానికి తుష్టి , పుష్టి , సిద్ధి , బుద్ధిమత్తత లభించాలి . నా పలుకులవెంట ఇవేన్నీ అనుసరించి సమకూరేలా చేయుమయ్యా

శా . శ్రీ బాలా జలధీశ్వరుండు కరుణా సింధుండు ; పాహీ యనం
గా బాధోపశమంబు గూర్చి జనులన్ గాపాడు దైవమ్ము ; "నీ
వే బంధుండ వ"టంచు మ్రొక్కిన దయన్ వీక్షించి రక్షించు వా
డై బాలాసతిగూడి నిల్చె నొక పీటన్ ఘంటసాలా పురిన్ ! 4

బాలా జలధీశ్వరస్వామి ఎంతో దయగల మహానుభావుడు . ఎటువంటివాడైనా సరే "పాహీ" అంటే చాలుఅన్ని బాధలనూతీర్చి కాపాడగలదేవుడు . "అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణంమమ" అని ఓ స్వామీ నీవే నాకు బంధుడవు - నీవు మినహా నాకు ఇంకా దిక్కెవ్వరూ లేరు అని నమ్మి కొల్చినట్లైతే ఆ స్వామి దయతోకనిపెట్టి రక్షించగలవాడు. సాధారణంగా పరమేశ్వరుడు తనంతతాను లోకులను

కాపాడగలవాడు అలాగే అమ్మవారుకూడా తనంత తాను భక్తులను అనుగ్రహించ సమర్థురాలు . కానీ ఘంటసాలలో ఉన్న విశేషం ఏమంటే ఇక్కడ అయ్యవారూ , అమ్మవారూ కూడా ఒకే పీఠం పైన విలసిల్లుతూ దర్శనమిస్తారు. అలా ఇరువురు ఒకే పీఠంపైన దర్శనమీయటం అనేది మనం ఎక్కడా చూడం . అలాంటి దర్శనం ఒక్క ఘంటసాలలోనే లభిస్తుంది. ఆ విధంగా ఇరుశక్తులు ఒకే పీఠికపై దర్శనం ఇస్తూ రెండింతల దయావిశేషాన్ని భక్తులకు అనుగ్రహిస్తారు. ఇలా కావటం భక్తుల అదృష్టం అని చెప్పాలి.

శా . ఆద్యంతమ్ము లెరుంగలేము ; ప్రళయోద్యద్వహ్ని తేజస్వియై
విద్యున్మాలల మించి తత్పురుషుడై వెల్గొందుచున్ స్వర్ణ వ
ర్ణ ద్యుమ్నంబగు పింగళంపు జడలన్ నాగావళీ హేలచే
హృద్యోదాత్తత నొంది ప్రాఙ్ముఖ భవుండిచ్చోట గన్పించెడిన్ ! **5**

పరమేశ్వరునికి మొదలు , తుది మనంతెలుసుకోలేము. ఆయన్ను మనం చూడలేకపోతున్నామని బాధ పడతాంగానీ నిజంగా ఆయన కనిపిస్తే చూడగలిగే దృష్టి మనకులేదు. ఆయన ప్రాఙ్ముఖం తత్పురుష మనే పేరునఉంటుంది . ప్రళయ కాలంలో ఉద్భవించే అగ్నిజ్వాలలు ఎంత ప్రకాశమానంగా ఉంటాయో అలాంటికాంతి గలిగి ఉంటుంది. ఒక్కమెరుపుమెరిస్తే మనంచూడలేం. అలాంటివి కోటి కోటి మెరుపులు ఒక్కసారిగా మెరిస్తే ఎంతటి కాంతి ఉద్భవిస్తుందో అంతటి కాంతిని అతని తూర్పు ముఖం కలిగి ఉంటుంది . ఇంకా మేలిమి బంగారు వర్ణంతో సమానమైన దేహకాంతితోనూ , పింగళవర్ణం గలిగిన (నలుపు , పసుపు మిశ్రమ వర్ణం) జడలతోనూ , మెడమీద , చేతులమీద బుసలు కొడుతూ పడగలు చాస్తున్న నాగాభరణాలతోనూ ఆ పరమేశ్వరుని తూర్పుముఖం ఇక్కడ దర్శనమిస్తుంది .

శా . కాలాభ్ర భ్రమర ద్యుతిన్ బొలుచుచున్ కర్ణాంతరాశ్లిష్ట నా
గాలంకార మణిప్రభా జటలతో గంభీరమౌ దక్షిణా
భీలమ్మైన " నఘోర " మియ్యెడ మహాభీష్ట ప్రసాదాత్మక
మ్మై లింగాకృతి బూని శాంతుడగుచున్ మన్నించు భక్తావళిన్ **6**

ఈశ్వరునియొక్క దక్షిణముఖానికి " అఘోరమని" పేరు . ఆ ముఖం ఎలా ఉంటుందంటే నల్లని కారు మబ్బువలె,ముసిరిన నల్లతుమ్మెదలయొక్క మెరిసేనల్లనికాంతిని పోలిఉంటుంది . ఆయన సిగనుంచి చెవులమీదుగా మెడచుట్టూ అల్లుకున్న నాగుపాముల తలలపైనున్న మణులకాంతిచేత ఆయన

జడలు మెరిసిపోతూఉంటాయి . గంభీరమైన ఆయన దక్షిణముఖం చూడటానికి భయంకరంగా ఉన్నా మనం కోరుకునే అసాధ్యమైన కోరికల్ని ప్రసాదించటంలో తిరుగులేనటువంటిది. అటువంటి ఈశ్వరుడు లింగాకారాన్ని ధరించి ప్రశాంతంగా బయటకు దర్శనమిస్తాడు .

శా . హేమక్ష్మాధర చంద్రికా నిభము ; బ్రహ్మేంద్రాదు లర్చింప సం
క్షేమ స్థైర్యము లిచ్చు పశ్చిమ దిశా శీర్షమ్ము ; కందర్పు నూ
ర్పేమార్చన్ చెలరేగు లోచనము తృప్తింజెంది భక్తాళి హృ
ద్భూమిన్ దోచు కళంకహీనముగ " సద్యోజాత " లింగంబనన్ **7**

ఈశ్వరుని పశ్చిమముఖం "సద్యోజాతం". అది బంగారుకొండయైన మేరుపర్వతం ప్రసరించే చంద్ర కాంతితో సమానంగాఉంటుంది. ఆయనను బ్రహ్మేంద్రాది సమస్తదేవతలున్నూ పూజించటంచేత శాంతిని వహించి లోకులకు క్షేమస్థైర్యాదులను ప్రసాదిస్తాడు. అలాగే ఒకప్పుడు ఉద్రేకాన్నిపొంది మన్మధుణ్ణి దహించివేసిన రుద్రనేత్రం ఇప్పుడు తృప్తిని పొంది ఏ ఉద్వేగమూ లేనట్లుగా , ప్రశాంతంగా భక్తుల హృదయాలకు కనిపిస్తుంది.

శా . గౌరాఙ్గాంచిత కుంకుమాంకిత ముఖాఙ్గశ్వేత గండస్థలం
బా రమ్యోత్తర "వామదేవ"మన నొప్పారున్ ; శశాంకప్రభా
పూరంబై యధర ప్రహాస మొలుకన్ భ్రూభంగకర్ణోత్పలం
బోరన్ జారగ నీలవేణి కులుకన్ పొల్పొందు లింగాకృతిన్ ! **8**

పరమేశ్వరుని ఉత్తరముఖం"వామదేవం"అనిపిలువబడుతుంది . ఆ వదనం పసుపువర్ణంతో ముఖాన కుంకుమ అద్దబడిఉంటుంది .తెల్లనిచెక్కిళ్ళతో ప్రకాశవంతంగాఉంటుంది . తెల్లనిచంద్రకాంతినిపోలి ఉంటుంది . ఎఱ్ఱనిక్రిందిపెదవితో చిరుదరహాసంచేస్తూ ప్రశాంతంగా కనిపిస్తుంది . ఆయన కనుబొమ ల కదలికలవలన చెవిపైధరించిన కలువపూవు ఓరగా జారగా ఆయనయొక్క నల్లని జడలు కొత్త కులుకులు ప్రదర్శిస్తూ లింగాకృతిలోనే అందాలు చిందిస్తాయి .

శా . వ్యక్తావ్యక్త గుణేతరంబగుచు విశ్వాంశాభి తత్వమ్ముగా
శక్తి స్థాపనజేయు నక్షరముగా సాధుల్ ప్రకీర్తింపగా
సూక్తమ్మై తమమున్ హరించు ; నదియే సూక్ష్మాతిసూక్ష్మమ్మునై
శాక్తంబై విలసిల్లు నూర్ధ్వముఖ "మీశానమ్ము" శాంతాకృతిన్ ! **9**

ఈశ్వరునియొక్క ఊర్ధ్వముఖం"ఈశానం". అది ఆకాశంవైపునుంచి దశదిశలకూ శక్తిని ప్రసరింపజేస్తుంది.ఆశక్తి అక్షరమైనది.అక్షరముఅనగానాశములేనిది.శాశ్వతమైనది.ఆపరమేశ్వరుని

శక్తి శాశ్వతమైనది . దానిని సాధువులైన వారు,యోగులైనవారు స్తుతిస్తూ ఉండగా అది చిరస్థాయి అవుతూ ఉంటుంది. ఆశక్తి చాలా సూక్ష్మంగా ఉంటుంది . అదే అణుశక్తి. ఉపనిషత్తులు చెప్పిన విధంగా "అణోరణీయాన్ మహతో మహీయాన్" అని గుర్తించబడింది. ఆశక్తి ఈ లోకమంతటా వ్యాపించిన చీకటిని హరించివేస్తుంది. అది ఆకాశంనుంచి కంటికి కనిపించనంతటి సూక్ష్మాతిసూక్ష్మ మైనరూపంలో శక్తి స్వరూపంగా, ఎటువంటి అలజడినీసృష్టించకుండాప్రశాంతంగా లోకమంతటా వ్యాపించి లింగాకృతిలో లీనమౌతుంది.

శా . శుద్ధ స్ఫాటికమూర్తి పంచముఖుడై శోభిల్లు ముక్కంటి సం
శుద్ధాత్ముండు శశాంకమౌళి విబుధశ్లోకుండు గంగాధరుం
డిద్ధవ్యాఘ్రపు చర్మధారి ఫణి నాగేశోపవీతుండు సు
శ్రద్ధాయోగి వినీలకంఠు నభవున్ సంపూజితున్ జేసెదన్ ! **10**

ఎటువంటి కల్మషమూలేని స్వచ్ఛమైన స్ఫటికం రూపంలో ముక్కంటియైన ఆ పరమశివుడు పంచ ముఖుడై ప్రకాశిస్తూ ఉంటాడు; చంద్రరేఖను తలపైధరించిన ఆ మహాదేవుడు పరిశుద్ధమైన అంత రంగం గలవాడు. దేవతలందరిచేతను కొనియాడబడువాడు. గంగను శిరసుపై ధరించినవాడు. ప్రసిద్ధమైన వ్యాఘ్రచర్మాన్ని ధరించేవాడు; విప్పారిన పడగలుగల నాగేశ్వరుణ్ణి యజ్ఞోపవీతంగా ధరించిన వాడు; తీక్ష్ణమైన శ్రద్ధతో యోగవిద్యను ఉపాసించువాడు; నీలకంఠుడు ; పుట్టుక లేనివాడు శాశ్వతుడు అయిన పరమేశ్వరుని నేను చక్కగా పూజిస్తాను.

శా. శూలంబొప్పెడి పాణి; పింగళజటా శోభాకృతుల్ దివ్య నా
గాలంకారము లక్షమాలలు శుభాకారంబు చేకూర్చి సౌ
ఖ్యాలంగూర్చు ; నుమాభవాని సహదేహంబై విరాజిల్లి జే
జే లొందన్ వృషభంబు నెక్కు నభవున్ సేవింతు నెవ్వేళలన్ **11**

ఆ పరమేశ్వరుడు వృషభవాహనుడు . ఆయనచేత శూలం కాంతులీనుతూ ఉంటుంది . పింగళవర్ణం గల ఆయన జడలుఆయనకు ఒక క్రొత్త అందాన్ని తెచ్చిపెడతాయి . ఆయన మెడలో వ్రేలాడే దివ్యమైన నాగుపాములు అలంకారాలుగా శోభిల్లుతూఉంటాయి. ఆయన మెడలోని రుద్రాక్షమాలలు లోకాలకు సుఖసంతోషాలను కలిగిస్తాయి . లోకాలకు శక్తిప్రదాతఅయిన ఉమాభవాని ఈశ్వరునిదేహంలో సగభాగమై విరాజిల్లుతూ ఉండగా వృషభ వాహనాన్ని అధిరోహించే ఆదిశంకరుని నేను ఆరాధిస్తాను

శా . లోకాలన్ సృజియించు నీశ్వరుని యాలోకింప నుత్సాహులై
సాకారమ్ముగ గాంచలేక భువిలో సంకేతముల్ గూర్చి "దై

వాకారంబియ్యది దీని గొల్వుడ"నగా భక్తిన్ ప్రపూజించి యా
యాకారమ్మున వాని గాంచుటది చిత్తైకాగ్ర లక్ష్యంబగున్ ! 12

ఈ సమస్త లోకాలనూ సృష్టించే పరమేశ్వరుణ్ణి దర్శించుకోవాలని ఉత్సాహంతో భావించే భక్తులు ఆయన రూపాన్ని సాకారంగాచూడలేక ఈలోకంలో ఆయననుచూడాలంటే సాధకాలుగా కొన్ని సంకేతాలతో విగ్రహమూర్తులను ప్రతిష్ఠించి "ఇదిగో! దేవుని ప్రతిరూపం ఇది ! దీనిని ఆధారంగా తీసుకుని దృష్టిని కేంద్రీకరించి ఆరాధించండి"అని ఋషులు బోధించగా ఆ ప్రకారంగా నడుచుకుని దైవదర్శనాన్ని పొందటం అనేది ఆ భక్తుల మనోబలం కదా !

శా. బొమ్మన్ గొల్చుటదోషమెట్లగును?నుద్బోధించు శాస్త్రమ్ములున్
బొమ్మన్ దేవుడటంచు మంత్రములు సంపూజించు మార్గమ్ములున్
నమ్మన్ గావని చాటి చెప్పినవి ;విశ్వాసమ్ము పాటించినన్
బొమ్మన్ బ్రహ్మము నిల్చి పల్కు నిట తత్త్వోపాసనా సిద్ధిచే ! 13

విగ్రహారాధన దోషమని కొందరు వాదిస్తారు. కానీ శాస్త్రాలు ఆ సంగతిని అంగీకరించటం లేదు . నిజానికి ఒక బొమ్మను దేవునిపేర నిలిపినా దానిని ప్రతిష్ఠించేటప్పుడు ఉచ్చరించిన మంత్రసిద్ధిచేతను, ఆ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో భగవానుడుగా ఆవాహనచేసి పూజలు సల్పటం చేతను , దానిలో దైవశక్తి ఆవిర్భవించిందని అవి ప్రకటిస్తున్నాయి.నమ్మకంతోనూ, విశ్వాసంతోనూ విగ్రహాన్ని తత్త్వోపాసనాసిద్ధి కలిగేటట్లు ఆరాధించి నట్లైతే దానికి బ్రహ్మత్వం లభిస్తుందని సర్వశాస్త్రాలు ఉద్బోధిస్తున్నాయి .

శా . తత్త్వార్థమ్ము నెరుంగలేని జడు లేతత్సారమున్ వీడి మా
తత్త్వమ్మే మహనీయమంచు కలహోద్యద్యత్నముల్ సల్పుటల్
తత్త్వజ్ఞాన విహీనమౌను ; సుజనాదర్శమ్ము కాబోదు ; యీ
తత్త్వమ్మున్ గ్రహియించి లోకము మతౌద్ధత్యమ్ము పోనాడెడిన్ ! 14

తత్త్వాన్ని తెలుసుకోలేని మందబుద్ధులు తత్త్వసారాన్ని గ్రహించలేక , తాము తలచినదే గొప్పదనుకుని వాస్తవవాదులతో కలహించేప్రయత్నంచేస్తున్నారు. ఇది తత్త్వచింతనాలోపంగా భావించాలి . అంతే గానీ అటువంటిఆలోచనావిధానం ఆదర్శపాత్రంకాదు.ఈసంగతిని గ్రహించి అటువంటివారు లోకం లో మతవాదాన్నీ, మతదురభిమానాన్నీవిడనాడాలి.

శా . బ్రహ్మాండమ్ము సృజించి దానికదియే వర్తిల్ల తానేలుచున్
బ్రహ్మాండమ్మున జీవకోటి బ్రతుకుల్ భద్రంబుగా గాచుచున్
బ్రహ్మత్వమ్మున వెల్గు నీశ్వరుని సంభావించు రూపమ్మునై
బ్రహ్మాండ ప్రతిరూపమై నిలచు దివ్యాంగమ్ము లింగమ్మగున్ 15

పరమాత్ముని దివ్యలింగం శివలింగం. అది ఈశ్వర ప్రతిరూపం . ఈ సమస్త బ్రహ్మాండానికీ అది ప్రతి రూపం . దానిలో బ్రహ్మత్వం వెలుగొందుతూ ఉంటుంది .ఈ బ్రహ్మాండంలో జీవకోటి బ్రతుకులను భద్రంగా కాపాడే దైవశక్తి అదియే . అసలు ఈ బ్రహ్మాండాన్ని సృష్టించిందీ , దీనికిదే ప్రవర్తించేలా రూపొందించిందీ, దీన్ని పరిపాలించేదీ కూడా ఈ లింగమే

శా . లింగాకారము లోకచిహ్నమగు ; నోలిన్ పానవట్టమ్ము నా
లింగాధారకమైన భూమి యగు ; నాలింగానురాగప్రభా
సాంగత్యమ్మున వృద్ధియౌను జగముల్ సంతాన సంపత్తిచే
నంగీకారము లోకభావమున సోహమ్మంచు సేవింపగన్ ! 16

భూమ్యాకాశాలు ఒకటిగా ఏకమౌతూ కనిపించే దృశ్యానికి లింగాకారం ఒక నిదర్శనంగా కనిపిస్తుంది శివలింగానికి అడుగున కనిపించే పానవట్టం ఆధార భూమిగా కనిపిస్తుంది. ఇలా శివలింగము, పానవట్టము ఆలింగనం చేసుకున్నట్లుగా కనిపించేసన్నివేశం లోకాలన్నీ సంతాన సంపత్తి చేత వృద్ధిని పొందుతాయని సూచిస్తున్నట్లుగా ఉంటుంది . సో2హమ్ అనే భావనతో ఆరాధించినట్లైతే సకల సంపదల వృద్ధి సమకూరుతుందని లోకంలో అందరూ అంగీకరించే విశేషం

శా . లింగంబెంతయు శక్తివంతము ; జగల్లీలా సమున్మేష మీ
లింగంబే ! శివలోకమౌనిదియె; నుల్లేఖింప శక్తిస్థలం బీ
లింగమ్మే ! శివపార్వతుల్ గలసి పాలింపన్ సుభద్రంబగున్
లింగాకారమె సృష్టి కారణము తాల్మిన్ గొల్చి మేలొందుడీ ! 17

ఈసృష్టి సమస్తంలోనూ శివలింగం మహాశక్తివంతమైనది. సర్వజగత్తులోను జరుగుతున్న కార్యక్రమాలన్నిటికీ ఈ శివప్రకృతియే మూలకారణం. ఈశివలింగ సన్నిధియే శివలోకం. నిజం చెప్పాలంటే శక్తి స్థలం శివలింగమే. శివపార్వతులు ఒకటియై ఈ లోకాన్ని పాలించటం వలన లోకాలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ జగత్ సృష్టికి లింగాకారమే మూలకారణం . కనుక లోకులెల్లరు ఓర్పుతో , నేర్పుతో పరమశివుని సేవించి మేలును పొందాలి .

శా . లోకేశుండగు నీశ్వరుండొకడె ! యాలోచింపగా వేరొకం
డే కూటంబున లేదు; నాతనిని వేరేపేర పూజించుచున్
మాకున్ దేవుడు వేరటంచు తెలుపన్ మాన్యంబు గాబోదు గా
నీ కర్తవ్య మెరుంగలేక నతగానిన్ తాల్మి నౌదాల్చెడిన్ ! 18

లోకాలన్నిటినీపాలించే పరమాత్ముడు భగవంతుడు ఈశ్వరుడు ఒక్కడే . ఎంత ఆలోచించినా సృష్టిలో

మరొక దేవుడనే వాడు ఎవడూ లేడు . ఏ దేశంలోగానీ, ఏ కూటమిలోగానీ మరొక దేవుడు లేడు . కానీ మాదేవుడు వేరుగా ఉన్నాడు . అతనిపేరు వేరుగా ఉంటుంది అని చెప్పటం సరియైన పద్ధతి కాదు అయినా అలాంటివారి బలం ఎక్కువ అయినప్పుడు చేయదగిన కర్తవ్యం మరొకటి తెలియక కొందరు వారిమార్గాన్నే తలదాల్చుతుంటారు .

శా . లోకమ్ముల్ నడిపించు యోగ్యుడెవరో ; లోకస్థులన్ బ్రోచు హృ
ల్లోకేశుం డెవరో; జగాలు గొలువన్ లోకోత్తరుం డెవ్వరో
లోకాలోకన పాలనాగరిమ నాలోచించు వాడెవ్వరో
నాకుందిక్కగు నాతడే యనుచు నానారీతులన్ గొల్చెదన్ ! 19

ఈ లోకాలన్నిటినీ నడిపించగల సమర్థుడైన వాడు; లోకులందరినీ కాపాడగల జనహృదయాధి నాయకుడు, అన్నిలోకాలలోనూ ఉత్తముడైనవాడు, లోకస్థులైన జనుల కష్టసుఖాలను గమనించి పరి పాలించగలవాడు,ఎవరైతేఉన్నాడో-అతడేనాకుదిక్కు. అతనిని నేను అనేక విధాలుగా పూజిస్తాను

శా . ఎవ్వాడీ జగమున్ సృజించె నెవడీ యీశుండు లోకంబులం
దెవ్వాడందరి యాత్మరూపుడయి పాలించున్ జగంబంతటన్ !
నెవ్వాడీ భువనాధినాయకుడు ! వర్ణింపన్ ప్రభుండెవ్వడో
యవ్వానిన్ మదిలో దలంతు భవదాస్యంబెల్ల పో నాడగన్ ! 20

ఈ లోకాలన్నిటినీ ఎవరుసృష్టించారో, ఈ లోకాలన్నిటికీ ప్రభువు ఎవరో , లోకాలన్నిటిలో అందరి లోనూ ఆత్మరూపునిగా నెలకొని ఎవడు అందరినీ పాలిస్తున్నాడో, ఎవరు సకలభువన నాయకుడో, అందరకూ ప్రభువు ఎవరో అటువంటి వానిని నాయొక్క జన్మపరంపరల దోషం పోయేవిధంగా నిత్యము నామనస్సులో తలుచుకుంటూ ఉంటాను .

శా . వేదాంతమ్మున కర్థ మెవ్వడు ! జగద్వృత్తమ్ము శాసించి స
మ్మోదంబొందెడి వాడెవండు ! యెవడా ముక్తి ప్రదాతృండు ! ని
ష్ఖేద బ్రహ్మ పదార్థ మెవ్వడు ! సదా కీర్తింప సంతృప్తుడై
యే దివ్యాత్ముడు వెల్గునో యతని "పాహీ" యంచు సేవించెదన్ ! 21

వేదాలన్నీ పరమాత్మునిగాయెవరినిపేర్కొంటున్నాయి? ఈలోకాలన్నిటినీ శాసించి యే భగవానుడు ఆనందాన్ని పొందుతూ ఉంటాడు? జీవులకు ముక్తిని ప్రసాదించేవాడు ఎవరు ? ఏ మాత్రమూ దుఃఖం లేని బ్రహ్మపదార్థ స్వరూపంఎవరు? ఎల్లప్పుడూ కీర్తించటం చేతనే సంతృప్తిని పొందేవాడు ఎవరు?

ఎల్లప్పుడూ దివ్యమైన కాంతులతో ప్రకాశించే వాడు ఎవరు ?అటువంటి భగవంతుణ్ణి నేను "పాహీ" యని శరణుకోరుతూ సేవిస్తాను .

శా. శ్రీ బాలాజలధీశ్వరుండు మహదాశీర్వాద సంపన్న వి
ద్యాబుద్ధుల్ దయసేయ భక్తిమెయి తాత్పర్యమ్ము సంధిల్లగా
నా బంధుండని యాత్మనెంచితిని; విజ్ఞానాబ్ధి బాలాంబ వా
ణీ బంధంబు బిగింప కొల్తునిట నన్నేలన్ దయా సింధువై ! 22

శ్రీ బాలాజలధీశ్వరస్వామి గొప్ప ఆశీర్వాద మహిమ గలవాడు . కోరిన సంపదలను, విద్యాబుద్ధులను ఆ పరమాత్ముడు అనుగ్రహిస్తాడుకనుక ఆయనను నా బంధువుగా భక్తితాత్పర్యాలతో మనస్సులో భావించు కున్నాను జీవులకు విజ్ఞానాన్ని అందించే తల్లి బాలాదేవి నాకు సరస్వతీ అనుగ్రహం లభించే టట్లు దయాసింధువై ఆశీర్వదించగా నేను నా తల్లిని సేవిస్తున్నాను

కవిరాజవిరాజితము : అయి జగదంబిని హాసవిలాసిని హైమవతీ పరమాత్మ శివా
దయగని బ్రోవవె తాపము దీర్చవె తత్పరబుద్ధి సదా నిడవే
రయమున గావవె రక్షణ నీయవె రాజితరూపిణి రత్నమయీ
భయమునుదీర్చి సుభద్రత గూర్చవె "బాల" మనస్విని భాగ్యమయీ ! 23

ఓ జగదాంబా ! చిరునవ్వుచేత విలాసములను ప్రదర్శించుతల్లీ !హిమవత్పుత్రికా ! పరమేశ్వరుని సతీమణీ ! నా యందు దయనుంచి నన్ను కాపాడవే ! నాకు కలిగే తాపాన్నితీర్చి అనుగ్రహించవే తల్లీ ఎల్లవేళలా నీయందు నాకు భక్తిభావం నెలకొనేలా చేయవేతల్లీ! నన్నుకాపాడటంలో ఆలస్యం చేయ వద్దుతల్లీ! అమితమైన తేజస్సుతో ప్రకాశించే నీ రూపానికి తోడుగా మరిన్ని రత్నరాసులను ధరించి కాంతులీనే తల్లీ! నా భయాన్నిపోగొట్టి నాకు భద్రతను అనుగ్రహించవే ! ఓ బాలా దేవీ ! నీవు మంచి మనస్సుగలదానివే ! కోరిన భాగ్యాలను ప్రసాదించేదానివి కదాతల్లీ !!దయచూపించవే !!

(కవిరాజ విరాజిత వృత్త లక్షణం: ఒక నగణము,ఆరు జగణములు, తరువాత ఒక వగణము-(అంటే లగము)ఉంటాయి.మొత్తం 23 అక్షరాలుంటాయి. ఇది వికృతి ఛందం. 1-8-14-20 స్థానాల్లో యతి. ప్రాస నియమం ఉంటుంది.ప్రాసయతి వేయకూడదు.)

కవిరాజవిరాజితము : అరుణ కిరణ్మణి హార విలాసిని యద్భుత శక్తి సమాభిరతే
సురుచిర సుందర సూనృత శోభిని !శుద్ధ మహత్వయశోవిభవా !
వరగుణ మానిని వైదిక రూపిణి వాక్యవివేచని వాఙ్మినుతే
హరవరభామిని హల్లకహాసినియైంకృతమాలిని హాస్యరతే ! 24

సూర్యోదయానికి ముందుగా ప్రసరించే అరుణకిరణాలవంటి కాంతులను వెదజల్లే దివ్యమైన మణులను హారాలుగా ధరించి ప్రకాశించే ఓ జగన్మాతా ! నీవు అద్భుతమైన శక్తిచేత నిత్యమూ శోభిల్లుతూ ఉంటావు; అంతటి జేగీయమానమైన నీ శోభకు కారణం నీలోని సత్యసంధతయే కదా తల్లీ !అంటే నీ శాశ్వతత్వమే కదమ్మా! నీవు దయతలిస్తే ఏమైనా ఈయగలదానవుకదా! నాకు స్వచ్ఛమైన , ఆక్షేపణ లేని గొప్పకీర్తినీయవేతల్లీ! అలాంటిదానిని పొందగలయోగ్యతకోసం ముందుగా నాలో శ్రేష్ఠమైన గుణాలను పెంపొందించు! ఆ సమర్ధత నీకు ఉన్నదికదా తల్లీ! ఎందుకంటే నీవు వేదస్వరూపిణివి ; ఎప్పుడు ఏవిధంగామాట్లాడాలో మాకునేర్పించగలదానివి; సాక్షాత్ సరస్వతీ బ్రహ్మలచేతనే పొగడబడినదానవు; పరమేశ్వరుడు మెచ్చినకాంతామణివి; విరిసిన పద్మదళంవలే పరిపూర్ణమైన చిరునవ్వు గలదానవు; బుద్ధిజీవులకు తెలివినిచ్చే వాగ్బీజాక్షరం "ఐం"కారమే మాలగా ధరించి ఎల్లవేళలా హాస్య రసాన్ని పండించేతల్లివి కదే! నీకు అసాధ్యమైనది ఎందునా లేదుకదా!

కవిరాజవిరాజితము : నినుమదినమ్మితి; నీ పదమానితి;నిత్యము నిన్ మది నిల్పితినే !
కనుగొనవే నను కల్మషహారిణి ! కామ్యఫలంబిడు కల్పలతా !
వనరుహలోచని వాఙ్మయరూపిణి వైభవదాయిని వర్ణమయీ
ననుదయజూడవె! నామవివర్జిత ! నాట్యవినోదిని! నాదమయీ ! 25

హే జగన్మాతా! నేను నిన్ను మదిలో నమ్మితినమ్మా! నీ పాదాలను ఆశ్రయించానుతల్లీ !నిత్యమూ నిన్నే నా మనస్సులో జపిస్తున్నానే తల్లీ! పాపాలనుపోగొట్టేభవానీ -నావంక చూడవే! నీవు అర్థిజనులకు కోరిన ఫలాలను అందించే కల్పవృక్షం వంటిదానవు కదా ! నీవు పద్మలోచనివి; నీవు వాఙ్మయస్వరూపానివి;నీవుఅక్షరస్వరూపానివి;లోకులకువైభవాన్నిప్రసా ంచేదానివి;అన్నినామాలకూ పలికే నీవు ఏపేరూలేనిదానివి; సంగీతంపట్లా,నాట్యంపట్లా ఆసక్తి గలదానివి; నాపట్ల దయను చూపించవే

కవిరాజవిరాజితము : సకల చరాచర సత్వ మహత్వ విశారద శారద శాంతిమతీ !
ప్రకటితశక్తి విరాజిత రంజని! భార్గవి!భైరవి!బ్రహ్మమయీ !
చకచకలాడు ప్రచండ నిభానన! చండి! కళావతి!చారుమతీ!
మకుట మణిప్రభ ! మన్యుమహాబల మండిత పార్వతి ! మంత్రవతీ ! 26

ఓతల్లీ! నీవు సకలచరాచరప్రకృతినీ నడిపించగల మహాశక్తిసామర్థ్యాలు గలదానివి; ప్రపంచగమనానికి ఆధారభూతమైన శారదామాతవు; శాంతమూర్తివై విరాజిల్లే మహనీయురాలవు; నిత్యమూ శక్తి

ప్రసారణం చేస్తూ, కాంతులను వెదజల్లుతూ ప్రకాశించే జగజ్జననివి; భర్గుడు మెచ్చిన మహత్వ శీలివి; మంత్రతంత్రాలకు అధిదైవతమైన భైరవివి; బ్రహ్మపదార్థం యొక్క స్వరూపానివి; నిన్ను చూడటానికి మాకళ్ళు చాలవే జననీ! ఎందువల్లనంటే నీవు నిత్యమూ చకచకా ప్రకాశించే ప్రచండమైన కాంతిగల దానివి; చండముండాసురులను సంహరించిన ఓ చండీదేవీ ! నేర్పుతో చేసే కళలన్నిటికీ నీవే ఆధార మైనదానవు; మాకుప్రశస్తమైనబుద్ధివిశేషాన్ని ప్రసాదించేబుద్ధిమంతురాలివి; కిరీటమందలి మణుల కాంతిప్రకాశం గలదానివి; యజ్ఞయాగాదిక్రతువుల నిర్వహణవల్ల మరింత బలవంతురాలవై పర్వత రాజుపుత్రికకు ఉండవలసినంత సత్తువగలదానివి మంత్రఫలాన్ని అనుగ్రహించగల మహాశక్తివి !

కవిరాజవిరాజితము : నిరుపమదీక్షను నిన్నుదలంచెడి నీ పదభక్తుల నిక్కముగా
నరయగలట్టి మహా మహిమాన్విత! హైమవతీ! సదయాంబునిధీ!
కరుణరసాన్విత కామ్యవరప్రద కాంతిమతీ! కళకంఠసతీ!
వరగుణ దీప్త నవావరణాత్మిక ! వందనమమ్మ భవాని ! శివా! 27

ఎవరైతే నిన్ను కఠోరమైన దీక్షతో జపిస్తూ ఉంటారో అటువంటి నీ భక్తులను నిజముగా కనిపెట్టి కాపాడగల మహామహిమగలతల్లివినీవు. మంచుకొండకుమార్తెవు కనుక నీ భక్తులను చూచి మంచు వలెనే కరిగిపోగలతల్లివినీవు. దయాసముద్రంవంటిదానవుకదా ! కరుణరసానికి నీవే కాణాచివి; కోరికలను తీర్చటంలో అద్వితీయురాలవు కదమ్మా పరమేశ్వరుని ఇష్టసఖివి కనుక కామితార్థాలను వెంటనే ప్రసాదిస్తావు. కానీ నిన్ను చేరాలంటే ప్రకాశవంతమైన నవావరణాలను దాటి రావాలికదమ్మా అదంతా నీ దయావిశేషం చేతనే సాధ్యం కదా తల్లీ !!

కవిరాజవిరాజితము : లలితవిలాసిని లాస్య వినోదిని లక్షణరూపిణి లక్ష్మిమయీ
జలరుహలోచని! జాగృతకారిణి! జన్మవిమోచని!జైత్రరథా!
చలిమల కన్యక! సాంద్ర దయామృత సారవిశిష్ట సుసాధ్యవతీ!
పలుకవె తల్లి! శుభప్రదమౌనటు భాగ్యవతీ! వరభానుమతీ! 28

సుకుమారమైన కదలికలతోసౌందర్యమును వహించి వినోదించు తల్లీ ! ఏ వంకర లేని సౌందర్యంగల తల్లీ! ఎల్లవేళలా లాస్యనాట్యమును అనుసరించి సంచరించుమాతా! పద్మనేత్రా! లోకములను చైతన్యపరచుశక్తివి నీవేతల్లీ! జీవులకు జన్మచక్రమునుండి విడుదలను అనుగ్రహించు ఆదిశక్తీ! సర్వత్రా విజయమును సాధించుచు తరలిపోవు రథమును కలిగి యున్నతల్లీ! ఓపార్వతీదేవీ! దట్టమైన

దయామృతసారమును మాకు సులభసాధ్యముచేసెడి జననివి! మాపాలిట భాగ్యదాతవు; గొప్ప కాంతికిరణములుగల లోకమాతవు ; నాకు శుభము కలుగునట్లుగా ఆశీర్వదించుమాతా!

కవిరాజవిరాజితము : నవరస పూర్ణ ఘనాఘనరూపిణి నాదవినోదిని ! నాట్యరతే !
భువన మనోన్మని భూపురకేంద్ర విభూషితవర్తిని పుణ్యవతీ!
వివిధకళామయ వృత్తవికల్పిత వేడుకనొందెడి వేదవతీ!
ధవళరవిప్రభ ధాటినిమించిన దైవశిరోమణి !తారయ మాం ! 29

నవరసాలను పరిపూర్ణంగా వర్షించే జననీ! మహానాదాన్ని విని వినోదించేతల్లివి నీవు; నాట్య భంగిమ లలో జీవులు నడయాడేవిధానం చూచి ఆసక్తితో ఆనందించే జననివినీవు; ఈ లోకస్థుల యొక్క మనోకేంద్రాలను-నీవు నివసించే శ్రీచక్రంయొక్క భూపుర కేంద్రంగా చేసుకొని సంచరించే పుణ్యవతివి నీవు! రకరకాల కళలచేత కల్పించబడిన కథనాలను విని, చూచి ఆనందం పొందే వేదవతివి నీవమ్మా తెల్లని సూర్యకాంతిని మించిన ఓ దైవశిరోమణీ! నన్ను తరింప జేయవే!

కవిరాజవిరాజితము : విజయవిహారిణి వీరశిరోమణి విద్యుదనూన వివేకధునీ !
రజితమహాగిరిరాజ నివాసిని రమ్యకపర్దిని రాజధృతా
నిజపదపద్మవనీస్పృశనంబున నీకృప నింపెడి నిత్యవతీ !
భజనమొనర్చెద భద్రము గూర్పవె పాద రజంబిడి భవ్యమతీ! 30

చతుర్దశభువనాలలోనూ తిరుగులేకుండా విజయవిహారంచేసే వీరశిరోమణివి నీవమ్మా!నీవు అత్యధిక చైతన్యవంతమైన విద్యుత్తువంటి వివేకప్రవాహం కలదానివి; వెండికొండపై నివసించే మహాతల్లివి; లోకోత్తర సౌందర్యవంతురాలవై పరమశివుని అర్ధాంగివై, ఆయనతోపాటుగా చంద్రరేఖను ధరించిన మహాతల్లివి; నీ పాదపద్మాలనే వనాన్ని స్పృశించగానే నీ దయావిశేషాన్ని మాపై ఏ సమయంలోనైనా ప్రసరించే నిత్యకృపామతివి! నిన్ను గురించి నేను శ్రద్ధగా భజిస్తానమ్మా;నీ పాదధూళిని రవంత నాపై ప్రసరింపజేసి నాకు రక్షణను కల్పించవే జననీ !

కవిరాజవిరాజితము : కలుషవిదారిణి! కల్మషహారిణి! కామ్యఫలప్రద! కల్పలతా!
మలయనివాసిని! మానిని! మాధవి! మానసచారిణి! మంజులతా!
కలమురళీరవ గానవినోదిని! కంజదళాక్షి! జగజ్జననీ!
తలపుననిల్చి సదాననుగావవె ! ధన్యునిజేయవె ధర్మమయీ ! 31

ఓజగజ్జననీ! నీవు మా పాపములను చీల్చివేస్తావు; లోకమునందలి కల్మషమును హరించివేస్తావు; మా కోరికలను కల్పవృక్షపు తీగవలే అనుగ్రహిస్తావు;అమ్మా నీవు మంచిగంధపు చెట్లనీడన సంచ

రిస్తావు; స్త్రీ లోకానికి ఆదర్శపాత్రురాలవు; మహాలక్ష్మివి; జీవుల మనస్సులలో సంచరిస్తావు; మనో హరమైన జీవలతవు; కలస్వనముతో వినిపించే మురళీ నాదమును వినుటలో ఆసక్తి గలదానవు; పద్మదళములవంటి కన్నులు గలదానవు; ధర్మస్వరూపివైన ఓ తల్లీ !నా ఆలోచనల నన్నిటిలో సర్వదా నీవే నిలచి నన్ను కాపాడవే తల్లీ ! నన్ను ధన్యుణ్ణి చేయవమ్మా !

మానిని. శ్రీశివమూర్తిని చిన్మయరూపుని చెంగటజేరిన శ్రీ లలితా !
యాశనిరాశల నావల(ద్రోయు నిరామయతత్వ సుధాంబుధివే!
కాశి నివాసినికల్మషహారిణి గౌరిమదంబ సుఖప్రసవా
యీశునిగూడి మహిన్ సుఖ మీయవె యీశ్వరభామిని హేమలతా !! 32

లోకులకు సర్వశుభాలను ప్రసాదించే శివపరమాత్మకు, చిన్మయస్వరూపునికి ఆత్మీయురాలవైన శ్రీలలితా! మాలో చెలరేగే ఆశానిరాశలను మానుండి దూరంచేసి, మాలో స్థితప్రజ్ఞత్వాన్ని నెలకొల్ప వమ్మా! ఓ కాశీనివాసినీ! మా పాపాలన్నిటినీ తొలగించేగౌరీ! మాతల్లీ! సర్వసుఖాలను ప్రసాదించే జననీ! ఆ పరమశివునితోకూడి ఓజగజ్జననీ -మాకు శుభాశీస్సులను ప్రసాదించు తల్లీ !

(మానిని: 7 భగణములు + ఒక గురువు; 1-7-19 యతిస్థానాలు. ప్రాస ఉంటుంది.)

మానిని. శ్రీ జలధీశునిచిన్మయ పీఠిక జేరిన బాల వరిష్ఠనిధీ
హే జగదంబ మహేశ్వరి శూలిని హే పరమేశ్వరి యిందుమతీ
తేజ విరాజ సుధీ పరమాత్మిక దివ్య మనోన్మణి ధీరమతే
పూజలనొంది సుభోగములీయవె మోహమడంచవె ముక్తిలతా ! 33

అమృతంతో నిండిన సుధాసముద్రంవంటి ఓబాలాపార్వతీమాతా! శ్రీ జలధీశ్వరస్వామివారితో కలిసి ఘంటసాలలో నీవు ఒకే పీఠంపై నిలిచి ఉన్నావుకదమ్మా!ఓ జగన్మాతా ప్రపంచమంతా నీ స్వరూపమే కదా తల్లీ! ఓపరమేశ్వరీ! వేదమాతా! నీవు పరమశివుని అర్థాంగివికదా! నిత్యమూ తేజస్సుతో విరాజిల్లే సర్వమంగళా! పద్మంవంటిముఖంకల తల్లీ! మనస్సులను పులకరింపజేసే దివ్యమైన మహా మణీ! నిత్యమూ యోగవిద్యపట్ల ఆసక్తితోఉంటూ మాకు ముక్తిని ప్రసాదించే ఓతల్లీ! మేము నీకు సమర్పించే పూజలను స్వీకరించి మాలోని మోహభ్రాంతులను తొలగించవే మాతా!

మానిని. నీదయనొందిన నిత్యజయమ్మది నిశ్చయమౌ జననీ!ద్యుమణీ !
యేది యసాధ్యము కాదు జగంబున నించుక నీవు సహించునెడన్
నీ దరహాసధునిన్ బడియాడిన నిన్నెదనిల్పిన నీకృపయే
వేదనబాపును ;వేడుకసేయును; విజ్ఞతగూర్చు నభీష్టయుతిన్ !! 34

ఓ హైమవతీ! లోకంలో ఎవరికైనా నీ దయ లభించిందంటే వారికి విజయం నిజంగా తథ్యమైనట్లే. నీ దయ లభించినవారికి యేలోకంలోనూ అసాధ్యమైనది యేమీఉండదు; అంతయెందుకు తల్లీ! ఎవరి వంకనైనా నీవుచిరునవ్వునుచిందిస్తే ఆమాత్రంతోనే జీవులకుఅన్నిబాధలున్నూ తొలగిపోతాయి; నిన్ను మనస్సులోనిలుపుకుంటేచాలు -జీవులకు ఎంతో వేడుక కలుగుతుంది; తెలివి కలుగుతుంది. మనసు విప్పారుతుంది; నీ దయ అమోఘమైనది కదా!!

మానిని. శ్రీపరమేశ్వరి ! చింతలబాపి వసింపుము నామది సేమముగా!
నీపరతత్వము నిల్పుకొనందగు నెమ్మదినీయవె నిత్యమిలన్
తాపముదీర్పవె తల్లివి కావునధైర్యము నీయవె తత్వమతీ !
పాప మడంచవె పాహి! మదంబిక ! భార్గవి ! భారతి! భాగ్యమయీ !! 35

హే పరమేశ్వరీ! భార్గవీ!భారతీ!తత్వస్వరూపము నీవైన ఓ తల్లీ! భార్గవీ! పరతత్వస్వరూపిణివైన నీవు నా మనస్సులో క్షేమంగా నివసించవే! అందుకు తగిన నెమ్మదిని నాకు ప్రసాదించవమ్మా! నాలోని తాపాన్ని అణగించవే! నాకు ధైర్యాన్ని ప్రసాదించవే నా పాపాన్ని అణచివేయవే జననీ!

మానిని. నామదినుండు సనాతనరూపిణి! నన్ నడిపింపు మనారతమున్
నీమముతో మది నిన్ను ధరింతును నిత్యముగావవె నిండుదయన్
సేమముతోడి ప్రసిద్ధినిగూర్పవె సిద్ధ మనస్విని శీలవతీ !
నామములన్ మననంబొనరించెద! నాదమయీ!కరుణార్ద్రమయీ! 36

ఓసనాతనస్వరూపిణీ!నామనస్సులోఎల్లవేళలా కొలువైఉండవమ్మా! ఎల్లప్పుడు నన్ను నడిపించమ్మా! నియమం తప్పకుండా నిన్ను పూజించటానికి కావాల్సిన ఇంద్రియ నిగ్రహాన్ని నాకు ప్రసాదించవే! ఓ శీలవతీ! నాకు క్షేమంతోపాటు ప్రసిద్ధిని కూడా అనుగ్రహించవమ్మా! ఓభాగ్యవతీ! సిద్ధ మనస్వినీ! నీ నామాలన్నిటినీ జపంచేస్తాను; నీవునాదమయివి. కరుణార్ద్రమనస్వినివి. నాకుప్రశాంతతను, క్షేమాన్ని అనుగ్రహించవే జగత్కళ్యాణీ!ఎట్టిపరిస్థితులలోనూ నన్ను విడువకు జననీ!

మందాక్రాంత : నీ సంకల్పంబుననె జగముల్ నిత్యశోభావహంబై
నీ సాన్నిధ్యంబొదవుటకునై నిన్ను పూజించుచుందున్
నీ సంతోషంబెసగు నెడలన్ నిత్యకల్యాణమౌటన్
మా సౌభాగ్యంబలరు నిలపై ! మానినీ కొల్తు నిన్నున్ ! 37

అమ్మా! నీ సంకల్పంవల్లనే లోకాలన్నీకూడా నిత్యము సుఖశాంతులతో నిన్ను చేరాలనే తపనతో నీ కోసంపూజిస్తున్నాయి! నీకుమాయెడ సంతోషంకలిగిందంటే ఇకమాకు నిత్యకల్యాణం, పచ్చతోరణం

అన్నట్లుగా సౌభాగ్యసిద్ధి కలుగుతుంది కదా! మాకు మేలు జరగాలని నిన్నే సేవిస్తాము తల్లీ! నీ సాన్నిధ్యాన్నిమాకుఅనుగ్రహించుమాతా! (మందాక్రాంత:మ,భ,న,త,త,గగగణాలు.11యతి.)

మందాక్రాంత : మూలాధారా!భువనజననీ!ముక్తి మార్గమ్ము నీవే;
లీలాకేళీ విలసితముఖీ!క్లీంకృతామోదవర్తీ!
బాలా!దుర్గా!సకలశుభదా!వారిజాక్షీ!శివానీ!
జాలింజూపంగదవె జననీ! శాంకరీ!సర్వరూపీ! **38**

లోకమాతా! నీవుమూలాధారశక్తి; ముక్తిదాతవు; లీలావిలాసంతో క్లీంకార జపాన్ని వినటంవలన మరింత సంతోషపడే చల్లనితల్లివి; బాలా!దుర్గా!సకలశుభాలనూ ప్రసాదించే మాతా! సర్వ స్వరూపి వైన ఓశివానీ! మాపట్ల జాలిని చూపవమ్మా!

మందాక్రాంత: శ్రీమాతా హేభువనవిజయా!స్నిగ్ధ సంకల్పసిద్ధా!
శ్రీమంత్రార్థా!నిగమ విపులా! చిన్మయాకార రూపా!
శ్యామాకారా!సకలజగతీ చక్రరాజ్ఞీ! కుమారీ!
శ్రీమాహేంద్రీ విమల చరితా! సిద్ధిబుద్ధి ప్రదాత్రీ! **39**

హే శ్రీమాతా!సకలభువనాలనూ జయించిపాలించేతల్లీ! మామనస్సులలో కలిగే సర్వ సంకల్పాలనూ సిద్ధింపజేసేమహామాతా!శ్రీవిద్యాపరమైనమంత్రార్థానికి మూలమైన తల్లీ! వేదములన్నీ ఎవరిని గూర్చి చెబుతున్నాయో ఆ అర్థానికి ఆధారభూతమైన జననీ! చిన్మయతత్వం యొక్క ఆకృతిని కనిపింపజేసే కరుణామయీ!శ్యామలవర్ణంగలమూర్తీ!సకలబ్రహ్మాండాన్నీశాసించేమహారాణీ!కుమారీ స్వరూపం తో విరాజిల్లే ప్రభావశాలీ! మహామహిమోపేతమైన ఐంద్రీశక్తిని స్పష్టంగా, విజయవంతంగా ప్రసాదించే తల్లీ! మాకు సిద్ధినీ,బుద్ధినీ ప్రసాదించే శక్తి స్వరూపిణీ! నిన్ను సదా సేవిస్తానుతల్లీ!

మందాక్రాంత : శ్రీ కళ్యాణీ! నిరుపమకళా శ్రీప్రదా!యోగమూర్తీ!
ప్రాకామ్యత్వం బొసగుజననీ!బ్రాహ్మీ! చాముండి! కాళీ!
శాకిన్యంబా! త్రిపురనిలయా!సర్వ బీజాంతరస్థా !
మా కైమోడ్పుల్ గొనవె బహుధా మంగళాఖండ శక్తీ! **40**

ఓ కళ్యాణీ! సాటిలేని కాంతిగలతల్లీ!మాకు అశేష సంపదలను ఇచ్చే జననీ! నిత్యమూ శక్తి సంయోగం తో విలసిల్లే మాతా! అష్టసిద్ధులలో ఒకటైన ప్రాకామ్యసిద్ధి(మహైశ్వర్యము)ను ప్రసాదించేతల్లీ!బ్రాహ్మీ మూర్తీ!చాముండా!కాళీ!శాకినీ!అంబా! త్రిపురవాసినీ! సర్వబీజము

లందున్నూ నెలవైయున్నశక్తి స్వరూపిణీ! సర్వమంగళా! అఖండశక్తీ! నీకు అనేకవిధాలుగా నమస్కరిస్తున్నాను

శా. వాగర్థంబులుగా జగత్పితరులై వందారులా దంపతుల్
ప్రాగల్భ్యంబు రహింప భక్తులను బ్రోవన్ ఘంటసాలా పురిన్
జాగృచ్ఛక్తి వివర్ధమానులగుచున్ సంపద్యశోదాత్తులై
యోగంబిచ్చుచు నుండె భక్తులకు హృద్యోదాత్త సమ్మాన్యతన్ ! 41

ఆదిదంపతులైన ఆ పార్వతీ పరమేశ్వరులు వాక్కు అర్ధములవలే విడదీయరానివారై,లోకములకు పితరులై ప్రకాశిస్తూ భక్తుల వైభవం వెలుగొందేటట్లుగా వారిని ఆశీర్వదిస్తూ , అందరిలోనూ చైతన్యం వృద్ధియయ్యేటట్లు, సంపదలు, కీర్తి విలసిల్లే విధంగా మెచ్చదగినయోగాన్ని భక్తులకు అందిస్తూ, భక్తజనులను రక్షించటానికే ఘంటసాలాపురంలో వీరిరువురు ఒకే పీఠం పైన వెలిశారు.

శిఖరిణీ వృత్తం: అసామాన్య క్షేత్రంబని యిది మహా ఖ్యాతి బడసెన్
ప్రసిద్ధాత్ముల్ భక్తిన్ తరలి గొలువన్ భర్గు డలరున్
రసామోదంబొందున్ నమక చమకార్చాదుల నిటన్
ప్రసన్నుండౌనిందే శిఖరిణి వినన్ భాగ్య మిడుచున్ ! 42

ఈ ఘంటసాలక్షేత్రం అసామాన్యమైనక్షేత్రమని గొప్పఖ్యాతిని పొందింది. సుప్రసిద్ధులైన మహర్షు లెందరో పూర్వంఈ క్షేత్రాన్నిదర్శించి శ్రీజలధీశ్వరస్వామినిసేవించారు. స్వామివారికి ప్రీతినికలిగిం చారు. ఆస్వామి అనునిత్యమూ నమకచమకాదుల పారాయణతో అభిషేకాలను పొందుతూ రసామోదాన్ని వ్యక్తం చేస్తాడు. ఈ శిఖరిణీ వృత్తంలో ఆయన మరింత సంతోషాన్ని పొందుతాడు.

(శిఖరిణి: య,మ,న,స,భ,వ, గణాలు;1-13 యతి.)

మ. శివలింగాత్మ నమో నమశ్శివ నమో శ్రీవాయులింగేశ కే
శవరూపా గిరిజా మనోహర నమశ్శంభో హరా శంకరా
భవ లింగాఖ్య మనోన్మనా!స్వరమయా! భస్మాంగరాగా మృడా
జవసత్వమ్ముల నీయరా జలధరా! శర్వా! భవా! శంకరా ! 43

ఓమహాదేవా-వాయులింగా!నీకునమస్కారాలయ్యా!శంకరా!భవలింగా!స్వరమయా! మనోహరా ! భస్మాఙ్గధారీ!మనోన్మనా!జలధరా!గంగాధరా!శర్వా! మాకు జవసత్వాల నీయరా! ఓం నమశ్శివాయ

శా. ఈశానాయ నమశ్శివాయ ప్రణతుల్ హే శంకరాత్మా నమో
హే శక్తిప్రతిభా విశేష వినుతా!హ్రీంకార తాదాత్మికా!

రాశీభూత సమస్తదేవ నిలయా ! రౌద్రాత్మకా! త్ర్యంబకా !
శ్రీశంభో!మహాదేవ!మన్మధహరా! చిద్రూప భావాత్మకా !! **44**

హే శంకరా! త్రినేత్రా!ఈశానా! ప్రతిభావిశేషాలను ప్రసాదిస్తూ కీర్తిని పొందే శక్తి స్వరూపా! శివశంభో ! మన్మధహరా! రుద్రా! చిద్రూప భావనిలయా! నీకు నమస్కారాలయ్యా!

చం. అని శివభక్తులంద రుదయమ్మున నుండియు సుప్రభాతముల్
గొనకొని పాడుచుండ కలకూజిత మొప్పగ వాణి వీణపై
ననితర భక్తి భావమున నద్భుతరీతిని మంత్రపుష్పమున్
సునిశిత రాగమాధురి రసోచిత రీతిని పంచె నయ్యెడన్ ! **45**

అని శివభక్తులందరు ఉదయం నుంచి ఆ జలధీశ్వరస్వామివారికి సుప్రభాతములు పలుకుతూ భక్తి తన్మయత్వంతో సేవిస్తూ ఉండగా ఆ ఆలయప్రాంగణంలో ఈశ్వరుని సేవించటానికి అన్నట్లుగా మహాసరస్వతి వీణపై మంత్రపుష్పాన్ని రాగయుక్తంగా రసబంధురంగా పలికింపజేస్తోంది. ఆ స్వామి సన్నిధిలో సుప్రభాత సేవల అనంతరం మంత్రపుష్పం పలుకుతూ ఉన్నారు.

ఉ. విస్ఫుటమైన కాంతి పరివేషము మోము నలంకరింపగా
ప్రస్ఫుటమైన దృష్టి నలరారెడి పుస్తకపాణి వాణి లో
క స్ఫుట తేజపుంజముగ కన్నుల ముందరదోచుచున్న భా
షా స్ఫురణమ్ముగా నిలచి శాంకరియై ప్రసరించె నల్దెసల్ **46**

స్పష్టంగా కనిపించే కాంతి వలయం ముఖారవిందం చుట్టూ వెలుగొందుచుండగా ప్రశాంతమైన చూపులతో ప్రకాశించే వీణాపాణి -సరస్వతి ఒక మహా కాంతిపుంజంగా, వాక్ప్రవాహంగా ఎదుట నిలచినట్లు స్ఫురించి, లోకానికి శుభం కలిగించే శాంకరిగా నలుదెసలా వ్యాపించింది.

శా. బ్రహ్మాండమ్ము సరస్వతీ మహిమచే భాసిల్లుచుండెన్;హరి
బ్రహ్మేశానులు వాగ్విభూషణులుగా రాజిల్లుచుండెన్;మదిన్
బ్రహ్మానందము నొందు వారికిలలో వాగ్దేవి నీవే గదా
బ్రహ్మత్వమ్మున కాదిమాతవు సదా వాణీ మమున్ బ్రోవవే !! **47**

ఈ బ్రహ్మాండమంతా సరస్వతీ మహిమచేతనే ప్రకాశిస్తోంది. బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు వాగ్దేవి అనుగ్రహం చేతనే శక్తివంతులవుతున్నారు. లోకంలో బ్రహ్మానందాన్నిపొందుతూ బ్రహ్మత్వాన్ని పొంద గలవారికి ఓ సరస్వతీ మాతా – నీవేగదా తల్లీ మూలకారణమైన శక్తివి !

శా. వాగ్వీణాగుణనాద లాహిరుల నాస్వాదించి సంప్రీతితో
దిగ్వీధుల్ పులకించె ! సర్వ జగముల్ దివ్యానుభావమ్మునన్

ఋగ్వేదామృత ధారలన్ దనిసె ; మూర్తీభూత వాగ్రూపమే
దృగ్వ్యాలభ్యముతో సరస్వతి యనన్ దీపించె ప్రార్థింపుడీ ! **48**

ఆ మహాసరస్వతీ వీణానాదంతో దిక్కులన్నీకూడా పులకించాయి.అన్ని లోకాలూ కూడా దివ్యమైన అనుభూతితో ఋగ్వేదమంత్ర ధారలకు మహదానందాన్ని పొందాయి. అన్ని దిక్కులలోనూ వాగ్దేవీ స్వరూపమే కళకళ లాడుతూ భక్తుల ప్రార్థనలతో వాగ్దేవి దిగంతాలకు వ్యాపించింది.

పంచచామరము : ప్రపంచమెల్ల నీ మహద్విరాజమాన దృష్టికై
తపమ్మొనర్చుచుండు వాగ్విధాన లబ్ధి గోరుచున్
జపించునట్టి వారికిన్ ప్రసన్న భావమిచ్చుచున్
కృపారసమ్ము జూపు వాణి ! కేల్మొటింతు వాఙ్మయీ !! **49**

ఓవాగ్దేవీ! ప్రపంచజనులందరూ నీమహిమాన్వితమైన దయాదృష్టికోసం తపిస్తుంటారు. అందరూ తమకు చక్కనివాక్కులు కావాలని ఆశిస్తారు. అటువంటివారికి మధురమైన వాక్కులను అనుగ్రహిస్తూ దయావిశేషాన్ని చూపించే తల్లీ! నీకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను వాఙ్మయీ!

(పంచచామరము: జ,ర,జ,ర,జ,గ, గణాలు; 1-10 యతి)

శా . తల్లీ !శారద ! ప్రాణముండు వరకున్ త్వత్పాద పద్మమ్ము నా
యుల్లంబందున నిల్చియుండ దగు సద్యోగంబు గల్పించి నా
సల్లాపంబుల సత్కవిత్వగుణ ముత్సాహంబునన్ పొంగి శ
శ్వల్లావణ్య మహద్విభూతి వరమై వర్ధిల్లగా బ్రోవవే! **50**

ఓ శారదా మాతా! నా శరీరంలో ప్రాణం ఉన్నంత వరకు నీ పాదాలు నా మనస్సులో నిల్చి యుండేటట్లుగా నాకు మంచి యోగాన్ని అనుగ్రహించవే ! నాలో సత్కవిత గొప్పశబ్దశక్తి నిలచేటట్లు అనుగ్రహించమ్మా !

చం . అని మధురానుభావమున నయ్యెడ వాణిని వేదమూర్తినిన్
విను వినమ్ర భక్తులు నభీప్సిత సిద్ధికి ప్రస్తుతించి కొ
ల్చిన నభిషేకకృత్యములుజేయు పురోహితులేగుదెంచి సూ
ర్యునిగమనించి వందనమహోదయసూక్తి పఠించె గొల్చుచున్ ! **51**

ఆ విధంగా ఒక మధురమైన అనుభూతితో భక్తులు వాగ్దేవిని వేదమాతగా వింటూ, తమ కోర్కెలు ఫలించాలని స్తుతిస్తూ ఉండగా శ్రీజలధీశ్వరస్వామికి అభిషేకాదులను నిర్వహించటానికి పురోహితులు విచ్చేశారు . అంతలో సూర్యోదయం కావటాన్ని గమనించి ఆయనకు వందనసూక్తులను పఠించసాగారు.

:సూర్యోదయ వర్ణన :

చం . తెలతెలవారుచుండ నుదధిన్ పయనించెడి నీలి తెల్లచా
పలు నొక వాలుగా పరచి భానుని కొల్వగ మంద్రమంద్రమై
యలలవి వేద మంత్రముల నర్చన జేయగ పిల్ల వాయువుల్
సలలిత భాను భానువుల సన్నుతితో నుదయించె భానుడున్ ! **52**

ఆ సమయంలో తెలతెలవారుతూండగా సముద్రపు ఉపరితలం మీద నీలి వర్ణపు తెరచాపలు పరచి సూర్య భగవానుణ్ణిసేవించటానికై అలలు వేదమంత్రాలమాదిరిగా మెల్లమెల్లనిశబ్దాలు చేస్తూ కదులుతూండగా పిల్లవాయువులు వాటివెంట నాట్యంచేస్తూ స్తుతిస్తూ ఉండగా సూర్యభగవానుడు ఉదయించాడు.

లయగ్రాహి:ప్రాగరుణ భాను దనురాగ రస రంజిత సమాగమన శోభల సుయోగ మొనరింపన్
వేగముగ నాకస మహాగమనసిద్ధునకు సాగిలు కరమ్ములు సమాగతిని కోరన్
త్యాగివలె వీడుకొని యేగెడి కుమారుడగు భాగవతశీలుని వియోగ గమనంబుల్
యోగఫల తేజమనుభోగమునకై యుదధి రాగ మొలయన్ రవి సమాగమము పంచెన్ **53**

తూర్పుదిక్కున ఉదయిస్తున్నభానుడు ప్రేమరసంతో నిండినఎఱ్ఱని కాంతులతోఆగమన భరితమైన పుప్పొడులను అతికించగా, సంతోషపడినమహాసముద్రుడు అతివేగంగాఆకాశంపైకి తరలిపోయే నడకగలసూర్యునకు అలలు అనే చేతులుచాపుతూ రమ్మనిపిలుస్తూంటే, ప్రేమాభిమానాలను త్యాగంచేసినవానివలే భాగవతశీలు డైన సూర్యభగవానుడు పైపైకి వెళ్ళిపోతుంటే, కలిగిన వియోగపులకింతలతో ఊగిపోతున్న సముద్రునికి సూర్యుడు తానొక మహాతేజస్సు అనేయోగఫలాన్ని పొందుతున్నాననిచెబుతూ తన ఆత్మీయతనుపంచాడు

(లయగ్రాహి: భ,జ,స,న,భ,జ,స,న, భ,య-గణాలు; 2-10-18-26 స్థానాల్లో ప్రాసయతి వేయాలి.)

ఉత్సాహ : **ఏడు గుఱ్ఱములను బూంచి యేకచక్ర రథముపై**
నేడు నేడు లోకములను యేలు భాస్కరుండిటన్
నేడు వర్ణముల ధరించి యేడు సుస్వరమ్ములన్
పాడుకొంచు తూర్పుతీర పంక్తి నుదయ మయ్యెడిన్ **54**

ఒక్కటే చక్రం గలిగి ఏడుగుఱ్ఱాలచే లాగబడే రథమెక్కి ఏడేడు పధ్నాలుగు లోకాలను పాలించే సూర్యుడు ఏడురంగులతో, ఏడుఅక్షరాలతో ఏడుస్వరాలను ఆలపిస్తూ తూర్పుతీరపుటంచుపై ఉదయించాడు.

(ఉత్సాహ: 7 సూర్యగణాలు+ఒక గురువు; 1-10 యతి)

చం. అరుణ మహాట్టహాస కిరణాళి విహాయసభాండ మండలం
బొరయుచుపర్వె సర్వజనమోదకరమ్ముగ లోకమంతయున్
చిరుదరహాస వీచికలు చిత్తములందున తోప భాస్కరున్
వరదునిగా దలంచుచు నవారిత ప్రేమ నమస్కరింపగన్ 55

అనంతాకాశమండల మంతటా సూర్యుని అరుణకాంతులు సర్వజనులకు సంతోషాన్ని కలిగిస్తూ వ్యాపించాయి. అందువల్ల అఖండమైనప్రేమతో జనులు అతనిని వరదునిగా తలంచి నమస్కరించారు.

ఉ . నీలి మహోదధీస్థలము నీలిమతో నరుణార్ద్ర కాంతులన్
మేలములాడజేసి పృథుమేదినికిన్ పురుటింటి భానునిన్
కాలమనోజ్ఞ రూపుడను కానుకగా రచియించి యిచ్చె నైం
ద్రీ లలితోన్ముఖంబున తరింపగజేయుచు లోకవాసులన్ 56

నీలిరంగుసముద్రం తనలోఉన్న నీలిరంగునకు సూర్యుని అరుణారుణ కాంతులను జతజేసి భూమాత కు తానుగన్న సూర్యుణ్ణి కాలస్వరూపుడనే కానుకగా లోకవాసులను తరింపజేస్తూ తూర్పుముఖం నుంచి అందించింది.

సీ . లోకాల చీకట్లు పోకార్చు మహనీయ
తేజోనిధానంబు తిలకమనగ
అజ్ఞానతిమిరమ్ము నారజూచినయంత
తరిమికొట్టెడి వెల్గు తరణి యనగ
నిద్రాతమినిగూలు నిర్జీత లోకాల
జాగరించెడి సత్వశాలి యనగ
అన్నపానాదుల కాధారభూతుడై
దీవింపవచ్చు నాదిత్యుడనగ
గీ. నైంద్రి ముఖమున వెలుగొందు నతిథిదేవు
డేడు గుఱ్ఱాలు రంగుల నేకచక్ర
రథముపైవచ్చి శాసించు రవి యితండు
అంజలింపుడు ! లోకహితైషి యనుచు !! 57

అన్ని లోకాలలోను వ్యాపించియున్న చీకట్లను తరిమికొట్టే గొప్ప తేజో తిలకం అన్నట్లుగా; తెలివితక్కువతనం అనే చీకట్లను తన చూపులతోనే పారద్రోలే వెలుగులముద్ద అన్నట్లుగా ; నిద్రాంధకారంలో కూరుకుపోయిన ఈ పధ్నాలుగులోకాలనుచైతన్యపరచేశక్తిశాలిఅన్నట్లుగా; జీవులు తినిత్రాగే అన్నపానాదులను ప్రసాదిస్తూ

లోకాలను దీవింపవచ్చే ఆదిత్యుడు అన్నట్లుగాతూర్పుముఖాన ఏడుగుఱ్ఱాలపైన, ఏడురంగులతోకూడిన , ఏకచక్రరథంపైన వస్తున్న సూర్యభగవానునికి నమస్కరించండి.

శా . ఓహో ! భాస్కరు డెంతశక్తి యుతుడో ! యుత్థాన మైనంత దా
సోహమ్మన్న జడప్రపంచమున తేజో రాశి పండించి జీ
వోహమ్మంచు సమస్త జీవులను నుద్బోధించి చైతన్య స
మ్మోహాక్రాంతిని నింపి కాలవిధి సంబోధించు భద్రాత్ముడై ! 58

సూర్యభగవానుడుఎంతోశక్తిగలవాడు.ఉదయించిందిమొదలుజడస్థితిలోఉన్నప్రపంచానికితేజస్సునిచ్చి మీలోని జీవంనేనేఅన్నట్లుగాసమస్తజీవులనుతనచైతన్యంతోనింపిసమయనిష్ఠనుభద్రంగా పాటిస్తూ ఉంటాడు

సీ . వేద విజ్ఞానమ్ము విస్తరించినయట్లు
వినువీధి నుదయించు భాను డతడు;
లేత బంగరురంగు లేపనమ్మును దాల్చి
నేల ఫాలజ్వాల నేలునతడు ;
అంతకంతకు చండ కాంతివంతుండౌచు
నఖిల లోకములేలు నబ్జభవుడు ;
విశ్రమించని విశ్వ విక్రాంత కాంతియై
విస్తరించెడి వేదవిదుడితండు ;
గీ . కాల గమనమ్ము రూపించు ఘను డితండు ;
ధర్మపాలన గావించు ధన్యుడితడు ;
తెలివి గలిగించు మహనీయ తేజమితడు ;
సృష్టి కర్తయు భర్తయు ద్రష్ట యితడు ! 59

వేదవిజ్ఞానం వలె వినువీధిలో ఉదయించి ఆకాశమంతా వ్యాపించిన కాంతిపుంజం ఈ సూర్యభగవానుడు. మొదట లేతబంగారుకాంతిని ధరించి ఉదయించి, క్రమంగా త్రినేత్రునిమూడవకంటి మంటగా జ్వాలలను ప్రసరిస్తూ నేలను పాలించేతేజస్వంతుడు. ఉదయించిన తరువాయి ప్రచండ కాంతివంతుడగుచు సమస్తలోకాలనూ పాలించే పరమాత్మ యితడు. అలుపెరుగక ప్రపంచమంతటినీ కాంతివంతం చేసే వేదపురుషుడితడు. కాలగమనాన్ని నిరూపించే మహానుభావుడితడు. ధర్మపాలన చేసేధన్యుడితడు. లోకాలకు తెలివిని కలిగించే కాంతిస్వరూపుడితడు.

సీ . లేలేత భానుండు లీలాప్రభావుండు
లోకైకవిభుడు నారోగ్యకరుడు;
తేజోనిధానుండు దివ్యాంశరూపుండు

కాలవిజ్ఞాన సంకల్పధనుడు ;
శక్తిసంపన్నుండు ముక్తిసన్మిత్రుండు
చిచ్ఛక్తిరూప సంజీవి యతడు ;
పంచభూతాత్ముండు బ్రహ్మాండదీప్తుండు
ప్రాణికోటికి జీవబంధు వతడు;
గీ. ఉదయవేళకు మేల్కొల్పి యుద్యమించి
సృష్టినంతయు నడిపించు స్రష్టయతడు ;
అతని కిరణాలు సోకిన నాత్మశక్తి
జీవకోటికి చిగురించి చేవనొసగు ! 60

అప్పుడే ఉదయించిన సూర్యుడు లోకాలన్నిటికీ రారాజు. ఆరోగ్యప్రదాత. ఎన్నెన్నో వరాలను అనుగ్రహించగల మహనీయుడు. ఆయన తేజస్సుకు నిధివంటివాడు. దేవుని అంశతో ఆవిర్భవించినవాడు. ఆయనయే కాల స్వరూపుడు. సమస్త విజ్ఞానాన్నీ ధనంగా గలవాడు. శక్తిసంపద గలవాడు. ముక్తిని ప్రసాదించగల మంచి స్నేహితుడు. శాశ్వతమైన శక్తి అనే సంజీవిని గలవాడు. పంచభూతాలకూ ఆశ్రయమైనవాడు. బ్రహ్మాండాన్ని ప్రకాశింపజేయగలవాడు. ప్రాణులందరకూ జీవశక్తిని ప్రసాదించువాడు. తాను ఉదయించు వేళకు జీవులను మేల్కొల్పి సృష్టి క్రమాన్ని నడిపించువాడు. ఆయన కిరణాలు సోకినట్లైతే జీవులకు ఆత్మశక్తితో చేవ లభిస్తుంది.

లయగ్రాహి :

మేలుకొలుపుల్ వినుచు మేలుకొని యీశ్వరుడు లీల గమనించె తన ఫాలపృథుశోభన్
బోలె నుదయాద్రిపయి గ్రాలు తన నేత్ర పరిహేలనము లోకహిత పాలనము కాగన్
బాల గమనించె తన ఫాల తిలకమ్మొ యన బాలరవి గాంచి మురిపాలు రహియింపన్
కాలపురుషుం డుదయ కాల పరమాత్ముడని చాల తలపోసె జగమేలు డితడంచున్ ! 61

ఆ ఉదయపు వేళ భక్తులు ఆలపిస్తున్న మేలుకొలుపులను వింటూ శ్రీజలధీశ్వరస్వామి తూర్పుకొండపై తన నుదుటి నేత్రానికి ప్రతిఫలంగా ప్రకాశిస్తున్న సూర్యుణ్ణి లోకహితపాలనంకోసం తెరచిన తనకన్నుగా గమనించాడు. బాలాదేవి మురిపెంగా బాలసూర్యుణ్ణి తననుదుటితిలకంగా భావించింది. ఇతడు కాలపురుషుడని, కాలస్వరూపుడైన పరమాత్ముడని, లోకాలను ఏలగలవాడని ఆశీర్వదించింది.

మానిని : ఎన్ని యుగాలుగ నిట్లు రహింతువొ యింధన మెయ్యెడ నెంచెదవో
పన్నుగ లోక వివర్ధనకై ప్రతిభన్ వెలిగించెడి భాస్కరుడా
వన్నె రవంతయు వాడక వర్తిలు వైష్ణవ చక్రనిభా! ద్యుమణీ!
సన్నుతి జేసెద సద్గతినిచ్చి యశమ్మొనగూర్చుము శౌర్యమయా ! 62

హే సూర్యభగవాన్! నీవుఎన్నోయుగాలనుండీ ఈ విధంగా కాంతివంతంగా ప్రకాశిస్తున్నావు. ఇలా ప్రకాశించ టానికి నీకు ఇంధనం ఎక్కడిది? నీ కాంతి అణువంతయైనా తగ్గకుండా శ్రీమహావిష్ణువు యొక్క చక్రం వలె కాంతుల నీనుతున్నావు. ఆకాశంలో ఒకకాంతివంతమైనమణి వలె ప్రకాశించే సూర్యభగవాన్! నిన్ను స్తుతించగలవారము. మాకుసద్గతులను, కీర్తిచంద్రికలను ప్రసాదించవయ్యా !

మానిని : అవ్విధి నందరు నర్యము గొల్వగ నాతడు కాంతి మహత్వముతో
యవ్వన శోభ దిశాంతమునింపె మహావిభవమ్ము లహోయనగన్
క్రొవ్వెలుగుల్ మెరుగుల్ గురిపింపగ కూరిమి నొంది సుఖోన్నతులై
సవ్వడిజేసిరి శంకరలీల ప్రసన్నవిశేష విశాల విధిన్ ! 63

ఆవిధంగా అందరూ సూర్యభగవానుణ్ణి స్తుతించగా ఆతడు మరింత యవ్వనవంతుడై దశదిశల పర్యంతము ఉత్సాహంతో తనకాంతులను వ్యాపింపజేశాడు. ఈసన్నివేశాన్ని ప్రజలందరూ సాత్వికచిత్తంతో పరమేశ్వరుని లీలా విశేషంగా భావించారు.

: పుర వర్ణన:

చం . నలుగడలందు కాంతి కిరణమ్ములు బర్వగ ఘంటసాల వీ
ధులు తెలివొందె! పౌరులు యథోచిత రీతిని వాడకట్టుగా
కలివిడి నొంది మేలి గుణకారములెక్కి పరస్పరమ్ము ప
ల్కుల నుడికార మింపెసగ కోమల వాఙ్మయ రూపునొందెడిన్ ! 64

ఆవిధంగా నాలుగు దిక్కులా సూర్యభగవాని కాంతికిరణాలు వ్యాపించగా ఘంటసాల నగరవీధులు ప్రకాశ వంతమైనాయి. పురజనులు ఉదయపువేళలో ఒకరికిమించి మరొకరు ప్రేమాతిశయంతో ఆప్యాయతను పెంచేట్లుగా మాట్లాడుకోసాగారు. వారిఆత్మీయతలో భాషాతన్మయత్వం పులకించి ఒకస్నేహార్ద్రమైన వాఙ్మయ స్వరూపం ఆవిర్భవించి కనిపించింది. అందుకనే ఈ కోవెల ప్రాంగణంలో సరస్వతీ స్వరూపం దర్శనమిచ్చిం దని ముందుగా వర్ణించబడింది.

శా . వ్యాపారమ్మునకై విదేశముల బోవంజాలు సంపన్న వి
ద్యా పారంగతులీ పురాన గలరుద్యద్భాగ్య వర్ధిష్ణువుల్
ప్రాపున్ గాంచిరి వర్తకాభిరతిచే భాగ్యోన్నతిన్ పొంది బా
లా పూజల్ జలధీశ్వరాశిషములున్ లాభించి యోగించుటన్ ! 65

విదేశాలతో వ్యాపారాలు చేయగల సంపన్నులు, విద్యావంతులు ఈ ఊరిలో ఉన్నారు. ఆ విధంగా వ్యాపారాలు చేసి సిరిసంపదలనుగడించినవారుకూడా చాలామందిఉన్నారు. ఈపట్టణంలో వెలసియున్న బాలా జలధీశ్వర స్వామి వార్ల అనుగ్రహ విశేషమే వీరికి ఇంతటి సంపదలను అందించింది.

మ . పలు వర్ణమ్ములవారలీ పురిని సౌభాగ్యమ్ము వర్ధిల్లగా
విలువన్ బొందెదరిందు వర్తకమునన్ విస్తారమౌ సంపదల్
తులతూగన్ ధనధాన్య సంపదలు హృద్యోదాత్త భాగ్యంబులున్
పులకించున్ జలధీశ్వరుండు కృప నామోదించి దీవించుటన్ ! 66

అనేకవర్ణాలవారు ఘంటసాలలోసౌభాగ్యవంతులైవిలసిల్లారు. గొప్పవ్యాపారం ఈ ప్రదేశాన్ని సిరిసంపదలతో తులతూగేట్లుచేసింది.జలధీశ్వరస్వామికృపతోఆశీర్వదించటంచేతధనధాన్యసంపదలుఇక్కడవృద్ధిచెందాయి.

మ . సిరులున్ చిందులు వైచుభూమి;బహుళ శ్రీమంతమౌ గ్రామ ము
ర్వరలో పాడియు పంట హెచ్చయిన యారామమ్ము;కోట్లాది బం
గరునిల్వల్ వివిధాకృతిన్ గల ధనాగారంబు; పాలించు నె
వ్వరుగానీ తలవంచ వోలెనను సంపన్న ప్రదేశంబిదే ! 67

ఈ ఘంటసాల సిరులు చిందే భాగ్యస్థానం. మహాశ్రీమంతుల గ్రామం. నిజం చెప్పాలంటే ఈ భూమిలోనే పాడిపంటలుసమృద్ధిగా గలబౌద్ధారామం ఈప్రదేశం. ఇది కోట్లాదిగా బంగారురాసులు రకరకాల ఆభరణాల రూపంలో నిల్వ యున్న ధనాగారం. పాలకులు ఎవరైనా సరే ఇక్కడ తలవంచవలసిందే అనేపుణ్యభూమి ఇది.

ఉ . వేలయుగాలనాడిది కుబేరుని కోటయొ ! శ్రీ నివాసమో!
బాలశివానురాగమున వర్ధిలు బంగరు పర్వతమ్మో! ము
న్నేలిన శాతవాహనుల యేల్బడి కాసులు నింపినట్టి యీ
నేలయె "టంకసాల"యన నేడిట నిల్చె సువర్ణశాలయై ! 68

వేల సంవత్సరాలకిందట ఈ ప్రదేశం కుబేరుని కోటయేమో ! లేక శ్రీమహాలక్ష్మికి నివాసప్రాంతమో ! కానిచో ఇక్కడవెలసిన బాలాపరమేశ్వరులప్రేమచే వర్ధిల్లిన మేరుపర్వతమో! అదీకానిచోఇంతకుముందు ఈ ప్రదేశాన్ని పాలించిన శాతవాహనులు బంగారు నాణేలను ముద్రించే టంకసాలగా ఈ ప్రాంతాన్ని యేర్పాటు చేయటం తో ఇది ఇప్పటికీ సువర్ణశాలగానే నిలిచి ఉంది.

శా . ఆనాడియ్యది రేవుపట్టణము; వేలావృత్త సౌభాగ్యమౌ
నీ నేలన్ జలధీశ్వరుండన ప్రతిష్ఠించెన్ శివున్ నిష్ఠతో
మౌనీంద్రుండగు కుంభసంభవుడు; తన్మాహాత్మ్యమేమో ప్రజల్
నానారీతుల సంపదల్ కలిగి ప్రజ్ఞాశీలురై హెచ్చెడిన్ ! 69

పూర్వమెప్పుడో ఈ ప్రదేశం ఓడరేవు; మహానిష్ఠాపరుడైన అగస్త్యమహర్షిచేత ఇక్కడ జలధీశ్వరస్వామి ప్రతిష్ఠించబడినాడు. ఆ స్వామికి ఇక్కడి సముద్రం హారంగా శోభిల్లుతూ ఉండేది . అప్పట్నుంచీ ఇప్పటివరకు ఆస్వామి అనుగ్రహం చేతనే ఇక్కడి ప్రజలకు అష్టైశ్వర్యాలూ సమకూరి, ప్రజ్ఞావంతులౌతున్నారు.

మ . సరుకుల్ దింపుచు నెత్తుచున్ రొదల నక్రాంతమ్ముగా రేవులో
పరుగుల్ పెట్టెడి కార్మికుల్ సరుకులన్ భద్రమ్ముగా సర్దు కొం
దరుబేహారులతోడ సందడి వడన్ తాత్పర్యమేపార సు
స్థిర లాభార్థులుగొల్చె నీశ్వరుని యాశీర్వాదముల్ పొందగన్ 70

ఆనాడు ఘంటసాల రేవులో ఓడలకు సరుకులు ఎత్తుతూ దింపుతూ కార్మికులు పరుగులు పెట్టేవారు. మరొక ప్రక్క ఆసరుకుల్ని భద్రంగాసర్దుకునేవ్యాపారులుసందడి చేసేవారు. వారంతా తమతమ వ్యాపారాల్లో లాభాలు రావాలని జలధీశ్వరస్వామికి మొక్కుకునేవారు.

ఉ . వైదిక శాస్త్ర పండితులు వాగనుశాసనులట్లు కూర్మితో
వేద పురోహితార్థముల వృత్తి వహించుచు నెల్లవారలన్
కాదనకుండ నీశు సముఖంబున నిల్పి నిజాంగపూజ నిం
పాదిగ జేసి యీశ్వరకృపాదృతికై భజియించు చుండెడిన్ 71

వేదపండితులు పురోహితులు ఈ ప్రాంతంలోని ప్రజలను ఎవ్వరినీ కాదనకుండా జలధీశ్వరస్వామి గుడి లోనికి తీసుకునివెళ్ళి స్వామి ఎదురుగా నిలిపి శాస్త్రప్రకారంగా పూజలు జరిపించి స్వామి కృపకు పాత్రులయ్యే విధంగా సహాయపడేవారు.

ఉ . నావికులర్చనావిధి వినాయకునిన్ జలధీశు పార్వతిన్
భావన జేయుచున్ తమకు భాగ్యము కల్గగ పూజజేయుచున్
దైవ కటాక్ష వీక్షణల తద్దయుగోరి యఖండ దీపముల్
పావనభక్తి మీరగ శుభాకృతితో వెలిగించి మించెడిన్ 72

నావికులు తమకుమేలుచేకూరాలనీ, భాగ్యసమృద్ధిలభించాలనీజలధీశ్వరస్వామి ఆలయంలోని వినాయకునికి, బాలాత్రిపురసుందరికీ,జలధీశ్వరస్వామికీ భక్తితోపూజలుచేసిఅఖండదీపాలు వెలిగించేవారు. ఎక్కడెక్కడి వారూ కూడా స్వామియందు భక్తిప్రపత్తులతో జలధీశ్వరస్వామినిసేవించేవారు. తమకు స్వామి కోరిన కోరికలను తీర్చగలడని విశ్వసించేవారు.

: ధనగుప్తుని వృత్తాంతము :

ఉ. కొందరిలో నొకండు "ధనగుప్తుడు" యాడిన దెల్ల యాటయున్
విందులొసంగి పాడినది వీనులవిందగు పాట కాగ కా
మందులలోన పేర్కొనెడి మాన్యుడునై రసలోలుడై సదా
పొందులకోసమై చెలగు పుంశ్చలుడై తిరుగాడు చుండెడిన్ 73

ఘంటసాలలో గల కొందరు భాగ్యశాలురలో "ధనగుప్తుడ"నే వాడొకడు ఆడింది ఆటగా పాడింది పాటగా వ్యవహరించేవాడు. రసలోలుడై ఎల్లప్పుడు ఆడవారి పొందుకోసమై వ్యభిచారిగా సంచరించేవాడు.

చం. కడు పిసినారియై తన సుఖంబు గడించును గాని సేవకుల్
వడివడి సేవలిచ్చినను వారికి జీతములీయబోడు ;కా
చెడి జలధీశు నర్చనకు చిల్లిగవన్ దయసేయబోడు ; వ
చ్చెడి యతిథుల్ తినంగ నలుసింతయు బెట్టడు బెట్టు ధూర్తుడై ! 74

ధనగుప్తుడు గొప్పపిసినారి. స్వార్ధపరుడు. తనసుఖాన్ని మాత్రమే చూసుకుంటాడు. తనవద్ద పనిచేసే సేవకులు వడివడిగా పనులు చేసినా వారికి ఇవ్వవలసిన జీతాలను ఈయడు. తనను కాపాడే జలధీశ్వరస్వామి వారి పూజలకు చిల్లిగవ్వను కూడా దానమీయడు. వచ్చిపోయే అతిధులకు తినటానికి ఒక నలుసంతైనా పెట్టడు.

చం. అతిగుణహీనుడాతడు; మహాత్ములనంగ సహింపలేడు; స
మ్మతి నొకమేలుజేయగల మంచితనంబు రవంతలేని దు
ర్మతి; రసికుండు; కంటికొక మానిని కన్పడినంత చెంగునన్
రతియుతికోరి దూకెడి సరాగ పరాంగుడు కీచకుండనన్ 75

ధనగుప్తుడు గుణహీనుడు. గొప్పవారిని సహించలేడు. మనస్ఫూర్తిగా ఒక్క మంచిపనియైనా చేయగల మంచి తనం రవ్వంతకూడా లేనివాడు. కానీ గొప్పరసికుడు.వాని కంటికి ఆడది కనిపిస్తే చాలు-చెంగుమని దూకి కవయగోరే దుష్ట స్వభావి. పరస్త్రీలతో సరాగాలు , సరసాలు నెరపటంలో అతడు కీచకుని వంటివాడు

ఉ. పిల్లికి బిచ్చమీయని కుబేరుడు; కోట్లు గడించుచుండియున్
తల్లికి తిండిపెట్టని వృధామతి ; దుర్మతి; యైహికమ్ము శో
భిల్లియు తృప్తిజెందని గభీరుడు; నాస్తికవాది ; యెవ్వరిన్
పొల్లున నమ్మబోని కులభూతి; మహామతి ; చుప్పనాతియౌ ! 76

ధనగుప్తుడు పరమలోభి. పిల్లికి బిచ్చంపెట్టని పిసినిగొట్టు. కోట్లాదిగా సంపాదించినా తల్లికి గుప్పెడు మెతుకులు పెట్టని వ్యర్ధజీవి. తాను అనుభవించేందుకు కావలిసినంత ఉంటే చాలు అనుకునే స్వార్ధపరుడు. నాస్తికవాది. దైవభీతి లేనివాడు. ఎవ్వరిని పిసరంతయైనా నమ్మనివాడు. ఇతరులను సహించలేని చుప్పనాతి

ఉ . ఇట్టి దురాత్మునెన్నుకొని యెవ్విధి కావ్యము జెప్పబూని నా
విట్టి యెడన్ వచింపుమని హీనగతిన్ పలుకాడువారికిన్
దిట్టతనాన చెప్పగల ధీయుతు నే నిటుజూడు ! వీడొకం
డిట్టనరాదు ; వీనివలె నెందరొనుండిరి ! వీడు మచ్చుకే!! 77

ఇతడి కథావిధానా ఎన్నుకొని నేను కావ్యరచనకు పూనుకొనగా కొందరు నాతో ఇటువంటి దుర్మార్గుణ్ణి కథానాయకునిగా ఎందుకు తీసుకున్నావని అడుగగా ఇటువంటివాడు వీడొక్కడే కాదు. సమాజంలో ఇలాంటి వాళ్ళు చాలామంది ఉన్నారు. వీడు వారికి ప్రతిగా ఉదహరించబడుతున్నాడు అని చెప్పాను.

మ . అరిషడ్వర్గములందు చిక్కని ప్రపుణ్యాత్ముల్ ధరన్ గల్గిరే ?
వరణీయుల్ పరమేశ్వరానుభవ శశ్వత్కాంతు లిందుండిరే ?
చిరు పాపంబొనరింపనట్టి సుజనుల్ చింతిల్లగా నుండిరే ?
యరయంగా కడకైన మేలుకొను భాగ్యంబేరికిన్ గల్గెడిన్ ! 78

ఈభూమిమీద అరిషడ్వర్గాలకుచిక్కని పుణ్యాత్ములు ఎవరైనాఉన్నారా? పరమేశ్వరుని దర్శనానుభవం గల వారుఉన్నారా? చిరుపాపంకూడాచేయని పుణ్యాత్ములు ఉన్నారా ? ఎవరైనా చనిపోయేలోపుగానైనా మేలుకొనే భాగ్యాన్ని పొందగలుగుతారు. కనుక ఈ కథానాయకుని విశేషమేమిటో గమనించుదాము .

మ . అని నే జెప్పుచు నున్నయంత వడిలో నాశ్చర్యమౌనట్లుగా
తనకంటన్ బడినట్టి కాంత నొకతెన్ దర్పమ్ముతో నాలయం
బుననే యెంగిలిజేసి మీస జరచెన్; పోగాల ముప్పొంగ నా
ధనగుప్తుం డపరాధ సౌధము తుదిన్ దాకెన్ మహాపాపియై ! 79

ఈవిధంగానాకావ్యకథనుగురించి చెప్తున్నంతలోనే ధనగుప్తుడు జలధీశ్వరస్వామిగుడికి వచ్చిన ఒక కాంతను చటుక్కున పట్టుకుని మగతనం ఉందన్న గర్వంతో పోయేకాలం వచ్చి ఎంగిలిచేసి మీసాలు దువ్వుకున్నాడు.

ఉ . కన్నులకైపు నింపుకొను కాంతను గూడిన గూడవచ్చు; నా
యన్నులమిన్న సై యనిన నంతగ దోషము కల్గబోదు ! యే
మన్నదొ లెక్కలేక మహిమాన్వితమౌ గుడి ప్రాంగణమ్మలో
కన్నును మిన్ను గానక నకార్యము సల్పుట పాపమేకదా !! 80

తనకళ్ళల్లో కామవాంఛను నింపుకుని ఆహ్వానించిన వనితను కూడుకుంటే కూడుకోవచ్చు. కానీ ఆ వనిత ఏ మన్నదో తెలుసుకోకుండాఅకార్యంచేయటంపాపహేతువే!పవిత్రమైనగుడి ఆవరణలో ఇలాంటి పని చేయటం అతి నీచమైన పని . కాంత కనిపించగానే కన్ను మిన్ను కానక తెగబడటం ఎవరికైనా సరే తగినపని కాదు.

ఉ. లేడిని జూచి మీదపడి లేచిన సింగమువోలెనామెపై
దాడినొనర్చినంత కడుదైన్యముతో చనుదారిలేక పా

రాడుచు భీతిజెంది త్రిపురారిని నెమ్మనమందు నిల్పి కా
పాడుమటంచు నేడ్వగ కృపామతియై సతి జూచె భర్గుడున్ ! 81

సింహం లేడి పైకి దూకినట్లుగా ధనగుప్తుడు ఆ కాంతపైకి లంఘించాడు.ఆమె మహాభయంతో ఎటు పోవాలో తోచక ఎదురుగా ఉన్న పరమేశ్వరుణ్ణి తలచుకుని కాపాడుమంటూ ఏడ్చింది. శివుడు తన సతివంక చూశాడు

ఉ. దండముబూని దండధరు దర్పమునిండ ప్రచండభానుడై
మండుచు మీసలందడిమి మంటగ నార్చుచు మానహీన పా
షండ ధనాభిగుప్తుని విసావిస మోదె నొకండు నప్పుడే
చండ పరాక్రమంబున కృశానుడనంగ భయంకరంబుగన్. 82

అదేసమయంలో ఒకపెద్ద దండాన్నిధరించి మండుతున్న సూర్యునిలా సమీపించి, మీసాలు దువ్వుకుంటూ, పెద్దగా అరుస్తూ ఒకడెవడో వచ్చి యమునిలా ధనగుప్తుణ్ణి విసవిసా బాదేశాడు.

తే.గీ. ఆతడెవడో కదా స్మరహరుడొ ! శివుడొ !
కాలరుద్రుడొ ! యముడొ ! శంకరుడొ గాని
దుర్మదాంధుని బడగొట్టె –కర్మమేచి
నపుడు దైవమ్మె యమునిగా నవతరించు ! 83

అతడెవరో !కాలరుద్రుడో ! యముడో! ఎవరోగానీ దుర్మదాంధుడైన ధనగుప్తుణ్ణి పడగొట్టాడు.

తే.గీ. అంత పరమేశ్వరుడె తనవంత దీర్ప
వచ్చి గాపాడెననుచు నా వనితయెంచి
నిండుమది నీశ్వరునిగొల్చె నిరుపమాన
భక్తితాత్పర్యములతోడ పరవశించి ! 84

ఆసమయంలోపరమేశ్వరుడే తనబాధతీర్చి కాపాడాడనినిండు మనస్సు తో శివునికి సేవలందించుకొన్నది.

చం. బ్రతుకిటుబండబారగ నభద్రతనొందిన కాంత యిట్టి దు
ష్కృతికి మనంబులో జడిసి జీవితమందునరోతకల్గి దుః
ఖితయగుచున్ మదాంధునకుకీడు ఘటిల్లెడుగాక! వెంటనే
ప్రతిఫలమొందుగాక! యని వానిశపించుచు నేగెయింటికిన్. 85

ఆమె బ్రతుకిట్లు బండబారగా తనమనస్సులో రోతకల్గి ఆమె వాని వినాశనానికి శపిస్తూ వెళ్ళిపోయింది .

ఉ. కుప్పగకూలినట్టి ధనగుప్తుడు నోటను మాటలేక యే
చొప్పునెరుంగలేక వివశుండయితూలె ధరాతలాన మే
నప్పుడు సున్నమున్ గలుప నస్తికయొక్కటిలేనియట్లు ను
ప్పుప్పుగ తూట్లునొంది చనిపోయినయట్లుగరాలె నేలపై ! 86

అప్పుడు ధనగుప్తుడు నోటమాటలేక కుప్పకూలిపోయాడు. సున్నంలోకి ఎముకలు లేవన్నట్లుగా దేహం తుత్తునియలు కాగా చచ్చినవానివలె నేలకూలిపోయాడు .

ఉ . చేసినకర్మముల్ చెడవు; చేరు సరాసరి వెంటనంటి వి
శ్వాసముతోడ! వీటిని నివారణ సేయగజాలరెవ్వరున్
దోసములున్ గుణంబులు యథోచితరీతి భుజింపగావలెన్
త్రాసముజెందినన్ వ్యథలు తప్పవు దైవము కావకుండినన్ **87**

చేసినపాపం చెడనిపదార్థం. చనిపోయాక వెంటపడి వస్తుంది. దీన్ని ఎవరూ ఆపలేరు. ఈశ్వరుడు కాపాడక పోతే కర్మఫలాన్ని ప్రతివారూ అనుభవించాల్సిందే !

మ . ధనగుప్తుండు మదాంధుడై చెలగి కాంతన్ పొందు నవ్వేళ వా
నిని దండింపగ నీశ్వరుండె యముడై నిక్కమ్ముగా వచ్చెనో
యను భావంబది వానికిన్ వెలిగి దేహంబంత దేవాలయం
బున కీడ్చెన్ శివసన్నిధిన్ నిలచు పాముంబోలె పారాడుచున్ ! **88**

మదంతో ఆకాంతను కబళించేవేళలో అతణ్ణి దండించటానికి ఆఈశ్వరుడే వచ్చాడేమోననే భావం ధనగుప్తుని మనస్సులోకూడావెలిగింది. అప్పుడు తనదేహాన్ని పామువలే ఈడ్చుకుంటూ శివసన్నిధానానికి చేర్చుకున్నాడు.

సీ. లేచి నిల్చొనలేడు లేశమాత్రము శివ
లింగ సన్నిధి జేరలేనివాడు
చేతులెత్తగలేడు చేసినపాపాలు
ఛీకొట్టి దునుమ నశించువాడు
నోటబిల్వగలేడు నిండునకృత్యాలు
పండిన దుర్నీతిపరుడు వాడు
నీరుద్రావగలేడు నిరుపమదాహార్తి
నిలువెల్ల దహియింప నలుగువాడు
గీ. కడుపులోచిచ్చు కాల్చగా కనలువాడు
దెబ్బ లింతింత పీడింప నుబ్బువాడు
చావుబ్రతుకులసందులోసరసమాడు
కుమతియమకింకరునిధనగుప్తుడతడు. **89**

తనకు తగిలినదెబ్బలకు ఆ ధనగుప్తుడు లేచినిల్చోలేడు. స్వామి సన్నిధికి ప్రాకుతు చేరలేకపోతున్నాడు.వాడు చేసినపాపాలవల్లతగిలిన దెబ్బలవల్ల చేతులెత్తలేకపోతున్నాడు.నడచిన దుర్నీతి వలన దవడలు పగిలిపోయి

నోరెత్తి మాట్లాడలేకపోతున్నాడు. నాలుకపీడించే దాహం కలుగుతున్నా గుక్కెడు నీళ్ళు త్రాగలేక పోతున్నాడు. కడుపులో ఆకలి కార్చిచ్చుగా కబళిస్తున్నా మెతుకుతినలేని స్థితిలో ఉన్నాడు. తగిలినదెబ్బల వలన దేహం ఉబ్బిపోయి చావు బ్రతుకులమధ్యలో యమకింకరులను చూస్తూ , మునుపు చేసిన సరసాలు గుర్తు రాగా అలమటిస్తున్నాడు.

మత్తకోకిల : **మట్టికొట్టుకు పోవుచున్నను మానినుల్ దరి జేరరే ?**
పుట్టి మున్గుచునున్న నెవ్వరు పొల్పుమీరగ కావరే
యిట్టి కష్టము దాపురించిన నెవ్వరేమనకుండిరే ?
యెట్టి కర్మమటంచునాతడు యేడ్వసాగెను దీనుడై ! **90**

ఆ ధనగుప్తుడు మట్టికొట్టుకుపోతున్నా ఇంతకుమునుపు సరసాలాడిన కాంతలు ఒక్కరైనా రావటం లేదు . వీడి పుట్టి మునిగిపోతున్నా ఎవ్వరూవచ్చిచూడటంలేదు. వీడికి ఇంతటికష్టంవచ్చినా ఎవ్వరూ ఏమీ పట్టించుకోవటంలేదు. ఇదేంకర్మరా అని వాడు గొంతెత్తి ఏడ్వటం మొదలుపెట్టాడు.

మత్తకోకిల : **ఏడ్చునప్పుడు "నైం"కృతిన్ గమనింపకే పలుకాడగా**
యేడ్చువానినిజూచి బాల మహేశ్వరున్ గదలించె "వీ
డేడ్చునప్పుడు నైంకృతిన్ గమనించి కాచెదవో యికన్
నీడ్చి తన్నిన తప్పుసేయడొకింత నియ్యది చాలనన్. **91**

వీడు ఏడ్చేటప్పుడు వీడికి తెలియకుండానే వీడి ఏడుపులో ఐం కారాన్ని బాలాదేవి గమనించింది.మహేశ్వరుణ్ణి కదిలించి వీడు తెలియకుండానే నన్ను స్మరిస్తున్నాడు. కనుక వీడికి ఈ పరీక్షచాలు. ఇంకా ఈడ్చితన్నినా తప్పు చేయడులే అని వాణ్ణి సమర్ధించింది .

మత్తకోకిల : **వేచిచూచెదమింక నేమగు వీని చందమటంచు ది**
క్కూచివోలె నొకేదిశన్ వడి జూచుచుండె నుమేశు డా
గోచిపాతని గుప్తువంకను కోపధార స్రవించగా
తోచెనయ్యెడ గుప్తు దార్ద్రత తూలుచున్ విలపించుటల్ **92**

ఇంకేంజరుగుతుందో మరికొంతతడవువేచిచూద్దాము అంటూ పరమశివుడు దిక్కూచిలాగా ఒకేదిక్కును చూస్తూ ఆచూపులలో కోపధారలను ప్రసరిస్తూ ధనగుప్తునివంకకే చూడసాగాడు. గుప్తుడు ఏడుస్తూ తూలుతూ కనిపించాడు. **మ . "మునునే జేసిన పాపపుణ్యఫలమేమోకాని నా కర్మమం"**
చును గుప్తుండిటు లో దలంచె "నదియే శోధించుచున్ నన్ను కా
లుని రూపాన గ్రసించుచుండినది! నాలో దోషముల్ సత్యమే!
నిను మన్నింపని మాటయున్ నిజమె! కానీ శంకరా! బ్రోవరా!" **93**

ఓ పరమేశ్వరా! నేను చేసిన పాపపుణ్యాలఫలితం ఎలాఉందో కానీ అవేయముని రూపంలో నన్ను శిక్షిస్తూ తిని వేయటానికి సిద్ధంగాఉన్నాయి. నాలోదోషాలుఉన్నమాటనిజమే. నేను ఓశివా! నిన్ను లెక్కచేయకుండా పాపాలుచేసినమాటకూడానిజమే.కానీశంకరా!నీవుదయగలవాడవు కనుక నన్ను కాపాడరా ! అంటున్నాడు

శా . ఏనాడున్ దలపంగలేదు నిను ;నేనేనాడు దర్శింపలే
దేనాడున్ భజియింపలేదు శివుడా! దేవుండ వీవంచు నే
నేనాడున్ దలపోయలేదు; జగమే నేనంచు తీంౘ్రించి నా
తోనే లోకమటంచు నెంచి తుదకీ ధూళి స్నపంబొందితిన్ **94**

శివా! నేనునిన్నుఏనాడూతలుచుకోలేదు.ఏనాడూ దర్శించలేదు.నీవు దేవుడవని నేను ఏనాడూ అనుకోలేదు. పైగా నేనే దేవుణ్ణి అనుకున్నాను.చివరకు ఈ దుమ్ములోపడి కొట్టుకుంటున్నాను అనుకున్నాడు ధనగుప్తుడు.

ఉ . చేసినవన్ని పాపములె;చెప్పుకొనన్ సుకృతమ్ములేదు ;నే
చేసిన ధర్మకార్యమును చేసినదానము నిందు సున్నయే
వీసము పుణ్యకార్యమొకవేళను లే దయినన్ కృపాళు ? సం
త్రాసము బాపి నన్ను పరిరక్షణ జేయర శంకరా!హరా! **95**

నేనుచేసినవన్నీపాపాలే.చెప్పుకోవటానికి ఒక్క పుణ్యమైనాలేదు. ఒక్క దానమైనా లేదు.అయినా దయామయా! శంకరా!హరా! నా భయాన్ని పోగొట్టి నన్ను రక్షించరా! అని ధనగుప్తుడు శంకరుణ్ణి వేడుకొంటున్నాడు.

శా . సంపాదించిన సొమ్ములేమయినవో సాధింప నావెంట నే
సంపాదించిన దుష్ట కర్మఫలముల్ సాంగత్యమున్ జూపి నా
కొంపన్ దీయగ తోడ వచ్చినవి; నీ కూర్మిన్ ప్రసాదించి మ
న్నింపన్ బోలు దయాకరా!విడువరా! నిన్నే నమ్ముచున్నానురా! **96**

నేను సంపాదించిన సొమ్ములేమయినవో కానీ దుష్టకర్మఫలాలుమాత్రం నామీద ప్రేమను చూపిస్తూ నాకొంప తీసేట్లుగా నావెంటనే వస్తున్నాయి. నీ అనుగ్రహాన్ని చూపి నన్ను విడిచిపెట్టవయ్యా!నిన్నే నమ్ముతున్నానయ్యా!

శా . నిన్నేనాడు దలంపనట్టి జడులున్ నీముందె నన్యాయ సం
పన్నత్వంబు గడించువారలు మహాపాపాత్ములున్ ధీరులై
యౌన్నత్యంబు గడించుచుండ తగవౌనా నన్ను శిక్షింప ? నా
కన్నన్ కాముకులుండ నేనొకడనే కన్పించితే శిక్షకున్ ? **97**

ఓ పరమేశ్వరా! ఏనాడూ నిన్నుకనీసంతలుచుకోనివాళ్ళు, నీముందే అన్యాయంగా సంపదల్ని కూడబెట్టుకున్న వాళ్ళు, ఎందరో మహాపాపాత్ములు గొప్పవాళ్ళుగా చెలామణి అగుచుండగా నన్ను శిక్షించటం న్యాయమా? నా కన్నా కాముకులు ఉండగా శిక్షపొందటానికి నేనే కనిపించానా? అంటున్నాడు ధనగుప్తుడు

సీ. నాకన్న కాముకుల్ నాకన్న లోభులున్
ననుమించి మత్తిల్లు నరులు గలరు
నాకన్న నాస్తికుల్ నాకన్న మత్సరుల్
నను మించు నికృష్ట జనులు గలరు
నాకన్న దుర్జనుల్ నాకన్న దుర్మతుల్
ననుమించు దుష్టాత్మఘనులు గలరు
నాకన్న హీనులున్ నాకన్న దోషులున్
ననుమించు పాపాల నటులు గలరు
గీ. అట్టివారిని క్షమియించి యవల విడచి
పుట్టి ముంచుచు నన్నేల పూడ్చదలచి
కొట్టినావయ్య? యెముకలగూడు చెదర
బాదజేసితి విది నీకుపాడియగునె ! 98

నాకన్నా కాముకులు, నాస్తికులు, నికృష్టమైనవారు, దుర్జనులు, ఎందరోఉన్నారు. వారందరను క్షమించి, నన్నెందుకు కొట్టావయ్యా? నా ఎముకలగూడు చెదిరిపోయేట్టుగా బాదించావే ! ఇది నీకు ధర్మమేనా ?

చం . వయసుననున్న కాంత నలవాటునగూడితి ;పూరుషాళికిన్
ప్రియము రహించి హెచ్చు బహిరింద్రియ చేతన నీవరమ్మె ! యెం
తయిన మనంబడంచుకొని తద్దయు హీనత తల్లడిల్లుచున్
భయమున వీడిపోవగల పద్ధతి యే మగవాని కిమ్మగున్ ? 99

అలవాటుచొప్పున వయసులోఉన్నకాంతను కూడుకునే ప్రయత్నంచేశాను. ఆసక్తి కలిగినప్పుడు ఇంద్రియ చైతన్యం కలగటం పురుషులకు నీవిచ్చిన వరమేకదా! అందగత్తెనుచూచి కోరికను అణచుకోవటం, భయంతో తల్లడిల్లటం యే మగవానికైనా కుదురుతుందా ?

మ . ననుశిక్షింపదలంచుచో జడియబోనయ్యాశివా !శంకరా !
కని కాపాడిన శిక్షవైచిన మహాకాలుండవీవే కదా
నను నీదారికి తెచ్చి నొంచితివి; యజ్ఞానమ్ము పోద్రోచి మీ
దను సన్మార్గము జూపి బ్రోవుము హరా! తప్పొప్పులెక్కింపకన్ . 100

నీవు నన్ను శిక్షించదలచుకుంటే భయపడనయ్యా! నన్ను కాపాడినా, శిక్షించినా నీవే తగినవాడవు. నన్ను నీ దారికితెచ్చావు. ఇంక నాఅజ్ఞానాన్నితొలగించి, నాకు మంచిదారిని చూపించి, నాతప్పొప్పులు లెక్కించకుండా నన్ను కాపాడవయ్యా !

ఉ . నన్నొక దుష్టకర్మునిగ నవ్వులపాలొనరించినా ;నీ
మన్నన గోరకున్న నవమానములన్ కలిగించినా ; సం
పన్నుడటన్న దుర్జనుడె ? పన్నుగ నాస్తికతత్వశీలుడే ?
యన్నులమిన్నలన్ గవయ నయ్యది నేరమె! చెప్పరా శివా! 101

నేనుదుర్మార్గుణ్ణి అనుకున్నావా?అవమానాలపాలు చేశావు. సంపన్నుడైతే దుర్మార్గుడా?వాడు నాస్తికుడౌ అందగత్తెలను కలవాలని యత్నిస్తే అది నేరమా ? చెప్పవయ్యా శివా!

శా . నా కర్మంబును వ్రాసినాడవుగదా నా ఫాలభాగాన నీ
లోకంబందు జనించు ముందటనె; నాలోపంబులన్ జెప్పినన్
నాకేమౌనది నీదు తప్పిదము; యన్యాయమ్ముగా నన్నిటన్
నీకోపానలదగ్ధు జేయుట శివా! నీకుందగన్ ధర్మమా ? 102

నేను పుట్టకమునుపే నాతలరాతను వ్రాసినావు; పుట్టాక నా లోపాలను చెప్పటం నీకు న్యాయమా?నేను లోపం గలవాడనంటే అదినీతప్పే! అందుకు నీకోపానలంచేత నన్ను శిక్షించటం నీకు తగినదేనా ?

శా . సంపాదించుట నేరమా! ప్రజకు నా సంపత్తి నీకున్నచో
పెంపున్ గోల్పడినట్టులౌనె! తలవంపే పౌరుషంబిద్ధరన్ ?
సొంపారన్ ధనరాసు లిచ్చునతడే శోభిల్లువాడా ? ననున్
జంపన్ బూనితివేల? చెప్పుము శివా ! సైరింపలేకుంటివా ? 103

నేను సంపాదించుకోవటంతప్పా? నా సంపదను ప్రజలకు ఈయకపోతే నేను తప్పు చేసినట్లా? నేను మగవాణ్ణి కనుక నాపౌరుషాన్ని ఉపయోగించుకుంటేదోషమా? అదే సందర్భంలో నేను లోకులకు ధనాన్ని సమర్పించి ఉంటే దోషంపోయేదా? నన్నెందుకు చంపబూనావయ్యా ? నా మగతనాన్ని సహించలేకపోయావా

సీ . తప్పుజేసితి నంచు దండింప బూనినన్
తప్పుజేయనివాడు ధరణిగలడె
మానభంగమొనర్ప మరణశిక్ష విధింప
మరణించు నెందరు మనుజులిచట
దానమీయకయున్న దండింపబూనుచో
దాతలెందరు నుండె ధాత్రిలోన
దుష్టమానవుడని దునుమాడనెంచినన్

దుష్టుడుకాని వశిష్టుడెవడు

గీ. లోకకంటకులగుచు ముల్లోకములను –
పీల్చిపీడించు రాక్షసపీడకన్న
హింసయొనరించినాడనే యెన్నడైన –
యేలనాకిట్టిశిక్ష విధించినావు ? 104

ఉ. మంచి యొనర్చినావు పరమాత్మ! నినున్ తనివారజూచి ప్రే
మించెడి భాగ్యమిచ్చితివి; యింతకుమించి యదృష్టమేమి ! నీ
పంచన ప్రాణసంగతిని బాయుదు; నీ దెస నిటు జూచుచున్
సంచిత కర్మదోషములు సొంత మడంగ తలంచుకొందురా ! 105

ఓ పరమాత్మా! నీవు నాకు మేలు చేశావు. ఇప్పటికైనా నిన్ను తృప్తిగాచూచు భాగ్యాన్నిచ్చావు; ఇంతకన్నా నాకు ఏంకావాలి? నీదగ్గర నేను పంచప్రాణాలు విడుస్తాను; నిన్నుచూస్తూ నా పాపాలు నశింపజేసుకుంటాను

చం. నను పడగొట్టినా విదియు నాకొక మే లొనగూర్చె నీశ్వరా!
నిను కనులార నేను గమనించుచు దోషహరమ్ముకాగ బు
ద్ధిని నినుజేర నిల్పి పరితృప్తిని బొందుచు ప్రాణమిత్తు దా
నినిగొని ముందుజన్మకు ననిందిత పుణ్యఫలమ్మునీయరా! 106

శివా! నన్ను పడగొట్టావు. ఇదికూడా నాకుమేలే చేసింది . ఇందువల్ల నేను నిన్నే చూస్తూ నీపైన నా బుద్ధిని నిల్పి తృప్తిగా ప్రాణాలు వదులుతాను. వాటిని తీసుకుని ముందుజన్మకైనా నాకు పుణ్యఫలాన్నివ్వవయ్యా!

ఉ. ఇప్పటికైన కన్ను తెరిపించితి వియ్యది నాకుచాలు; నా
తప్పులదిద్దుకొంచు భవదాజ్ఞ నెరుంగుచు భక్తకోటిలో
నిప్పటికైన నొక్కనిగ నేనును జేరెద; నట్టి మార్గమే
చొప్పగునో యెరుంగగల శుద్ధమనోగతినిచ్చి బ్రోవరా! 107

శివా! ఇప్పటికైనా నాకన్ను తెరిపించావు; నాకిదిచాలు నాతప్పులుదిద్దుకుంటూ నీఆజ్ఞప్రకారంగా నిన్ను సేవించుకుంటూ నేనుకూడానీభక్తులలోఒక్కడినవుతాను.ఆమార్గమేదో తెలియగలమంచిబుద్ధిని నాకివ్వయ్యా

చం. అని ధనగుప్తుడార్తిమెయి నప్పరమేశ్వరుపైన దృష్టి ని
ల్పిన మరులిప్త వాలిపడె లింగము ముంగిట వానిదేహ మం
దున కొనప్రాణముండినదొ! తూలియటన్ విడనాడిపోయెనో
కనుగొనలేనిరీతి ! విధి కల్పితముల్ వివిధంబులౌగదా ! 108

అంటూధనగుప్తుడు ఈశ్వరునిపైనదృష్టిని నిల్పి మరుక్షణంలో లింగంఎదుటవాలిపడిపోయాడు. వాడి దేహం లో ప్రాణంఉందో, పోయిందో తెలియదు. విధివిలాసాలు విపరీతాలుకదా!

: వాయు వర్ణన :

ఉ. ఆ వరకెంతయో విసరినట్టి మహాపవనమ్ము శోభిలెన్
భావనలో నుమేశుని ప్రభావముగూర్చి తలంచునట్లు ;లీ
లావహమైన నాతని విలాసముగూర్చి తపించునట్లు ;శో
భావహమైన "బాల"పరిపాలనలో కుసుమించి నట్లుగన్ ! 109

అప్పటివరకూ విసరికొడుతున్న గాలి ఒక్కసారిగా నెమ్మదించింది. బహుశా అది మనస్సులో పరమేశ్వరుణ్ణి గురించి తలుచుకుందేమో ! ఆయన లీలావిశేషాలు దానికి గుర్తువచ్చాయేమో! ఈ ప్రపంచాన్ని నడిపిస్తున్న బాలా దేవి అనుగ్రహంతో విరిసినపూవులాగా గాలి నెమ్మదిగా వీయసాగింది.

ఉ. మెల్లని మందహాసమది మేనునుదాకినయట్లు; చెంత హ
త్తిల్లగ చేరు ప్రేయసి మదిన్ గిలిగింతలు పెట్టినట్లు; జా
బిల్లి కళాంశురాగములు పిల్లనగ్రోవినియూదినట్లుగా
చల్లని పిల్లగాలులు రసార్ద్రత నింపుచు వీచెనయ్యెడన్ 110

చిఱుదరహాసం మెల్లగా శరీరాన్ని తాకినట్లు; దగ్గరకుచేరి ప్రేయసి కౌగిలించుకోటానికి గిలిగింతలు పెట్టినట్లు; చంద్రునివెన్నెల ప్రవాహం పిల్లనగ్రోవిని ఊదినట్లుగా చల్లనిపిల్లగాలులు వీచినవి.

ఉ. నాద తరంగ డోలికలు నమ్రతతో నడయాడినట్లు; ప్రే
మాదృత రాగబంధములు మన్ననతో పులకించినట్లు ; స
మ్మోద పరంపరాకలిత పుణ్యఫలమ్ము వరించినట్లు; సం
పాదిత సౌఖ్యరాశి పవమానముగా కదలాడె లాస్యమై ! 111

శబ్దించే నీటియలలు వినయంగా ఊగినట్లు; ప్రేమస్వభావంచేత గౌరవాన్ని పొందిన ఆలోచనలు ఒక్కసారి పులకించినట్లు; చేసుకున్న పుణ్యఫలం ఆనందంతో వచ్చివరించినట్లు; సంపాదించుకున్నసౌఖ్యం అంతా నాట్యం చేస్తూ పవమానంగా కదలివచ్చింది.

మత్తకోకిల: వాయులీన మనోజ్ఞవైఖరి భావమందు రహింపగా
సాయమిచ్చెడి మిత్రుడోయన చల్లగాలి ప్రసారమై
మాయమర్మము ద్రొల్ల జేయుచు మంచిగంధ మలందుచున్
వేయినాడులశక్తి నింపెను వేదమాత విధమ్మునన్ ! 112

వాయులీనం వాయిస్తున్న శబ్దభావన మనస్సులో కల్గగా సహాయం చేయటానికి వచ్చిన మిత్రునివలే మాయ మర్మాల్ని దూరంచేస్తూ మంచిగంధం అద్దుతూ వేదమాతవలే ఆ పావనం వేయినాడులలోనూ శక్తినింపింది .

(మత్తకోకిల: ర,స,జ,జ,భ,ర, గణాలు;1-12 యతి.)

ఉ. ఫాలతలాగ్ని నేత్రపరిపాలనతో గరళమ్ము కంఠ వి
స్ఫాలితమై మహాగ్నికణ సంచయమై రగిలింప ముంగిటన్
కూలి వచించున్న ధనగుప్తుని మాటలు నాజ్యమిచ్చినన్
కీలలు రేగకుండ నణగించుచు సన్నని గాలి వీచెడిన్! 113

ఈశ్వరుని ఫాలలోచనం అతని కంఠంలోని గరళాన్ని రగిలించగా అతనిముందు కూలిపోయి మాట్లాడుతున్న ధనగుప్తుని మాటలు దానికి మరింత ఆజ్యం పోయగా జ్వాలలు రేగకుండా సన్నని గాలులు వీస్తున్నాయి .

మ. తనవృత్తాంతము లోదలంచుకొని చింతాక్రాంతుడై గుప్తుడీ
శునివంకన్ తనదృష్టినిల్పి యనిమేషుండై "క్షమింపంగ జా
లు"నటంచున్ కడు దీన భావనలతో డోలాయమానంబుగా
నెనరున్ గోరెడి వేళ మంద్రగతి నూనెన్ శీతవాతార్భటుల్ ! 114

ధనగుప్తుడు తన కథనంతటినీ తనలో తలుచుకుని దిగులుతో పరమేశ్వరునివంకకే రెప్పవాల్చకుండా చూస్తూ తనను క్షమించుమన్నట్టు వేడుకుంటుండగా చల్లనిగాలులు మంద్రంగా వీచాయి.

శా. ఆవేళన్ కరుణాతరంగితమతిన్ హత్తించి బాలాంబ "నా
థా వీనిన్ కడతేర్చుమెట్లయిన! సంత్రాసంబునన్ వీడు ని
న్నే వీక్షించుచునుండె నిత్తరిని వీనిన్ జంపినన్ వీడు ది
వ్యావాసంబును పొందునేమొ గనుమా"యంచున్ ప్రబోధించెడిన్. 115

అప్పుడు బాలాదేవి దయాస్వభావం ఉన్నాకూడా ఈశ్వరునితో "నాథా! వీణ్ణి వెంటనే కడతేర్చు. భయంతో వీడు నిన్నే చూస్తున్నాడు. ఇప్పుడు వీణ్ణి చంపితే వీడు స్వర్గావాసాన్ని పొందుతాడు. చూసి చెయ్యి అన్నది.

తే.గీ. బాల పరమేశ్వరుని గూర్చి పలుకరించు
చుండ సాయంతనంబయ్యె పండితులట
వేదమంత్రాల పూజించు విధుల కొరకు
చేరవచ్చిరి జలధీశు చిత్తమలర ! 116

ఈవిధంగా బాలాదేవి ఈశ్వరునితో మాట్లాడేంతలో సాయంకాలమయ్యింది. అప్పుడు పండితులు వేదమంత్రాలతో పరమేశ్వరుణ్ణి అర్చించటానికి వచ్చారు.

: సూర్యాస్తమయ వర్ణన :

శా . గంభీరంబుగ పశ్చిమాద్రి సిగపై కాంతుల్ ప్రసారించుచున్
శంభున్ గాంచి నమస్కరించు రవి పశ్చాద్భూమికై క్రుంకగా
దంభంబూనిన కాకఘూకముల యౌద్ధత్యంబు రేరాజుగా
శుంభద్వైభవ భాగ్యమొందె ! నిశులన్ చోద్యంబు లెన్నోకదా ! 117

పశ్చిమకనుమలపైకాంతులు ప్రసారిస్తూ పరమేశ్వరునికి నమస్కరిస్తూ సూర్యుడు అస్తమిస్తూండగా మహా గర్వంతో రకరకాలజంతువులు, గుడ్లగూబలు విజృంభించాయి. రాత్రివేళల్లో ఎన్నో వింతలుంటాయి కదా!

ఉ. నింగికి చక్రవర్తిగ ననేక విధంబుల నేలి మాపటన్
పొంగులు దాచి భాస్కరుడు భోగములద్దుచు పశ్చిమాద్రిపై
బంగరు కాంతినింపి తన భాగ్యవిశేషము చాటిచెప్పుచున్
చెంగట నాకసమ్మున విశిష్ట కళాకృతులొప్ప గ్రుంకెడిన్ ! 118

ఉదయంనుండి ఆకాశాన్ని తిరుగులేని రాజుగా పాలించి సాయంత్రానికి తనవైభవాన్ని చాలించి బంగారు కాంతులను పశ్చిమాద్రిపై ప్రసరింపజేసి పడమటి కొండపై రకరకాల కళాకృతులు దిద్దుతూ సూర్యుడు అస్తమించాడు.

ఉ. అడ్డిన మేఘపుంజముల యంచుల బంగరు రంగులద్ది మే
నొడ్డిన కారుమబ్బుల వినోదపు చిత్రములట్లు చూపి, నో
రొడ్డిన తెల్లమబ్బుల పరోక్షములో కిరణాలు దూర్చి మి
న్నొడ్డు కళానురూపముల నూతన చిత్రములద్దు భానుడున్ 119

సూర్యాస్తమయ సమయంలో అడ్డుపడినమేఘాల అంచులకు ఆ సూర్యుడు బంగారు వర్ణాన్ని పులుముతాడు. నల్లమబ్బులలో, తెల్లమబ్బులలో రకరకాల బొమ్మల ఆకృతులను చూపిస్తాడు.

సీ. అస్తమించెడి నా యహస్కరుకాంతులే
యంతకంతకు తగ్గి యణగిపోవు
ఆకాశమంతట నలమిన వర్ణాలు
నంతకంతకు మారి వింతగూర్చు
దశదిశల్ నిండిన ద్వాదశ కిరణాలు
నంతకంతకుదాగి హంగుజేయు
పండుముసలియైన భాస్కరు హస్తాలు
నంతకంతకు చిక్కి యందగించు
గీ. ఒక్కరోజునుపోలి మరొక్క రోజు
ఆకసంబున కనుపింపదనుట నిజము
ఎన్ని చిత్రాలనతడు చూపించగలడు ?
నాకసమునందు మనకు నహస్కరుండు !! 120

అస్తమించేసూర్యకాంతి అంతకంతకూ తగ్గిపోతుంది. అప్పటివరకూ ఆకాశాన్ని ఆక్రమించిన కిరణాలు అస్తమయవేళకుమారిపోయి వింతరంగుల్ని చూపిస్తాయి. పదిదిక్కులా నిండిన సూర్యకిరణాలు అస్తమించే

టప్పుడు చాలా హంగుచేస్తాయి. పండుముసలియైన సూర్యునిహస్తాలు క్రమేణాచిక్కి కొత్తఅందాలను చూపిస్తాయి. ఆకాశంలో సాయంకాలాలు ఒకరోజువలే మరొకరోజు ఉండవు .

: రాత్రి వర్ణన :

మ . క్షణకాలంబొకచోట నిల్వక సుఖాశాలేశమున్ లేక త
క్షణ కర్తవ్యముగా చరించుచు మహాకాశంబునందోచు ద్యో
మణి యాదిత్యుడు పశ్చిమాద్రికి జనన్ మత్తిల్లి చీకట్లు ప్రేం
ఖణముల్ సల్పుచు నిండిపోయె జగతిన్ గాఢాంధకారమ్ముగన్ 121

సుఖపడదామనే ఆశ కొంచెమైనాలేకుండా, ఒక్కక్షణమైనా ఎక్కడా నిలవకుండా, తిరగటమే పనిగా పెట్టుకుని సంచరించిన సూర్యుడుపశ్చిమాద్రికివెళ్ళేసరికి లోకంలో చీకట్లు వ్యాపించి మత్తులోమునిగి చిందులువేశాయి

మ. ప్రతిభావంతులు గల్గుచోట కుమతుల్ రాణింపగాలేరు; య
ప్రతిభుల్ నేర్పరిలేనిచోట వెలుగున్ ప్రాగల్భ్యమున్ బూని యు
ద్ధతితోడన్ చరియించు తీంద్రగల వాదప్రౌఢిమన్ జూపి ! యీ
గతి రాత్రుల్ చెలరేగు చీకటిమతిన్ కాట్లాడు జీవాళితో ! 122

ప్రతిభావంతులున్నచోటమూర్ఖులుగౌరవాన్నిపొందలేరు;ప్రాజ్ఞులులేనిచోటమాత్రమేదద్దమ్మలుగౌరవించబడతారు.అటువంటిచోట్ల దుర్మార్గులు చెలరేగిపోతారు;రాత్రికూడా బుద్ధిహీనుల కాట్లాటలతో ఇలాగే ఉంటుంది

మ. బలవంతుండు బలమ్ములేని బడుగున్ భక్షించుటే న్యాయమై
చెలగున్ రాత్రులయందు; భూతగణముల్ చెర్లాడి చీకట్లలో
పులకించున్ కడు పాపకృత్యముల నామోదించి; నక్తంచరుల్
తులతూగున్ తమ కామితార్ధముల పొందుంగాంచి మత్తిల్లుచున్. 123

రాత్రివేళల్లో బలంగలవాడు బలహీనుణ్ణి తినేస్తాడు; అనేకపాపకృత్యాలుచేస్తూ జీవులు సంతోషపడతాయి . రాత్రి సంచరించేవాళ్ళు(చోరులు, వేశ్యలు) కోరినదాన్ని సంపాదించుకుని మత్తులో తులతూగుతారు .

మ. వరబింబాధరమున్ పయోధరములున్ వక్రాలకంబుల్ మనో
హర లోలాక్షులు చక్కదిద్దుకుని యాహార్యంబు కైసేసి సుం
దరమై భాసిలు మేనితీగె విటులందాటింపగాజేయ మం
దిరమందున్ గనిపెట్టియుండి నిశులన్ తృప్తిన్ గనున్ వేశ్యలున్. 124

చక్కని దొండపండువంటి కిందిపెదవియు, గుండ్రనిచనుకట్టును, వంకరలుతిరిగినకేశాలు, ఆకర్షించే నేత్రాలు చక్కదిద్దుకుని శయనమందిరాల్లో రాత్రివేళల్లో కనిపెట్టుకునియుండి వేశ్యలు విటులతో తృప్తిని పొందుతున్నారు.

కం. తెరవెనుకచేయుపనులకు
సరిగా తోడగుచు నిశులు సరిగమ పలుకన్
తరుణులు విటులంగూడుచు
సురసేవించుటయు మదన సుందరపదమౌ ! 125

తరుణులు చేసే చీకటి పనులకు రాత్రులు సరిగమపలుకుతూ ఉంటే వాళ్ళు సురసేవిస్తూ విటులను కూడుతున్నారు

ఉ. చీకటి మిట్టపల్లముల చింతనబాపుచు నెల్ల సంగతుల్
మేకొని కప్పివైచి పుడమిన్ సమధర్మము పంచి యంతటన్
ప్రాకటమౌ స్వరూప పరిభావన దూరముజేసి హెచ్చుకుం
దౌ కథలన్ని బాపి తన తత్వములో మిళితంబొనర్చెడిన్. 126

చీకటి మిఘ్టపల్లాల సంగతిని మరిపిస్తుంది. సమత్వాన్ని సూచిస్తుంది. అన్నిటినీ తనపొట్టలో దాచుకుంటుంది.

ఉ. దేవుని రూపమేమి యన తేజమటంచు వచింపవచ్చు; వి
ద్యా విభవంబు వానికి యథార్థపు రూపము; వానినెక్కడో
యావలనిల్పి లోకములనంతట చీకటినింపి జీవులిం
దే విహరించుచున్ తనను తిన్నగ చూడని యట్లొనర్చెడిన్. 127

దేవుడు తేజస్స్వరూపుడు. విద్యవలన ఆయనను తెలుసుకోవచ్చును. కానీ అతడు లోకాలకు ఆవలనున్నాడని చెప్పి లోకాలలో చీకటిని నింపి, ఆ చీకటివలన దేవునిచూడలేని పరిస్థితిని కల్పించుకున్నాము.

ఉ. చీకటియెంత ధర్మగుణసిద్ధినిపొందెనొ! వస్తుజాలమీ
చీకటిలో స్వరూపములు చేద్పడి కంటికి కానరాక యే
కాకృతిబొంది సర్వసమతానుభవమ్మున లీనమౌచు త
త్త్వైక విశుద్ధవృత్తి పరమార్థముగా రహియించునంతటన్. 128

చీకటి ధర్మగుణాన్ని కలిగినట్టిది. చీకటిలో వస్తువులు తమ ఆకారాన్ని కోల్పోయి అన్నీ ఒకటిగానే కనిపిస్తాయి.

ఉ. లోకమునందు చీకటి విలోకనజేయుటకన్న నీ మనో
లోకము జూచుకొమ్ము; మదిలో నెలకొన్న మహాంధకారమున్
మేకొని పారద్రోలిన నమేయ మహత్వమునొంది దైవమున్
నీకనులందు జూచెదవు; నిత్యము నీమది సంతసింపగన్. 129

లోకంలోఉన్నచీకటిని కంటే నీమనస్సులోఉన్న చీకటిని చూసుకో. దాన్ని తొలగిస్తే దైవం నీకళ్ళముందు నిలుస్తుంది.

ఉ. చీకటి శాశ్వతమ్ము; వరసిద్ధినిగూర్చు వెలుంగు చుట్టమై
మేకొని వచ్చిపోవు; నది మేలొనగూర్ప చిరమ్ముకాదు; చీ
కాకులు వేనవేలయిన కమ్మని కాంతులు నొందురెండగున్
లౌకిక వర్తనమ్మొక విలాసముగా తలపంగరాదయా ! 130

చీకటిశాశ్వతంగాఉంటుంది.వెలుగు అప్పుడప్పుడూ వచ్చిపోతుంది.అది శాశ్వతం కాదు. చీకాకులు వేలకు వేలుగా ఉంటాయి. కమ్మనికాంతులు ఒకటో రెండో ఉంటాయి. లోకంలో జీవితం విలాసం కాదు.

ఉ. చీకటిలో జనించెదము; చీకటిలోననె వృద్ధియౌదు మీ
చీకటిలో మృతింగనుచు చీకటినే బడి పోవువారమై
చీకటియన్న భీతిలుచు చీకటి నన్నివిధాల తిట్టుచున్
చీకటి నిచ్చగింపక నశింతుము చీకటి మ్రింగివేయగా! 131

చీకటిలోపుడతాం.పెరుగుతాం.చనిపోతాం. చీకటియంటే భయపడి తిడతాం. కానీ చీకటిలోనే కలిసిపోతాం.

ఉ. చీకటివెల్గులన్నవి నశింపక శాశ్వతమై రహించు;పెం
జీకటి దాటగల్గునెడ చిత్తము వేయి వెలుంగులొంది యా
చీకటులన్నిజీల్చివరసిద్ధ విశిష్ట వినూత్న కాంతు లీ
లోకమునందు నిల్పి యతిలోక సుఖైక మహత్వ మిచ్చెడిన్. 132

చీకటివెలుగులు శాశ్వతము. అవి నశించేవికావు.పెద్దచీకటినిదాటగలిగితే వెయ్యివెలుగులను చూడగలం. అది అన్ని చీకట్లను చీల్చి శాశ్వతసుఖానిస్తుంది.

ఉ. చీకటిలోన వెల్గులను చిత్తవిశిష్టతచే నెఱింగి ల
క్ష్యైక విలోక సాధకమహత్వమునొంది పరార్థతత్వ వి
ద్యా కలితాత్ములై గగన హారమణీప్రకరంబులైన తా
రాకృతులందు గుప్తమగు హాయి గణించెదరెల్లమానవుల్ 133

చీకటిలోనే వెలుగును వెతుక్కోవాలి.అలా సాధనచేస్తే పరతత్వాన్ని తెలుసుకొని ఉన్నతిని పొందగలుగుతాము.

తే.గీ. రాత్రి చీకటిలోన తారకలు కాంతి
విలువ నెరిగించుచున్నట్లు వెలుగులిచ్చి
వస్తురూపాలజూపించు బంధువులయి
దేవగణమేమొయనిపించు భావమందు ! 134.

రాత్రుల్లో నక్షత్రాలు కాంతివిలువను తెలుపుతాయి. అందులోనే వస్తురూపాలను బంధువుల్లా చూపిస్తాయి.

: చంద్రోదయ వర్ణన :

ఉ. చల్లని చందమామ సరసాద్భుత భావనలుల్లసిల్లగా
మెల్లన తొంగిచూచి కుసుమించిన లేనగవుల్ ప్రపంచమం
దెల్లెడ పంచు జీవులకు నెంతయు తృప్తిని హేమకాంతులన్
జల్లెడపట్టె లోకములు చక్కిలిగింతలతేలియాడగన్ ! 135

రసవంతమైన భావనలు రేకెత్తిస్తూ చల్లని చందమామ మెల్లగా తొంగిచూశాడు. వికసించిన లేతనవ్వుల్ని లోకాలకు పంచాడు. తృప్తిగా బంగారుకాంతుల్ని జల్లెడపట్టి లోకాలు సంతోషించేట్టు అందించాడు.

ఉ. చుక్కలతేడు మక్కువను జొక్కుచు తారలపైన నిక్కుచున్
పెక్కురగూడియాడెడి నుపేంద్రునిగా సరసాలదేలుచున్
చిక్కుసుధాంశుపాత్ర రసోచితధారల నొంపుచుండగా
తక్కుచు తారలన్ గదిసి తారకనాధుడు తోచె మింటిపై ! 136

చంద్రుడు ప్రేమతో తారకలతో క్రీడిస్తూ, సరసాలలో తేలుస్తూ, అమృతధారల్ని వొంపుతుండగా తూలిపడిన నక్షత్రాలతో కలిసి ఆకాశంలో కనిపించాడు.

ఉ . తారకలన్ని గూడి సురతాపరిఖేలనమందు సోమునిన్
తారొకరీతి ముంచి యనుతాపము తీరక స్రుక్కజేయ నే
దారిని గానలేక తనదర్పముగోల్పడి మేలమాడుచున్

మారునిరూపుదాల్చి యాభిమానముతో నుదయించె చంద్రుడున్. 137.

నక్షత్రాలన్నీ చంద్రునితో సురతక్రీడలో తృప్తిని పొందలేక తలొకరకంగా అతణ్ణి గాయపరచగా కనుమరుగైన చంద్రుడు మరొక(మన్మధుని)రూపంలో సౌందర్యవంతంగా ఉదయించాడు.

చం. మదనుడు సుందరాంగుడని మానినులందరు చూడగోరుచున్
హృదయగవాక్షముల్ తెరచి యెందు గలండని చూచుచుండగా
నదను నెఱింగి చందురుడు నాకసమందుదయించె! నాతనిన్
మదనునిగా వరించిరట మానసమందున తారకాసతుల్ . 138

సుందరుడైన మన్మధుణ్ణి చూడాలని స్త్రీలంతా తమహృదయాల్లో వెతుకుతుంటే తెలుసుకున్న చంద్రుడు ఆకాశంలో కనిపించాడట. అతడే మన్మధుడు అనుకుని తారకలు తమ మనస్సుల్లో అతణ్ణి వరించాయట.

చం. కలువలరాయడంచు కవి గాయకులల్లిన పాటలాని క
న్నెలు కనుమూసుకొంచు నతనిన్ తలపోసెడు నంతలోనె వె
న్నెల తెరిపించె కన్నులను నిర్మలకాంతులు నింపి చంద్రుడా
నెలతల కోర్కె దీర్చి వరణీయునిగా గగనాన నిల్చుచున్. 139

కవులు చంద్రుణ్ణి కలువలరాయడు అనటాన్నివిని కళ్ళుమూసుకుని అతణ్ణి తలచుకునేంతలో వెన్నెలను ప్రసరించి చంద్రుడు వారి కోరికలను తీర్చి వరణీయునిగా ఆకాశాన నిలుస్తూ వారి కండ్లు తెరిపించాడు.

: స్వప్నవృత్తాంతం :

ఉ. బంగరు వెన్నెలన్ గదిసి వైభవమొందెడి యంబరమ్ము ప్రీ
తిం గనువిందు సేయునెడ తిన్నగ నిద్దురనున్న గుప్తు క
న్నుంగవ దోచె నొక్క కల నూతనమై యట పల్కె నీశుడే
ముంగిట నిల్చి యిట్లతని బుద్ధి సమస్తము జాగరించుచున్ 140

బంగారంవంటి వెన్నెలతోకలిసి ఆకర్షణీయంగా ఉన్న ఆకాశం కనువిందు చేయగా ధనగుప్తుడు చూస్తూ నిద్రలోకి జారుకున్నాడు. అప్పుడు వాడికి కలలో ఈశ్వరుడు కనిపించి బుద్ధిచెబుతూ ఈవిధంగా పలికాడు:

ఉ. ఈశ్వరసన్నిధానమని యింతయుజంకక కావరమ్మునన్
నశ్వరమైన వాంఛ గొని నాశము నొందదలంచితేమొ! నిన్
శాశ్వతమైన రీతి యమసన్నిధి నిల్పెద; కాని జాలితో
నీశ్వరి నిన్నుగావుమని యెంతయు జెప్ప దయన్ వహించితిన్. 141

ఓ ధనగుప్తుడా! ఇది ఈశ్వరుని సన్నిధి అనికూడా తలంచకుండా, ఎంతమాత్రం జంకకుండా అశాశ్వతమైన కామవాంఛకు లోబడి నాశనం కావాలనుకున్నావా! నిన్ను శాశ్వతంగా యమసదనంలోనే నిలపగలను. కానీ పరమేశ్వరి నిన్ను రక్షించమనికోరటం వలన నీపైన జాలి చూపిస్తున్నాను.

ఉ. పాపము పుణ్యమన్న సరిభావన సుంతయు లేదు నీకు ; సం
తాపము నొందబోవు కడుతప్పిదముల్ పొనరించియుండియున్
యేపరిహార భావనయు నింతకు పొందవు; రెచ్చిపోవుచున్
కోపము కల్గజేసెదవు కూళతనంబును మానవేమిరా! 142

ఇదిపాపం, ఇదిపుణ్యం అనే ఆలోచన నీకుఇంతైనాలేదు; ఇన్నిన్ని తప్పులుచేసినా కొంచెంకూడా పశ్చాత్తాపాన్ని పొందవు ; పైగా రెచ్చిపోతూ కోపాన్ని తెప్పిస్తావు. బుద్ధితక్కువతనాన్ని మానవు !

ఉ. నీయుసురింతదీయుటకు నిచ్చదలంపను; నాదు సన్నిధిన్
నీ యుసురార్పినన్ సురలు నిన్ను భజింతురు గాన నీకు పూ
ర్ణాయువు నిచ్చుచుంటిని కరమ్ములు కాళ్ళను రాక పంగువ
టై యమబాధలొందుము మహానుభవమ్ము యడంగునంతకున్. 143

నీప్రాణాలుతీయటం నాకుఇష్టంలేదు. నాసన్నిధిలో నీప్రాణంతీస్తే దేవతలు నిన్ను సేవిస్తారు; అందువల్ల నిన్ను చంపకుండా నీకు పూర్ణాయువునిస్తూ నీకాళ్ళూ చేతులూ పనిచేయకుండా చేస్తున్నాను. నీ యనుభవాలన్నీ అణగారేట్లుగా సమస్త యమబాధల్నీ అనుభవిస్తూ పడియుండు!

ఉ. పాపపుచింతనల్ గొనుచు పాపమొనర్చుచు పాపకృత్యముల్
సైపడొయీశ్వరుండని యసహ్యపు పల్కుల నాడినావు; నీ
పాపముపండి నాకడన భంగమునొందితివైన మానవే
పాపపు యోచనల్ ! చిరము పాపఫలంబున స్రుక్కుచుండుమా ! 144

ఎల్లవేళలా పాపపు ఆలోచనలతో, పాపకృత్యాలుచేస్తూ, ఈపాపాలను ఈశ్వరుడుసహించడా అంటూ అసహ్యంగా మాట్లాడావు. నీపాపంపండి నావద్ద దెబ్బతిన్నావు; అయినా పాపాలోచనలు మానవేం? అందుకనేచాలాకాలం వరకు నీపాపాలు అనుభవిస్తూ బాధపడుతూఉండు! అనిపరమేశ్వరుడు శాసించాడు.

ఉ. పాపమొనర్చి యింతయును పాపమొనర్పగలేదటంచు నే
పాపము లేనివానివలె వాదమొనర్చుట గొప్ప పాపమై
కోపముదెచ్చునాకు; ననుగూర్చి విధేయతనెంచలేక నీ
వే పురుషోత్తముండవని వెల్గిగపల్కిన శిక్షలుండెడిన్ ! 145

పాపంచేసి యేపాపం చేయలేదని వాదిస్తే అదిగొప్పపాపమై నాకు కోపం తెప్పిస్తుంది. నాపట్ల విధేయత లేకుండా నీవే మొనగాడవైనట్లు ప్రవర్తిస్తే దానికి తగిన శిక్షలుంటాయి .

ఉ. తెలియక పాపమేదయిన తిన్నగజేసితినేమొ దేవుడా
తెలివి రవంత లేదనుచు దీనత నాశరణంబు వేడినన్
మెలకువగల్గియుండుమని మేలు ఘటించెద! నట్లుగాక నా
వలన భయంబులేదనుచు పాపమొనర్చిన జాలిగొందునా ? 146

తెలియక యేదైనాపాపంచేసి, దేవుడా! తెలియకచేశానురా అనిదిగులుతో నన్నుశరణువేడితే సరి పో జాగ్రత్త గాఉండు అనిచెప్పి మేలు చేస్తాను గానీ అసలు నేనంటే ఏం భయంలేదంటూ పాపాలు చేసేస్తే నేను జాలి చూపుతానా?

ఉ. మానవజన్మనిచ్చి కడు మాన్యుడవై రహియింపుమన్న లో
కానికి కీడొనర్చి బలగర్వముచే చెలరేగిపోయినన్
నేను సహింతునే?సమయనిష్ఠగణించి యణంగజేయనో
దానవులెందరో భువిని దంభముజూపి నశించిపోయెరా! 147

జన్మలన్నిటిలోకీ గొప్పదైన మానవజన్మనిచ్చి సుఖపడరా అంటే బలగర్వంతో చెలరేగిపోయి లోకానికి కీడు చేస్తే నేను సహిస్తానా? సమయంచూసి అణిచివేస్తాను. అహంకారం చూపి ఎందరు రాక్షసులు నశించిపోలేదు

ఉ. భక్తిరవంతలేక మదభావననొందిన గాచుకొందునా
శక్తి నశించి నన్ బిలువ జాలిని బొంది బిరాన వత్తునా !
యుక్తులు పన్నువారల కుయుక్తులు నాకడ సాగనిత్తునా ?
ముక్తి తలంపులేని యతిమూర్ఖుల నే సహియించి బ్రోతునా! 148

కొంచెంకూడా భక్తిలేకుండా మదించినవాళ్ళని నేను కాపాడుతానా? పాపాలన్నీ చేసి శక్తి నశించినతరువాత నన్ను పిలిస్తే వస్తానా? కుయుక్తులు నావద్దసాగవు; ముక్తియోచనలేని మూర్ఖుల్ని నేను సహిస్తానా ?

ఉ. కలిమి లభించినంత కనుగానక దుష్కృతముల్ పొనర్తువే ?
బలమొకయింతగల్గిన దభాలునలోకుల గూల్చివైతువే ?
తెలివిరవంతయున్న పరిధిన్ గమనింపక రెచ్చిపోదువే ?
మెలకువలేక హెచ్చిన శమింతునె నన్నిట దాటిపోదువే ? 149

కాస్తంత సంపదలభించగానే కన్నుగానక మహాపాపాలు చేసేస్తావా? బలం ఉంటే లోకుల్ని కూల్చేస్తావా? కాస్తంత తెలివి ఉంటే రెచ్చిపోతావా? జాగ్రత్తలేకపోతే నానుంచి ఎలా తప్పించుకుంటావ్?

ఉ. చేసిన పాపకార్య ఫలసిద్ధి నశించెడు నంతకాలమున్
గాసిలి బొందుచుండుము; సుఖమ్ము లవమ్ము లభింపబోదు; నీ
చేసిన దుష్కృతమ్ములవి చేరి భజించును నిన్ను; భక్తి కై
లాసము చేరినన్ చెడు ఫలమ్ములు వీడవు గుర్తెరుంగుమా ! 150

చేసినపాపాలు తీరేవరకు అనుభవించు; నీకు సుఖంలభించదు; కైలాసానికి చేరినా నీ పాపాలు పోవు;

మ. మునునీ పుణ్యమొకింత యుండు కతనన్ పుత్తెంచినావిందు పా
వనదేవాలయమందు నీల్గితివి; నా వాల్లభ్యమున్ బొంద గో
రిన నాపల్కుల నౌదలన్ దలచి కూర్మిన్ నన్ను సేవించి చే
సిన పాపమ్ములనుండి తేరుకొన సంసిద్ధుండవై నిల్వుమా! 151

పూర్వపుణ్యఫలంచేతనే నువ్విప్పుడు నాముందు నిలువగలిగావు; నా రక్షణను పొందగోరితే నామాట విని నన్ను సేవించి నీ పాపాలు పోగొట్టుకో !

మ. అనియాదేశమునిచ్చి యాశ్వరుడు మాయంబైన వెన్ వెంటనే
కనువిప్పున్ జలధీశ్వరుండు యెదుటన్ గన్పట్టగా స్వప్నమై
కనులన్ దోచినదేమొ యంచు తలచెన్ కైలాసనాథుండు పా
వన సందేశము నిచ్చె నాకనుచు సంభావించె గుప్తుండటన్. 152

ఈ విధంగా ఈశ్వరుడు ఆదేశించి మాయమైన వెంటనే కళ్ళు తెరిచిఎదురుగా ఉన్నజలధీశ్వరుణ్ణి చూసి నా కలలో కనిపించి ఇలా ఆదేశించాడా అని ధనగుప్తుడు అనుకున్నాడు.

మ. జలధీశుండు కృపాసముద్రుడగుచున్ సందేశమీయంగ ను
జ్జ్వల భావాంబుధి గ్రుంకి గుప్తుడు "సమస్తంబీవెగా శంకరా
మలినాత్ముండను నన్నుగావుము శివా మన్నింపవే"యంచు చే
తులు జోడింపగ కేలురాక వగచెన్ దుఃఖాంబుధిన్ గ్రుంకుచున్ 153

జలధీశ్వరస్వామి ఆదేశాన్నివిని ధనగుప్తుడు భావావేశాన్నిపొంది "సమస్తమూ నీవేకదాశివా! నన్ను మన్నించు నేను మలినాత్ముడను"అంటూ చేతులు జోడింపబోగా చేతులు కదలక దుఖించాడు.

శా. అంతన్ భానుడు దిఙ్ముఖంబున సువర్ణాకాశవీధిన్ కళా
కాంతుల్ విస్తరిలంగ లోకములు భాగ్యంబొంది దీపింప ని
శ్చింతన్ జాగృతినొంది జీవులిల భాసిల్లన్ ప్రభారాశియై
ధ్వాంతోత్సాహమునెల్ల బాపుచు దినాధ్యక్షుండుగా వెల్గెడిన్ 154

అంతలో సూర్యోదయమవుతోంది. చీకటులన్నీ తొలగిపోతున్నాయి. జీవులు చైతన్యవంతులవుతున్నారు.

మ. రవికాంతుల్ ప్రసరించినంత దివిజుల్ బ్రహ్మణ్యులున్ పండితుల్
శివసేవారతిబూని భక్తిమెయి విశ్వేశున్ సమర్చించున్
కవికంఠమ్ముల సుప్రభాత లహరుల్ గారాముగాసాగె శ
బ్ద విశేషంబుల్ సరసమ్ములైగురియ నాదబ్రహ్మరాగమ్మునన్ 155

తెల్లవారుతోంది. దేవతలు, పండితులు, బ్రాహ్మణులు సుప్రభాతసేవలకోసం స్వామికి సన్నిధికి వచ్చారు.

: శ్రీ జలధీశ్వర సుప్రభాతమ్:

అనుష్టుప్: **శ్లో. ఓంనమో జలధీశాఖ్య – పూర్వాసంధ్యా ప్రవర్తతే**
ఉత్తిష్ఠ భగవన్ శర్వ లోకానాం మంగళం కురు 156

అనుష్టుప్: **శ్లో. ఉత్తిష్ఠోత్తిష్ఠసర్వేశ –ఉత్తిష్ఠవృషభధ్వజ**
ఉత్తిష్ఠగిరిజాకాంత – సర్వేషాం శోభనం కురు 157

వసంతతిలకం: **మా భాగ్యదేవతవు మన్ననజేయుతల్లీ**
సౌభద్ర భవ్య విలసద్భవ సన్నుతాంగీ
ప్రాభాతమయ్యె సురవందిత భర్గురాణీ
శోభాత్మికా భువనసుందరి సుప్రభాతమ్ 158

(త,భ,జ,జ,గ,గ, గణాలు;8 వ అక్షరం యతి)

మంజుభాషిణి : ఇహ సుప్రభాతమిదె హేమమాలినీ
సహనమ్ము నూనుమిట సర్వమంగళా
మహనీయమూర్తి జయమంగళంబులౌ
మహినేలుమమ్మ భువి మాన్యదేవతా! 159
(స,జ,స, జ, గ –గణాలు; యతి 9 అక్షరం)

వసంత తిలకం : భానుండు తూర్పున ప్రభల్ నిగిడించె నీశా
నీనామమంత్రమును నెమ్మదిలో సురాదుల్
ధ్యానించుచుండిరి మహాశివ రుద్రమూర్తీ
హేనీరధీశ జలధీశ్వర సుప్రభాతమ్ 160

వసంత తిలకం: లేలేత వెల్గులు ఫలించుచునుండె ధాత్రిన్
కాలస్వరూప త్రిజగంబులనేలు మింకన్
నీలీలలియ్యెడ గణింప నమోఘమీశా
హేలింగమూర్తిజలధీశ్వర సుప్రభాతమ్ 161

వసంత తిలకం : నీ సేవలిచ్చుటకు నీరజసంభవాదుల్
నీ సన్నిధిన్ నిలువ నిష్ఠ హరీంద్రులెల్లన్
భాసించుచుండి రిట పన్నగఖేచరాదుల్
హేసాంబమూర్తి జలధీశ్వర సుప్రభాతమ్ 162

వసంత తిలకం : దేవాదిదేవ రవితేజము హెచ్చుచుండెన్
సేవాది కృత్యములు జేయగ వేళయయ్యెన్
మావంకజూడుమ యుమాధవ తెల్లవారెన్
హేవామదేవ జలధీశ్వర సుప్రభాతమ్ 163

వసంత తిలకం : ఈశామహేశకరుణించర కృత్తివాసా
ఆశల్ వెలింగె దరహాసప్రభాసలీలన్
ధీశాలివీవె పరితృప్తి నొసంగుదేవా
హేశూలపాణి జలధీశ్వర సుప్రభాతమ్ 164

వసంత తిలకం : దీపించుచున్న రవిదీప్తులు మించుచుండెన్
నీపాటలన్ కొసరి నిక్కె శుకాదులెల్లన్
నీపైనదృష్టినిడి నిల్చె సమస్త జీవుల్
హేపంచవక్త్ర జలధీశ్వర సుప్రభాతమ్ 165

వసంతతిలకం : లోకమ్ములున్ నిను విలోకనసేయుచుండెన్
మా కర్మదీర్చి మము గాచు మహానుభావా

మాకున్ పరార్ధమిడి మమ్ముల గావుమయ్యా
హేకామితార్ధ జలధీశ్వర సుప్రభాతమ్ 166

వసంత తిలకం : నీసన్నిధానమున నిల్చితిమో మహేశా
మాసేవలంది పరమాత్మ విముక్తినీరా
గాసిన్ విదల్చి శుభగమ్ముగ గావుమీశా
హేసత్వశీలి జలధీశ్వర సుప్రభాతమ్ 167

వసంత తిలకం : మాతండ్రివైన పరమాత్మవునీవు దేవా
మాతల్లిబాల జగమంతయు నిండియుండెన్
మాతోడునీడ బలమౌదువు నీవెమాకున్
హే తారకేశ జలధీశ్వర సుప్రభాతమ్ 168

వసంత తిలకం : హేశాంతికారక మహేశ్వర మేలుకోరా
నీశోభలన్ మది గణింపగనిమ్ము దేవా
దేశమ్ము మేలు గణుతింపు ముమామహేశా
హే శోభనాంగ జలధీశ్వర సుప్రభాతమ్ 169

వసంత తిలకం : నీపుణ్యమూర్తి గననిమ్ము మహానుభావా
తాపమ్ముదీర్చి భవదంఘ్రిని గొల్వనీరా
నీపాదసేవలిడు నేర్పునొసంగుమోయీ
హేపార్వతీశ జలధీశ్వర సుప్రభాతమ్ 170

వసంత తిలకం : ధూపమ్ము నీకిదియె దుర్గ శివాత్మరూపా
దీపప్రదర్శనమిదే గ్రహియింపుమార్యా
ఆపై నివేదనమునందుకొనుండు దేవా
హేపార్వతీశ జలధీశ్వర సుప్రభాతమ్ 171

వసంత తిలకం : శ్రీపద్మనాభుడు విరించి సురేంద్రముఖ్యుల్
మీపాదపూజలకు మేల్కొని వచ్చినారే
ఆపన్నులందరు మహాశివ వేచినారే
హేపార్వతీశ జలధీశ్వర సుప్రభాతమ్ 172

వసంత తిలకం : మాపాలిదేవుడవు మమ్ము భరింపరావా
మా పాపసంహతిని మాపుము దేవదేవా
నీపాద మానితిమి నిండు బలమ్మునీరా
హేపార్వతీశ జలధీశ్వర సుప్రభాతమ్ 173

వసంత తిలకం : తాపాగ్నితట్టుకొను ధైర్యము లేదు దేవా

శాపాలు చుట్టుకొన శక్తినశించె నీశా
కోపమ్ము చూపకదిగుల్ తొలగించవయ్యా
హేపార్వతీశ జలధీశ్వర సుప్రభాతమ్ 174

వసంత తిలకం : ఆపన్నజీవులకు నాశ్రయమిచ్చుదేవా
మాపట్ల జాలిగొని మాదరి జేర రారా
మాపాట్లు జూడర యుమాధవ బ్రోవుమింకన్
హేపార్వతీశ జలధీశ్వర సుప్రభాతమ్ 175

వసంత తిలకం : దీపించు ధర్మగుణ దీప్తివి నీవుకాదా
మా పాపకృత్యముల మాన్పు మనంగవైరీ
మాపైన జాలిగొని మమ్ముల నేలుమయ్యా
హేపార్వతీశ జలధీశ్వర సుప్రభాతమ్ 176

వసంత తిలకం : నీపైన లక్ష్యమును నిల్పిభజించు వారిన్
కాపాడవయ్య శితికంఠ యుమామహేశా
నీ పాదపూజకిట నిల్చితిమయ్య దేవా
హేపార్వతీశ జలధీశ్వర సుప్రభాతమ్ 177

వసంత తిలకం : శ్రీపద్మనాభ సురశేఖర దివ్యమూర్తుల్
గోపాలకాది జనగోష్ఠియు జేరినారే
దీపించు భాస్కరుని దృష్టిని తెల్లవారెన్
హేపార్వతీశ జలధీశ్వర సుప్రభాతమ్ 178

శ్రీ జలధీశ్వర స్తోత్రం :

తోటకం : జలధీశ్వర నీ సహచారిణియౌ
లలితాంగి యుమాసతి లక్షణయై
యలరారుచునున్నది యంబికగా
కొలువై భవపీఠిక కూడియిటన్ 179

(4 సగణములు; 9 వ అక్షరం యతి)

తోటకం : సకలోర్విని గాచెడి సత్వమతీ
అకళంకమనస్కృత నర్చనలన్
ప్రకటించెద శంకర పాహిహరా
ముకుళింతు కరమ్ములు మోదమునన్ ! 180

తోటకం : నినునమ్మి భజించెడి నీమమదే
యనునిత్యముగాచు మహోయుధమౌ

	కనరా పరమేశ్వర కష్ట హరా	
	వినుతింతు నినున్ మది వేడుకగా!	181
తోటకం :	అరుణోదయమయ్యె మహాశివుడా	
	విరులన్నియు నీకయి విచ్చెనురా	
	సురలెల్లరు వచ్చిరి జోతలిడన్	
	పరిపాలన జేయర భద్రముగా	182
తోటకం :	సురగంగ వహించె యశోమతియై	
	వరవైదికమంత్ర శివార్చనలున్	
	స్వరయుక్తములై కొనసాగె నిటన్	
	కరుణించి దయన్ మముగాంచుమయా	183
తోటకం :	నిను గొల్వగ బాలయు నెచ్చెలియై	
	మును ముందుగమేల్కొనె మోదమునన్	
	కనువిప్పర! శంకర! కాలమయా!	
	వినుతించుచు నుంటిమి వేదమయా!	184
తోటకం :	భువనమ్ముల నేలెడి మూర్తివిగా	
	రవళించెడి యోంకృత రాశివయా	
	భవసంచిత దోషము బాపుమిలన్	
	నివసింపుము నా హృదినిండ శివా!	185
తోటకం :	సువిశాలమహోదధి జొచ్చు నెడన్	
	శివదేవ! వణిక్ తతి చింతిలుచున్	
	భవదీయులమేమని పాహి యనున్	
	జలధీశ్వర నిన్ గని సంతసిలున్	186
తోటకం :	నిను నమ్మిన వారిని నిక్కముగా	
	కనిపెట్టి భరించెడి కాపరివే	
	ననుగావుము శంకర నమ్మితిరా	
	వినయమ్మున గొల్చుచు వేడెదరా	187
భుజంగప్రయాతము :	ననున్ దూరవాసిన్ గనన్ రమ్ముదేవా	
	మనఃపూర్తిగా నిన్ సమర్చింపనీరా	
	ఘనమ్మైన నీ పాదుకల్ తృప్తిదీరన్	
	గనన్ జేయుమీశా సుఖంబౌ మహేశా	188

అనుష్టుప్: అజ్ఞానినైన నా పాపం బెన్నకో పరమేశ్వరా
క్షమస్వత్వమ్ క్షమస్వత్వమ్ ఘంటసాలపుర ప్రభో 189

:శ్రీ జలధీశ్వర ప్రపత్తి:

శా. శ్రీకళ్యాణగుణప్రపూర్ణ !తెలవారెన్ చిద్విలాసా!హరా!
నీకైవచ్చిరి దేవతల్ పురహరా నీలాంగ మేల్కొవయా !
లోకాలోకన సేయబూనుకొనుమా!లోలాక్షి బాలాసతీ!
మా కైమోడ్పుల నందవే జనని!సంభావింతు నిన్ భార్గవీ! 190

వసంతతిలకం: కారుణ్యరూప శివ గౌరి మనోనువర్తీ
ధారాభిషేక రసతత్పర భవ్యమూర్తీ
శౌరీప్రధాన సురసన్నుత సాంద్రకీర్తీ
నారాయణీశ నిను నమ్మితి గావుమయ్యా! 191

వసంతతిలకం: ధారాళశబ్దమణిదర్పగుణప్రసారా
హేరాళభాగ్యచయ హేమ మహత్వపూర్ణా
నీరాది భూతతతి నీవృత చక్రవర్తీ
నారాయణీశ నిను నమ్మితి గావుమయ్యా! 192

వసంతతిలకం: మారాంతకా త్రిపురమారక మౌనమూర్తీ
ధీరాధిధీర గుణదివ్యవరప్రదాతా
వారాసిపాలక భవాంబుధి తారకేశా
నారాయణీశ నిను నమ్మితి గావుమయ్యా! 193

వసంతతిలకం: ధారాళమైన కృప ధన్యత గూర్చుగానన్
తోరంపుభక్తిగొని దోయిలియొగ్గి నిన్నున్
గారాముతోడ మది గాంచి నుతింతునయ్యా
నారాయణీశ నిను నమ్మితి గావుమయ్యా! 194

వసంతతిలకం: రారా మహేశ్వర విరాగిని చేదుకోరా
నీరూపుగాంచి మది నిన్ భజియించుచుంటిన్
ప్రారబ్ధమొంచి నను రక్షణ జేయరారా
నారాయణీశ నిను నమ్మితి గావుమయ్యా! 195

వసంతతిలకం: వారాహిసేవిత శుభాస్పద ప్రేమమూర్తీ
కారుణ్యరూపిత శరణ్య సుభిక్షవర్తీ
దూరీకృతాఘ పరిదోష నివర్తశక్తీ
నారాయణీశ నిను నమ్మితి గావుమయ్యా! 196

వసంతతిలకం: తారావిభున్ శిఖనుదాల్చు మహానుభావా

హారమ్ముబోలు సుమహత్తర హాసలీలన్
గౌరాజ్ఞమూనిన ముఖాబ్జవరాంగ్రశేష్ఠా
నారాయణీశ నిను నమ్మితి గావుమయ్యా! 197

వసంతతిలకం : చిత్తైకసాధనముచే వరమిచ్చు దేవా
మత్తున్ విదల్చు గుణమండిత భాగ్యశాలీ
నృత్తాభిషేచనమణీ నటరాజమౌళీ
నారాయణీశ నిను నమ్మితి గావుమయ్యా! 198

వసంతతిలకం : పారమ్యభక్తిసుధ బంధవిముక్తకారీ
సౌరభ్యసౌరభ రసాంచిత సౌమ్యశీలీ
హారాద్యలంకృత విహాయసమూర్తి శూలీ
నారాయణీశ నిను నమ్మితి గావుమయ్యా! 199

వసంతతిలకం : సారప్రపంచ పరిషత్ ప్రణవస్వరూపా
తారాధికారి యవధారణ మంత్రహారీ
ధారాంబురాశి పరితర్పణ యోగమూర్తీ
నారాయణీశ నిను నమ్మితి గావుమయ్యా! 200

వసంతతిలకం : శ్రీరమ్య భావగుణసృష్టి వరప్రమేయా
వారీశ భక్తగణ భాగ్య విశిష్ఠ రూపా
భారమ్ము మోయగల బంధువు నీవుకావా
నారాయణీశ నిను నమ్మితి గావుమయ్యా! 201

శ్రీ జలధీశ్వర మంగళావాహనం

అనుష్టుప్ : బాలనామాంకిత ధ్యానం – సర్వకామఫలప్రదమ్
ఘంటసాలేశ్వరం వందే – జలధీశాయ మంగళం – 202

అనుష్టుప్ : బహుసంతాన దాతారం – కామితార్థప్రదాయకం
సర్వవాంఛాప్రదం వందే – జలధీశాయ మంగళం – 203

అనుష్టుప్ : మహాపాపవినాశాయ – ప్రపుణ్య వరదాయచ
సర్వాభీష్ట ప్రదాత్రేచ – జలధీశాయ మంగళం – 204

అనుష్టుప్ : బ్రహ్మవిష్ణుమహేంద్రాది – పూజితాయ మహౌజసే
శక్తిభక్తి ప్రదాత్రేచ – జలధీశాయ మంగళం – 205

అనుష్టుప్ : సర్వభూత గణాధీశం – సర్వగ్రహ విధాయకం
సర్వశక్తిప్రదాతారం – జలధీశాయ మంగళం – 206

అనుష్టుప్ : బాలామంత్రాధిదేవాయ – పంచభూత విహారిణే

పంచాక్షరీ ప్రసన్నాయ – జలధీశాయ మంగళం – 207

అనుష్టుప్: ఆదిమధ్యాంతరహితమ్– సర్వదేవ నమస్కృతం
అవ్యయం సర్వదం వందే – జలధీశాయ మంగళం – 208

అనుష్టుప్: మహాదోషహరమ్ దేవం – మహామంత్రవిరాజితమ్
పార్వతీవల్లభం వందే – జలధీశాయ మంగళం – 209

అనుష్టుప్: సర్వప్రకృతిరూపాయ – సర్వదేవ స్వరూపిణే
సర్వసంకల్పసిద్ధాయ – జలధీశాయ మంగళం – 210

అనుష్టుప్: గంగాధరాయ శర్వాయ – నాగభూషణ ధారిణే
త్రిణేత్రాయ మహేశాయ – జలధీశాయ మంగళం – 211

అనుష్టుప్: భువనేశీ సమాసీనం – అష్టమూర్తిధరం శివం
ఏకాదశాకృతిం వందే – జలధీశాయ మంగళం – 212

అనుష్టుప్: మంగళావాహనమిదం – పూర్వపుణ్య సమీకృతం
సర్వైశ్చ పూర్వమంత్రైశ్చ – సత్కృతాయాస్తు మంగళం – 213

చం. అని సకలోర్వి యీశ్వరుని యర్చనజేయుచు సుప్రభాత మిం
పొనరగ పాడుచుండ తమపుణ్యఫలంబును గోరు భక్తులున్
మనసుల నిల్పెనీశ్వర సమాగమమందున ;కాంతిపుంజముల్
సునిశితమై దిశాంతములు శోభిల బర్వెమహత్వపూర్ణమై ! 214

ఆ విధంగా భూమండలమంతా సుప్రభాతసేవలతో యీశ్వరుణ్ణి అర్చిస్తూండగా ఉదయభానుని కిరణాలు దిశాంతములకు వ్యాపించాయి.

ఉ. హేజలధీశ్వరా!శివ!మహేశ్వర!యంచు శివాలయంబునన్
పూజలొనర్చుచున్ శివునమోఘ మహత్వమునుగ్గడించి యు
త్తేజము నొందుచున్ గొలిచె తృప్తిగభక్తులు; లోకమందు తే
జో జయశీలి భాస్కరుడు శోభలెసంగుచు దీప్తినింపగన్ ! 215

శ్రీజలధీశ్వరస్వామి ఆలయంలో భక్తులు తృప్తిగా శివపూజలొనర్చి, ఆయన మహిమలను వర్ణిస్తూ భక్తిపర వశు లవుతుంటే లోకంలో సూర్యభగవానుడు కాంతికిరణాలను ప్రసరిస్తూ పైపైకి వస్తున్నాడు.

చం. కలుషమడంచివేయు కఱకంఠుని ఫాలవిలోచనాగ్ని కీ
లలవలె పాపపంకిల బలమ్ము నడంచగ తీక్ష్ణ దృక్కులన్
నిలిపి దహించునట్లు నవనీతలమెల్ల తపింపజేయుచున్
వెలిగె నహస్కరుండు నుడువీధిని వేడిమి నుగ్గడించుచున్. 216

పాపాలనుఅణచివేసే పరమేశ్వరుని మూడవకంటిమంట వలె పాపపంకిలాన్ని అణచివేసేవిధంగా తీక్ష్ణమైన కిరణాలతో భూమండలాని దహింపజేస్తూ సూర్యభగవానుడు ఆకాశంలో వెలుగసాగాడు.

మ. ఇట దేవాలయమందు నీశునికడన్ హీనాతిహీనమ్ముగా
గుటకల్ మ్రింగుచునున్నగుప్తుని మహాక్షోభన్ సమీపించె సం
కట దాహార్తులు; వానిజూచిన జనుల్ కర్మంబవశ్యంబె యె
ప్పటికైనన్ భుజియింప దప్పదనియొప్పంజెప్పె చారిత్రమున్ 217

దేవాలయంలో చావుబ్రతుకులమధ్య గుటకలుమింగుతున్న ధనగుప్తుణ్ణి అనేకబాధలు, ఆకలిదప్పులు వరించాయి. అతణ్ణి చూసిన జనులు కర్మయెప్పటికైనా అనుభవించక తప్పదని చరిత్రను గుర్తుచేయ సాగారు.

ఉ. కన్నులచీకటుల్ గదిసె; కంఠమడంగెను దప్పినొంది; లో
నున్న మహాక్షుధావ్యథ మనోవికలత్వము గూర్చె; నాడులున్
తిన్నగ చేడ్పడెన్; నుసురుదీసిన నింతకుమించి సౌఖ్య సం
పన్నత గల్గియుండునను భావనలాతనిలో గలంచెడిన్ 218

అతనికళ్ళు చీకట్లుకమ్మాయి. దాహంతో నోరార్చుకుపోయింది. ఆకలిబాధ మనస్సును క్షోభింపజేసింది. నాడులు నీరసించిపోయాయి. ఇంతకంటే ప్రాణాలు తీసిఉంటే బాగుండేదని ఆతడు బాధపడసాగాడు.

మత్తకోకిల: రాజభోగములొందినప్పుడు అవ్వజేసినయప్పుడున్
యోజయింతయు కల్గలేదు కదోయి! కర్మఫలంబిటన్
భాజనంబగునంచుదోచదు; భావికాలమునందు నీ
పూజకున్ ఫలముండునన్న సుబుద్ధి యేలలభింపదో! 219

రాజభోగాలు అనుభవించినప్పుడు, ఇష్టంవచ్చినట్లు చెలరేగిపోయినప్పుడు ఈపాటి ఆలోచనకలగలేదేమో! కర్మఫలం అనుభవించాల్సి ఉంటుందని తెలియలేదేమో! చేసినపూజకు ఫలం ఉంటుందని తోచలేదేమో !

తే. చావుబ్రతుకులమధ్యలో సాగుకన్న
చచ్చిపోవుట మే లటు చావకుండ
బ్రతుకగల్గిన మేలుగా బ్రతుకవలయు
రెంటిమధ్యన నలుగ దరిద్రమగును ! 220

చావుబ్రతుకులమధ్య సాగటంకంటే చావటం మేలు. ఆరెంటి మధ్యనా నలగటం పెద్ద దరిద్రం అవుతుంది.

శా. జీవన్మృత్యువులందు బోరుచు దశాశేషంబులింకంగ సం
జీవిన్ బోలు నుమామహేశ్వరునిపై చిత్తమ్ము లక్షించుచున్
"కావంగా దయలేదె ఈశ్వర ననున్ కాపాడరా"యంచు శో

కావేశంబుననేడ్చు గుప్తునిగనెన్ కారుణ్యతన్ భర్గుడున్ 221

చావుబ్రతుకులతో పోరాడుతూ జీవితదశలు ముగిసిపోతుండగా మళ్ళీ జీవితాన్ని ప్రసాదించే సంజీవనివంటి ఉమామహేశ్వరుణ్ణి తలచుకుంటూ కాపాడుమని గొంతెత్తి ఏడుస్తూండగా శివుడు జాలితో గమనించాడు.

శా. ఆలోజంగమదేవుడొక్కడట వాహ్యాళిన్ సమీపించి దీ
నాలాపంబుల నేడ్చు గుప్తునకు నత్యంతానురాగమ్మునన్
మేలౌ తారకమంత్రమిచ్చి యికపై మేలొందుమా యంచు కెం
గేలన్ శీర్షముదాకి యేగె సుఖనిక్షేపమ్ము రూపించుచున్ 222

అంతలోఒకజంగమదేవు డటుగావచ్చి దీనంగా ఏడుస్తున్న ధనగుప్తుణ్ణి ఓదార్చి తారకమంత్రోపదేశం చేసి వెళ్ళాడు

శా. శ్రీబాలాజలధీశ్వరుండు కరుణాసింధుండు; పాహీయనం
గా బాధోపశమంబుగూర్చి జనులన్ గాపాడు చిన్మూర్తి; నీ
వే బంధుండవటంచు మ్రొక్కిన దయన్ వీక్షించి రక్షించువా
డై బాంధవ్యముగూర్చి దీవెనలతో నాశీర్వదించున్ సదా! 223

శ్రీబాలాజలధీశ్వరస్వామి దయగలవాడు; ఎవరైనా సరే పాహీ అనగానే బాధలనుతీర్చి కాపాడగలడు; నీవే బంధుడవు అని భావిస్తే రక్షిస్తాడు; దర్పం చూపక దీవిస్తాడు.

శా. ఈదృశ్యమ్మునుజూచి భక్తతతి హర్షించెన్; జగన్నాథుడే
యీదీనున్ దయజూడవచ్చెనని వానింజేరి యన్నోదకా
లౌదార్యమ్మున వానికిచ్చి శివసాహాయ్యమ్ము కీర్తించె నిం
కౌదార్యమ్మునకేమి తక్కువగునయ్యా దేవుడే మెచ్చినన్ 224

ఈదృశ్యాన్నిచూసి దేవుడే వీనిని కాపాడవచ్చాడని భక్తులంతా గమనించి అతనివద్దకువెళ్ళి అన్నపానీయాలు ఇచ్చి ఇంటికిపంపారు.

ఉ. ఇంటికిజేరినన్ మనసు నీశునిపైననె నిల్పి యాతడే
కుంటితనమ్ముబాపి తనకున్ జవసత్త్వములిచ్చెనంచు న
న్నింటను నీశ్వరున్ గనుచు నెంతయుదక్షతతో జపింప ము
క్కంటియు వానిబాధ లుడుగన్ దయజూపెను వైద్యురూపునన్ 225

ఇంటికివెళ్ళినా ధనగుప్తుడు తనచిత్తాన్ని ఈశ్వరునిపైనే లగ్నంచేసి ధ్యానించాడు.ఈశ్వరుడు సంతోషించి ఒక వైద్యుని రూపంలోవచ్చి వానిబాధలన్నిటినీ పోగొట్టాడు.

ఉ. కొన్నిదినాలలోనతడు కోలుకొనెన్; నడువంగసాగె; నా
పన్నుడు యీశ్వరుండనుచు భక్తివిధేయతలొంది యాలయం

బున్నతిజెందునట్లు తన మూలధనంబును వ్రాసియిచ్చి "నా
కున్నది యింకనీవె"యని యుత్తమబుద్ధిని పొందెనాతడున్ 226

కొద్దిరోజుల్లో అతడు కోలుకున్నాడు; నడువసాగాడు; ఈశ్వరుడు ఆపదలను పోగొట్టగలవాడని నమ్మి తన ఆస్తి నంతటినీ గుడికి రాసిచ్చాడు; ఉత్తమమైన బుద్ధిని పొందాడు.

మానిని: "దీనులకున్ పరితృప్తి నొసంగెడి దేవుడనన్ శివదేవుడగున్
హీనునిగూడ సుఖింపగ జేయు మహేశ్వరు డాజలధీశ్వరుడే
వాని దలంపనివాడు జగంబున వర్ధిలబోడు శుభంబొదవన్
దీనుడనైన మదీయ చరిత్ర విధేయత గూర్చు నుదీర్ణులకున్ 227

దేవతల్లో దీనదయాళుడు పరమేశ్వరుడే. హీనజనుణ్ణికూడా గొప్పవాణ్ణిగా అతడు చేయగలడు. అటువంటి ఈశ్వరుణ్ణిమనస్సులోతలవనివాళ్ళువృద్ధిచెందలేరు. ఇందుకు నాకథయే నిదర్శనం అని ధనగుప్తుడు చెప్పాడు.

మానిని : చేసినపాపవిచేష్టల ద్రుంచెడి చిన్మయరూపుడు శ్రీశివుడే
గాసిలువారల కష్టమడంచు ప్రగాఢ దయాబ్ధి దిగంబరుడే
హాసవిలాసవిహారవినోదము లాతని నాటకహారములే
భాసిలుశక్తి ప్రభాన్వితుడాతడు బాలవిభుండు శుభప్రదుడే ! 228

మనం చేసినపాపాలన్నిటినీ బాపేవాడు ఆ పరమాత్ముడే. కష్టాల్లో ఉన్నవాళ్ళ బాధల్ని తీర్చేదీ ఆతడే.

మానిని : కర్మఫలంబులు ఖండితమై జనగా జలధీశుడు కర్తయగున్
ధర్మగుణంబున తద్దయు గొల్చిన దవ్వొనరించును దైన్యతలన్
మర్మమెరింగి"యుమాపతి! పాలయమాం! హర"యన్న సమర్పణతో
నర్మిలిమ్రొక్కిన నాదరమొప్పగ నాతడుగాచు మహాదయతో ! 229

మనపాపకర్మలను పోగొట్టగలవాడు ఈశ్వరుడే. మనం ధర్మగుణాన్ని కలిగిఉంటే ఆతడు మనకష్టాల్ని పోగొడతాడు. ఆయన్ను శరణువేడితే మనల్ని ఒడ్డెక్కిస్తాడు.

చం. అని జలధీశు నాతడు మహానుభవమ్మున గొల్చి యంతమం
దున శివలోకమున్ బడసె తొల్లిటిపాపమడంచుకొంచు; నీ
శుని కృపనొందువారలు విశుద్ధిని బొందుట సత్యమౌను; దే
వుని మదినమ్మి గొల్చిన శుభోదయమౌను జనాళికెయ్యెడన్ 230

ఆవిధంగా ధనగుప్తుడు జలధీశ్వరుణ్ణి సేవించి శివలోకాన్ని పొందాడు. దేవుని నమ్మినవారికి శుభమే అవుతుంది

భుజంగప్రయాతం : మహాదేవదేవా! సమస్తావనీశా!
అహిర్బుధ్న్యరూపా!వృషాంకా!గిరీశా !
మహేశా!త్రినేత్రా!ఉమాధీశ!భర్గా!
సహాయంబునీరా!అసామాన్యతేజా! 231

ఓమహాదేవా! మాకు సహాయం చేయవయ్యా!

స్రగ్విణీవృత్తం : వామదేవా!శివా!ఫాలనేత్రా!భవా!
సామవేదప్రియా!సన్నుతింతున్ సదా!
నామొరాలింపరా!నన్నురక్షించరా!
ప్రేమతోలోక సంప్రీతి గావించరా ! 232

(4 రగణములు; 7 వ అక్షరం యతి)

ఓ పరమేశ్వరా! నామొరాలించరా ! ప్రేమతోలోకాలను కాపాడరా!

వనమయూరం : ఆపదలు పోనడచు నాత్మభవు డీశుం
డీ పుడమి జీవులకు నీతడొకడేయౌ
నేపుగొని వీని శరణింపొదవ నొందన్
పాపపరిహారమగు! భద్రమగు నుర్విన్ ! 233
(భ,జ,స,న,గ,గ,గణాలు; 9 వ అక్షరం యతి)

ఆపదలను పోగొట్టగలవాడు పరమేశ్వరొక్కడే. అతణ్ణి శరణువేడితే మనకు మేలవుతుంది.

మహాస్రగ్ధర: జగమున్ పాలించువాడై సకలజన మనస్సాంద్ర సంకల్పరీతుల్
జగదామోదంబుకాగా సమరసవిధి విశ్వాంతరాళంబునందున్
ప్రగతిన్ బొందంగ నాశీర్వచనములనిడున్ భర్గుడీ ఘంటసాలా
నగరిన్ బాలాసతీ మాన్యవిలసదభిమానంబు విస్తారమౌటన్ 234

(స,త,త,న,స,ర,ర,గ, గణాలు;1-9-16 యతి స్థానాలు)

బాలాదేవితోడుగాజలధీశ్వరస్వామిలోకాలన్నిటినీపాలిస్తూజనామోదాన్ని పొందుతూ, ఆశీస్సుల నిస్తున్నాడు.

మంగళమహాశ్రీ : శ్రీజలధినాయకుడు సేవలొనరించు జన చిత్తములదోచి కరుణించున్
తేజమొనగూర్చి గుణధీధితులనిచ్చి ఘనతృప్తి సమకూర్చి వరమిచ్చున్
రాజితమహోన్నత సరాగయుతమై యలరు రాజపదమిచ్చి మురిపించున్
భూజనులునీశుగొలువుండుతమకోరికలు పుణ్యఫలవంతమయి తీరన్. 235

(భ,జ,స,న,భ,జ,స,న,గ,గ, గణాలు;1-9-17-యతిస్థానాలు) .

ఇదికృష్ణాతీరవాసి–వేదవేదాంగవిపులపురాణేతిహాస–సంస్కృతకావ్యవ్యాఖ్యానమహోదధీ–కవిశిఖామణి–వైదికధర్మకర్మచింతామణి–ఘంటసాలపురశిరోమణి–శ్రీమచ్చింతలపాటిలక్ష్మీనృసింహశాస్త్రివర్యుల

కుమారుడు–కావ్యవిమర్శనామర్మజ్ఞ– సహజ కవితాకళాభిజ్ఞ –కావ్యకళాప్రపూర్ణ మోహనమురళీకృష్ణశర్మచే వ్రాయబడిన "సిరిదివ్వెలు" కావ్య ప్రథమాశ్వాసము – సంపూర్ణము.

సిరిదివ్వెలు

ద్వితీయాశ్వాసము

శా . శ్రీమంతుం డుధధీశ్వరుండు సతియౌ శ్రీబాల; భూమి ప్రజా
క్షేమంబారయుతల్లిదండ్రులగుటన్ చిత్తమ్ములోనిల్పి వి
ద్యా మందారమరందధారల సుధాతాత్పర్యమేపార భా
షా మాధుర్యకథావి నపథవిస్తారమ్ముచే గొల్చెదన్! 1

శ్రీబాలాజలధీశ్వరులు ఉభయులు గొప్పశ్రీమంతులు. ప్రజలక్షేమాన్ని కనిపెట్టి కాపాడే జగన్మాతా పితరులు.

ఉ. శ్రీజలధీశ్వరున్ గొలువజేరినభక్తులు దేవళమ్ములో
పూజలొనర్చుచున్ మరియు బుద్ధికితోచినరీతి భక్తి ను
త్తేజితులై నుతించిరి విధేయతతో తమకెల్ల దిక్కు బా
లా జలధీశ్వరుండె యని లక్ష్యముతోడ నయ ప్రపత్తులన్ ! 2

శ్రీజలధీశ్వరస్వామినిసేవించటానికిగుడిలోచేరినభక్తులుస్వామిని పూజిస్తూ రకరకాలుగా స్తుతించసాగారు.

శా. సర్వేశా జలధీశ్వరా మము దయాసౌరభ్యముప్పొంగగా
యుర్విన్ గావర శంకరా! జగతి మమ్మోదార్చు వారెవ్వరో
సర్వంబీవె యెరుంగువాడవుమహాసంక్షోభముల్ రేగగా
నిర్వృత్తిన్ గలిగింపవా స్తుతమతీ నీకన్న లేరెవ్వరున్ ! 3

ఓసర్వేశ్వరా!జలధీశ్వరా!మమ్మల్ని కాపాడవయ్యా! నీవు అన్నీ తెలిసినవాడవు.మాకు గొప్ప ఆపదలు సంభవించి నప్పుడు నీవు గాక వేరెవ్వరును మమ్మల్ని కాపాడేవారు లేరు.మాకు దిక్కు నీవేనయ్యా!

శా. నేరమ్ముల్ పొనరించినన్ కొసరి వానిన్ ద్రోచి ప్రేమార్ద్రతన్
రారా రమ్మని చేరదీసెదవు గారాబమ్ము క్రొత్తౌనె మా
కే రోజైన విపత్తికల్గినను నిన్నే బిల్చి పాహీ శివా
నా రక్షన్ గమనింపరా యనుచు విజ్ఞాపింపమో శంకరా! 4

మేం తెలిసీ తెలియక నేరాలు చేస్తాము. అయినా నీవు కన్నతండ్రివి కనుక మమ్మల్ని సహించి కాసేపు కేకలువేసి తరువాత గారాముగా దగ్గరకు తీసుకుంటావు. మాకే రోజైనా ఆపదలు కలిగితే భయపడి నిన్నే పిలుస్తాము కదయ్యా

ఉ. కట్టెదుటన్ కనంబడవుగాని మనంబునగోచరింతువే
తట్టుకొనంగలేనపు డుదారముగా జనుదెంచి లెమ్మురా
పట్టుము నాకరంబనుచు భాగ్యవిధాతగతోడునిల్తువే
పుట్టువులేనిదేవుడ! విభుండవు నీవుగదా ధరిత్రికిన్ ! 5

మాకళ్ళయెదురుగా కనబడవుగానీ మనస్సులో కనిపిస్తూనే ఉంటావుగదయ్యా! మేము తట్టుకోలేని ఆపదల్లో పడినపుడు నీవే ఏదో ఒకరూపంలోవచ్చి నాచేయ్యిపట్టుకోరా అని తోడు నిలచి కాపాదుతావు గదయ్యా !

ఉ. సృష్టివి నీవు; మమ్ముల సృజించిన కర్తవునీవు;నీకు మా
కష్టములెవ్వియో దెలుపగావలెనా! యిది నీదు దేహమే
పుష్టియొసంగి మాకు పరిపూర్ణత నిత్తువు లోకమందు సం
కష్ట హరా! మహేశ్వర!ప్రగాఢత్రమ్మొక్కెద!శాంతినీయరా! **6**

ఈ సృష్టి అంతా పరమాత్ముడవైన నీస్వరూపమే. మమ్ములను సృష్టించినవాడవు నీవు. నీకు మా కష్టాలను ప్రత్యేకించి చెప్పాలా ప్రభూ! మా దేహం నీదికాదా! మాకు పరిపూర్ణతనిచ్చి శాంతినీయవయ్యా .

ఉ. జాగృతవేళలో కలల సంగతిలో నతిగాఢనిద్రలో
దోగినవేళ నెల్లెడల తోరముగా శివతత్త్వసారమే
యోగతురీయసంగతమహోద్యమరూపముతోడ లీనమై
భోగములిచ్చు నుత్తమ విభూతిఫలమ్ముగ దోచునాత్మలో ! **7**

మేము మేలుకున్నా, స్వప్నావస్థలోఉన్నా, గాఢనిద్రలోఉన్నా నీ తత్త్వమంతా మాకు అనుభవమౌతుంది.

ఉ. ఎన్ని పదాలనెన్నుకొని యెంతగవర్ణనజేసి తీర్చినన్
వన్నెతరుంగనట్టి గుణభాస్కరమూర్తివి నీవురా శివా!
చిన్ని వెలుంగుచుక్కవయి శీర్షమునుండి పదానువర్తివై
తిన్నగవెల్గు మా హృదయదీప్తివి నీవు కదా మహేశ్వరా! **8**

హే పరమేశ్వరా! నిన్ను వర్ణించడానికి ఎన్ని పదాలను యేరుకుని, ఎంతగా వర్ణించినా మా వర్ణనలకు మించి ప్రకాశిస్తావు! నీవు ఒక అణువు వలె మాలో నఖశిఖపర్యంతమూ వ్యాపించి వెలిగే మా హృదయదీపానివి.

ఉ. మానవదేహమం దొదిగి మన్ననలొందెడి సప్తజిహ్వ వై
శ్వానరుడెవ్వడో, యెవడు సప్తముఖుండును, తైజసుండుగా
పూనునొ, యే విరాట్పురుషపుంగవుడిందు హిరణ్యగర్భుడౌ
వాని తురీయ భావుడని వర్ణనజేసెను వేద సంహితల్ **9**

మానవదేహంలో ఒదిగియుండి ఏడునాల్కల అగ్నిస్వరూపంతో, ఏడు ముఖాల తేజస్స్వరూపంతో ఏ విరాట్ పురుషుడు హిరణ్యగర్భునిగా వెలుగొందుతున్నాడో అతనినే మోక్షకారకుడని వేదసంహితలు వర్ణిస్తున్నాయి.

ఉ. ఏ మతసారమైన నిదియే; జనులందరి జాగృతంబున్
కామకలాకలాప మతిగాఢతమంబగునిద్ర–మూడిటన్
బామిచరించు నాల్గవయవస్థ తురీయ మిదేరహస్య వి
ద్యామయమైన దివ్యపరతత్వమహత్వసుఖానుభూతియౌ ! **10**

ప్రపంచంలోయేమతసారాంశమైనాఒకటే. ప్రజలందరిలోనూ జాగ్రదవస్థ, కామకలాపావస్థ , గాఢనిద్రావస్థ, ఈ మూడిటినీ మించిన నాల్గవయవస్థ తురీయావస్థ . ఇది విద్యామయం. పరతత్వసుఖానుభూతిని ఇస్తుంది.

ఉ. లోపలనున్న జీవుని విలోకనజేసిన వాని వర్ణమున్
రూపము తత్వమున్ గని విరుద్ధఫలంబులదేల్చి యే మతం
బో పరిశీలనావిధిని పోల్చి వచింపగ సత్యధర్మముల్
దాపరికమ్ములేక నిజతత్వముతో కనిపించు నెయ్యెడన్ ! **11**

ఓ మానవుడా! నీలోపల నున్న జీవుడెవరో ఆతని రూపాన్ని, కులాన్నీ, రంగును, తత్వాన్నీ, పరిశీలించి యే మతమో పోల్చి చెబితే అందులో దాపరికం లేకుండా నిజమైన ధర్మం దర్శనం ఇస్తుంది.

చం. కరుణవహించినన్ను కలకాలముతిన్నగ(బోవరా విరాట్
పురుష! మహాత్మ! దేహమును పుణ్యఫలమ్ముగ తీర్చిదిద్దరా
వరగుణదాత! శక్తి పరివర్ధనజేయర! సర్వరోగముల్
పరుగిడిబాయునట్లు నిజబంధుడవై తనియింపజేయరా! **12**

హే విరాట్పురుషుడా! నన్ను కలకాలము తిన్నగా అనుగ్రహించవయ్యా! నేను పుణ్యఫలాన్ని పొందేలాగున నా జీవితాన్ని తీర్చిదిద్దరా! ఈ దేహానికి ఎటువంటి రోగాలు అంటకుండా చేసి నాకు తృప్తిని కలిగించరా!

సీ. పరమేశ్వరా నీదు పాదాలవద్దనే
పడియుంటి నీతోడ పలుకుచుంటి
సర్వేశ్వరా నీదు సన్నిధానమునందు
సాగిలబడియుంటి శరణమంటి
విశ్వేశ్వరానిన్ను విడలేకభక్తితో
గుడిముందునిలచి నే కొలుచుచుంటి
జలధీశ్వరా నీవె యిలనాకుదిక్కని
తలచుచుంటిని నిన్ను పిలుచుచుంటి
గీ. నమ్మికొల్చెడివారి వినమ్రుల నిల
కాచుకొన్నను విడచి చీకాకువడిన
దిక్కునీవని నమ్మిన దీనుడనుర
బాలజలధీశ్వరా! పాహిపాహి కనర! **13**

హే పరమేశ్వరా! నేను నీపాదాలనాశ్రయించుకొని నీ సన్నిధిలోనే ఉన్నానయ్యా! నిన్నే నమ్ముకున్నాను.

శా. శంభోశంకర వామదేవ! జగదీశా! పాహిమృత్యుంజయా!
అంభోధీశ్వర! నిన్నుగూర్చి మదిలో నావంత చింతింపగా

శుంభద్వైభవమూర్తివై కరుణతో శోభిల్లుచున్ నాదెసన్
గంభీరమ్ముగజూచి కాచెదవు సాంగత్యమ్ము నీ సొమ్మురా! **14**

హే శంకరా!మృత్యుంజయా!శరణుగోరుతున్నానయ్యా!జలధీశ్వరా! నీగురించి కొంచెం తలుచుకుంటే చాలు

నావంకమహాప్రేమతోచూసిస్నేహభావాన్నిప్రదర్శిస్తావు;స్నేహంనీసొమ్ముకదయ్యా!

మ. జడతత్వమ్మున మొద్దుబారితిని; నీ సాన్నిధ్యమున్ జేరి నీ
యొడిలోనన్ కడదాకనిల్చిన మహాద్యోగంబు చేకూర్చు దే
వుడవీవేయిక నాకు దిక్కు శివశంభో! పార్వతీవల్లభా
కడకంటన్ దయజూడరా యనుచు నాకాంక్షింతు భక్తిన్ మదిన్ **15**

స్వామీ!నాలోచైతన్యంతగ్గిపోయింది.జడస్వభావంపెరిగిపోయింది.నన్నునీవద్దకుచేర్చుకునిదయచూడవయ్యా!

ఉ. వేదము నేనెరుంగ పరివేదన నా కనుభావ్యమౌటచే
నీదయకోరి నిల్చితిని;నిక్కముగా కరుణించితేని పూ
ర్ణోదయ చంద్రునట్లు దివినుండి భవామృత జీవశక్తి న
న్నాదరమొప్ప నోమెదు మహాద్భుతరీతిని చంద్రశేఖరా! **16**

హే చంద్రశేఖరా! నేను వేదం నేర్చుకోలేదు. కానీ ఎల్లప్పుడు బాధలను అనుభవించటమే నాకు తెలుసు. అందువల్ల నీ దయగోరుతున్నాను. పూర్ణచంద్రునివంటి జీవశక్తిని నాపై ప్రసరించుము దేవా!

శా. మాయాజాలమునీదలేనుర శివా మన్నించి కాపాడరా
నీయందేమది లగ్నమై నిలువగా నీరూపు యోజించి ని
న్నే యర్చించుచునుంటి పల్కుల భవానీశక్తి మంత్రార్చనా
ధ్యాయంబొప్పగ నాశిషమ్ము లిడరా తద్భావమేపారగన్ **17**

ఈలోకంలో మాయాజాలాన్ని నేనుఈదలేను. ఎలాగో నేర్చుకున్న మాటలతో నిన్నే పూజిస్తున్నాను. కాపాడవయ్యా

ఉ. కుండనుబోలు దేహమెటగూలునొ నేనెరుగంగలేను; కా
పుండెదవంచు నమ్ముకొని పుణ్యమొకింత గడించలేదు; నో
రెండి గతించునప్పుడు నిరీక్షణకన్న భజించలేను; చా
ముండిని నిన్ను నామదిని ముందుగనే తలపోయుచుంటిరా! **18**

కుండవంటిదేహంఎప్పుడుకూలిపోతుందో తెలియదు. నీవు కాపుంటావని నేను ఏమాత్రమూ పుణ్యాన్ని సంపాదించు కోలేదు. నోరెండి పోయేటప్పుడు యేమీచేయలేను కనుక ఇప్పుడే నిన్నూ, చాముండీశ్వరినీ తలుచుకుంటున్నాను.

చం. నమకము చెప్పలేను నిను నమ్ముటకన్న భజించలేనయా
చమక మొకింతరాదు మరి సంతసమెట్లగు నీకు నా యెడన్
మమతనుజూపరా యనగ మన్ననజేయుదువా ప్రసన్నభా
వము సమకూరజాలునె శుభంకర నన్నెటు లాదుకొందువో 19

పరమేశ్వరా! నాకు నమకచమకాలు రావు.భక్తితో తలుచుకోగలను.అంతమాత్రానికి మమతను చూపగలవా!

ఉ. లౌకిక భోగలాలసత లక్ష్యముగా నడయాడు మానసం
బే కరణిన్ భజించునిను! పెద్దమనస్కుడవై గణింపుమా!
భీకరలోకయాత్ర దురపిల్లుచు నుండిన నన్ను కావగా
నే కరణిన్ వహింతువు? మహీతలమందున నెట్లు బ్రోతువో! 20

అయ్యా! నా మనస్సు లౌకికవిషయాలపట్ల ఆసక్తితో తిరుగుతుంది.భయంకరమైన జీవయాత్రలో దుఃఖించే నన్ను ఎలా కాపాడుతావో ఆలోచించవయ్యా!

ఉ. సోమరిపోతునైతిని;విశుద్ధ మనంబున నిన్నుగొల్వ లే
నే! మరియెట్లుగాచెదవు? నిక్కముగా నినుగూర్చి కానలన్
నీమముతో జపించు వరణీయులె నిన్ గననైరి;యింక నా
కేమి లభించునయ్య! కడకేమగు? నాగతి నాలకించరా! 21

స్వామీ!నేను పెద్దసోమరిపోతును. ప్రశాంతమైన మనస్సుతో నిన్ను ఆరాధించలేను.సర్వమూ త్యజించి అడవుల్లో నీకోసం జపించే వారే నిన్ను చూడలేకపోయారు.మరి నాగతి యేంటయ్యా?

ఉ. చక్కని భావసంపద విశాల కవిత్వగుణాభిశిల్పమున్
చిక్కనిశబ్దవైఖరి విశిష్ట రసాత్మక బంధుర ధ్వనిన్
వాక్కులు పల్లవించెడి ప్రభావిభవంబు గలట్టి కావ్యముల్
పెక్కులు నీపదార్చనకు పెన్నిధిగా రచియింపనీవయా 22

చక్కనిభావసంపద,గొప్పశిల్పచాతుర్యం,రసధ్వనులుగలకావ్యాలనునిన్నర్చించడానికినాచేవ్రాయించవయ్యా

శా. నాదోద్యాన సుశబ్దసంహితయు విజ్ఞానప్రదమ్మై స్వరా
మోదమ్మున్ ప్రకటించు మంత్రయుతసంభూతమ్మునౌ కావ్యమే

వేదార్థమ్ము వచించు నట్టి కవితావేశమ్ము కల్గించి యా
మోదంబౌనటు దర్శనంబిడుము సమ్మోదంబు శాంతిన్ గనన్! 23

నాదానికి ఉద్యానవనంలాంటి శబ్దాలు గలిగిన కావ్యం విజ్ఞానప్రదంగా ఉంటుంది. అది స్వరయుక్తమై ఉంటే మంత్ర పూతమవుతుంది. ఆలాంటి కవితావేశం గలకావ్యం తాపాలను తీరుస్తూ భగవద్దర్శనాన్ని కలిగిస్తుంది.

శా. ఏకాగ్రమ్మున నిన్ను లో దలచి నే నెంతెంత యోజించినన్
నాకున్ కంటికి తోచకుందువు జగన్నాథా! పరీక్షించుటే
నీ కర్తవ్యముగా కనంబడును; కానీ కంటికే గానవే
లోకారాధ్యుడవైన నిన్ను మది నాలోకించనీరా హరా ! 24

ఏకాగ్రచిత్తంతో నాలోనిన్నుతలచుకుంటూ ఎంతఆలోచించినా నీవునాకంటికి కనిపించవు.హే జగన్నాయకా! పరీక్షించటమే నీ కర్తవ్యమా! లోకపూజ్యుడవైన నిన్ను చూసే అవకాశం కలిగించవయ్యా!

శా. ఎంతో నిగ్రహమున్ వహించి మదిలో నింతింత నీమమ్ముతో
చింతల్ దూరమొనర్చుకొంచు నిను పూజింపన్ దయాశీలివై
వంతల్ దీర్చి యనుగ్రహింప నిటరావా దేవ! యెన్నాళ్ళు నా
కింతక్షోభ నొసంగెదయ్య! మరి జాగేలయ్య వార్ధీశ్వరా! 25

నియమాలను పాటిస్తూ, నిగ్రహంతో మనసును అదుపులో ఉంచుకుంటూ నిన్ను ధ్యానిస్తున్నాను కదా! మరి ప్రసన్నుడవు కావేమయ్యా ?

ఉ. దాతవునీవు లోకులను ధన్యులజేసి పరార్థమిచ్చు ము
త్తాతవు నీవు;లోకమున దండి మగండవు భాగ్యశాలివై
ప్రీతి రహించినన్ సకలరీతుల సిద్ధి ననుగ్రహించు సం
ధాతవు నీవు; నీకెవరు ధారుణిలోపల సాటియౌ శివా! 26

నీవు మహాదాతవు గదయ్యా ! లోకులందరూ ధన్యులయ్యేవిధంగా పరార్థమును దానంచేసే ఆదిపురుషుడవు; లోకంలో దండితనంగల పురుషుడు ఎవరన్నా ఉన్నారంటే అది నీవేగదయ్యా! నీవు మహాభాగ్యశాలివి. లోకులు ఏదికోరితే దానిని ఇవ్వగల సమర్థుడవు. నీతో సమానులు ఇంకెవరూ లేరుకదా!

ఉ. సర్వసమర్థుదెవ్వడు? ప్రశాంతుడు దివ్యమహత్త్వపూర్ణుడై
సర్వజనాళికిన్ గొలువజాలిన శక్తి సమన్వితుండు నీ
యుర్వర నెవ్వడౌను? పరమోన్నత తత్త్వము నీవుగాదొకో
శర్వ!మహేశ్వరా! సుగుణశాలివి నీవగుటన్ నుతించెదన్ 27

ఈ భూమిపై సర్వసమర్ధుడని ఎవరిని చెప్పాలి ? ప్రశాంతంగాఉంటూ దివ్యమైన మహత్త్వంతో విరాజిల్లుతూ జనులందరికీ సేవింపసమర్ధుడైనవాడవునీవేకదా! మహోన్నత తత్త్వానివికూడా నీవేకదా! అన్నిమహిమలను కలిగి యున్నపరమేశ్వరా! సుగుణశాలివి నీవు కనుక నిన్ను స్తుతిస్తున్నానయ్యా !

మ. భవదాజ్ఞా పరివృత్తులై నడచు దిక్పాలుర్ విశిష్టాత్ములై
వ్యవహారమ్ములు దీర్చుచుండ జగతీవర్తిత్వ సంధాతవై
భువనమ్ముల్ నడిపించుచుంటివి మహాభోగేశ్వరా నీకృపా
ధ్యవసాయంబున ధన్యతన్ బడయు సాయంబిమ్ము శ్రీశంకరా! 28

దిక్పాలకులునీయాజ్ఞచేపాలిస్తున్నారు.నీవులోకాలనుసమీక్షిస్తున్నావు;నీదయ వలన ధన్యత్వాన్ని పొందగలను.

శా. అంతర్జాలమహాద్భుతంబుగని యాహాయంచు నొక్కొక్కడున్
వింతల్ గాంచుచునుండె నట్టిమహిమావేశంబు సంకల్పమా
త్రాంతర్భాగము నీకటంచు మదినింతన్ గాంచగాలేరు; నీ
వెంతో దూరమునందు నుంటివని భావించున్ మహా మూర్ఖులై! 29

ప్రస్తుతం అంతర్జాలంతో ప్రపంచజనులండరు దగ్గరౌతున్నారు. కానీ ఈఅంతర్జాలం నీసంకల్పమేనని ఒక్కడు కూడా గుర్తించటంలేదు. పైగా నీవు మాకెంతో దూరంలో ఉన్నావని, పొరపాటునకూడా మావద్దకు రావనీ, కనిపించవనీ ప్రతివారికీ నమ్మకం ఏర్పడింది.

శా. ఆనాడెన్నడొ యూహకల్గెనెదలో "హా, దేవుడున్నాడొ? నా
కేనాడున్ గనిపింపలే దతడునాకేమౌను? యవ్వానిపై
నేనింతింతగ నూహజేయ తగవౌనే" యంచు భావింప"నీ
లోనే నిల్చితి జూచుకొ" మ్మనగ నాలోకించి యర్చించితిన్ ! 30

అప్పుడెప్పుడో నాకొక ఆలోచనకలిగింది : "దేవుడున్నాడా!నాకెప్పుడూ కనిపించలేదే! కనిపించనివానిపై నేను ఇంతంతగాఊహించటంతగునా"అనుకున్నాను.అప్పుడు"నీలోనే ఉన్నాను.చూసుకోరా!" అని వినిపించింది

శా. ఇన్నాళ్ళున్ వశియించుదేహమికపై నేమౌను? కార్చిచ్చులో
మన్నెరూపణగారి గాలిగలియున్! మౌనంబుగా జీవుడున్
కన్నున్ గానని కారుచీకటులలో కర్మంబదే తోడుగా
యెన్నంజాలని దుఃఖపుంజములలో నీదున్ మనోవేదనన్ ! 31

ఇన్నాళ్ళూ ఈప్రాణం నివసించిన శరీరం ఇకముందేమవుతుంది? కార్చిచ్చులో కాలిపోయి మన్నైపోతుంది తోడూనీడాలేక మౌనంగా కారుచీకట్లలోబడి తానుచేసుకున్నకర్మ వెంటరాగా చెప్పలేని కష్టాల్లో ఈదుకుంటూ వెడుతుంది

ఉ. దేహములేనినాడు జగదేకవిభున్ పిలువంగలేము; యు
త్సాహమడంగి దుఃఖిలుచు సద్గతి గానక దిక్కులేక సం
దేహముతోడ కాచుకొను దీనజనావను డెవ్వడంచు వి
ద్రోహ పురాకృతమ్ము కనుదోయి నడంపగ తేలిపోవమే !! 32

ధర్మసాధనకోసంశరీరంఉండాలి. దేహం లేకపోతే పరమేశ్వరుణ్ణి ఆరాధించలేము. దిక్కూమొక్కూ గానలేక, కాచుకునే దిక్కెవరో తెలియక, చేసుకున్న మహాపాపం కళ్ళను మూసేస్తే దారికనపడక జీవుడు దుఃఖిస్తాడు

ఉ. ఇంద్రియనిగ్రహమ్మున సహింతుము కష్టము; లట్లుగాక స
ర్వేంద్రియభావజాలము వరించి యథాగతిబండితోలినన్
సాంద్రవిచారకర్మఫలసంపద కూరిమితోడ జేరి ని
న్నింద్రియలోలుజేసి మరణింపగజేయును దుష్ఫలమ్మునన్ 33

ఇంద్రియనిగ్రహంఉంటే ఎన్నికష్టాలనైనాసహించవచ్చు. అట్లుగాకుండా అన్నిఇంద్రియవాసనలను గ్రహించితే ఆ ఇంద్రియలోలత్వం చివరకు మృత్యువును కౌగిలింపజేస్తుంది.

ఉ. దేహమనన్ రథమ్ము; గుణధీయుతి సారథి; ఇంద్రియమ్ములే
గ్రాహక గుఱ్ఱముల్;మనసు కళ్ళెము;నాత్మ రథిప్రకారమై
దేహముతోలుచుండు; నిది తిన్నగ నేగిన మోక్షగామియై
మోహపథమ్మువీడి యనుమోదమునొందును యాత్మ దైవమై! 34

దేహంఒక రథం వంటిది; బుద్ధి అనేది దీన్ని సారథి; ఇంద్రియాలు ఈ రథాన్ని లాగే గుఱ్ఱాలు. మనస్సు వీటికి కళ్ళెం. ఈ రథంలో కూర్చున్న రథికుడు ఆత్మ. రథం తిన్నగా లాగబడితే మోక్షాన్ని చేరుతుంది.

చం. విషయములన్ దగుల్కొనిన వేలకువేలుగ వాంఛలెచ్చి శే
ముషినడగించు; దుఃఖమును మూఢవిరోధము గల్గజేయు నీ
మిషమున కామవిభ్రమము మెండయి బుద్ధినశించుగాన దు
ర్విషమయమైన వర్తన వరించిన నాశముతప్ప దేరికిన్ 35

విషయవాంఛలలోతగుల్కొంటే వేలాదిగా కోరికలుపెరిగి తెలివితేటలు, బుద్ధికుశలత నశించిపోతాయి.. అందువల్ల దుఃఖం, మూఢత్వం, విరోధం కలుగుతాయి. విషయవాంఛల వలన నాశనమే కలుగుతుంది.

మ. అనుబంధమ్ములు దుఃఖహేతువులు; కాయంబెన్నడో దుల్లిపో
వును; జీవంబది గల్గినంత భవ శంభో యంచు కైలాస వా
సుని కీర్తించుచు చింతలన్ విడచి దాసోహమ్మనన్ జీవుడా!
ఘనమౌ మోక్షపదమ్ము లభ్యమగు నాకాంక్షల్ ఫలించున్ ధరన్ 36

బంధుత్వాలన్నీదుఃఖకారకాలే. దేహం ఎప్పుడో పడిపోతుంది. ప్రాణం ఉన్నప్పుడే కైలాసవాసుని శరణుకోరాలి

చం. ఇహపరవాంఛలన్ విడచి యీశ్వరునే మదిలో దలంచుచున్
తహతహలాడు నెవ్వడు యథార్థముగా నతగాడె ముక్తుడై
విహగమువోలె నీశ్వరుని వెన్కనె జేరి విలీనమౌను; దు
స్సహమగు బంధముల్ విడిచి సద్గతినొందెడి మార్గమియ్యదే 37

విముక్తినిపొందటానికి ఇహపరవాంఛలు అడ్డంకులు. కనుక వాటిని వదిలి ఈశ్వరునే శరణు కోరితే అతడు ముక్తిని ప్రసాదిస్తాడు . బంధాలను విడిస్తే సద్గతి కలుగుతుంది.

ఉ. కన్నులముందు మేటినయగారములున్ నటియించుచుండినన్
పన్నుగ దాటివైచి రసభావములన్ దలపోయకుండ నా
పన్న జనావనుందలచి బంధువుగా దలపోసి వానినే
మిన్నగ నాత్మలో నిలిపి మేలని గొల్చిన చాలదేభువిన్? 38

కళ్ళయెదురుగా యెన్నెన్ని నయగారాలు నాట్యం చేస్తున్నా వాటిని పట్టించుకోకుండా దీనజనరక్షకుడైన పరమాత్ముణ్ణి మనస్సులో నిలుపుకుని ఏకాగ్రంగా సేవిస్తే చాలునుకదా!

ఉ. తామరపాకుజేసిన సుధర్మమదేమి? జలాధివాసియై
నీమముబూనినట్టులొక నీటికణంబును మీదనంటదే!
ప్రేమరహించి మించినను పెద్దరికంబున నాట్యమాడి యా
పై మమకారశూన్యముగ భాసిలుటన్ గమనింపు డాత్మలో 39

తామరాకు చేసుకున్నపుణ్యం యేమిటి? ఎన్నాళ్ళు నీటిలోఉన్నా ఒక్క నీటిబొట్టునుకూడా అంటించుకోదు. ఎంత సంబంధంఉన్నా ఓహోఅంటే ఓహో అంటుందే కానీ కించిత్ మమకారాన్ని పెంచుకోదు.

క్రౌంచపదం : **మోక్షపదంబున్ గోరెదగానీ భువిపయి మనగల పొలుపు రహింపన్**
రక్షకుడా! కాపాడుము నీవే రథికునివలె మము రమణతమీరన్
వీక్షణసేయన్ వేడెదనిన్నే విభుడవు జగతికి వెలుగువు కానన్
అక్షయమౌ శాంతిన్ దయసేయన్ అనిశము భవహర యని వినుతింతున్ 40

(భ,మ,స,భ,న,న,న,య-గణాలు; 1-11-19 యతిస్థానాలు)

మోక్షంకోరుకుంటాను.కానీముందుగాఈనేలపై ఎలా బ్రతకాలో చెప్పి మాకు దారి చూపి, శాంతినీయవయ్యా

క్రౌంచపదం : **కంటికి భోగంబుల్ కనిపింపన్ కనుగొని యనుభవ గమనము లేకన్**
మింటను నీకై వేడుకజూడన్ మెలగునె సుఖములు మెలకువతోడన్
తుంటరి వాంఛల్ తొందరవెట్టన్ "దురితము" వలదని తొలగతరంబే
వెంటనెదీనిన్ దూరమొనర్పన్ విభుడవు నినుగని వెడవెడగొల్తున్ 41

భోగాలుకవ్విస్తుంటే నీవంకచూస్తే సుఖం కలుగుతుందా ?నాలోరేగే తుంటరి కోరికల్ని తుదముట్టించవయ్యా!

క్రౌంచపదం : **ఐహికవాంఛా సంగతులింపై యహరహమును నను నలరగ జేయన్**
దేహియటంచున్ దేవుడనీపై దినదినమును మది తిరముగనిల్పన్
సాహసమౌ!నాబుద్ధిని నీవే సదయుడవగుచును సతతముదీర్పన్
పాహిమహేశా! కోరెదనిన్నే భవహర ననుగను వరదుడవీవే! 42

ఐహికవాంఛలనుండి వెలువడి దేవా! నేను నీపై బుద్ధి నిలుపలేకపోతున్నాను. నాబుద్ధిని అదుపుచేయవయ్యా!

క్రౌంచపదం : **నామదినిన్నే గోరుచునున్నన్ నడచునె బ్రతుకులు నయముగనీతో**
నీమము లెన్నంజాలునుగానీ నియతిని పనిగొని నిలువగలేమే
కామవికారంబుల్ సడిసేయన్ గడువగ జనులకు గడబిడ కాదా!
హైమవతీశా! శంకరరారా! యనిశము దయగొను మఖిలదిగీశా! 43

నిన్ను ఆరాధిస్తున్నా మనసులో కామవికారాలు కవ్విస్తున్నవయ్యా ! దయచేసి మాబుద్ధిని దారిలోపెట్టవయ్యా

క్రౌంచపదం : **శంకర నీకే మ్రొక్కెదమయ్యా! సకలభువనములు సరసతగొల్వన్**
శంకరనీకే వందనమయ్యా! సహృదయవిభుడవు సకలజగాలన్
ఓంకృతివై తేజంబదినీవై యుమనిను కదియగ నురిమెడి దేవా!
కింకరుడన్ పాలింపగరారా! గిరిసుత మమువెస గృపగను మాతా! 44

హేఉమాపతీ!నీకు నమస్కరిస్తున్నానయ్యా! నేను నీ కింకరుడను! నన్ను పాలింపవయ్యా! నీవు సహృదయత గలగొప్పస్వామివి. నీవు ఓంకారస్వరూపుడవు. ఉమాదేవి నీప్రక్కన ఉండగా ఎంతోశక్తివంతుడవై నీవు ఉఱుమగలవు. అమ్మా గిరిజాదేవీ నీవు శ్రీశివస్వామితో కలసి మమ్ములను దయచూడవమ్మా!

లాక్షణీ వృత్తం: **ఈశ్వర! నినుమది గొలుచుచు నిలిచిన నెంతయు సుఖ మమరును ధరణిన్**
నశ్వరమగు నిహమును నెదదలచిన నాశమె కలుగును జనులకిలన్
విశ్వము శివమయమగునని యెరిగిన వేదనలవి తొలగును నెడమై
శాశ్వతమగు విషయము దలచిన భవ సన్నిధి దొరకును సురుచిరమై 45

(భ,న,న,న,న,భ,న,న,స ; 1-16 యతి)న,భ,ర,స,జ,జ,గ5జ,త

ఈశ్వరా! నీస్మరణసుఖంగా ఉంటుంది. ఐహికవాంఛలు శాశ్వతం కావు. ప్రపంచమంతా శివమయం కదా!

లాక్షణీవృత్తం: శంకర భవహర మముగను పురహర! సాగిలపడి నిను దలతు మదిన్
కింకరుడను భవ పదయుగళిని బడి కీర్తన సలుపుచు కొలిచెదరా
వంకర తలపులు ననువిడి జనియెడి భాగ్యము నొసగుము జలధివిభో !
క్లీంకృతజపమును మనసున దలచెద లేశము దయగొని వరమిడరా! 46

హేశంకరా!నీముందుసాగిలబడిమ్రొక్కెదనురా!నాలో వక్రాలోచనలను రానీయకు.నాయందు దయచూపరా!

లాక్షణీవృత్తం: లౌకికవిషయము లహరహమును నుపలక్షితమగునటు లనుభవమై
సోకులు పలుతెరగుల నటనములవి చోద్యము గనునటు కులుకులతో
వాకిట నిలచెను వలపులు గురిసెను వైభవ లహరిని విసరెనిటన్
నీ కృప గలిగిన నిలచెద నిలపయి నెవ్వగలను కద నిలుపు శివా! 47

హేపరమేశ్వరా!లౌకికవిషయాలురకరకాలుగా ఆకర్షిస్తున్నాయి. నీదయ ఉంటే వాటినుండి బయటపడతాను.

లాక్షణీవృత్తం : ఈశుని పదములు దలచుచు మెలిగెద నిమ్ముగ నను దయ గనుగొనగన్
హేశివ! భవహర! పశుపతి! యనుచు నుతింతును మనమున ముదమెసగన్
కాశిని వెలసిన పురహరు గొలిచెద కల్మషహరు నిల నిలకడగన్
నాశిషములనిడి ననుకృప నరయగ హాస పరిమళములవి పొసగన్ 48

పరమేశ్వరా! నీనామస్మరణచేస్తూ నిలకడగా నిన్ను సేవిస్తాను. నాపై దయతో నాకు ఆశీస్సులనీయవయ్యా!

లాక్షణీవృత్తం : ఐహికములు చిరసమయము నిలువవు యాదరణము నవిగొనవు శివా
సాహసమున జను విషయము లెరుగను సన్నుతి గొలిచెద సదయుడవై
మోహము ననువిడి చనునటు గనుము విభోశివ! హరహర! వినతులివే!
పాహిసుగుణమణి! ఫణిగణరమణ! శుభాహ్వయ! పశుపతి! దయగనరా! 49

పరమేశ్వరా!ఐహికవిషయాలుఅశాశ్వతాలు.వాటిపై నాకు మోహాన్ని నశింపజెయ్యి. నీకు హారతులిస్తున్నాను.

ఉ. నమ్మినవారి కష్టములు నష్టములన్ తొలగించి యీశ్వరుం
డిమ్ముగ గాచి బ్రోచును మహీతలమందు నిదర్శనమ్ముగా
నిమ్మహి నెన్నియోకథలు యీశ్వరతత్త్వమునొప్పజెప్పుచున్
సమ్మతిగూర్చు నందొక ప్రసన్నవిశేషము నుగ్గడించెదన్ 50

నమ్మినవారిని ఈశ్వరుడు కాపాడుతాడు అనటానికి ఎన్నో కథలున్నాయి. వాటిలో ఒకకథ :

చం. సదమల భక్తి నీశ్వరుని సన్నుతిజేయుచు గొల్చువారలన్
మదమున నెచ్చరించి యవమానకరమ్ముగ నీసడించె ను
న్మద మథితుండొకండు నధినాస్తికతత్వము నెత్తికెక్కగా

వదరుచు నాలయంబున నవాచ్యములౌ కఠినోక్తులాడుచున్ 51

భక్తులుఈశ్వరుణ్ణిసేవిస్తుంటే, నాస్తికత్వం బలిసిన ఒక మూర్ఖుడు గుడిలో భక్తుల్ని నిందించసాగాడు.

శా. పూజల్ గీజలనేమియౌను ? సమయమ్మున్ దాటుటే గాని ని
స్తేజోవంతులు దేవుడా యనుచు గాసింజెంది ఘూర్ణిల్లుటల్
సాజంబెక్కడజూచినన్; జనులు విశ్వాసమ్ముతో బుద్ధిచే
రాజిల్లంగల రెందు బుద్ధి విలువన్ రవ్వంత చింతింపరే! 52

పూజలు గీజలు చేసినంతమాత్రాన కాలహరణం తప్ప ఏమౌతుంది? శక్తిహీనులు దేవుడా యని యేడ్వటం ఎక్కడైనాసహజమే.తెలివిగలవాళ్ళుయేమైనాసాధించగలరు. ఆ విషయాన్ని జనం తెలుసుకోలేక పోతున్నారు.

ఉ. బుద్ధినొసంగి మానవుని పూర్ణబలుండుగ జేసె దైవ మా
బుద్ధినిశుద్ధిజేసుకొను పోడిమిగానక మూర్ఖచిత్తులై
బద్ధవిరోధమూని తగవాడుచు మీదట దైవమొక్కడే
యిద్ధర తమ్ము గావవలె నిమ్ముగనంచు నుతింప భావ్యమా! 53

మనిషికిదేవుడుబుద్ధినిచ్చాడు.దాన్నిపక్కనబెట్టి తమలోతాము తన్నుకుంటూ దేవుడే కాపాడాలనటం తగునా!

శా. సంపాదించి భుజించి సంతసమునన్ స్వర్గానుభోగాల భో
గింపన్ మేలగుగాని యోగివలె భక్తిన్ ముక్తి వాంఛించి జీ
వింపన్ జాలక పెన్ విచారజలధిన్ భీతిల్లుచున్ గ్రుంకినన్
సొంపేముండును? జీవితార్థ మిదియా? క్షోభిల్లుటే మార్గమా? 54

కావల్సినంత సంపాదించి తిని అనుభవించాలి. అంతేగానీ యోగివలే ముక్తికోసం దిగులుపడటం మంచిదా?

ఉ. నీతిని గౌరవించెద మనేకములైన కథావి నముల్
ప్రీతి రహింపజెప్పెదము; రేబవళుల్ భగవానుగూర్చి వి
ఖ్యాతములై యెసంగు పలుగాథలనల్లి భజించుచుందు మిం
తే! తగుదంచు నిక్కముగ దేని నొనర్పము యాత్మశుద్ధిగన్ 55

నీతిని గౌరవిస్తాం. ఎన్నెన్నో కథలు చెబుతాం. రాత్రింబవళ్ళు దేవుణ్ణి సేవిస్తాం. కానీ ఆత్మశుద్ధిగా ఏదీ చేయం.

శా. మాయామోహితలోకమందు బ్రతుకన్ మార్గమ్ముయోజించి పెన్
మాయోపాయము పన్నుచున్ జగములన్ మాయించుచున్ మోస మ
న్యాయక్రౌర్య కిరాతచోర కుటిలవ్యాపార కేళీకళా
ధ్యాయంబై తనరారు విద్యల మహత్త్వక్రీడ లాడన్ వలెన్ 56

లోకం ఓ పెద్దమాయ. ఇక్కడ బ్రతకటానికి మాయోపాయాలే కావాలి. ఎన్నెన్నో అరాచకాలే చేయాలి.

శా. పోటాపోటి బలప్రయోగములతో పోరాటవిస్ఫూర్తితో
ధాటిన్ జూపెడు వాడు మాత్రమె ధరన్ ధన్యుండుగానిల్చు ను
ద్ఘాటింపన్ బలవంతుడే ప్రభువు; చిత్తస్థైర్యమున్ లేక పో
రాటంబే యొనరింపలేనతడు చేరన్ లేడు లక్ష్యార్థమున్ **57**

ప్రతివిషయంలోనూ పోటీ పడుతూ పోరాటం చేసేవాడు మాత్రమే లోకంలో నిలుస్తాడు. బలవంతుడే రాజు.

సీ. రభసంబు మీరగా రాజకీయముజేసి
రాణకెక్కెడివాడె రాజు యగును
తిట్టకముందరే తీండ్రించి దుమికెడి
తీటగాండ్రకె మేలు వాటమగును
కులబలంబొనగూర్చుకొని రేగు వానికే
కోర్కెలన్నియు సమకూరుటగును
మందిమార్బలమున్న పందికాపరియైన
మన్ననలనుబొంది మాన్యుడగును

గీ. భక్తియని నమ్మి ముక్కును బట్టుకొనిన
దేవుడెన్నడు గాంచునో దెలియలేము
కర్మ మర్మమ్ములోబడి కండ్లు మూసి
నమ్మికూర్చున్న బ్రతుకును నడుపగలమె? **58**

రాజకీయాలు నడిపించి పేరుపొందినవాడే రాజు . తిట్టకముందే మీదకు దుమికేవాని మేలు జరుగుతుంది.

కులబలం, మందీమార్బలం ఉన్నవానికే మాన్యత ఉంటుంది. భక్తితో కూర్చుంటే బ్రతుకు నడవదు.

చం. చిరు చలచిత్రముల్ గనుచుచిందులువైచెద మాతడెందునన్
పరుగునబోయి నాయికను ఫక్కునకౌగిలిలోన హత్తగా
నురకలువైచి పాడెదము నూగుచు పానము నందుకొంచు సం
బరములతేలియాడెదము! భాగ్యమిదేకద జీవితమ్ములో! **59**

చిరంజీవి చిత్రాలను చూస్తూ చిందులు వేస్తాము. అతడు నాయికకోసం పరుగెత్తితే సంబరపడతాము. ఆమెను

కౌగిలించుకుంటే సంతోషపడతాము. ఇలా అనుభవించటమే కదా జీవితమంటే !

ఉ. వారుణ ధార పీల్చి గురుభామినులన్ జతగూడి యూగుచున్
ఘోరవిలాసనాట్యముల కొందలమందుచు చిందులాడుచున్
భోరున పాటలందుకొన పుణ్యము దక్కును! నీతిమాలి యే
తీరున రొక్కమొందినను తీరుగ వాంఛలు తృప్తినొందెడిన్ ! **60**

పానశాలలోమదిరాసవాన్ని పీలుస్తూ పెద్దమొత్తలున్నఅమ్మణ్ణులతోకలిసిఊగుతూ ఒళ్ళుతెలియని గెంతులు, చిందులతోభోరునపాడుతూఆడుతుంటేపుణ్యందక్కుతుంది.అడ్డగోలుగాడబ్బుసంపాదిస్తేకోరికలు తీరుతాయి.

ఉ. దేవుడు దేవుడంచు పరిదేవనమేలర! మిన్నకుండినన్
తావక కర్మభావమది తప్పక నీకనుభావ్యమౌను; నిం
దే విధమైన భిన్నతయు నేరికి గల్గదు; కోపతాపముల్
దేవునికేల కల్గును? మదిన్ తలపోయుము వాస్తవమ్ములన్ 61

అన్నివేళల్లోనూ దేవుడు దేవుడు అంటూ తపించనక్కర్లేదు. నువ్వు మెదలకుండా ఉన్నా నీకర్మనిబట్టి నీకు ఫలితాలుంటాయి. దేవునికి కోపతాపాలుండవు. వాస్తవాలను యథార్థదృష్టితో గమనించాలి.

చం. సుఖపడుయాశ లన్నవి యశుద్ధములా? నిరతమ్ము దుఃఖియై
నిఖిలదరిద్రముల్ బడసి నెవ్వగదాల్చిన భక్తి చిహ్నమా?
ముఖమున నవ్వునింపుకొని భోరునలోపల నేడ్చుచుండుటే
యఖిలమనోభిరామమగు నర్చనయా? కపటంబె భక్తియా? 62

సుఖపడాలని కోరుకోవటంతప్పా! ఎప్పుడూఏడుస్తూ అన్నిదారిద్రాలూ మీదబడినట్టు బాధపడటం భక్తియా? పైకి నవ్వుతూ లోపల బాధపడుతూ ఉండటం గొప్పఅర్చన అవుతుందా? అంటే కపటమే భక్తి అవుతుందా?

చం. మనము సుఖింప దేవుడల మన్ననజేయడొ? యెల్లకాలమున్
గొనకొని దుఃఖవార్ధిబడి కుందుచునుండిన సంతసించునా?
మన సుఖదుఃఖముల్ గనుచు మానసమందున వాడుకూడ భా
వన గనుచుండునా? నితరభావనలాతనికేమి యుండవా? 63

మనంసుఖపడితేదేవుడు ఒప్పుకోడా?ఎప్పుడూ మనం ఏడుస్తుంటే దేవుడు సంతోషిస్తాడా? మన సుఖదుఃఖాలను బట్టి ఆతడుకూడా అలాంటి భావనలు పొందుతాడా? అతనికి మరే ఇతరభావాలు ఉండవా?

చం. ధర నొనగూడినంతకు యథార్థముగా సుఖియించు నెవ్వడున్
పరిపరియూహలన్ దగిలి బాధలనొందుట మేలుగాదు; నే
ర్పరియగువాడు యెట్లయిన భవ్యసుఖమ్ములనొంది తృప్తిగా
మురియునుగాని కష్టపడి మోకరిలన్ జనబోడు యెన్నడున్ 64

వీలైనంతవరకు ఎవడైనా లోకంలో సుఖపడాలని చూస్తాడు. కష్టపడాలని ఎవడూ కోరుకోడు.

శా. ఆనందాబ్ధిని నోలలాడుట దురన్యాయంబె? సౌఖ్యామృతం
బానంబూనిన ఘోర కిల్బిషమె?యత్యంతాదరంబొప్పగా
తేనెంబోలిన తీయనౌ మదిరనెంతే ద్రావినన్ దోషమా !
మేనున్ దార్చెడి భామినిన్ గవయ కుంభీపాకమౌనా భువిన్? 65

సంతోషంలో మునిగితేలటం అన్యాయమా?సుఖపడటం మహాపాపమా?అతిమధురమైన మదిరను త్రాగటం తప్పా? ఒళ్ళమ్ముకునే(వేశ్య) యువతితో కూడటం వల్ల కుంభీపాక నరకం వస్తుందా?

శా. ఎన్నో పూవులనానునట్టి మధుపంబే పాపమున్ బొందు? నిం
కెన్నో పండ్లనుకొట్టివేయు శుకమే క్లిష్టత్వమున్ బొందు? నె
న్నెన్నో గోవుల దాటునట్టి వృషభంబే చేటునున్ బొందు? నీ
యన్నింటన్ గనరాని పాపమది యెట్లొ జోటితో కూడినన్ ! 66

ఎన్నెన్నో పూలపై వ్రాలే తుమ్మెదకు, ఇంకెన్నో పండ్లను కొట్టేసే చిలుకకు, మరెన్నో గోవులను దాటే వృషభానికి ఏపాపం వస్తుంది? ఎక్కడాలేనిపాపం నచ్చినచెలితో కూడితే వస్తుందా?

చం. వడివడి సాగివచ్చు సురవాహిని యబ్ధిని జేర పాపమా?
కడలి తరంగముల్ గిరి నికాయము సందులదూర పాపమా?
తడయక మబ్బులో నుఱుము తళ్కు మెరుంగు హసింప పాపమా?
పడతి పదాహతిన్ విరియు భవ్యసుమమ్ములజన్మ పాపమా? 67

వేగంగా ప్రవహించివచ్చేగంగ సముద్రంలోకలవటం పాపమా?సముద్రతరంగాలు అడ్డువచ్చిన కొండల సందుల్లో దూరటం పాపమా? మబ్బుల్ని ఉరుములు కలిసినపుడు మెరుపులు రావటం పాపమా? యువతి కాలితాకునకుపూలువికసించటంపాపమా?ఇవన్నీప్రకృతిసహజమైనసంగమవిశేషాలే.ఇవేవీ తప్పుకానప్పుడు ఒకడు తాను కోరుకున్న యువతిని అనుభవించటం తప్పు ఎలా అవుతుంది అని గాలినాయుడి విమర్శ.

చం. కలిమి గలంతమేరకు సుఖానుభవమ్మును పొందనేరమా?
లలితవిలాసవైభవ కళామతి నొంది సుఖింప ఘోరమా?
పలు రమణీయ వాంఛల నవారితరీతి గడింప దోషమా ?
తలచినదెల్ల పొందగల తత్పరభావముకూడ మోసమా? 68

సంపద ఉన్నంతవరకు అనుభవించటం నేరమా? కళాప్రపంచంలో సుఖపడటం ఘోరమా? ఇష్టం వచ్చినట్లు అనుభవిస్తే దోషమా? అనుకున్నదంతా పొందగల తాత్పర్యభావం కలిగి ఉండటం మోసమా?

చం. అనితలపోసి నాయుడు మహావిభవంబు సమీకరించి కో
రిన సకలమ్ము నొందగలరీతిని గూర్చి దలంచి బుద్ధిమ
త్తను చిగురింపజేసుకొని తథ్యముగా కలలన్ని పండు దా

రిని గమనించె; బుద్ధియెవరించు నభీష్టముతీర్చు మార్గమున్! **69**

గాలినాయుడు ఈ విధంగా ఆలోచించి గొప్పసంపదను సమీకరించుకుని తనకోరికలను తీర్చుకునే దారిని గూర్చి చింతించి , ఉపాయాన్ని తెలుసుకున్నాడు. కోరికలు కలిగితే తీరేదారిని మనస్సే కనిపెడుతుంది గదా!

చం. ధరణి సుఖింపనెంచిన యథార్థముగా నొకరాజకీయ బం
ధురతరవీరుడై జనులధోరణి సుంతయెరింగి వారలన్
సురుచిర వాగ్విలాసముల సొంపు దలిర్ప సమాశ్వసించి యం
దరి హృదయాల చూరగొని యానక నేలవలెన్ ప్రభుండునై! **70**

లోకంలోసుఖపడాలంటేఒకరాజకీయనాయకుడుగా మారాలి. ప్రజల అభిప్రాయాలకు తగినట్లు మాట్లాడుతూ అందరి మనస్సుల్ని ఆకర్షించాలి. ఆ తరువాత వాళ్ళకు ప్రభువై తిరుగులేనట్లుగా పాలించాలి అనుకున్నాడు.

ఉత్సాహ: రాజకీయ మన్నమాట రక్తి కలిగి యుండెడిన్
రా జనంగ నర్థమేమొ రాజుకూడ నెరుగడే
రాజకీయమన్న రచ్చరచ్చచేయు చందమే
రాజుచెప్పుమాటవేరు రాజు పనులు వేరయా! **71**

రాజకీయం అంటే ఆసక్తిగా ఉంటుంది. రాజు చెప్పేమాటకు అర్థంఅతనికే తెలియదు. రాజకీయం అంటే రచ్చ రచ్చ చేయటం - అనవసరపు రాద్ధాంతం చేయటం. రాజు చెప్పే మాటవేరు. చేసేపనులు వేరుగా ఉంటాయి.

ఉత్సాహ : రాజుభోగమనుభవించు రమ్యయోగ ముండినన్
తేజమలర భూతలాన దివ్యసంపదల్ గనున్
భూజనుల్ నమస్కరింప భూరి గౌరవమ్ముతో
జేజెవోలె వెలుగు గొప్పజీవితమ్మునొందెడిన్ **72**

రాజయోగంఅనుభవించేగీతఉంటేఈలోకంలోగొప్పసంపదలుముందేలభిస్తాయి.ఆకళకనిపిస్తూనేఉంటుంది

. **ఉత్సాహ : రాజసమ్ము చూపగల్గు రాణ కల్గియుండినన్**
రాజభోగములను పొందు రమ్యమార్గముండెడిన్
పూజలందుకొనెడి పూర్వపుణ్యకర్మమున్నచో
భూజనుల్ శిరస్సు వంచి పూజలిచ్చి మ్రొక్కరే ! **73**

రాజభోగాలకురాజసంఉండాలి.పూర్వజన్మకర్మఫలంఉండాలి.అప్పుడుఅందరూతలలువంచి నమస్కరిస్తారు.

ఉత్సాహ : ఎన్నివిద్యలున్నగాని హెచ్చుతీవి లేనిచో
వన్నెకల్గబోదు జనులు వాని మెచ్చులే రిలన్
కొన్నియక్షరాలు నేర్చి కూతవేయు డాంబికుం

దన్నిటన్ మహానుభావుడై వెలుంగుచుండెడిన్ **74**

ఎన్నివిద్యలున్నారీవిదర్జాలేకపోతే జనంమెచ్చుకోరు. అవిఉన్నవాడుకొన్నిఅక్షరాలునేర్చినా గొప్పవాడవుతాడు.

ఉత్సాహ : **రాజకీయనాయకుల్ విరాజమానమూర్తులై**
పూజలొందగలరు సర్వపుణ్యమూర్తులేయనన్
మోజుతోడనెల్లజనులు ముగ్ధులై భజింపగా
తేజరిల్లుచుండగలరు దేవతలను మించుచున్ 75

రాజకీయనాయకులు ప్రజల అవసరాలు తీర్చాలి కనుక దేవతలకంటే మిన్నగా సేవించబడుతూ ఉంటారు .

ఉత్సాహ : **కనుక రాజకీయ వర్తకమును మించి యేదియున్**
కనులదోచదయ్యె నిలను కాంచనమ్ముకన్న మిం
చినవిశేష బేరమిదియె చేయగల్గు సెట్టికిన్
ధనపరంపరల్ రహించి దండి గూర్చి నిల్పెడిన్ **76**

రాజకీయవర్తకానికిమించినదిధనగుప్తునికికనిపించలేదు.అదిబంగారాన్నిమించిలాభం ఇస్తుందనుకున్నాడు

సీ. కష్టాలగల్పించి కాపుగా కడజేరి
కమ్మనిమాటలగంధ మొసగి
ఆధారములగూల్చి యాసరాగానిల్చి
యర్మిలిబంధువై యాదుకొనుచు
ఆత్మశక్తినడంచి యన్నితానేయౌచు
నాత్మీయతాభావ మమరజూపి
ఆపదల్ గడతేర్చు నపరదైవమ్ముగా
నధికుల హృదయాల నధివసించి
గీ. అపర చాణుక్యునిగ నెవ్వడలర గలడొ
యట్టి వాడేగదా రాజు! యాధునికుల
నేలగలవాడు చాతురీ నిపుణు డతడు
రాజకీయానుభావ పారంగతుండు !! **77**

అసలే కష్టాల్లో ఉన్నవారికి మరిన్ని కష్టాలు కలిగించి ఆనక వారికి తోడుగా తానున్నానని కమ్మని మాటలు చెప్పటం.,ప్రజలకు ఉన్న ఆధారాలన్నిటినీ కూల్చేసి,ఆ తరువాత తాను వారికి అండగా నిలుస్తానని చెప్పటం., ప్రజల్లోఆత్మవిశ్వాసాన్ని అణచివేసి, తనసహాయం లేనిదే వాళ్ళు నిలబడలేమనే భావాన్ని కలిగించటం.,ఎవరికి ఈ కష్టం వచ్చినా తానే వారిని ఆదుకొనే దైవం అనిపించటం., మొదలైన లక్షణాలను

పాటించి ఎవడైతే అపర చాణక్యునిగా మసలగలడో వాడే ఈనేలను యేలగలడు అని ధనగుప్తుడు విశ్వసించాడు.

గీ. అనుచు మదిలోన తలపోసి యతనికిష్ట
మైన వర్గమ్ము పరికించి యవసరమ్ము
పొసగకల్పించి యందు విస్ఫూర్తి మెరయ
"గాలినాయుడు" జేరె విఖ్యాతుడగుచు ! 78

అలాఆలోచించిన గాలినాయుడుఒక అనుకూల వర్గాన్ని తయారుచేసుకొని దానికి అతడు నాయకుడయ్యాడు.

ఉ. చేరిన వెన్క నాతడు విశేషపరిశ్రమతో ప్రణాళికా
ధారిత వర్తనమ్మున ప్రధానిగ నెల్లెడ కీర్తినొంది యె
వ్వారికి తానెతోడు యనువైఖరితో నతిముఖ్యభూమికన్
కూరిమితో వహించెననుకూల జనాధిపు దీతడే యనన్ 79

ఆ తరవాత అతడు గొప్పశ్రమజేసి తానే గొప్ప నాయకుడు అనిపించుకునేలా ప్రధానపాత్రవహించాడు.

ఉ. పన్నుగ రాజకీయముల భాగ్యమునొందుచు సర్వకాల మా
పన్న జనావనుండనగ బంధువితండన "గాలినాయుడు
ద్యన్నవ కీర్తిచంద్రికల దర్పము నొందె జనానుకూలుడై
యెన్నికయయ్యె మంత్రిపదమీతని కోరి వరించె మీదటన్ 80

అతనికి రాజకీయ వైభవం ప్రాప్తించింది. దీనజనరక్షకుడు అనే పేరు ప్రజలహృదయాల్లో వ్యాపించింది. అతణ్ణి మంత్రిపదవి వరించింది. విస్తృతమైన కీర్తి లభించింది.

శా. వ్యాపారమ్ములు విస్తరిల్లె కృషి నిర్వర్తించు నొప్పందముల్
దీపించెన్ సిరిపల్లవించె యశమున్ తేజమ్ము రాణించె ని
క్షేపమ్మల్ సమకూరె నెల్లెడ మహోత్సేకమ్మునన్ భోగముల్
ప్రాపించెన్ తగు యోజనాగరిమచే రాజిల్లె మంత్రాంగమున్ 81

రాజకీయాల్లో పేరు పెరగుతున్నంతలో అతని వ్యాపారాలు కూడా వృద్ధి చెందాయి. ఆదాయం పెరిగింది. నిధి నిక్షేపాలు దొంతరలుగా వచ్చిపడ్డాయి. రాజకీయమంత్రాంగం కూడా బాగా కలిసివచ్చింది.

మ. ధనసౌఖ్యమ్ములు వృద్ధిజెందుకతనన్ దర్పమ్ము హెచ్చుయ్యె త
న్ననిశంబున్ జనులెల్ల పేర్కొన మహద్వ్యాప్తిన్ గనెన్! ఠీవి చొ
ప్పున పైవంకకు జూచి పల్కుటయు సంబోధించినన్ క్రొవ్వి ని
క్కి నటింపన్ జను చేష్టలబ్బె మదమున్ క్రీడించె లో నెల్లెడన్ 82

ధనసౌఖ్యాలు బాగా వృద్ధి చెందాయి. దాంతో దర్పం పెరిగింది. అందరూ తననే ఆశ్రయించటంతో బాగా పేరొచ్చింది. ఠీవి, దర్పం పెరిగాయి. కళ్ళు నెత్తికెక్కాయి. నిక్కు, టెక్కు బలిసింది.

ఉ. లక్షలకోట్లసొమ్ములు విలక్షణరీతినివచ్చి చేరగా
తీక్షణమయ్యెదృష్టి ; పరితృప్తి నశించి యఖండ వాంఛలున్
లక్షితమయ్యె; సొంపగు విలాసవతుల్ కనిపించినంతనే
యక్షయమైన వాంఛలు విహారముసేయ రమింప నెంచెడిన్ **83**

లక్షలకోట్ల సొమ్ములు అతనికి లభించాయి. దాంతో అతని చూపుల్లో అహంకారం పెరిగింది. ఎక్కడలేని కోరికలు అతనిలో రేకెత్తాయి. అందగత్తెలు కనిపిస్తే చాలు కోరికలు ఈరికలై వారిని పొందితీరాలనే వాంఛలు ఎక్కువైనాయి

చం. కను కనినట్టి కాంతను సుఖమ్మున తేల్చక నిల్వలేడు;నె
మ్మనమున కాముకుండగుచు మానినులన్ జతగూడి సత్వరం
బున మదనప్రహేళికల పొల్చి రహింపక నాగలేడు;చెం
తను రమణీమణుల్ నిలువ దర్పముజూపక వీడబోడెటన్ **84**

అతడు కంటితో చూసిన కాంతను సుఖపెట్టకుండా విడువడు. ఎల్లవేళలా కామజ్వరంతో పీడింపబడుతూ కాంతల పొందుకోసం తపిస్తూ వారిని మన్మథక్రీడలో ముంచితేల్చేవరకు ఆగలేడు.

మ. మహిళాసక్తిని రాజకీయమిషతో మాన్యమ్ముగాదిద్ది దు
స్సహ కామాగ్ని దహింప చేద్పడి మహా సంతోషమేపారగా
విహితమ్ముల్ సమకూర్చు నెల్ల యెడలన్ ;వీ దన్నచో మానినుల్
సహియించున్ సురరాజ వైభవ సుధా సాంగత్యమింపొగదా! **85**

తనకు మహిళలపై ఉన్న ఆసక్తిని రాజకీయాల వంకతో గౌరవప్రదంగా చూపుతూ, మహిళలకు ఎన్నెన్నో సౌకర్యాలను అందిస్తూ, వారినిఆకర్షిస్తాడు. ఇంద్రభోగాలు, తరగని సౌఖ్యాలు ఎవరికి మాత్రం రుచించవు?

ఉ. వీని సుఖమ్మదెవ్వరికి వృద్ధిగ లభ్యమగున్ ధరిత్రిలో
వీని ధనంబదెవ్వరికి వీసముచేతికిచిక్కు నిమ్మహిన్
వీని మదంబదెవ్వరి ప్రవృత్తిగ సాగును లోకమందెటన్
వీని యశంబదెవ్వరికి విస్తృతరీతి లభించు నింతగన్ **86**

వీనికి లభించినంత సుఖం ఎవరికి లభిస్తుంది ? వీనికి వచ్చినంతధనం భూమ్మీద ఇంకెవరికి వస్తుంది? వీడికున్నంత మదం లోకంలో ఎవరికి సాగుతుంది ? వీడికి వచ్చినంత పేరు లోకంలో ఇంకెవరికి వస్తుంది

మత్తకోకిల : గాలినాయుడటన్న లోకుల గంతులే ధర యంతటన్
మేలినాయకుడంచు నెల్లరు మించి హర్షము దెల్పెడిన్
నేలగావలెనీతడే యని యందరీతని నెంచుచున్
తేలియాడెదరాత్మలో పరితృప్తినొందుచు నెల్లెడన్ 87

గాలినాయుడు అంటే అందరికీ సంబరమే .ఎన్నాళ్ళైనా ఇతడే పాలించాలని అందరూ ఇతన్నే ఎన్నుకుంటారు.

మత్తకోకిల : గాలినాయుని అంతరంగము గాంచరెవ్వరు లోతుగా
మేలుమేలని యూహజేయుచు మెండుగా తలపోసెడిన్
వాలువాటమెరుంగుచున్ నయవంచనమ్మున ముంచుచున్
కాలవాహిని నీదసాగెను గాలినాయుడు వీరుడై 88

ఈ విధంగా గాలినాయుడు వ్యవహరిస్తుంటే ఎవ్వరూ అతని ఆంతర్యాన్ని గమనించలేదు. పైగా చాలా మంచివాడని మెచ్చసాగారు. వాటం కనిపెట్టి నాయుడు నయవంచనతో ప్రజల్ని నిలువునా ముంచసాగాడు.

మత్తకోకిల : ఇంద్రభోగములొందు వీడు మహేంద్రుమించినవానిగా
సాంద్రకీర్తిని బొందియున్ సువిశాలబుద్ధిని గోల్పడెన్
ఇంద్రియాలను నిగ్రహింపక ఇంతకింతకు సాగుచున్
కేంద్రమయ్యెను వింతరోగమొకింత సోకిన నొచ్చుచున్ 89

గాలినాయుడికి ఇంద్రభోగాలు సొంతమైనాయి. ఎన్ని భోగాలున్నా మంచిబుద్ధి లేకపోయింది. ఇంద్రియనిగ్రహం రవ్వంతకూడా లేకపోవటం వల్ల ఏదోతెలియని ఒక వింతరోగం అతన్ని అంటుకుంది.

మత్తకోకిల : కొత్తరోగము సోకువారలు కూడరాదట యెవ్వరిన్
హత్తుకొన్నను మాయరోగము యంటునంట సరాసరిన్
చిత్తగింపుము చేయినోటికి చిన్నగానందించినన్
హత్తెరేయని కమ్మికుమ్మెడి యంటురోగము ధాత్రిలో! 90

ఈ కొత్తరకం వ్యాధి వచ్చినవాళ్ళు ఎవ్వరితోనూ కలవకూడదట . ఎవ్వరినీ తాకరాదట. తాకితేచాలు ఈ వ్యాధి అంటుకుంటుందట. రోగినితాకినచేత్తో నోటిని తాకితే ఈ జబ్బు కుమ్మేస్తుందట. ఇదొక చెడ్డ అంటురోగం.

మత్తకోకిల : ఇట్టిరోగము వచ్చినంతనె ఇంటనుండవలెన్ సదా
కట్టివైచినరీతిగా నటుగాక నట్టిటుబోయినన్
ముట్టుకున్నటువంటి వారికి ముద్దిడున్ యమపాశమై
కట్టుబాటగు మందులేనిది కాటికంపెడి జబ్బురా! 91

ఈరోగం వచ్చినవాళ్ళు ఇల్లు కదలరాదు. కట్టేసినట్లుగా ఇంట్లోనే ఉండాలి. అటూయిటూ పోతే ఈ వ్యాధిగ్రస్తుణ్ణి ముట్టుకున్నవారికి యమపాశంలాగా ఇది అంటుకుంటుంది . ఇది మందులేని మాయరోగం. సోకిందంటే సరాసరి కాటికే పంపిస్తుంది.

మత్తకోకిల : **విశ్వమంతట వేనవేలుగ వీడుచుండిరి ప్రాణముల్**
నశ్వరమ్మగు సంపదల్ విడనాడకుండగ గాచునా?
శాశ్వతమ్ముగ దీనినొంచెడి సత్క్రియల్ భువి లేవురా!
ఈశ్వరుండె సమర్థుడౌ నిల నెట్టిదారిని జూపినన్ **92**

ప్రపంచమంతటావేలకువేలమంది ఈరోగంబారినపడి ప్రాణాలు వదులుతున్నారు. సిరిసంపదలు ఈ రోగుల్ని కాపాడలేకపోతున్నాయి.దీనికిశాశ్వతమైన నివారణోపాయం ఏదీ లేదు. పరమాత్ముడే ఈ రోగుల్ని కాపాడాలి.

మత్తకోకిల : **తోటివారిని నీవు దాకక దుర్భరమ్ముగ నొంటివై**
మేటిశుభ్రత నాచరించుచు మేనిభద్రత గాచినన్
పోటునొందక తప్పుకొందువు పూర్తిజాగ్రత బూనినన్
పోటుగాడను నా కదేమన పోటు తప్పదు సోదరా! **93**

ఈ రోగంవస్తేనీవు ఎవరినీ తాకరాదు. కొన్నాళ్ళపాటు ఒంటరిగా కాలం గడపాలి. శారీరక శుభ్రతను పాటించాలి. నేనో పోటుగాణ్ణి. నాకేం అనుకుంటే పోటు తప్పదని గుర్తుంచుకోవాలి.

మత్తకోకిల : **జబ్బువచ్చినవాని సంగతి చక్కగాదది వానితో**
నుబ్బియూగిన వారలందరు నుద్ధరింతురు జబ్బుతో
గబ్బురోగము సోకినంతనె కాలధర్మమె మార్గమౌ
నిబ్బరమ్ముగ నాత్మశక్తిని నింపి గెల్వగబోలెడిన్ **94**

ఈ మాయరోగం వచ్చినవాళ్ళ సంగతి మంచిగా ఉండదు. కానీ వాళ్ళతో కలిసి తిరిగినవాళ్ళు కూడా ఈ జబ్బును వ్యాపింపజేస్తారు. ఇది అంత సులువుగా తప్పించుకోగల వ్యాధి కాదు. ఆత్మశక్తినింపుకుని నిబ్బరంగా గెలవాలి

మత్తకోకిల : **కన్నువైచిన కాంతలందర కాటువేసిన నాయుడా**
నిన్నుముంచెడివేళ వచ్చెను నేరకర్మఫలంబిదే
తిన్నగా దిగెనంట రోగము తీవ్రబాణమనంగ నీ
వెన్నులో నిక లేచి నిల్చుట వీలుకాదు గణింపుమా! **95**

ఓ గాలినాయుడా! నువ్వు కన్నువేసిన కాంతలందర్నీ కాటువేశావు. దానిఫలితంగా నిన్ను ముంచేవేళ వచ్చింది. మందులేని ఈ రోగం ఒకబాణంలా నీవెన్నులోదిగింది. ఇక నీవు లేచి నిల్చోవటం వీలుకాదేమో !

లాటీవిటము : **భవదీయ కృతమ్మిహజన్మమునన్ బాధల్ సౌఖ్యంబుల్ తగ నిచ్చున్**
భువిజీవనమార్గము దప్పినచో బొందున్ దుర్మార్గుల్ ఫలితమ్మున్
నవజీవనవేదము మోదమిడున్ నానాభోగంబుల్ సమకూర్చున్
నివియన్ని దలంచుచుసాగునెడన్ నెచ్చోనైనన్ దోష మడంగున్ **96**

నీవు చేసుకున్న కర్మఫలం పుణ్యంగానీ పాపం గానీ ఈ జన్మలోనే పొందుతావు. ఇది తెలుసుకుంటే మంచిది.

లాటీవిటము : **పొనరించిన పాపములన్నియు నీ భోగ్యంబై జేరున్ నిహజన్మన్**
ననుపానముతో నెదురై నిలచున్ నావంతైనన్ దుష్కృతి జేయన్
ధనధాన్యములెన్నడు గావవురా ధర్మంబే నిన్ గాచునుభూమిన్
కనరా జలధీశ్వరునియ్యెడలన్ కారుణ్యాత్ముండై నిను గాచున్ **97**

(4 సగణములు+ మ,త,య,గణాలు; 1-13 యతి)

నీవుచేసినపాపాలుఈజన్మలోనేనీకుఅనుభవమౌతాయి.నీ దుర్మార్గం నీఎదుట అనుభవంగా నిలుస్తుంది. ధనధాన్యాలేవీ నిన్ను కాపాడవు. ధర్మం ఒక్కటే నీకు రక్ష. శ్రీ జలధీశ్వరస్వామియే నీకు దిక్కు.

లాటీవిటము : **అతినాస్తికతత్త్వము నీ గుణమై అత్యంతాహంకారము మీరన్**
గతిదప్పి చరించిన దుర్మతి నీ క్రౌర్యంబెల్లన్ లోకమెరుంగున్
మతిమాలినవారలు నీ గతికై మాన్యంబౌ మార్గంబులు జెప్పున్
హితమెన్నటికిన్ మతికెక్కదురా హేయంబౌ వృత్తుల్ రుచియించున్ **98**

ధనగుప్తుడా! నీవు పెద్ద నాస్తికుడవు. అహంకారం బలిసినవాడవు. నీ దుర్మార్గాలు లోకమంతటికీ తెలుసు. బుద్ధి తక్కువైనవారు నీ మంచిని కోరుతారు. వాస్తవ హితవు నీ చెవికెక్కదుకదా!

ధృవకోకిల: **మదము హెచ్చి రహింపగా నభిమానమింతయు వృద్ధియై**
పదవి కూర్చిన యాధిపత్యము భాగ్యవల్లరి పెంచగా
సుదతులందరిముందు తానొక సొంపుగాడను నుద్ధతిన్
వదరసాగెను గాలినాయుడు వాదులాడుచు హుంకృతిన్ **99**

(న,భ,ర,స,జ,జ,గ, గణాలు;1-12 యతి)

గాలినాయుడికి మదం బాగా హెచ్చింది.అహంకారం పెరిగింది. పదవివలన భాగ్యం పెరిగింది. స్త్రీలముందు తాను ఒకపెద్ద అందగాడననే ఔద్ధత్యంతో వాదులాడసాగాడు. ఇష్టం వచ్చినట్లు వాగటం మొదలుపెట్టాడు.

మత్తకోకిల: **మాటతీరున మంచివారని మన్ననల్ గడియించెడిన్**
నోటిమాటయె మంచినిచ్చి మనోభిలాషను తీర్చెడిన్

మాటకారితనంబె పుణ్యము మంచి దాని ఫలంబగున్
మాటయే మనకర్మశిల్పము మాతృభాష వరంబగున్ **100**

మాటతీరునుబట్టి మంచివాళ్ళనుకుంటారు. నోటిమాటయే మంచితనాన్నితెలుపుతుంది. మాటకారితనం అనేది ఒక పుణ్యఫలం. మన నోటిమాటను బట్టియే మన కర్మఫలం ఉంటుంది. మాతృభాష మనిషికి వరం .

మత్తకోకిల : **మాట చిత్కళయౌను మాటను మంచిగా ప్రసరించినన్**
మేటివక్తవు యౌదు వంతకుమించి వృద్ధి లభించెడిన్
మాటయే పరమాత్మరూపము మాట మన్నన పెంచెడిన్
మాట బుద్ధికి దర్పణం బనుమాన మింతయు లేదెటన్ **101**

మాటఅనేది ఒకగొప్పకళ. మంచిగామాట్లాడితే గొప్పవక్తవు కాగలవు . అంతకు మించి దానివలన భాగ్యవంతుడవు కాగలవు. మాట పరమాత్ముని స్వరూపం.అది గౌరవాన్ని పెంచుతుంది. అది మన బుద్ధికి అద్దం వంటిది. మాటను మించిన బహుమానం ఇంకెక్కడా లేదు.

మత్తకోకిల : **మాటచక్కన పుణ్యసంపద మాననీయత తోడ్పడన్**
మాటగౌరవమెచ్చి శక్తి సమాదృతంబుగ బొల్చెడిన్
మాట తిన్నగ సాగిపోవలె మంత్రయుక్తి గడించుచున్
మాటజారిన భంగపా టనుమానమింతయు లేదెటన్ **102**

చక్కగా మాట్లాడటం గొప్ప పుణ్యఫలం. గౌరవప్రదంగా మాట్లాడటం వలన మాటకు బలం పెరుగుతుంది. మాట మంత్రముగ్ధంగా ఉండాలి. తిన్నగా మాట్లాడాలి. మాటజారితే భంగపాటని గమనించాలి.

మత్తకోకిల: **మాట వీనులవిందుజేయును మంచిబుద్ధిని దెల్పెడిన్**
మాటమైత్రినిపెంచి యంతట మానవత్వము నింపెడిన్
మాట దారుణమైన రాక్షస మైకమున్ సృజియించెడిన్
మాట మంట రగిల్చి కాల్చి యమానుషంబుగ కూల్చెడిన్ **103**

మాటవీనులవిందుచేస్తుంది.మనుషులమంచిబుద్ధినితెలుపుతుంది.స్నేహంపెంచుతుంది.మానవత్వానికి చిహ్నంగానిలుస్తుంది.అదేదారుణమైతేరాక్షసత్వాన్నిసృష్టిస్తుంది.మాటవలనమంటలుకూడా పుడతాయి.

మత్తకోకిల : **మాటవేటగ మారకుండిన మంచిదక్కెడు నెంతయున్**
మాటమీటిన రాగసంపద మంచికావ్య చయంబగున్
మాటలోటు విషమ్ము చిమ్మును మత్సరమ్ములు హెచ్చెడున్
మాటలాడుట నేర్చిపల్కిన మానసమ్ము సుఖమ్మగున్ **104**

మాట్లాడటం అనేది వేటాడటం కాకూడదు. మంచిగా ఉంటే గొప్పకావ్యాలే అవతరిస్తాయి. అలాకాకుండా మాట లోటైతే భేదభావాలు కలుగుతాయి. అందువల్ల ఎలామాట్లాడాలో తెలుసుకుని మాట్లాడాలి.

ధృవకోకిల: **వదరుచుండిన గాలినాయుని వంకజూచిన వారలున్**
కదనవైఖరి వీనిగ్రమ్మెను కష్టమివ్విధి యంచు నె
మ్మది దలంచి సుదూర ముండిరి మౌనరాగము సాగగా
పెదవి విప్పక చోద్యమందిరి భీతిజెందుచు నాత్మలో **105**

ఇష్టంవచ్చినట్లువాగుతున్నగాలినాయుణ్ణి చూసినవాళ్ళు మౌనం పాటిస్తూ భయపడుతూ వింత చూడసాగారు.

ధ్రువకోకిల: **తనశరీరము క్రుంగుచున్నను తన్మయత్వము నొందుచున్**
తనివి తీరగ విందుపొందు సుథానుభావము లొందుచున్
మనసు కోరిన కాంతనొందుచు మానినీకుచ పంక్తిలో
ఘనవిహార మొనర్చుచుండెను గాలినాయుడు చొక్కుచున్ **106**

గాలినాయుని శరీరం ఎలా ఉన్నా వాని స్త్రీలోలుపత్వం తగ్గలేదు. తనివితీరా విందులు, పొందులు సాగించు కుంటున్నాడు. కోరిన కాంతల్ని అనుభవిస్తున్నాడు. పూర్తిగా ఆనందాన్ని అనుభవిస్తున్నాడు.

మ. సకియల్ మెత్తన తాకుచున్ పెదవులన్ సంధించి పోనాడుచున్
చకితాహ్వాన ఘనమ్ములౌ పిరుదులన్ సౌరెక్క తాటించుచున్
ప్రకటమ్మైన పయోధరాల నడుమున్ పల్మారులీ నాయునిన్
నొకరాయిద్దర నల్గురా పదుగురా యుద్దీప్తికై యేవురా ! **107**

గాలినాయునిపైబడి సరసాలతో ముంచెత్తేవారు ఒకరు ఇద్దరు కాదు. రకరకాల భంగిమలతో ఎందరో అతణ్ణి భోగిస్తున్నారు. శృంగారంలో ముంచితేల్చుతున్నారు .

చం. అవియువతీ యురోజములౌ యాతృతనానెడి కల్లుకుండలో
జవమున పీల్చుచుండె సరసార్ద్రత నోటికి తాకినంతనే
"శివము శుభమ్ము సుందరము" చెంతకుచేరిన భామలట్లుగా
కవయగసాగె నాయుడు సుఖాబ్ధిని దేలుచు కామవేదనన్ **108**

గాలినాయుడు కామవేదనతో యువతులను కూడుతూ శివము, శుభము, సుందరము అన్నీ వాళ్ళే అనుకుని సుఖసముద్రంలో మునిగితేలుతున్నాడు.

చం. బలము జవమ్ముగోల్పడి శవాకృతి నొందియు నీరసించియున్
నిలువగ లేకపోయినను నెచ్చెలి పొంగులుజూపి పిల్చి మ
మ్ముల కబళింపుమంచు ననుమోదముతో పరిహాసమాడుచున్
కిలకిల నవ్వి మన్మథునికేళికి బిల్చిన లేవకుండెడిన్ **109**

అతడికి బలము, వేగము సమస్తము నశించాయి. శవాకారంగా తయ్యారయ్యాడు . బాగా నీరసించాడు. నిలవలేక పోతున్నాడు. అలాంటివాణ్ణి అలవాటు ప్రకారం ఒక వేశ్య తన అవయవాల బింకం చూపించి తనను లొంగదీసుకో మని సవాలు చేసింది. కానీ అతడు లేవలేకపోయాడు.

ఉ. కార్యము సాగకున్నను సుఖమ్మును కాదనలేదు; కాంతలన్
వీర్యబలమ్మునన్ గెలుచు వీరతగోల్పడి బేలయయ్యు నా
హార్య విలాసభామినుల నానక నిల్వగలేదు; యాత్మలో
స్థైర్యమడంగినన్ యువతి సంగతిలేక మనంగలే డిలన్ 110

అతడు మదనకార్యాన్ని సాధించలేదు. అయినా సుఖాన్ని కాదనలేదు. స్త్రీలను వీర్యబలంతో గెలువలేదు. అయినా విలాసవతులను కవయక నిలువలేదు. కావలసిన శక్తిని కోల్పోయినా యువతులను వదలలేదు.

మ. సుఖరోగమ్ములు విస్తరిల్లి తనువున్ శోషిల్లె; షండత్వము
న్ముఖమై లోకువజేసె కాంతలకు; సంబోధించువారెల్ల స
మ్ముఖ మంత్రిత్వపదమ్ము జూచి ధనసంభోగమ్ములన్ గోరియే
సఖులై మోదమొసంగుచుండె నిట విశ్వాసమ్ము లేదేరికిన్ 111

సుఖరోగాలు ప్రాప్తించి అతని శరీరమంతా శుష్కించిపోయింది. అతనికి నపుంసకత్వం ప్రాప్తించి స్త్రీలకు లోకువచేసింది. అతనివద్దకు వచ్చేవారు అతనిమంత్రిపదవినిచూసి, ధనానికిఆశపడి, సంతోషాన్ని పంచేవారే కానీ ఎవరికీ అతనిపై విశ్వాసం లేదు.

చం. అమితసుఖమ్ము నొంద తనువెల్ల కృశించి హసించె;పాండురో
గము బడబాగ్నియై పొదల గాయముగా నొడలెల్ల ప్రాకె! "నీ
చము నితగాని జీవితము; చచ్చుటకన్న మరొక్కదారి గా
నము గద!"యంచు లోకులు మనంబున నాయునిగూర్చి యెంచెడిన్ 112

అతిసుఖం పొందటంవలన గాలినాయుడి ఒళ్ళంతా సుఖవ్యాధులు వ్యాపించాయి. ఇతనిజన్మ కడు నీచ మైనది. ఇలా బ్రతికేకంటే చావటం మంచిది అని జనులు గాలినాయుణ్ణి గురించి వ్యాఖ్యానించసాగారు.

చం. నరములు శక్తి గోల్పడి వినాశనకాలముదాపురించె నీ
పురుషుని కన్నరీతిగ నపుంసక లక్షణముల్ రహించె నం
దరు గమనించి ఛీ యనగ తప్పును దిద్దుకొనంగ దారికై
యరసెను గాలినాయుడు మహత్తరశక్తిని గల్గు వానికై ! 113

గాలినాయుడికి నరాల నిస్సత్తువ వలన నపుంసకలక్షణాలు కలిగాయి. అందరూ వాణ్ణి ఛీ కొట్టసాగారు. తన తప్పు దిద్దుకొనటానికి , తనకు దారి చూపటానికి ఎవరైనా మహాత్ములు దొరుకుతారేమోనని వెదకసాగాడు.

చం. పలువిధ వైద్యముల్ గనె నుపాయముగా తనరోగముక్తికై
తెలివిగ సేమమీయగల ధీరునికై వెదకించె దేశమం
దలుపు నెరుంగకుండ పరిహాసము లెన్నక నార్తి జెందుచున్
నలుదిశలన్ గలంచె తరుణమ్మున గాచెడువాని కోసమై! 114

గాలినాయుడు తనరోగ విముక్తికోసం రకరకాల వైద్యాలను పొందాడు. ఎంతోబాధపడుతూన్న నాయుడు తనకు క్షేమాన్ని ప్రసాదించగలవారికోసం- ఎవరెన్ని రకాలుగా ఎగతాళిచేసినా లెక్కచేయక దేశదేశాలు వెతికించాడు.

ఉ. చేసిన పాపకర్మమది చింతిలినంతనె తీరిపోవునే
మేసినగడ్డికిన్ ఫలము మేదినిలో లభియించకుండునే
దోసమెసంగు శీలమది దుష్టఫలమ్ముల నీకపోవునే
గాసిలియేడ్చినన్ కలుషకర్మము కాలునె దూలదీరునే ! 115

చేసిన పాపం విచారిస్తే తీరిపోదుకదా! తిన్నగడ్డికి ఫలితం అనుభవించక తప్పదు. దుశ్శీలత దుష్టఫలం ఇవ్వక పోతుందా! ఎంత యేడిస్తే మాత్రం పాపఫలం తప్పుతుందా ?

ఉ. ఆకృతిమారిపోయె తనువంత కృశించి నరాలు క్రుంగె; నిం
డా కలుషమ్ము పేరుకొని దంబమడంగెను ; దిక్కుమాలి లో
కైకవిభుండుదక్క మరి కర్త యొకండును లేడటంచు చిం
తా కలితాత్ముడై యడలె నల్వురి ముందట దేహశాంతికై! 116

గాలినాయుడు శరీరమంతా మారిపోయింది. అతని నరాలు క్రుంగిపోయాయి. చేసినపాపఫలం ఒళ్ళంతా పేరుకొంది . ఇక తనను కాపాడే దిక్కు పరమాత్ముడు తప్ప వేరులేరని అందరిముందు ఏడ్వసాగాడు.

శా. అయ్యోపాపమటన్నవాడొకడు తోడైరాకపోయెన్ గదా!
అయ్యారేధనవంతుడీతడని సాహాయ్యంబు లేరెవ్వరున్
భయ్యా మంత్రి వటంచు తోడుపడు సావాసుండు రా డెవ్వడున్
సయ్యాటన్ మురిపించు జాణలెవరున్ సైదోడు కా రెవ్వరున్ 117

ఇటువంటి దుస్థితిలో గాలినాయుడికి అయ్యోపాపం అని ఒక్కడైనా తోడు రాలేదు. మహాధనవంతుడుగదా అని ఒక్కడుకూడా సహాయం రాలేదు.అరె భయ్యా నువ్ మంత్రివి కదరా అని ఒక్క సావాసగాడుకూడా తోడు రాలేదు. ఈ దుస్థితికి తెచ్చిన వేశ్యాశిఖామణులుకూడా ఎవ్వరూ మరిపించటానికి రాలేదు.

శా. కుయ్యో మొఱ్ఱో యటంచు నేడ్చినను నే కుంకైన రాదేలనో
వయ్యారంబును వంచిపంచిన సతుల్ వైళంబ రారేలనో
అయ్యా బాబనియేడ్చినన్ జనులు సాహాయ్యంబు నీ రేలనో

పొయ్యేకాలము దాపురించి యడలన్ పోకార్చదే యెవ్వడున్! 118

కుయ్యోమొఱ్ఱో అని యెంత ఏడ్చినా ఎవ్వత్తే రావటంలేదే ?ఇన్నాళ్ళూ వయ్యారాలని వంచి పంచిన వేశ్యలంతా ఏమయ్యారు! అయ్యాబాబూ అని ఎంతగా ఏడ్చినా ఎవరూ సహాయపడటంలేదేం ? పోయేకాలం వచ్చినా ఏ ఒక్కడూ వీడి బాధను తీర్చడేం ?

ఉ. దేవుడుగీవుడా యనుచు తిమ్మెరలాడిన గాలినాయు దే
భావనతోడ రెచ్చెనొ యవారితసత్యము వానివంకనే
దైవిక కర్మబంధముగ దర్శనమిచ్చెను; కండలెండినన్
దేవుడుగుర్తువచ్చెనట దివ్యమహత్త్వము విశ్వసింతురా! 119

శరీరంలో మదం జవజవలాడినంతకాలము దేవుడా గీవుడా అని త్రుళ్ళిన గాలినాయుడు ఏ మదంతో అలా వాగాడో అదే భావం వాని కర్మబంధమై ఎదురుగా కనిపించింది. ఎక్కిన పులుపు దిగినతరువాత దేవుడు గుర్తుకువచ్చాడు. చూశారా దేవుని మహత్త్వము !

ఉ. కండబలమ్ము గల్గునెడ కానకపోయెను దివ్యతత్త్వమున్
మెండుగ రోగబాధలవి మీదకువచ్చిన తాళలేక నో
రెండిన వాడునై ధర నిరీక్షణజేయుచు నుండె "దేవుడా
దండినొసంగి నావలని తప్పులుగావుమటంచు నేడ్చుచున్ 120

ఒంట్లోబలం ఉన్నంతవరకు దేవుడు దేవతత్వంవంటి మాటలు రుచించలేదు. పూర్తిగా రోగాలు మీదికెక్కినవేళ దిక్కెవ్వడా అనుకుంటే దేవుడు గుర్తొచ్చాడు. ఇప్పుడు ఏడ్చియేడ్చి నోఱెండి తప్పులు గాయుమని రోదిస్తున్నాడు.

ఉ. కాలముసాగివచ్చునెడ కన్పడ జాలడు దేవుడెయ్యెడన్
కాలము కాలనాగువలె కాటొనరించిన గుర్తువచ్చు దే
వాలయమేరికైన! పరిభావముదీరిన నాత్మశక్తియే
మేలుగ గాచెనంచు తనమేనిబలమ్మును విశ్వసించెడిన్ ! 121

కాలంకలిసివచ్చినంతవరకు దేవుడితో పనిలేదు. వాడుకనపడడు. కాలం కాటేసినప్పుడే దేవుడు, గుడి గుర్తొస్తాయి. అంతజరిగి ఆపదలు తొలగినతరువాత తన శక్తియే తనను కాపాడిందని విఱ్ఱవీగుతారు.

ఉ. సాగిన యంతకాలము రసార్ద్రతదేలిన గాలినాయుడీ
యోగమునొంది యిప్పుడు నయోగ్యునివోలె కృశించుచుండె సం
భోగ ఫలమ్ము రోగముగ పోడిమి గూల్చిన హేతువాద మూ
రేగెనొ!మూలదాగెనొ! మరేమయెనో గమనింపు మియ్యెడన్ 122

సాగినంతకాలం వేశ్యాసంపర్కంతో కాలంగడిపిన గాలినాయుడు ఇప్పుడు వాటి ఫలితాన్ని అనుభవిస్తున్నాడు. అతడు నమ్మిన హేతువాదం యెక్కడికి ఊరేగిందో ! యేమూలదాగిందో! ఇంకా యేమైందో గమనించండి.

శా. పూజల్ గీజల నేమియౌననిన నీమూఢాత్ముడీ వేళకున్
జేజేలొగ్గుచు నేడనుంటివనుచున్ చింతిల్లుచున్ దేవుడా
యీ జన్మంబున చేసినట్టి ఫలమే యీరీతిగా రోగమై
నా జీవమ్ము హరించుచుండెననుచున్ నానాగతిన్ కుందెడిన్ **123**

పూజలాగీజలా? వీటివల్ల యేమౌతుంది అనిఆక్షేపించినమూఢుడు ఇప్పుడు దణ్ణం పెడుతూ ఎక్కడున్నావురా బాబూ అంటూ ఏడుస్తూ వెతుక్కుంటూ తనగతికి అనేక విధాలుగా గాలినాయుడు బాధపడసాగాడు.

ఉ. ఆతని రీవి దర్పములు నాతని మంత్రిపదమ్ము సంపదల్
ప్రీతినిగూర్చు నెచ్చెలులు పెన్నభిమానముజూపు లోకులున్
చేతన నింపునట్టి నవజీవన శక్తియు నేమియయ్యె! నే
డాతనికిట్టి దుర్భర యనర్థములేల ఘటిల్లె నెంచుమా ! **124**

గాలినాయుని రీవిదర్పం పదవి జవరాళ్ళు అభిమానులు కండకావరం అన్నీ యేమయ్యాయి? గమనించండి

ఉ. భక్తిని గేలిజేసితివి; పచ్చిగమెచ్చి సుఖానుభూతినిన్
రక్తినిమించుభోగములు రాజిలనెక్కడ లేవటంచు నీ
శక్తియె నీకు తోడనుచు శైశవభాషల తూలనాడి యా
శక్తి నశింప నేడు దిగజారితివేమి ఫలమ్ము నాయుడా ! **125**

భక్తిని ఎగతాళి చేశావు. పచ్చిపిచ్చి సుఖాలే సర్వస్వం అన్నావు. నీ శక్తియే నీకు తోడనుకున్నావు.

ఉ. ఆతని రాజకీయ మరియాదలు వానిని కావగల్గెనే ?
ఆతని భోగభాగ్యముల హారతి వానిని బ్రోవగల్గెనే
ఆతనిగొల్చు సేవక జనావళి వానికి రక్షగూర్చిరే ?
ఆతని సౌఖ్యకారకులు హాయిగ వాని సుఖింపజేసిరే ? **126**

అతని రాజకీయాలు అతణ్ణి కాపాడగల్గాయా ? అతని భోగభాగ్యాలు గానీ అతని సేవకులుగానీ అతనికి సుఖాన్నిచ్చిన వేశ్యలుగానీ అతన్ని సుఖపెట్టగల్గారా ? రక్షించగల్గారా?కాపాడగల్గారా?

ఉ. నాస్తికవాదిగా నిలచి నాశనమయ్యెడువేళ "దేవుడా
యాస్తికవాదినైతిని సహాయముజేయము బ్రోవ రమ్ము దే
వా! స్తుతియించుచుంటి"నని భక్తిగ పల్కుట వింతగాదె! నీ
నాస్తికవాద మెవ్వలన నాశనమయ్యెనొ గాలినాయుడా ! **127**

ఇంతకాలం నాస్తికవాదినని వాదించి చివరకు వినాశనకాలం సమీపించినప్పుడు రక్షించమని కోరుతున్నావే! దేవుణ్ణికాపాడరమ్మనిస్తుతిస్తున్నావే!ఇదిచాలావింతగాఉంది.నీనాస్తికవాదంఏమైంది గాలినాయుడూ!

మత్తకోకిల: **గాలినాయు డొకండె కాదు సుఖాలనుండిన నెవ్వరున్**
తూలనాడెద రీవిధంబున దోసమెంచరు యాత్మలో
వాలుగాలికి నావ సాగిన వంకచూపుల నిక్కెడిన్
కాలమే ఝుళిపించి నిల్చిన ఖండితంబగు జీవముల్ **128**

ఈ గాలినాయుడు ఒక్కడే ఇలాంటివాడుగా చెప్పటం లేదు. నిజానికి గాలినాయుడు అనేది ఒక కల్పిత పాత్ర ఒకానొక పేరు. అది ఎవరినీ ఉద్దేశించింది కాదు. కనుక సుఖాల్లో ఉన్నవాళ్ళెవరైనా తప్పులు తెలుసుకోకుండా ఇలాగే తూలనాడుతారు. వాలుగాలికి పడవ కులాసాగా సాగుతున్నప్పుడు ఎన్నిరకాల వంకరచూపులైన వస్తాయి. కాలం ఎదురుతిరిగి కత్తి ఝుళిపించినప్పుడు ప్రాణాలు ఎగిరిపోతాయి.

మత్తకోకిల: **జీవనంబు రహించుచుండిన చేవగల్గుదునందువే**
జీవయాత్ర యడంగునంతట ఛిద్రమై నసియింతువే
నీవు కారణమౌదువే ధరణీస్థలంబున నెందునన్
భావజాలముకన్న నీయెడ భాగ్యమున్నదెజూడగన్ **129**

నువ్వెలాగోబతికేస్తున్నానాకుచాలాశక్తిఉందిఅంటావు.అదే నీ బ్రతుకు చినిగిపోయినప్పుడు నీవు కూడానశించి పోతావు.లోకంలోదేనికీనీవుకారకుడవుకాదు. కేవలం మాటలు చెప్పేవరకే గానీ నీ ప్రయోజకత్వం ఏమీలేదు.

మత్తకోకిల: **మూలకారణ మెవ్వడాతని ముందుగా తలపోయరా**
గోలతప్ప మరేమి నీ వొనగూర్పలేవు గ్రహించరా
చాలగొప్పలు చెప్పుకొందువు సత్యమున్ దలపోయరా
మేలుగల్గు పథంబెరుంగుము మిన్నయౌ నొకదైవమే ! **130**

సృష్టియంతటికి మూలకారణమైనవానిని మొదటగా తెలుసుకో. అమాయకత్వంచేత నీవు గోలచేయ గలవేగానీ మరేమీ చేయలేవు. గొప్పలు చెప్పుకునేబదులు యథార్థాన్ని గ్రహించు.మేలుకలిగే దారిని తెలుసుకో

మత్తకోకిల: **ముక్కుమూసి జపమ్మొనర్చుట మౌఢ్యమౌనను నాయుడే**
పక్కదారినిబట్టి తూలిన భావశూన్యుడు నాయుడే
దిక్కుమాలితి నన్నుగావుము దేవుడాయని యేడ్చుచున్
మ్రొక్కుచుండె నీదేమివాదము రూఢిజేయుదు నెమ్మదిన్ **131**

ముక్కుమూసుకుని జపం చేయటం మూఢత్వం అని తూలనాడిన గాలినాయుడే ఇప్పుడు పక్కదారికి వచ్చి దిక్కుమాలి ఉన్నాను నన్ను కాపాడరా అని అదే దేవునికి మ్రొక్కుతున్నాడు. ఇదేం వాదమో గమనించండి .

చం. అతి సుఖలోలుడై యలసినట్టి శరీరము నెట్టివైద్య సం
హితయును కావలేదన సహింపగజాలక దిక్కులేక న
మ్మితి నిను దేవుడా యనుచు మేకొని భక్తి దలంచుచున్న సం
గతి గమనించుడీ ! జనుల కర్మల మూలము బుద్ధియేగదా! 132

అతిసుఖం పొందటంవల్ల శిథిలమైన నాయుడు తనదేహాన్ని కాపాడగల వైద్యం యేదీ లేకపోవటం వలన దిక్కులేక ఇప్పుడు భక్తితో దేవుణ్ణి శరణువేడాడు. గమనించండి. జనులకర్మకు మూలం అతని బుద్ధియేగదా !

ఉ. చేసినదంతచేసి కడు చేటగుకాలము దాపురించినన్
గాసి నణంగుచున్ తనను గాచెడి మార్గము దేవుడంచు స
న్యాసి పథాన దేవుని సహాయముకోరి భజించినంతనే
వీసము నాలసింపక నభీష్టము లిచ్చునె దేవు డెయ్యెడన్! 133

చేసినదంతాచేసి చివరకు కష్టకాలం వచ్చినప్పుడు ఆ కష్టాలను పోగొట్టి తనను గాచేవాడు దేవుడే అని, సన్యాసివలే దేవుని సహాయం కోరితే అతడు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కోరినకోరికలన్నీ తీర్చేస్తాడా !

ఉ. ధర్మ పరంపరా పథము దప్పక జీవితమెల్ల నిష్ఠతో
నిర్మల బుద్ధితో గడపి నిక్కముగా భగవాను నాత్మలో
కూర్మిని నమ్ము వారల నకుంఠిత దీక్షల వెన్క వారి దు
ష్కర్మల జూచు దేవుడు సుఖమ్ముల నెట్లొనగూర్చు నేరికిన్ ? 134

జీవితాంతము ధర్మమార్గంలోనడిచి, నిర్మలబుద్ధితో భగవానుణ్ణి నమ్మికొల్చిన వారిని కూడా పరీక్షించి, వారిలో అధర్మకర్మం ఏమైనా ఉందా అని చూసే భగవానుడు ఎవరికైనా సుఖాలను ఎలా ఇస్తాడు ? దానికి కొంత సుకృతంఉండాలి. అనుభవంఅనేది జన్మజన్మల సంపాదనం .

ఉ. కర్మమదొక్కటే జనుల గాచెడి దైవము; కన్నుగానకన్
దుర్మతులై చరించుచు మదోద్ధతి నీల్గెడి పాపవర్తులన్
కర్మమె గాల్చివేయును; సుఖమ్ము లవమ్ము లభింపకుండ దు
ష్కర్మమె ముంచివైచెడు నగాధమునన్ యమదుఃఖ సంహతిన్ 135

చేసిన కర్మమదొక్కటే జనులను కాపాడే దైవం. కన్నుమిన్ను కానక దుర్మార్గంగా ప్రవర్తిస్తే అతడు చేసిన కర్మమే అతణ్ణి తుదముట్టిస్తుంది. యమలోకపు దుఃఖాలన్నీ అతడిని చుట్టుకుంటాయి.

ఉ.చేసిన పాపకర్మములు చేటొనరింపగ బొంచియుండి సం
త్రాసము కల్గజేయ నతిదైన్యముతో కడుభీతినొంది యా
యాసముతోడ బెగ్గడిలి యా జలధీశ్వరు ముందు నిల్చి వి

శ్వాసముతో భజించె తన బాధల దీర్చుమటంచు నాయుడున్ 136

చేసినమహాపాపాలు చేటుచేయగానే భయపడి, జలధీశ్వరస్వామితో తనబాధల్ని తీర్చమని ప్రార్ధించసాగాడు

చం. పిలచినవెంటనే పలికి భీతినిమాన్పుట కీత డిద్దరన్
సలలిత పుణ్యమూర్తియొకొ! సన్నుత భక్తవరేణ్యుడౌనొకో
తలపుల శిష్టవర్తనము దాల్చిన మాన్యుడొ! దిక్కులేక బా
ధలు భరియింపలేక శివదైవముగూర్చి తలంచుచుండెడిన్ 137

దేవుడారమ్మనికాపాడుమని పిలవగానే రావటానికి ఇతడేమైనా మహాపుణ్యాత్ముడా!లేక గొప్పభక్తుడా! మంచి ఆలోచనలుకలిగినగౌరవనీయుడా? ఏ దిక్కూలేక శివుణ్ణి తలచుకుంటున్నాడు. అంతకన్నా వేరేమీలేదు.

ఉ. దంభములెల్ల మాసినవి; దైన్యముతోడ శివధ్వజాధ్వ సం
స్తంభనచే మహేశునెడ తత్పరతన్ శివనామ వాగ్ఝరీ
జృంభిత మానసుండగుచు చిత్తమునీశ్వరుపైన నిల్పి యా
శాంభవి నాత్మలో నిలిపి సన్నుతి సేయగసాగె నంతటన్ 138

ఇప్పటివరకు గాలినాయుడు ప్రదర్శించిన అహంభావంపోయింది. దీనత్వంతో శివాలయం లోని ధ్వజస్తంభం దగ్గరతాత్పర్యభావంతోశివశివాఅంటూఅమ్మవారిపైకూడా దృష్టిని నిలుపుతూ ధ్యానించటం మొదలుపెట్టాడు.

ఉ. సాగినయంతకాలము నసాధ్యములేదని విఱ్ఱవీగితిన్
సాగని దేహయాత్ర యిట చచ్చువడన్ భవదీయరూపమే
రోగనివారకంబనుచు రూఢిగ కన్పడుచుండె నీశ్వరా
నా గతి యేమిరా? నను ననాధునిజేయక తోడు నిల్వరా! 139

సాగినంతకాలం ఎదురులేదని విఱ్ఱవీగాను. కాలం ఎదురుతిరిగి నా జీవితమే చచ్చుబడింది. ఇప్పుడు ఎక్కడ చూసినానీరూపమేకనబడుతోంది.నన్నుదిక్కులేనివాణ్ణిచేయకనాకుతోడునిలువుముశివాఅంటూ ప్రార్ధించాడు

మ. కడు దుష్టాత్ముడనై చరించితిని ; సంఘమ్మెల్ల ఛీ కొట్టె; ని
య్యెడ రోగమ్ములు దాపురించి తనువున్ హీనాతిహీనమ్ముగా
కడముట్టన్ దునుమాడుచున్నవి శివా! కారుణ్యమున్ జూపి దు
ష్టుడనై త్రుళ్ళిన నన్ క్షమించర మహాక్షోభన్ నివారించరా ! 140

నేనుచాలాదుర్మార్గుడనై ప్రవర్తించాను; నన్ను సమాజం అంతా ఛీకొట్టింది.రోగాలు దాపురించి నాదేహాన్ని నాశనం చేస్తున్నాయి.శివా! నాయందు దయ గలిగి నన్ను క్షమించవయ్యా ! నా ఆపదను నివారించవయ్యా!

శా. అంగంబంతయు పుండ్లయెన్ సుఖవిహారానంగ సంభోగముల్
పొంగెన్ దేహమునిండ; రక్తకణముల్ పోటెత్తి గాఢమ్ముగా
శృంగారార్భటి దోషముల్ కుదుపుచున్ ఛిన్నమ్ముగావించి నే

లంగూల్చెన్ గద నన్ను! జాలమికనేలాశంకరా! కావరా! **141**

ఇష్టంవచ్చినట్టుసుఖాలుఅనుభవించటంవల్లరోగాలు నాదేహం నాశనం చేస్తున్నాయి. నన్ను కాపాడవయ్యా!

ఉ. దైహికవాంఛలన్ మునిగి దర్పము జూపితి; నేడు దీనతన్
దేహియటంచు నీయెదుట దిక్కునుమొక్కునులేక నిల్చితిన్
పాహి పరాత్పరా యనుచు పన్నగభూషణ నిన్నువేడుచున్
మోహము సర్వమున్ విడచి మ్రొక్కుచునుంటిని కావరా శివా! **142**

ఇంతవరకు శారీరకవాంఛలలో మునిగి అహంకారాన్ని చూపించాను. ఇప్పుడు సర్వభ్రష్టుడనై దేహీ అంటూ నీ ముందు నిలచాను.మోహవాంచలన్నిటినీ విడచి నీకు మ్రొక్కుతున్నాను. నన్ను కాపాడవయ్యా!

ఉ. చక్కని కన్నెలంచు సరసాలమునింగితి; కందజూచి కై
పెక్కి రమించితిన్; జఘనపీఠము సౌఖ్యమటంచు వాలి నే
చిక్కితి పంజరమ్మున నశింతునటంచు నెరుంగలేక సౌ
రెక్కిన భామినీమణుల రీతి నెరుంగకపోతిరా శివా! **143**

అందగత్తెలుదొరికారనిసరసాల్లోమునిగితేలాను.వారికండలుచూసికైపెక్కివాళ్ళతోరమించాను.వారి జఘనమే సుఖమందిరమని అనుభవించాను. అదే పంజరమని తెలుసుకోలేకపోయాను..చిక్కాను. కాపాడరా శివా!

సీ. కన్నుజూచినకాంత గవయక విడిచిన
కామదేవుడు సైపగలడె యనుచు
కౌగలించిన నింతి గబళింపకుండిన
ఘనతయే మగటిమి కలిమి ననుచు
కవ్వించి బిల్చిన కామినిన్ విడచిన
కమ్మవిల్తుని శక్తి కనలు ననుచు
కోరివచ్చినకాంత కోర్కె తీర్చనియెడ
కోవిదుననుపేరు కుములు ననుచు
గీ. శక్తిమొత్తము సంధించి సతులనెల్ల
లేవలేనట్లు పడగొట్టి లెస్స యంటి
నిందు తప్పేమొ యానాడు నెరుగనైతి
రోగమీనాడు దగుల విరాగినైతి ! **144**

కంటబడినకాంతను కవయక విడువలేదు. అది మగతనానికి చిహ్నం అనుకున్నాను. దానిలో తప్పేమో ఆనాడు తెలియలేదు. ఇప్పుడు ఒంటినిండా రోగాలు తగులుకుని ఇలా నాశనం అయ్యాను అని బాధపడ్డాడు.

అభినవ తామరసము: **నడిచినదారులు నాశ పథమ్ముల్**
(తోవకము) **గడచినరోజులు కల్మషమయ్యెన్**
విడువని పాపము వేదనగూర్చెన్
బడలితి శంకర ! పాహి మహేశా! 145

(స,జ,జ,య,గణాలు; 8వ అక్షరం యతి)

ఇప్పటివరకునేను నడిచినమార్గం తప్పుఅనిగ్రహించాను.గడిచినరోజులన్నీదుర్దినాలే . నేనుచేసినపాపం నన్ను విడువకుండానావెంటనేవచ్చినన్ను వేధిస్తోంది.నా శక్తి సన్నగిలిపోయింది. శంకరా పాహిమాం అంటున్నాడు.

అభినవ తామరసము: **శివశివశంకర చిన్మయరూపా**
(తోవకము) **భవకరుణాన్విత భద్రము కల్గన్**
యవిరళభక్తిని యాత్మనుతింతున్
భువి నను గావుము పూర్ణదయాళూ ! **146**

హే శంకరా! నాకు భద్రతను కలిగించవయ్యా ! నీవే దిక్కని ప్రార్థిస్తున్నాను. నాయందు దయచూపవయ్యా !

అభినవ తామరసము: **మదమున క్రొవ్విన మాటలనంటిన్**
(తోవకము) **హృదయమునందున నెంచకుమయ్యా**
సదయుడవీవు ప్రసన్నముగావా !
మదిననుగాంచు ముమాధవ రావా! **147**

ఇప్పటివరకు మదగర్వంచేత ఎన్నెన్నో మాటలన్నాను.వాటిని మనస్సులో తలంచకు. నన్ను కాపాడవయ్యా !

అభినవ తామరసము: **సహనమెరుంగక సాగితిగానీ**
(తోవకము) **యిహపరమింతయు నెంచకపోతిన్**
అహమున త్రుళ్ళినదంతయు నణగెన్
మహిననుగావు ముమాపతి పాహీ **148**

గమనించే బుద్ధిలేక ప్రవర్తించాను. ఇహపరాలను తెలుసుకోలేకపోయాను. అహంఅణగారింది. పాహిమాం

అభినవ తామరసము: **యువతులగాంచిన యూపున నీతిన్**
(తోవకము) **గవలితి నయ్యెడ కర్మమెరుంగన్**
శివశివ కామము శీలమడంచెన్
భవ! భయమయ్యెను భద్రమునీరా! **149**

వయసులోనున్న యువతులను చూసేసరికి నీతినియమాలను పాటించలేకపోయాను. శీలాన్ని చెడగొట్టుకున్నాను. ఇలాంటి కర్మ పడుతుందని తెలుసుకోలేకపోయాను. నన్ను క్షమించి కాపాడుశివయ్యా!

పాలాశ దళము : **నినుమదిని నిలిపితిని నియమ మెసగంగన్**
మనసు నిను మరిమరియు మదిని తలపోసెన్
కనుగొనుము కలరవము గల మదిని దేవా
వినయమున విధివలయ వివరమును గంటిన్ **150**
(5 నగణములు–అనగా 15 లఘువులు+గ,గ, గణాలు;1–11 యతి)

ఇప్పటికినిన్నునామనస్సులోనిలుపుకొనగలిగానుదేవా!మరిమరినామనస్సునిన్నే ధ్యానిస్తోంది. విధివివరాలను నేను ఇప్పటికీ తెలుసుకో గలిగాను. నా మనస్సులో ఉన్న బాధను గమనించి నన్ను కాపాడవయ్యా!

పాలాశ దళము : **పరమ పదమున నిలచు భవహర మహేశా**
కరుణనెద నిలుపుకొని కనుగొనుము దేవా!
శరణమని నిలచితిని శరణుమిదుమయ్యా!
వరదుడవుగద జనుల వగలు తొలగింపన్ **151**

హే పరమేశ్వరా! నీవు కైలాసాన కొలువుందువుగదయ్యా! కరుణాహృదయంతో నన్ను కాపాడవయ్యా! నేను శరణు కోరుతున్నాను స్వామీ! నీవు జనులకు వరములనిచ్చి కష్టాలను పోగొట్టే వరదుడవు గదయ్యా!

మణిగణనికరము: **మదమునచెలగితి మనసున నినునే**
పదపడి దలపక పలుదెరగులుగా
మెదలితి హరహర మెలకువచెడగా
సదయుడ కనుగొను సకలము దయతో **152**

(4 నగణములు + 1 సగణము; 9 వ అక్షరం యతి)

అన్నినాళ్ళూమదంవల్ల నిన్ను మనస్సులో తలచుకోలేదు. అయినా సరే దయావంతుడవైనన్ను కాపాడవయ్యా!

మణిగణనికరము: **ధనబలమదమున తడబడు నడతన్**
పనిగొని నడచితి పలుమరునిలలో
కనుగొని నడుపుము కలతలు దొలగన్
నినుమది దలచితి నియమములెసగన్ **153**

ధనమదంతోను , బలగర్వంతోనూ అనేకచెడ్డపనులను చేశాను. ఫలితంగా అనేక ఇడుములపాలయ్యాను. దయతో నన్నుకనుగొని కాపాడవయ్యా శివా!

చం. అనితన హీనగాధ పరిహాసములాడుచు వెక్కిరించుచున్
మనసునదోప చింతిలుచు మానముగాచుకొనంగలేక నీ
శుని యెదుటన్ చరిత్రగతి చోద్యముజెప్పి భరింపలేక నా
త్మను కడు సిగ్గుజెందుచు నుమాపతి సన్నిధి క్రుంగెనార్ద్రతన్ ! **154**

ఆవిధంగా తన హీనగాధను తలచుకొని దిగులుపడుతూ దానంతటినీ పరమేశ్వరునిముందు ఒప్పుకుని సిగ్గుతో కుంచించుకునిపోయాడు .

చం. తనయెదుటన్ శివార్చనల తత్పురుషున్ తనియించుచుండుటన్
గనుగొని మంత్రసూక్తముల కంఠగతమ్మొనరించుకొంచు నీ
శుని కనులారగాంచుచు నిజోక్తముగా పలుమార్లు "రుద్రగీ
తిని" జపియించసాగె జలధీశ్వరు దార్ద్రత నొందునట్లుగన్! **155**

అప్పుడు జలధీశ్వరాలయంలో స్వామిని పూజిస్తూ చెబుతున్న మంత్రసూక్తాలను ఇతడు శ్రద్ధగా విన్నాడు. వాటిని మననం చేశాడు. తానుకూడా వాటిని పునరుక్తం చేశాడు. అలా స్వామి పులకించేట్లుగా రుద్రగీతిని జపించాడు.

మ. భ్రమలున్ వీడగ లోకనాయకుని పేరన్ రుద్రగాయత్రి మం
త్రము సర్వమ్ము గ్రహించి లక్ష్యముగ నద్దానిన్ ప్రయోగించి చి
త్తమునన్ బాలను శంకరున్ నిలిపి రుద్రాధ్యాయ సంకీర్తనా
ధ్వముతో నెమ్మది గాలినాయుడు జపధ్యానమ్ములన్ బూనెడిన్ **156**

గాలినాయుడికి ఇప్పటివరకు కలిగిన భ్రమలన్నీ తొలగిపోయాయి.ఆలయంలో భక్తులు జపిస్తున్న రుద్రగాయత్రీ మంత్రాన్ని శ్రద్ధగావిని ఒంటపట్టించుకున్నాడు.మనసులో బాలాశంకరులను నిలుపుకున్నాడు. తదేకంగా రుద్రాధ్యాయాన్ని జపించటం మొదలుపెట్టాడు.

మత్తకోకిల: **చిత్తమందున చిద్విలాస విశేషసంపద నిండగా**
మత్తకోకిల మౌనభక్తి సమన్వితంబుగ యోగ సం
పత్తిచే పరమేశ్వరున్ తనభావమందు జపించున
ట్లత్తరిన్ భజియింపసాగెను లక్ష్యశుద్ధి రహింపగన్ **157**

అతనిమనసులో ఈశ్వరుని లీలావిశేషాలు నిండిపోయాయి. భక్తితో మదించిన కోకిల మౌనంగా యోగదీక్షతో ఈశ్వరుణ్ణి ధ్యానించినట్లుగా నాయుడు శుద్ధికలిగిన లక్ష్యంతో ఈశ్వరుణ్ణి గురించి జపించసాగాడు .

మత్తకోకిల: **దేహమందున రుద్రునంశలదీర్చి తానొకరుద్రుడై**
పాహిపాహియటంచు రుద్రుని భక్తితో భజియింపగా
మోహసంతతి వీడిపోయి విముక్తి మార్గము కన్పడెన్
దేహికింతకు మించి వేరొక దివ్యమార్గము లభ్యమే ? **158**

తనదేహమంతటారుద్రాంశలనునిలుపుకుని."నారుద్రోరుద్రమర్చయేత్"అన్నట్లుతానేరుద్రుడైఆపరమేశ్వరుణ్ణి శరణుకోరుతూధ్యానించగాఅతనికితానుచేసినమహాపాపంనుంచికొంతవిడుదలయ్యేమార్గం కనిపించింది.

మత్తకోకిల: **పూర్వకాలమునందు నాతని పూర్వలాహిరులెవ్వియో**
సర్వమున్ విడనాడి నేడొక సజ్జనుండను రీతిగా
నుర్వరన్ గనిపించుచున్ శివ హోమతత్పరుడై గుడిన్
సర్వమంత్రములందుకొనివిశ్రాంతితో జపియించెడిన్ **159**

ఇంతకుముందు అతని కేళీవిలాసాలేమో గానీ ఇప్పుడు అతడు వాటన్నిటినీ మరిచిపోయి ఒక సజ్జనునివలే గుడిలో భక్తులతోపాటు హోమాలలో పాల్గొంటూ అన్ని మంత్రాలనూ అందిపుచ్చుకుంటూ జపించసాగాడు.

మత్తకోకిల: **ప్రాణమున్ బిగబట్టి గాలి నుపాసనన్ నడిపించుచున్**
జాణయౌ ఋషిపుంగవుండనజాలి దీక్ష వహించెడున్
పాణిపద్మము లా మహేశ్వరు భక్తితో భజియింప ని
ర్వాణ మార్గ మెరుంగుచున్ శివరాత్రినోము వహించెడిన్ **160**

ఊపిరిబిగబట్టి ప్రాణాయామాన్ని ఉపాసిస్తూ జాణయైన ఒక ఋషి వలె ఈశ్వరదీక్షను పాటిస్తూ చేతులతో ఈశ్వరుణ్ణి పూజిస్తూ ముక్తిమార్గాన్నిగురించి తెలుసుకుంటూ అతడు శివరాత్రివ్రతాన్ని ప్రారంభించాడు.

మత్తకోకిల: **హేశివా! పరమేశ్వరా! జలధీశ్వరా! ననుకావరా!**
శైశవోద్ధృత చాపలంబున సాగినాడను దేవరా!
పాశబద్ధుడనైతి దుష్కృత బంధమోక్ష సంగరా!
యాశలన్ని యడంగిపోయె మహాశయా కరుణించరా! **161**

హేపరమేశ్వరా!తెలివితక్కువతనంతోనడిచానయ్యా!యమపాశానికి చిక్కాను. భరించరాని ఈ బంధాన్నుంచి తప్పించవయ్యా! ఇప్పుడు ఇది తప్ప నాకింకే ఆశా లేదయ్యా! నాపై జాలిచూపించు పరమేశ్వరా!

మత్తకోకిల: **జ్ఞానహీనుడనై చరించితి నన్ గృపన్ గడతేర్చరా!**
కాననైతిని సత్యమార్గము కండకావరమెచ్చగా
నేనెలోకమునందు గొప్పని నిక్కినాడ మహేశ్వరా!
దానినెంచక నన్నుబ్రోవు సుధాంశుశేఖర ! పాహిమాం ! **162**

బుద్ధితక్కువగా ప్రవర్తించాను.అహంకరించాను .అదేమీ తలంచకుండా నన్ను కాపాడవయ్యా !

చం. అనిపలుమారు కుందుచు మహాత్ములసూక్తులులోదలంచుచున్
వినమితగాత్రుడై యతడు వేదనతో పలుకాడలేక నె
మ్మనమున మంత్రభావములు మన్ననజేయగసాగె స్రుక్కుచున్
తనువును నిల్పలేక నరదండముగా నిలపై నణంగుచున్ 163

అతడు బాధపడుతూ వంగిపోయి మాట్లాడలేక తాను వింటున్న మంత్రార్థాలను ఉచ్చరించసాగాడు.

చం. మనసునునిశ్చలమ్ముగ నుమాధవుపైనను నిల్పి యాత్మలో
కనుగొనసాగె యోగివలె కర్మఫలంబిట కాలిపోయినన్
మునుపటి సంచితమ్ము వరమోయనురీతిని తోడునిల్చి బు
ద్ధిని తగుమార్గ గామినిగ దీర్చెసుభిక్షమునిచ్చి బంధువై ! 164

అతడుతన మనస్సును పరమేశ్వరునిపైననే ఉంచి యోగివలే ఆత్మలో దర్శించసాగాడు. అదంతా అతని పూర్వజన్మ కర్మఫలం . అది ఇప్పటికి అతని బుద్ధిని సరైనదారికి మళ్ళించింది.

ఉ. ఆతని ఆత్మదర్శనమహత్త్వము శుద్ధము; సాత్వికమ్ము; హృ
ద్యోతిత దివ్యదీపము వియోగ ఫలమ్మను దారిజూపి మి
థ్యా తతినెల్ల గూల్చి నిజతత్త్వము బోధపడంగజేసి లో
లో తిమిరంబడంచెను విలోకనకాగ సమస్త తత్వమున్ 165

అతని ఆత్మదర్శనం శుద్ధసాత్వికమైనది.అతని హృదయంలో వెలిగే ప్రాణదీపం మిథ్యా ప్రపంచంపట్ల విరక్తిని కలిగించి నిజతత్త్వాన్ని బోధపరిచేదిగా ఉంది. అది అతనిలోని అజ్ఞానమనే చీకటినిపోగొట్టేదిగా ఉంది.

ఉ. లేనియెడన్ దురాత్మునకు లేశము దక్కునె దివ్యశైవ దీ
క్షానియమమ్ము! దుర్గుణునికర్మకు నా యమదూతలిచ్చు తీ
క్ష్ణానుభవమ్ములే తగునుగాక! మహోన్నత మంత్రసిద్ధి యె
ట్లైన లభించునా? విధివిలాసము గా కిది యేమి?.. చిత్రమౌ! 166

అది నిజం కాకపోతే ఒక దుర్మార్గునికి దివ్యమైన శివదీక్షానియమం లభిస్తుందా ? అతని దుష్ప్రవర్తనకు యమదూతలిచ్చే శిక్షలే సరియైనవి. మహోన్నతమైన మంత్రసిద్ధి ఎవరికైనా లభిస్తుందా? ఇది విధి విలాసం.

ఉ. అవ్విధినేలగూలి యతడద్భుత దృశ్యము గాంచె నాత్మలో
నవ్వుచు వచ్చె నొక్కడధునాతన సిద్ధుడు; వచ్చి చూచి నే
నెవ్వరినో యెరుంగుదువె? యీ వరకీవు భజించినట్టి వా
డెవ్వడొ వానినే సొబగులిమ్మనికోరితి విచ్చి నాడిటన్ 167

ఆ విధంగా గాలినాయుడు నేలకూలి ఒక అద్భుతమైన దృశ్యాన్ని దర్శించాడు. అందులో ఒక సిద్ధుడు ఆధునికరూపంతో కనిపించాడు. "నేనెవరో తెలుసా" అని అడిగాడు. "ఇదివరకు నువ్వు ఎవరినైతే పూజించి అన్నిరకాల సుఖాలను ఇమ్మని కోరావో ఇప్పుడు వాటన్నిటిని అతడు నీకిచ్చాడు". అని చెప్పాడు.

చం. అమరసుఖాలుకోరితివి; యన్నియొసంగెను; నంతకాల మం
దమరులవోలె వానికడ నచ్చెరువొందగ చేరగోరినా
వమిత సుఖాన! కష్టపడినంతట నిత్తుననంగ నీవు యో
టమిని గడించినావు; ప్రకటమ్ముగ నియ్యదిమాత్ర మిచ్చెగా 168

"స్వర్గసుఖాలనుకోరావు. కోరినవన్నీ ఇచ్చాడు; చివరికి మహాసౌఖ్యంతో అతణ్ణి చేరుకోవాలన్నావు. కొంత కష్టపడితే ఆవరం ఇస్తానన్నాడు. కానీ భోగలాలసతలోపడి ఓడిపోయావు. అందువల్ల నీకు ఈ మాత్రం అనుగ్రహం ప్రసాదించాడు" అని ఆ సిద్ధుడు చెప్పాడు.

చం. నిజమునకిట్టి దుర్మతిని నిల్వున జీల్చిన తప్పులేదు; నీ
కుజనత కెట్టి లాభమును కూడదు; శిక్ష విధించుటొక్కటే
నిజమగుధర్మమౌ నిదియెనిశ్చయమయ్యును నీదు పూర్వ పు
ణ్యజయ ఫలంబుదక్కి భువనాధిపు సన్నిధి జేర్చెనిన్నిటన్ 169

నిజానికి నీవంటి దుర్మార్గుణ్ణి నిలువునా చీల్చినాతప్పులేదు. నీకు ఎటువంటి లాభాన్నీ కలగనీయకూడదు. శిక్ష విధించటం ఒక్కటే నీపట్ల సరైన ధర్మం. అదే సరైనది. అయినా నీ పూర్వపుణ్యఫలం నిన్ను పరమేశ్వరుని సన్నిధికి చేర్చింది . అదే లేకపోతే నీకు యమయాతనలు కలిగి ఉండేవి .

తే.గీ. తనువునందెల్ల ముండ్లను దాల్చినట్టి
చెట్టుగోరింట తొల్లిట జేసినట్టి
పుణ్యఫలమున యువతుల పొల్పుమీఱు
హస్తముల పండు నెఱ్ఱగా నందగించి 170

ఒళ్ళంతా ముళ్ళను ధరించిన గోరింట చెట్టు గతజన్మలో చేసుకున్న పుణ్యఫలంగా యువతుల చేతులపై ఎఱ్ఱగా పండేభాగ్యాన్నిపొందింది. అంటే దేనినైనా పొందే యోగ్యత కావాలంటే అందుకు తగిన పుణ్యం చేసుకుని ఉండాలి.

ఉ. " చేసిన పుణ్యమంతయు నశించినదింతట పాపకార్యముల్
చేసితివేని కర్మఫలసిద్ధిని బొందక తప్పదింక నీ
దోస ఫలంబు బాపినను దుఃఖమొసంగిన నీశ్వరుండె ది
క్కౌ సుమతిన్ దలంచి కలకాలము వర్తిలు మింక జాగృతిన్ 171

నువ్వు చేసుకున్న పుణ్యమంతా ఖర్చయిపోయింది. ఇకమీద పాపకృత్యాలు చేశావా ఫలితం అనుభవించక తప్పదు. ఆ పాపఫలాన్ని పోగొట్టినా కట్టికుడిపినా పరమేశ్వరుడే. మంచిబుద్ధిని పెంచుకుని నడుచుకో .

మణిగణ నికరము : **సురుచిర పథమున సుగుణము లమరన్**
మరిమరి నరయుచు మసలుచు నడువన్
కరుణయు గలుగును ఘనముగ నికపై
పరమశివుని యెద బహువిధమగుచున్ **172**

మంచిదారిలో కలయజూచుకుంటూ నడిస్తే పరమేశ్వరునికి కూడా నీపై ఎంతో గొప్ప దయ కలుగుతుంది.

మణిగణ నికరము : **నడవడి నియతిగ నడిచెడి జనులన్**
తడయక పురహరి తనకడ నునుచున్
చెడు పథమున జను చెడుగుల నిలలో
నడుగడుగున శివుడనిశ మడంచున్ **173**

నియమబద్ధంగా నడుచుకునే వాళ్ళను పరమేశ్వరుడు ప్రేమిస్తాడు. తనవద్దకు రానిస్తాడు. దుర్మార్గులను మాత్రం అడుగడుగునా కనిపెట్టి అణచివేస్తాడు.

వంశస్థము: **మహాత్ములాశర్వు నమానుషోన్నతిన్**
గ్రహించి పూజించిన కర్మముల్ ధరన్
ప్రహారమై శాంతి శుభాలు కూడెడిన్
దహించు పాపమ్ములు దగ్ధమయ్యెడిన్ **174**

(జ,త,జ,ర,గణాలు; 8వ అక్షరం యతి)

గొప్ప ఆలోచనాపరులు పరమేశ్వరుని అమానుషమైన శక్తిని గ్రహించి అతణ్ణి భక్తితో పూజిస్తారు. అందువల్ల దుష్కర్మఫలాలన్నీనశించిపోతాయి.శాంతి, శుభాలుసమకూరుతాయి. పాపాలన్నీ నశించిపోతాయి.

వంశస్థము : **పొనర్చినా విమ్ముగ పుణ్యపాపముల్**
ఘనమ్ముగా లబ్ధిని గాంచినావిటన్
వినమ్రివై యీశ్వరు వేడుకొన్ముురా
సనాతనుండెయ్యెడ సాయమౌనురా ! **175**

నువ్వెన్నోపాపపుణ్యాలను చేశావు. వాటి ఫలితాలు కూడా పొందావు. ఇంక .ఆ పరమేశ్వరుణ్ణి శరణువేడుకో.

ఉ. నీ తనువే రథమ్ముగ గణించి వసించెడి నాత్మనేను; నీ
చేతలు సక్రమమ్మయిన చిత్తమునందు సుఖింతు నేను; కా
నీ తగురీతి మీరిన ననేకవిధమ్ముల నిన్ను దిద్ద నే
నే తగుదానినౌట నిట నెచ్చెలినై పలుకాడవచ్చితిన్ **176**

నీ శరీరాన్ని రథంగాచేసుకుని నీలో నివసించే ఆత్మను నేను. నీచేతలు సక్రమంగా ఉంటే లోపల ఉన్న నేను సంతోషిస్తాను. లేకుంటే నేనే నిన్ను సరిదిద్దాలి. నేను నిన్ను పలకరింప వచ్చాను అని అతనియాత్మ పలికింది

శా. ఆ మాటల్ విని గాలినాయుడు మహాజ్ఞానాత్ముడై యీశుడే
యేమూలంబున తన్నుగాచునని మన్నింపన్ తగన్ గోరుచున్
ప్రామాణ్యంబగు దీక్షగైకొనె గుడిన్ పంచాక్షరీమంత్ర మా
లా మేధాక్షరశిక్షపక్షమును సల్లాపస్వభావమ్ముగన్ **177**

తన ఆత్మఘోషను విని గాలినాయుడు బుద్ధితెచ్చుకుని పరమేశ్వరుడే తనను ఏదోవిధంగాకాపాడుతాడు అనే విశ్వాసంతోఅన్నిమంత్రాలలోనూపరమప్రామాణికమైనపంచాక్షరీమంత్రదీక్షనుఆగుడిలోనే ప్రారంభించాడు.

శా. ఎన్నాళ్ళీ జపమున్ జపించెనొ శివుండే యెంచలేడేమొ తా
నన్నాళ్ళున్ జపియించె దీక్షగ! నుమానాథుండు బాలాంబయున్
కన్నారన్ గమనించి పల్కె నిటులన్ కారుణ్యమున్ బూని "లే
వన్నా తప్పులు చేయకుండ సుఖివైవర్తింపు! పొమ్మింతటన్ !" **178**

ఆవిధంగాగాలినాయుడుపంచాక్షరీమంత్రజపాన్నిఎన్నాళ్ళుజపించాడో ఎవ్వరూ లెక్కించలేరు. చాలాకాలానికి జలధీశ్వరస్వామి,బాలాదేవిఅతణ్ణిగమనించిజాలిపడి"ఇంకతప్పులుచేయకుండా సుఖపడు" అని దీవించారు.

శా. ఆ మంత్రమ్ము మహత్త్వమేమొ యపుడేయాశ్చర్యమౌనట్లుగా
క్షేమంబయ్యెనతండు; రోగ గుణముల్ క్షీణించె; నింపాదిగా
శ్రీమంతున్ జలధీశ్వరున్ గొలిచి సంక్షేమమ్ము శాంతమ్ము బా
లా మాతృత్వమునందు పొందె భవ లీలన్ పూర్తి యారోగ్యమున్ **179**

ఆపంచాక్షరీమంత్రమహిమయేమోగానీఆశ్చర్యకరంగాఅతనికిఅనారోగ్యంతగ్గసాగింది.రోగగుణాలుతగ్గాయి అలా జలధీశ్వరస్వామిని, బాలాదేవినీ సేవించటం వలన అతనికి పూర్తి ఆరోగ్యము, అన్నీ సమకూరాయి.

తురగము : **జలధి వలయిత వలయ మగునిల సార్వభౌమ మహేశ్వరా**
మలగి తొలగెను మలిన గతులవి మాసెనో జలధీశ్వరా
తొలగిచనినది తొలుత ననుగను దుర్మదంబది శంకరా
యలుక వలదుర యలసితిని నను యాదుకో శివదేవుడా! **180**

(4 నగణములు+స,జ,జ,గ,గణాలు; 1-15 యతి)

చతుస్సాగర పర్యంతమైన ప్రపంచానికి సార్వభౌముడవైన ఓ పరమేశ్వరా! నాలోని మాలిన్యమంతా తొలగి పోయిందయ్యా! నా దుర్మదాంధత కూడా నశించిందయ్యా! నాపైన కోపం వద్దయ్యా ! నన్ను ఆదుకోస్వామీ అని గాలినాయుడు జలధీశ్వరుణ్ణి వేడుకుంటున్నాడు.

తురగము : **బ్రతుకు విలువను తెలిసి నడతును భద్రమీయర దేవరా!**
సతము నిను మది నెరిగి నడతును శక్తినీయర శంకరా
అతుకు బ్రతుకుల కలత నెరిగితి యండనిల్వగ తోడురా
పతనగతినిల పడితి హరహర పాపముల్ వదిలించరా ! **181**

స్వామీ! బ్రతుకువిలువను తెలుసుకున్నాను. ఇంక జాగ్రత్తగా నడువగలను. నాకు భద్రతను కల్పించవయ్యా! నాకు అండగా నిలువుము స్వామీ! నా పాపాలు వదిలించి నాకు నిలబడే శక్తిని ప్రసాదించు.

తురగము : **అహమువిడచితి మదముతొలగితి నార్తితోడను నిల్చితిన్**
ఇహముపరమును సకలజగమును నీవటంచు నెఱింగితిన్
సహనమిల నొక సుగుణగణమను సత్యమున్ గమనించితిన్
మహిమగలిగిన జలధిపతివని మౌన ముద్ర దలంచితిన్ **182**

నా అహంకారాన్ని విడిచిపెట్టాను. బాధతో నీముందు నిలచాను. ఇహపరాలన్నీ నీవే అని తెలుసుకున్నాను. ఓర్పు ఎంత అవసరమో గ్రహించాను. నీవు చతుస్సాగరాధిపతివని తెలుసుకున్నాను స్వామీ!

తురగము: **సకలజగతిని నడుపు మగటిమిసౌరు గల్గిన శంకరా**
వికలమగుమది గలుగు మనుజుడ భిక్షపెట్టర దేవరా
సుకరముగ నిను నరయు పథమును చూపుమయ్య శుభంకరా
ముకుళగతి నిల కరములను హర మోడ్చిమ్రొక్కెద శ్రీకరా **183**

హే పరమేశ్వరా! నీవు సకల లోకాలను నడపగల సమర్థుడవు. నేను వికలమైన మనస్సు గలవాడను. నాకు ఒకింత భిక్షను పెట్టవయ్యా! సులభంగా నిన్ను చూచే దారిని తెలుపుమయ్యా! చేతులెత్తి మ్రొక్కుతాను స్వామీ

చం. **అని మృదువైన వర్తనము నంచిత రీతిని పల్లవింపగా**
మనసున నీశ్వరున్ నిలిపి మౌన ఋషీశ్వరు నట్లు తృప్తిగా
కనులను మోడ్చి యోగమున గాలి మహర్షిగ మార్పుజెంది నె
మ్మనమునశాంతిబూని కడు మన్ననతో నడువంగసాగెడిన్! **184**

ఈ విధంగా ఈశ్వరుని స్తుతిస్తూ మెల్లని ప్రవర్తనతో ఒక ఋషీశ్వరుని వలె మౌనంగా , శాంతితో గాలినాయుడు గాలిమహర్షిగా ప్రజలలో గౌరవాన్ని పొందుతూ రోజులు గడుపసాగాడు.

ఉ. శ్రీ జలధీశ్వరుండు బహు చింతలబాపెడి చిన్మయుండు; యు
త్తేజమొసంగి జీవులకు తృప్తినొసంగెడి సత్త్వశీలి; యో
జో జవసత్వ సంపదల శోభనమిచ్చెడు భాగ్యశాలి;నా
లో జయశీలమున్ నిజబలోద్ధతి గూర్చెడి బందుగుండగున్ **185**

శ్రీ జలధీశ్వరస్వామి ప్రతివారికీ దిగుళ్ళు పోగొట్టి ధైర్యమిచ్చే చిన్మయమూర్తి. ఆయన అందరకు చైతన్యాన్ని, తేజస్సును, జవసత్త్వాలను ప్రసాదిస్తాడు.

కమలవిలసితము : **ప్రతినిమిషము మది భవుని దలంపన్**
జతయగు శుభములు శతమగుచుండున్
హితవుగ కలిమియు నిక లభియించున్
అతులిత విభవము లవి కుసుమించున్ **186**
(4 నగణములు+గ,గ; 1-9 యతి)

ప్రతినిమిషములోనుపరమేశ్వరుణ్ణి తలచుకునేవారికి అనేకశుభములు సమకూరుతాయి. సురుచిర సంపదలు లభిస్తాయి. అనంతమైన వైభవం కలుగుతుంది. కనుక ఓం నమశ్శివాయ యని పంచాక్షరిని జపించండి.

మంగళ మహాశ్రీ; శ్రీలు రహియింప జలధీశునకు మ్రొక్కులిడు చేతనముగల్గుశివ భక్తుల్
మేలయిన సంతుగని సంపదలు కొల్లలుగ మేరలవి లేక సమకూరన్
ఆలనయు పాలనయు అంబగని పెట్టునెడ ఆ హరుని యెల్లరు భజింపన్
మేలగును నెల్లరకు మేదినిని గల్గు జన మెల్లరును బాలను నుతింపన్ **187**

శ్రీ జలధీశ్వరస్వామిని సేవించే భక్తులకు సిరి సంపదలు వృద్ధి అవుతాయి. మంచి సంతానం కలుగుతుంది. అలాంటి భక్తులను బాలాంబ కనిపెట్టి కాపాడుతుంది. శ్రీ బాలాజలధీశ్వరులు లోకానికి మేలు కారకులు.

ఆస్వాశాంత గద్యము :

ఇదికృష్ణాతీరవాసి-వేదవేదాంగవిపులపురాణేతిహాస-సంస్కృతకావ్యవ్యాఖ్యానమహోదధీ-కవిశిఖామణి-వైదిక ధర్మకర్మచింతామణి-ఘంటసాలపురశిరోమణి - శ్రీమచ్చింతలపాటి లక్ష్మీనృసింహ శాస్త్రి వర్యుల కుమారుడు-కావ్యవిమర్శనామర్మజ్ఞ-సహజకవితాకళాభిజ్ఞ --కావ్యకళాప్రపూర్ణ మోహనమురలీకృష్ణశర్మచే వ్రాయ బడిన "సిరిదివ్వెలు" కావ్య ద్వితీయాశ్వాసము — సంపూర్ణము.

సిరిదివ్వేలు

తృతీయాశ్వాసము

శా. శ్రీమంతుండుదధీశ్వరుండు భువనశ్శ్రేయోభిశీలుండు; దే
వీ మంత్రంబున సర్వలోకరచనావిశ్లేష సంపత్ప్రభా
సామర్ధ్యంబుల నిర్ణయించు విభుడై చైతన్య విస్ఫూర్తియై
ప్రేమన్ జీవుల గాచు బంధువుగ శోభిల్లున్ మహాదేవుడై ! 1

జలధీశ్వరస్వామి గొప్ప శ్రీమంతుడు. లోకహితాన్ని కోరువాడు. అమ్మవారి మంత్రమహిమచేత అన్నిలోకాలను తీర్చిదిద్దటంలోను, లోకస్థుల ఆశలను తీర్చటంలోను సమర్ధతను కలిగియుండి లోకాలకు జీవాన్నిచ్చి ప్రేమతో బంధువువలె కాపాడగల మహాదేవుడు.

శా. లోకాతీతుడు;లోకనాయకుడు;కల్లోలంబుపోనార్చు హృ
ల్లోకేశుండు; విలక్షణాఘనుడు; మేలుంగీళ్ళ రెండింట లో
కైకవ్యాప్తినిగొన్నవాడు; సకలవ్యాప్తుండు; కల్యాణ భ
ద్రాకారుం డఖిలంబునందుగల శక్త్యాత్ముండు వార్ధీశుడే ! 2

పరమేశ్వరుడు లోకాలన్నిటికీ అతీతుడు; అతడు లోకనాయకుడు;ఎటువంటి కష్టాలనైనా పోగొట్టగలవాడు; ప్రతిమనిషి హృదయానికీ అధినాధుడు; ప్రత్యేకలక్షణాలుగల గొప్పవాడు; మేలుకీడులరెంటిలోనూ తోడైయుండే వాడు. లోకాలన్నిటిలోనూ వ్యాపించినవాడు; అన్నియాకారాలు గలవాడు;శుభములు కలిగించే మంచి ఆకృతి గలవాడు. అందరిలో ఉన్న శక్తిస్వరూపుడు ఈశ్వరుడే.

ఉ. అన్నియు తానయై కనులకందనియాకృతిగల్గువాడు; సం
పన్నుడునైన భిక్షకుడు;పంచముఖుం డభవుండు; వాసుకిన్
పన్నుగదాల్చువాడు; సతి బాలనుజేరిన లింగమూర్తి; యా
పన్నులభాగ్యవర్తి; జనవందితశక్తి; దయామృతాబ్ధియౌ ! 3

సృష్టిలోని సమస్తము తానేయైనవాడు; కానీ చూపులకు చిక్కనివాడు; గొప్ప సంపన్నుడు. అయినా భిక్షాటనం చేయువాడు; పంచముఖాలుగలవాడు; పుట్టుకలేనివాడు; నాగరాజైన వాసుకిని ఆభరణంగా ధరించినవాడు; శక్తిస్వరూపిణి బాలాదేవితో కలిసియున్నవాడు; బాధలలోఉన్నవారికి బాధలుతీర్చి

భాగ్యాన్నిచ్చేవాడు; ప్రజలందరి నుండి వందనాలనుస్వీకరించేవాడు; దయామృతానికి మహాసముద్రం వంటివాడు.

ఉ. పుట్టినవారిలో గుణవిభూషితులన్ పరమాత్ములంచు చూ
పెట్టుచు వారిబోధల నభీష్టతనానుచు వారికోసమై
కొట్టుకుచచ్చుచున్న పలు కూళలబుద్ధులు మాన్పదే?యిలన్
పుట్టుకలేని వాని నిల పుట్టిగతించినవారు పోలునా ? 4

పుట్టినవారిలో కాస్త మంచిగుణాలున్నవారిని దేవుడని కీర్తిస్తారు. వారిమాటల్ని బోధనలుగా ప్రచారం చేస్తారు. వారిపై భక్తితో జనులు తమలోతాము కొట్టుకుచస్తూ ఉంటారు. ఇటువంటి బుద్ధితక్కువ జనుల ఆలోచనల్ని దేవుడు మాన్పించడేం? అసలు పుట్టుకయే లేనివానికి పుట్టిచచ్చినవాళ్ళు సరిపోలుతారా ?

ఉ. చీకటులన్ని దాటుకొని చిత్తమునందు ప్రశాంతినిల్పి దీ
క్షైక ప్రవృత్తినొంది జడులందున జంకక పోటుపాట్లకున్
చీకులనొందకుండ వరసిద్ధి గడింపగనిల్చియుండి లో
కైకప్రభుండునైన శివునర్చనజేయుట పుణ్యకార్యమౌ! 5

కష్టాలనే చీకట్లన్నిటినీ దాటుకొని మనసులో శాంతిని నిలుపుకుని దీక్షగానిలచి, ఎటువంటి ఆటుపోటులకు జంకకచికాకుపడక, లక్ష్యసిద్ధిని పొంది లోకేశ్వరుడైన పరమేశ్వరుణ్ణి దర్శించటం పుణ్యకార్యం.

ఉ. ఎంతటిశక్తిశాలి యితడెన్ని యుగాలుగ సృష్టికార్యమున్
వింతలతో రచించుచు నభీష్టముదీరగ బుద్ధిజీవులన్
భ్రాంతులముంచిదేల్చుచు ప్రభావముజూపుచునుండె! వీని ని
శ్చింతగ గొల్చి చేరగలసిద్ధులు జీవుల నెందరుండిరో! 6

భగవంతుడు ఎంత శక్తివంతుడు ! ఎన్ని యుగాలుగా అతడు రకరకాలవింతలతో సృష్టిచేస్తూ , కొందరి కోరికలు తీరుస్తూ , కొందరిని భ్రాంతుల్లో ముంచితేలుస్తూ తనగొప్పతనాన్ని చూపిస్తున్నాడో కదా! ఎటువంటి ఆలోచనలూ లేకుండా ఇతణ్ణి సేవించి , చేరుకోగల సిద్ధులు మనుషుల్లో ఎంతమంది ఉన్నారు ?

ఉ. ఇంతటిసృష్టికార్యమొనరించు శివున్ గనలేక యెవ్వడో
చింతలదీర్చుదేవుడని చిత్తమునందునవిశ్వసించి భా
వింతురుగాని సత్యపరివేక్షణ సేయరు ; కర్మపాపమే
సంచితలబ్ధమైనపుడు సత్యముతోచునె విప్పిచెప్పినన్ ! 7

ఇటువంటి గొప్పసృష్టికార్యాన్ని చేసే పరమేశ్వరుణ్ణి గమనించకుండా, ఎవరెవరినో దేవుళ్ళు అంటూ నమ్మి పూజి స్తున్నారుగానీ సత్యాన్నిగమనించటంలేదు.పాపకర్మాన్నిసంపాదించుకున్నవారికి ఎంతచెప్పినా సత్యం బోధపడదు.

ఉ. మాయపొరల్ మనస్సునునమాయికపంకమునందుముంచగా
డాయగలేరు దైవమును; టక్కరివృత్తిని పుట్టి చచ్చుచున్
హేయపరంపరన్ బడుచు హీనతనుందురుగాని విజ్ఞులై
ప్రాయముగల్గునాడె భగవానుని యాత్మ దలంచుకొొందురే ! 8

మాయపొరలు కమ్మేసి మనస్సును అమాయకత్వం అనే బురదలో ముంచేస్తున్నాయి కనుక దేవుణ్ణి చేరలేక పోతున్నారు. మాయదారిమనస్తత్వంతో పుడుతూ చస్తూ హీనజన్మల్ని అనుభవిస్తూ పరమాత్మునిపై బుద్ధినిలప గలుగుతున్నారా.

ఉ. సత్యము చావులేనిది; ప్రశాంతమనస్కత నాచరించినన్
భృత్యునివోలె సేవలొనరించి తరింపగజేయునిన్ను! కా
నీ త్యజియించివైచి యనునిత్య మసత్యములే వచించున్
మృత్యువునాశ్రయించెదరు! మేలు రుచించదు మొట్టి చెప్పినన్ ! 9

సత్యముశాశ్వతమైంది;ప్రశాంతంగా సత్యాన్ని ఆశ్రయిస్తేఅది నీకు ఎన్నో సేవలందిస్తుంది; కానీ దాన్నివదిలేసి అన్నీ అసత్యాలేచెబుతూఅందుమూలంగామృత్యువునుదగ్గరకుతీసుకుంటున్నావు.ఎంతచెప్పినా మంచి రుచించదుకదా!

ఉ. మాయగ్రసించునర్తకి; ప్రమాదముగూర్చి నటించి యేది యే
మాయెనొ గుర్తురానటుల మైమరపించి నటింపజేసి పెన్
మాయనుముంచునప్పుడు సమంచితభావమడంగి భీతితో
నా యమసన్నిధానమున నక్కట యేడ్చినలాభమేమగున్ ? 10

మాయ మనలను మ్రింగివేసే గొప్ప నర్తకి. ప్రమాదాన్ని కలిగించి యేదియేమైందోతెలుసు కోలేనంతగా మనల్ని మరిపించి చివరకు పెనుమాయలో ముంచుతుంది. అప్పుడు బుద్ధితక్కువైందని యేడిస్తే ఏంలాభముంటుంది ?

చం. ఋజువగు వర్తనమ్మును వరింపగ కట్టడి చేయరెవ్వరున్
ప్రజలుసుధర్మమున్ దలచి భద్రముగా తలదాల్చిప్రజ్ఞతో
నిజమగునీశ్వరున్ దెలిసి నీమముతోభజియించి మీదటన్
యజనఫలమ్మునొందవలె నయ్యది జన్మకు సిద్ధియయ్యెడిన్. 11

సరియైనదారిలోవెళ్ళమని ఎవరూ నిర్బంధించరు. ప్రజలు మంచిమార్గాన్ని ఆలోచించుకుని ఆచరించాలి.

నిజమైన దేవుడెవరో తెలుసుకుని నియమంగా భజించాలి.అందువల్ల సత్ఫలితాన్ని పొందాలి.అదే జన్మఎత్తినందుకు ఫలం.

శా. ఆరాధింతురు సర్వమానవులు సిద్ధార్థుల్ మహాదేవునిన్
భారమ్మంతవహించి కాచుకొనగా భద్రమ్ము చేకూర్చగా
నారున్ బోసినవాడు నీరొసగి తానైగాచు నిక్కమ్ముగా
ధీరుండెన్నడు వీడిపోవడను బుద్ధిన్ నమ్మి సేవించుచున్ . 12

మానవులందరూ సిద్ధినిపొందగోరి మహాదేవుణ్ణి ఆరాధిస్తారు; తమభారమంతా మోయాలనీ, భద్రత కలిగించాలనీ కోరుకుంటారు. నారుపోసినవాడు నీరుపోస్తాడనీ , వదిలిపోడనీ విశ్వసిస్తారు.

శా. లింగాకారమదేల యీశునకు? నుల్లేఖింపగా బిందువే
లింగమ్మై మనలో వెలుంగు కతనన్ లింగాకృతిన్ జూపి దై
వాంగంబయ్యదిగా రచించిరి ;యశోభాస్వంతుడౌ యీశ్వరుం
డంగమ్మున్ ధరియింపబో డతని దేహంబీ ప్రపంచంబగున్ 13

ఈశ్వరునికి లింగాకారం ఎందుకు అంటే మనలోని ప్రాణబిందువుకు అది ప్రతిరూపం. శివునికి దేహం ప్రపంచమే

శా. ఓంకారస్వరమందు తేజరిలు సద్యోజాత పంచాస్యముల్
యైంకారమ్మున శబ్దబీజము మహాశాపూర్తిగావించు సౌః
క్లీంకారమ్ముల కామబీజములు సంశ్లిష్టమ్ముకాగా భువిన్
సంకేతమ్ముగ నిల్చినట్టి పరమేశా !మమ్ము రక్షింపరా! 14

ఓంకారంలోప్రకాశించేపరమశివునిసద్యోజాతాదిపంచముఖాలుఐం క్లీమ్ సౌః అనే బీజాక్షరాలను ఆశ్రయించుకుని సృష్టికి సంకేతంగా నిలిచాయి. ఆ మూర్తిస్వరూపం మనల్ని రక్షించుగాక!

పంచాక్షరీ స్వరూప వర్ణన :

శా. ఓంకారమ్మున నాదరూపుడవుగా యోగీంద్రులర్చింప ని
శ్శంకన్ కామ్యములిచ్చిమోక్షమిడు నీశానుండ! నిన్ గూర్చి యే
కైంకర్యమ్మొనరించినన్ తనిసి మా కాంక్షల్ ప్రసాదింతువే
యోంకారేశ! నకారరూప!శివశంభో!శంకరా!పాహిమాం! 15

యోగులు నిన్ను నాదరూపునిగా ఓంకారరూపునిగా ఆర్చిస్తారు. నీవు ఎట్టి అనుమానము లేకుండా కోరికలను తీరుస్తావు.నీకోసం ఏపూజచేసినా అనుగ్రహిస్తావు.నకారరూపుడవైన శంకరా ! మమ్ము కాపాడరా!

శా. ధీశాలుండు మహాత్ముడాతడు మహాదేవుండు సర్వేశ్వరుం
డీశానుండు సమస్తపాపహరుడై యేరీతిగా మ్రొక్కినన్
క్లేశంబుల్ తొలగించి భక్తులకు సంక్షేమమ్ము చేకూర్చువా
డౌ శాంతుండు మకారరూపుడు శివుండవ్వానికిన్ మ్రొక్కుడీ! 16

మహాదేవుడుసర్వేశ్వరుడు.ఆతడుమహాత్ముడు.బుద్ధిశాలి.యేవిధంగాపూజించినాసమస్తపాపాలను పోగొట్టువాడు. భక్తులకష్టాలను బాపి క్షేమాన్ని చేకూర్చువాడు. అతనికి భక్తితో నమస్కరించండి.

శా. లోకానుగ్రహ కారకుండు శివుడే! లోకాలకాపాడువా
డై కష్టంబుల డాయనీక పితరుండట్లున్ సదా బ్రోచుచున్
తాకుంజీకుల మాపి గాచెడి జగన్నాధుండు భూతేశుడా
శ్రీకల్యాణ శికారమూర్తి శివుడే చిన్మూర్తి యర్చించుడీ! 17

లోకాలను అనుగ్రహించేవాడు శివుడే! ఆయన లోకాలను కాపాడుతూ లోకులకు కష్టాలు రాకుండా తండ్రివలె కాపాడుతూ కనిపెట్టి చూసే జగన్నాధుడు.ఆయనను భక్తితో యర్చించండి.

శా. వామాక్షిన్ సగమేన దాల్చి భుజగవ్రాతంబు భూషింపగా
ప్రేమన్ గంగను నెత్తికెత్తుకొనుచున్ పెన్నెద్దుపై నెక్కి భ
క్తామోదమ్మునుగూర్చు శంకరుడు లోకాలోకనన్ దక్షుడౌ
ధీమంతుండు వకారరూపుడు గుణాతీతుండు సర్వజ్ఞుడౌ! 18

పరమేశ్వరుడు పార్వతీదేవికి సగంశరీరమిచ్చితనలో ధరించాడు. సర్పాలను ఆభరణాలుగా ధరించాడు. గంగా దేవిని నెత్తికెత్తుకున్నాడు. వృషభవాహనంపైనెక్కి భక్తులకు వరాలనిస్తున్నాడు.ఆయన వకారరూపుడు. సర్వజ్ఞుడు.

శా. ఎందున్ శోధనజేసినన్ కనులముందేనిల్చి కన్పింప వీ
చందంబంతయు చోద్యమౌను; జగదీశా! మాయచాలించి మా
ముందున్ దర్శనమీయవేడెద మహామూర్తీ! నినున్ జూడ నా
నందంబౌను యకారరూప!గుణవిజ్ఞానస్వరూపా!శివా! 19

ఎక్కడవెదకినా అన్నిటా నీవైయుండికూడా మాకు కనిపించవు!ఇదిచాలాచోద్యంగా ఉంది. హేజగదీశా! మాయచాలించి మాకు దర్శనమీయరా!మహామూర్తీ!యకారరూపా! నిన్నుచూడగా మాకు ఆనందమౌతుంది.

శా. ఈశానా!యభవా!యుమామహేశ్వర!హరా! హేశర్వ భీమేశ్వరా!
కాశీవాస! భవా!త్రినేత్ర జయమౌ కైలాసవాసా శివా!
హేశంభో పరమేశ్వరా పశుపతే హేరుద్ర మాహేశ్వరా!
ధీశాలీ కరుణాసమంచిత మహాదేవా ననున్ గావరా!! 20

హేపరమేశ్వరా!కాశీవాసా! పశుపతీ !యకారరూపా! నీకు నమస్కారాలయ్యా!

శా. వామాంకమ్మున పార్వతీసతి యొడిన్ ద్వైమాతురస్కందులున్
ప్రేమన్ జేరగ నందికేశ గణముల్ ప్రీతిన్ భజింపన్ సదా
నీమంబొప్ప తపించు యోగివరులున్ నిష్ఠేద బ్రహ్మాత్ములై
కైమోడ్పుల్ ఘటియించి కొల్చెదరటన్ కైలాసపీఠమ్మునన్ 21

పార్వతీదేవి,గణపతీకుమారులనునందీశ్వరాదులు సేవిస్తుండగా,యోగులుచేతులుజోడించి కొలుస్తున్నారు .

శా. ఓంకారమ్మును మూర్ధ్ని నాసికతుదన్ నోలిన్ నకారమ్ము మో
దాంకమ్మౌను లలాటమున్ భ ముఖమధ్యంబౌ గకారమ్ము కం
ఠాంకన్యాసి వకారమా హృదిని తేటన్ దక్షిణమ్మౌ రుకా
రాంకంబయ్యది వామహస్తగుణ ముద్రా నాభి యః పాదమౌ 22

ఓం నమోభగవతే రుద్రాయ" మంత్రాన్ని మూర్ధ్నిస్థానంలో ఓంకారాన్ని, నాసికచివర నకారాన్ని,లలాటంలో మోఅనే అక్షరాన్ని, ముఖమధ్యంలో భకారాన్ని,కంఠంలో గకారాన్ని,హృదయంలో వకారాన్ని, తేఅనేఅక్షరాన్ని కుడివైపున,రుకారాన్నిఎడమవైపున,ద్రాఅనేఅక్షరాన్నినాభిస్థానంలోనూ,యఃఅనేఅక్షరాన్ని పాదంలో నిలపాలి.

శా. దేవేశుండగు నీశ్వరుండు తనువై తృప్తిన్ ప్రసాదించి తా
నావేశించును యెల్ల దేహముల విజ్ఞానామృతస్పర్శచే
నావంబోలె తరింపజేయును మహన్యాసంబు కైసేసి శో
భా విఖ్యాతు లొసంగి దీవెనలతో భాసిల్లగా జేయుచున్ 23

పరమేశ్వరుడేనాకుశరీరం.ఆతడేనాకుతృప్తిని,తెలివినిఇస్తాడు.నన్ను తరింపజేస్తాడు. ఆశీర్వదిస్తాడు .

శా. కామక్రోధ వికారముల్ విడి నే కందర్పదర్పాంతకున్
నీమంబొప్ప భజించెదన్ సతము వానింగొల్చు భక్తాళి కే
లేమిన్ గల్గదు వాంఛితార్థములు సంపల్లీల వర్షించి సం
క్షేమంబున్ సమకూర్చుగాన నతనిన్ సేవింతు నెవ్వేళలన్ 24

కామక్రోధాదివికారాలను విడచి నేను పరమేశ్వరుణ్ణి నియమపూర్వకంగా పూజిస్తాను. ఆయనను

సేవించేభక్తులకు ఎటువంటిలేమియుకలగదని, అన్నికోరికలు తీర్చిక్షేమాన్ని కలిగిస్తుందని, అందువల్ల ఎల్లవేళలా ఈశ్వరునే సేవిస్తాను

శా. నాచిత్తమ్ముననిల్చినాకు మహదానందమ్మునీరా శివా
నీ చిన్మూర్తిని యాత్మలోనిలిపి నిన్నే కొల్చుచున్ భక్తితో
ప్రాచీనంబగు యోగమార్గమున సంభావింతు నీవైభవ
శ్రీచందమ్మును లోకులెల్లరు నిదేరీతిన్ సమర్చించగన్ 25

ఓపరమేశ్వరా! నీవు నా మనస్సులో నిలిచి ఆనందాన్ని ప్రసాదించరా! ప్రాచీనమైన యోగమార్గంలో నేను నిన్ను ఆదర్శపూర్వకంగా ఆరాధిస్తాను.

శా. ఎన్నోయేండ్లు గతించుచుండినను నీ వింతైన మాటాడవా?
మిన్నున్ మన్నునునేకమౌనటుల నేమీ నీ తపంబీశ్వరా!
నిన్నే నమ్మిన భక్తజీవులను మన్నింపంగలేవా శివా?
యెన్నాళ్ళీపరిశోధనంబు! దిగిరావేమయ్య విశ్వేశ్వరా ! 26

విశ్వేశ్వరా ! ఎన్నాళ్ళిలా మాట్లాడకుండా తపస్సుచేసుకుంటూ ఉంటావయ్యా ! నిన్ను నమ్మినజీవుల్ని కాపాడవా? ఈ పరిశోధనలు ఎన్నాళ్ళు చేస్తావు ? ఇక చాలు-దిగిరావయ్యా!

మ. బ్రతుకన్ గల్గిననాల్గునాళ్ళు తమకంబందున్ వినోదించుచున్
గతియేమౌనొ యెరుంగకుందు మొక లక్ష్యంబింతయున్ లేక దు
ర్మతితోడన్ చరియింతు మంతమున కర్మంబేచి సాధించగా
ధృతిగోల్పోయి నినుందలంప మతి రాదే కర్మమర్మంబునన్ 27

బ్రతికియున్ననాలుగురోజులూ విలాసాల్లోమునిగితేలుతూ ముున్ముందుయెటువంటిగతిపడుతుందో తెలియకుండా ప్రవర్తిస్తాము. చివరకు నిన్ను తలుచుకుందామనుకుంటే కర్మఫలంవల్ల మతి పనిచేయదు.

శా. బ్రహ్మాండమ్మును చూడలేని నరులే భాస్వంతుడౌ యీశ్వర
బ్రహ్మన్ జూచెడిశక్తిలేక మదిలోభావింపగాలేక యే
బ్రహ్మాజిహ్మములెవి వనుచు నొవ్వంబల్కి నాస్తిత్వమే
బ్రహ్మాండమ్మని పల్కుచుండుట సుధీభంగప్రభావంబగున్ 28

ఈ బ్రహ్మాండాన్నంతటినీ చూడలేనివాళ్ళు, చూసేశక్తిలేనివాళ్ళు, ఎలాపడితే అలాగంటూ నాస్తికత్వాన్ని ప్రచారం చేయటం మతిలేనితనమే.

శా. బ్రహ్మన్ జూచెడిశక్తినొందుము శుభంబౌనీకు నీజన్మలో
బ్రహ్మత్వమ్ముగడించువారికిలలో భాగ్యమ్ముపెంపొందు ;సు
బ్రహ్మణ్యున్ తెగనాడు మూఢత మహాపాపంబునిచ్చున్! పర
బ్రహ్మన్ చింతన చేసి శక్తి గడియింపన్ బోలు నెవ్వారికిన్ ! 29

బ్రహ్మనుచూచేశక్తినిసంపాదించు.బ్రహ్మత్వంవల్ల భాగ్యం, శక్తి లభిస్తాయి . బ్రాహ్మణున్ని తిడితే పాపం లభిస్తుంది.

శా. దైవాంశమ్మది యింతగల్గునతడే దైవమ్ముగా తోచినన్
దైవమ్మేమగునింక ? నీకుభువిలో దైవాంశరూపమ్ములే
యేవంకన్ భగవత్స్వరూపముగ భాసిల్లన్ వినోదించు నో
జీవా! యెల్లెడ దైవమే వెలయురా! చింతింపు వేదాంతమున్ 30

దైవాంశ యే కొంచెమో కలిగినవాడు దేవునిగా కనిపిస్తే అసలు దేవుడు ఏం కావాలి? లోకంలో నీకు దైవాంశలే దైవంగా కనిపిస్తే అంతటా నీకు దైవమే కనిపిస్తాడు.అదే వేదాంతం.

శా. దైవాంశమ్మది యాత్మయే; నిజముగా తత్త్వమ్ము దర్శించువా
రే విశ్వాత్మకు మానవాత్మ యెటుకూర్మిన్ స్నేహమై చిక్కెనో
భావించెన్ ఘనమౌతపోవిధిని; సంప్రార్థించు నానాగతుల్
జీవుంజేర్చెడు నొక్క దేవునికడన్;చింతింప లే దన్యమున్! 31

ఆత్మయే దైవాంశం. తాత్వికులు మానవాత్మకు దైవాత్మకు గల సంబంధాన్ని తపోదృష్టితో తెలుసుకుంటారు. రకరకాలప్రార్థనావిధానాలుజీవుణ్ణి ఒకే దేవుని వద్దకు చేరుస్తాయి . జీవునికి అంతకన్నా చేరదగింది మరొకటిలేదు.

శా. ఈశుండే మనయాత్మరూపమగు; ప్రాణేశుండు సర్వేశుడే
నాశంబొందని శాశ్వతుండతడు; విజ్ఞానుల్ విమర్శించి మా
హేశున్ జీవులలోనగాంచి సకలంబీశాను తత్త్వమ్ముగా
ధీశక్తిన్ గమనించి మ్రొక్కెదరు సందేహింప రావంతయున్ 32

మానయాత్మస్వరూపం ఈశ్వరుడే; మనప్రాణస్వరూపం ఈశ్వరుడే;అతనికి నాశం లేదు;అతడు శాశ్వతుడు; జ్ఞానులు జీవులందరిలో అతని తత్వాన్నిగమనించి నిస్సందేహంగా అతనికి నమస్కరిస్తున్నారు.

శా. ఏకాగ్రమ్మగు చిత్తసాధనలచే నెవ్వండు సర్వేశ్వరున్
లోకేశున్ పరిపూర్ణశక్తియుతునిన్ లోలోన భావించి చి
త్తైకారాధ్యుని దర్శనమ్ముగనునోనాతండు తథ్యమ్ముగా
లోకంబందున సిద్ధుడై బరగు నాలోచింప ముక్తాత్ముడౌ! 33

ఎవడైతే పరమాత్మ్మణ్ణి జపసాధనలచేత మనస్సులో ధ్యానించి దర్శనభాగ్యాన్ని పొందుతాడో అతడే సిద్ధుడు.

శా. ఆపాతాళ నభ స్థలాంత భువనవ్యాపీ! మహాదేవ! చి
ద్రూపస్ఫాటికలింగరూప! విలసత్ పూర్ణేందు శీతాంశు రే
ఖా పుణ్యామృతమూర్తి! నిత్యమభిషేకార్చాదులన్ బొంద రా
రా! పాలింపర! శంకరా! త్రిణయనా!రక్షించు మాహేశ్వరా! 34

పాతాళం మొదలు ఆకాశం వరకు వ్యాపించిన ఓ మహాదేవా! సిగపైవెలుగొందే పూర్ణచంద్రుని చల్లని కిరణాలుగల పుణ్యమూర్తీ! స్ఫటికలింగస్వరూపా!నిత్యమూ అభిషేకాలను స్వీకరించటానికి రావయ్యా! మమ్ము రక్షించవయ్యా!

చం. అణువణువేకమై తనువు నల్లినయట్లుగ కర్మబంధముల్
గుణితములై ప్రభావమొనగూర్చెదునంతకు వెన్క నున్న కా
రణమగు నీశ్వరుండవు నిరామయమూర్తివి నీవుకావె! ధా
రుణిగల జీవకోటికి నిరూపితప్రాణము నీవెయీశ్వరా! 35

అణువులన్నీ కలిసి శరీరాన్ని యేర్పరచినట్లుగా కర్మబంధాలన్నీ కలిసి కొంతఫలితాన్నికూడబెడతాయి. వాటి వెనకనున్న కారణం నీవుకాదా దేవా? జీవకోటికి ఆధారభూతమైన ప్రాణం కూడా నీవే కదా ఈశ్వరా!

ఉ. చేసినకర్మమే చెడని చీకుపదార్థము; వెంటవచ్చి సం
త్రాసము నొందజేయుచు సరాసరి జీవికి తత్ఫలమ్ములన్
వీసముదాచకుండ చదివించును; కానియుమామహేశ!నీ
బాసటయున్నచో జనులపాపఫలమ్ములు మాసిపోయెడిన్ 36

చేసినపాపముచెడనిపదార్థము!అటువంటిపాపాలుఎన్నయినాకూడాఓ ఈశ్వరా నీ బాసట ఉంటే నశించిపోతాయి

ఉ. మానవులందరున్ సరిసమానులు; బుద్ధిబలంబుతోడ స
న్మానమునొందు కొందరు; సమానత మించెదరట్టి బుద్ధిచే
ధ్యానసమాధిలోమునిగి ధన్యతనొందిన సిద్ధయోగులున్
మానవులార! బుద్ధి పరమాద్భుతసిద్ధి నొసంగి గాచెడిన్ 37

మనుషులండరు సమానమే. కానీ బుద్ధిమంతులు కొందరు సన్మానించబడుతారు. ధ్యానం వలన ఇంకొందరు సిద్ధులై ధన్యను పొందుతారు. బుద్ధి అనేది ఎవరికైనా సిద్ధిని ప్రసాదిస్తుంది.

ఉ. బుద్ధినిగల్గువాడె పరమోన్నతు డందరిలోన; మందుడై
బుద్ధిబలంబుగోల్పడిన మూర్ఖుడు హీనుడు; జాతికీర్తి సం
సిద్ధి నడంచు దుర్జనుడు చిత్తవికారముతోడ నీల్గుచున్
వృద్ధి నెదుర్కొనున్ దనుజవృత్తి చెలంగుచు ధర్మదూరుడై! 38

బుద్ధిమంతుడే గొప్పవాడు; బుద్ధిలేనివాడు మూర్ఖుడు; అటువంటివాడు దుర్మార్గుడై జాతికీర్తిని వృద్ధిని ఎదుర్కొంటాడు

చం. దనుజులనంగ నెక్కడనొ దాగినవారలు కారు; ధాత్రిలో
వినయవివేక సంపదలవీడి యమానుషవర్తనంబునన్
పనిగొని హింసజేయు రణపాలురుదక్క ప్రవృద్ధమైన బు
ద్ధిని వికసింపజేసుకొను ధీరులు మానవులీ ధరిత్రిలో! 39

రాక్షసులంటే వేరే ఎక్కడో లేరు. వినయవివేకాలు లేకుండా మానవత్వాన్ని విడిచి పనిగట్టుకుని హింసించేవాళ్ళు తప్ప రాక్షసులంటే వేరెవరో లేరు; బుద్ధితో ఆలోచించే మహానుభావులే ఈ లోకంలో మానవులు.

ఉ. ఆయువుగల్గునాల్గుగడియల్ తనతోటి జనావళి మెచ్చునట్లు సే
వా యజనంబులన్ సలుపు వారలె మానవు లిద్ధరిత్రిపై
తీయని బంధుకోటియు సుధీమహితాత్ములు వారెయౌను; నా
నా యగచాట్లనొందియు నణంగక సేవలొనర్తు రా జనుల్ ! 40

ఆయువున్నన్నాళ్ళు తనతోటివాళ్ళకి సేవలు చేసేవాళ్ళు అసలైన మానవులు.వారే తెలివిగలవారు; బంధువులు; వారు ఎన్ని అగచాట్లకు గురియైనా అణగారకుండా సేవలు చేస్తూనే ఉంటారు.

ఉ. బుద్ధికితోచినట్లుగ నపోహలబోవుట మేలుగాదు; త
ద్బుద్ధి నియంత్రణాగరిమతో నడయాడుచు మంచిచెడ్డలన్
బుద్ధినెరింగి లక్ష్యమునుపొందుట మేలగు ! బుద్ధిమంతులే
వృద్ధినిబొందు నిద్ధరణి పేరిమికూరిమి వారిసొమ్ములౌ! 41

ఎవరిబుద్ధికి తోచినట్లుగా వారు అపోహలతో కాలం గడపటం మంచిదికాదు;బుద్ధిని అదుపులో ఉంచుకుని మంచి చెడుల్ని తెలుసుకుంటూ నడుచుకోవటం మంచిది.లోకంలో బుద్ధిమంతులే వృద్ధిని పొందుతారు.

సీ. అణుమాత్ర దేహంబునందు దాగిన శక్తి
అద్భుత మానవుండయ్యెను గద
పాంచ భౌతికమైన పార్థివదేహంబు
పరమాత్మమనికియై బరగెను గద

అంతరంగమునేలు నధినాయకుండుగా
నపురూపదైవమే యలరునుగద
అఖిలలోకములేలు నాత్మస్వరూపుడే
అవయవమ్ములనేలు నధిపుడు గద
గీ. అట్టి భగవాను నాత్మలో నరయలేక
చుట్టుగట్టుల తిరుగాడుచుండ నేల ?
బిట్టుపంతాల వంతల కొట్టుకొనుచు
నెవడు దేవుడుయనుచు వాదింపనేల ? 42

అణువులతో యేర్పడిన శరీరంలో దాగిన అద్భుతశక్తియే మానవుడయ్యాడు. పాంచభౌతికమైన ఈ పార్థివ దేహమేపరమాత్మకు నివాసమయ్యింది. అఖిలలోకాలనుపాలించేదేవుడే మనిషిమనస్సుకు పాలకుడయ్యాడు. అటువంటి దేవుణ్ణి మనస్సులో చూసుకోలేక దేవుడేడియంటూ చుట్టుపక్కలతిరగతూ వాదించటం దేనికి ?

సీ. ఈశుండనిన మనుజేశుండనిన పర
మేశుండె యగునంచు నెరుగలేవొ
జీవాత్మలోనున్న జీవమే పరమాత్ము
డను సత్యసారమ్ము నరయలేవొ
కోట్లాదిగల జీవకోటిని రహియించు
దీప్తియెవ్వనిదొ గుర్తింపలేవొ
జీవజాలముచేయు చేష్టలసృజియించు
చిత్రదర్శకుని భజింపలేవొ
గీ. ఈ జగన్నాటకంబు రచించునెవడొ
యెరుగనేలేవొ ? నీకింత యెరుకలేదొ ?
కులము మతమను తీండ్రతో కొట్టుకొనుచు
నెవడుదేవుడు యనుచు వాదింతువేల ? 43

ప్రభువన్నా రాజన్నా పరమాత్ముడేననియెఱుగవా?మనలోనిప్రాణమే పరమాత్మ అనితెలియదా ? కోట్లాది జీవులలో ప్రకాశించే వెలుగే పరమాత్మ అని గుర్తించలేవా? ఇన్నిజీవాలు చేసే పనుల్ని రూపొందించే దర్శకుడు దేవుడేనని తెలుసుకోలేవా ! ఈ జగన్నాటక కర్త ఎవరో నీకు తెలియదా ? కులం మతం అని కొట్టుకుంటూ వాదిస్తారేం ?

సీ. అహమహమికతోడ నహరహమ్ము చరించి
యహమనవెవ్వరో యరయలేవు

యనుబంధముల నెంచి యంతయునాదియే
యనుమాయ మునిగెడి జనుదవీవు
నీలోననెలకొన్న నిండుదైవమువంక
గనలేక విలపించు ఘనుదవీవు
కుత్సితాత్ముడవౌచు కులభేదములతోడ
కూళవైచరియించు కుమతివీవు
గీ. అల్పసాధనచేతనే యధికమైన
ఘనతసాధించినట్లు యుద్ఘటన లేల?
సత్యశోధన గావించి సాగుమయ్య
నిత్యజయశీలివై నీవు నియతిగొనుచు 44

రేయింబవళ్ళునేనంటేనేననేమనస్తత్వంతోనడుస్తావుగానీ నేను అంటే ఎవరో చెప్పలేవు;బంధుత్వాలమాయలో పడిపోతావు; నీలోనే ఉన్న దైవాన్ని చూడలేక ఏడుస్తావు; కుత్సితమైన కులతత్వంతో కుమిలిపోతావు. కొంచెం సాధించగానే ఘనకార్యాన్ని సాధించినట్లు విఱ్ఱవీగుతావు;సత్యశోధనచేసి నిత్యజయశీలివై నడుచుకోవయ్యా

సీ. కాలప్రభావంబు గర్హింపగాలేము
ఘంటాపథమ్మిది గడచితీరు
మాయాప్రభావమ్ము మాన్పజాలగలేము
మన్నించుటదికాక మరియులేదు
కర్మపొందుఫలమ్ము కాదనజాలము
కర్తవ్యమిల వేరు కానరాదు
శివునాజ్ఞ లేనిదే చీమైన చావదు
చింతించి వేరొండు చేయలేము
గీ. విలువ లానాటి కానాడు తొలగుచున్న
మాయరోగాలు కొల్లలై మసలుచున్న
దైవచింతన నటనయై తప్పుచున్న
కదలవేమయ్య జలధీశ కావవయ్య!! 45

కాలప్రభావాన్ని ఎవరమూ దాటలేము; అది తన ధర్మాన్ని నిర్వర్తించి తీరుతుంది. లోకమంతటా నిండియున్న మాయాప్రభావాన్ని నిరోధించలేం. దాన్ని మన్నించితీరాల్సిందే. అలాగే కర్మఫలాన్ని మనం కాదనలేం. దాన్ని దాటిపోయే మార్గం యేదీలేదు. శివునాజ్ఞలేనిదే చీమైనా చావదు. దానిగురించి దిగులుచెంది ప్రయోజనం

లేదు. రోజురోజుకూ విలువలు దిగజారుతున్నవేళ , మాయాప్రభావం పెరిగిపోతున్న సందర్భంలో, దైవభక్తి అనేది ఒక నటనగా మారిపోతున్న రోజుల్లో ఓ జలధీశ్వరస్వామీ కదిలిరావయ్యా !

ఉ. కన్నులు మూసుకొంచు పలుగాకుల లోకుల గానకుంటివే
యన్నులమిన్న "బాల" పరిహాసము లాడుచునుండ లీలగా
మిన్నకయుంటివేమొ! యిదిమేలు ఘటింపదు లేచిరావయా
పన్నగభూషణా! జగతి భవ్యగతిన్ సరిదిద్దిబ్రోవుమా! 46

ఓ పన్నగభూషణా! నీచెలికత్తె బాల నీతో సరసాలాడుతూ మురిపిస్తుంటే కళ్ళుమూసుకుని ఆనందిస్తున్నావా!ఇది మంచిపనికాదయ్యా! లోకాలను సరిదిద్ది కాపాడాల్సినపని ఉంది. లేచిరావయ్యా!

చం. కులమతవాదభేదముల ఘూర్ణిలుచుండె జగమ్ములన్ని సం
కుల సమరమ్మొనర్చుచు నకుంఠిత దీక్ష మతప్రచార మె
వ్వల నొనరించుచున్ సకలభాగ్యములొడ్డుచు వారిమార్గమే
సలలిత యోగ్యమార్గమని చాటుచు భేదములెత్తి చూపెడిన్ ! 47

లోకాలన్నీ కులమతభేదాలతో కుళ్ళి తన్నుకుంటున్నాయి. తమసకలసంపదలనూ మతప్రచారాలకే వినియోగిస్తూ తమ మతమే అన్నిటికన్నా గొప్పదని చాటుకుంటూ, ఇతరుల లోపాల్ని యెత్తి చూపిస్తున్నారు.

చం. కలిగిన పుణ్యకాలమున కశ్మలభావములూని పోరుచున్
దలపడుచుండె మానవు లుదంచిత ధర్మము లుజ్జగించుచున్
కలుష కషాయ కూటముల గాఢతమమ్మున జిక్కి వేరుగా
కులపులకింతతో జనెడి కూళలబుద్ధులు మాన్పవేమయా ? 48

కావలసిన మంచి ధర్మాల్ని వదిలేసి, మనుష్యులు పాపాలోచనలతో, కూటరాజకీయాలతో, కులమతభేదాలతో చీకటిలోచిక్కి కొట్టుకుంటున్నారు. వారి దుర్బుద్ధుల్ని పోగొట్టవేమయ్యా !

సీ. భూలోకమది పాపపుణ్యాలకూడలి
సత్యానృతాల కాసారమదియె
రాత్రింబవళ్ళుగా ధాత్రిన్ విరాజిల్లు
నీ ద్వంద్వసమితి విహీనగతిని
యేడేడులోకాలనేటికి మధ్యగా
భూమియుండుటనేమొ పొల్పెనిటుల
దైవమ్మునెదిరించి దయ్యమ్ము రీవిగా
ధారుణినేలు నుద్ధతియొ యేమొ

గీ. రావణాదుల వారసుల్ రచ్చనిలచి
సంస్కృతంబును సంస్కృతిన్ జంపగోరి
మొగ్గరంబొనరింపగా ముందుకురికి
కాలుదువ్వుట కిది యొక కారణంబొ !! 49

భూలోకంఅనేది పాపపుణ్యాలకూడలి.సత్యాసత్యాల సరస్సు. ఆ పాపపుణ్యాలు రాత్రింబవళ్ళుగా లోకంలో నడుస్తూ ఉంటాయి.పధ్నాలుగు లోకాలమధ్యలో భూలోకం ఉండటం వల్లనేమో ఇలాజరుగుతోంది. దైవాన్ని ఎదిర్చి దయ్యం నేలను యేలటంవలన ఈ అఘాయిత్యం జరుగుతోందేమో! రావణాది రాక్షసులవారసులు సంస్కృతినీ, సంస్కృతాన్నీ సంహరిస్తూ కయ్యానికి కాలుదువ్వటంవల్ల ఇలాంటి పరిస్థితులు యేర్పడ్డాయేమో!

ఉ. ఆశకుహద్దులేక జనులందరు తేరగవచ్చు లబ్ధికై
శైశవబుద్ధులట్లు నిమిషమ్ము శ్రమింపక జీవనమ్ములన్
గాశి నెరుంగబోనటు సుఖమ్ముగ పోనడుపన్ దలంచి పే
రాశ మునింగి కోర్కెల విరాజిలుచుండి రిదేమి చోద్యమో !! 50

పిల్ల మనస్తత్వంతో తేరగాలాభం పొందాలని ప్రజలు పేరాశతో వ్యవహరించటం చాలావింతగా ఉన్నది శివా!

ఉ. దేవుడ! నీవె వచ్చినను తృప్తిగడింపక నీచ వాంఛలన్
భావనజేసి కోరెదరు; భవ్యఫలంబుల మెచ్చబోరు; సం
భావనజేయవయ్య జనవర్తనయెట్టిదొ! మాయదోగు నీ
జీవుల తత్వమున్ దెలియు చిన్మయమూర్తివి నీవె సృష్టిలో! 51

ఓదేవుడా!నీవేవచ్చిదర్శనమిచ్చినాతృప్తిని పొందక నీచమైన కోరికలను ఈ ప్రజలు కోరుకుంటారు. అంతకుమించి గొప్పఫలాలను మెచ్చుకోరు. ఈ సృష్టిలో వీరి ప్రవర్తన ఎటువంటిదో తెలిసిన మహానుభావుడవు నీవేకదయ్యా!

ఉ . స్వర్గమునిత్తునన్న నది చాలక లక్షలసొమ్ము గోరు దు
ర్మార్గులు పెక్కు రీభువి నమోఘముగా చెలరేగుచుండె; స
న్మార్గమునాచరించెడి యమాయకులన్ గికురించు వంచనా
దుర్గమ మార్గవర్గులు మదోద్ధతులై చెలరేగుచుండెడిన్ ! 52

ఈనాడు ప్రజాలెంత దుర్మార్గంలో నడుస్తున్నారంటే దేవుడే దిగివచ్చి స్వర్గం ఇస్తానంటే సరేకానీ దానితోపాటుగా లక్షలసొమ్ములు కూడా ఇస్తావా అని అడిగే స్థితిలో ఉన్నారు. వారు చెడుదారిలో నడుస్తూ, మంచి దారిలో పొయ్యే వారిని చెడగొడుతూ మదగర్వంతో చెలరేగిపోతున్నారు.

ఉ. సాధువులైనవారియెడ శౌర్యము జూపెడి రాక్షసాధముల్
వీధులలో చరించుచు నభీప్సితమిమ్మని తన్నులాడుటల్
శోధనజేయుమయ్య! పరిశుద్ధమనస్కులు పొందుచున్న నీ
బాధలనెట్లుబాయుదు రుపాయము దెల్పు ముమామహేశ్వరా! 53

ఓరిశివుడా! రాక్షసులు సాధువులపై పరాక్రమాన్ని చూపిస్తున్నారు. వాళ్ళడిగింది ఇమ్మని కట్టడి చేస్తున్నారు. సాధుజనుల బాధలు తీరే దారి చూపరా!

మ. ఘనతత్వమ్ము రుచించదయ్యె; ధనమే కైవల్యమిప్పించు సా
ధనమౌనంచు తలంచు జీవులు మహౌద్ధత్యమ్మునన్ దేవుడే
ధనలోభమ్మున దర్శనంబిడును గాదాయంచు తీంట్రించి జీ
వనయానమ్మును ధిక్కరింతురిది నీ వైఫల్యమౌనా శివా! 54

ప్రజలకు తత్త్వవిశేషాలు రుచించటం లేదు; ధనమే మోక్షసాధనమని నమ్ము తున్నారు. జీవనవిధానాన్ని ధిక్కరిస్తూ దేవుడే ధనానికి బానిసయై డబ్బిస్తే దర్శనం ఇస్తున్నాడని విమర్శిస్తున్నారు. శివా! ఇది నీ చేతకానితనమా ?

ఉ. సొమ్ములుగల్గువాడె పురుషోత్తముడౌ! నొకపుణ్యమూర్తియౌ:
నిమ్ముగకీర్తివంతుడగు; నెల్లెడ రాజుగ వెల్గులొందు ; స
త్యమ్ముగ లోకపాలుడని ధర్మవిదుండని పేరుగాంచి ని
త్యమ్మును తేజరిల్లును యథార్థముగా ధనలబ్ధి గల్గినన్! 55

ధనంఉన్నవాడు మహానుభావుడుగా గుర్తించబడుతున్నాడు. అతడే పుణ్యాత్ముదని కీర్తి పొందుతున్నాడు. అటువంటి వాడే రాజ్యాన్ని పొందుతున్నాడు. వాడే ధర్మాత్ముడు అని కూడా పేరుపొందుతున్నాడు.

సీ. సుఖసంపదలతోడ శోభావహమ్మైన
పదవులనెన్నియో బడయవచ్చు
చిరభాగ్యములతోడ చెన్నారు విశ్వాస
పాత్రమౌ సేవల బడయవచ్చు
ధనవిస్తృతినిజూపి తరుణీమణుల మాన
పానమానుచు తృప్తి బడయవచ్చు
భాగ్యసంచయమున్న పడగెత్తు కోట్లచే
వాంఛితార్థములన్ని బడయవచ్చు
గీ. సమ్మతింపగ గోరుచు సొమ్ములిచ్చి
మతవిశేషము గడియలో మార్చగలరు

సొమ్ములుండిన కలగని శోభలేదు

ధరణి నేలును ధనము విస్తారగతిని ! 56

ధనంఉంటే ఎన్నెన్నోసుఖాలనుపొందవచ్చు. పదవులను పొందవచ్చు. అందరిచేతను సేవించబడవచ్చు. వేశ్యలను అనుభవించవచ్చు.అన్నికోరికలనుతీర్చుకోవచ్చు.ఎదటివారి మతాన్ని మార్చవచ్చు. ఎంతైనాశోభను పొందవచ్చు.

ఉ. సంపదలేనివాడు గుణసంయుతుడయ్యు దరిద్రుడౌను; రా
ణింపగలేడు దేశమున నేర్పరియైనను; సాటివారు మ
న్నింపరు యేహ్యభావమున నెందు సహింపక ద్రోచివైచి దుః
ఖింపగజేయు నీతనిని కేవలమీ ధనలోప భావనన్ 57

సంపద లేకపోతే ఎన్ని గుణాలున్నా దరిద్రుడే అవుతాడు. ఎంతటి నేర్పరితనమున్నా రాణించలేడు. తోటివారు సహించరు. అవలకు త్రోసి దుఃఖింపచేస్తారు.

శా. నైపుణ్యమ్ములు లేకపోయినను విజ్ఞానమ్ము లోపించినన్
ప్రాపున్ బొందెడి నేర్పుగల్గిన మహాప్రాజ్ఞుండుగా కీర్తి యు
ద్దీపించున్ దిశలందు; లేని సుగుణాధిక్యమ్ము శోభిల్లుచున్
వ్యాపించున్ సకలప్రపంచమున ధన్యత్వమ్ము రాజిల్లగన్ 58

అందుకు విరుద్ధంగా ఎటువంటి నైపుణ్యము లేకపోయినా, విజ్ఞానం లేకపోయినా, ప్రాపును సంపాదించే నేర్పు ఉంటే మహాప్రాజ్ఞుడని కీర్తిని పొందుతాడు. గొప్పగుణవంతుడని, మహాధన్యుడని, సకల ప్రపంచము కూడా కీర్తిస్తుంది

సీ. ప్రజ్ఞాప్రభావాల పాటవమ్ములు కావు
వెనుకబాటు తనంపుటునికి చాలు
విజ్ఞానమతియన్న వేడ్క యక్కరలేదు
అజ్ఞాన ధృవపత్రమదియె చాలు
ప్రావీణ్యవంతుడన్ ప్రాగల్భ్యములుకావు
అప్రయోజకమతి యైనచాలు
బ్రహ్మాండవిద్యల పారాయణత కాదు
యాత్మీయగణమైన నదియె చాలు

గీ. నేర్పు తీర్పులకంటె సన్నిహితమైన
గణము వర్గము వారను కారణములె

ప్రజ్ఞ గుర్తించుటకు మూలభావములయి

అసలు నశియింపజేయుచు నతిశయించె ! 59

ఎవరినైనా ప్రజ్ఞావంతుడని గుర్తించాలంటే అతనికి నిజంగా ప్రజ్ఞాపాటవాలు ఉండక్కరలేదు. అతడు వెనుకబడిన వాడు అని గుర్తింపుఉంటేచాలు. తెలివిగలవాడు కానక్కరలేదు. తెలివితక్కువవాడనే ధృవపత్రం చాలు. గొప్పగొప్ప ప్రావీణ్యతలు అక్కరలేదు. అధికారగణానికి ఆత్మీయుడైతే చాలు.

శా. మేధావుల్ భృతికోసమై తరలుచున్ మేలైన సంపాదనా గాథ=కథ., గాధ.కోరిక

గాథల్ వించు ధనార్జనాభిరతిచే ఖండాంతరవృత్తులై

యోధత్వంబున బోవుచుండి రిటులయ్యో మాతృదేశమ్మ! నీ

మేధాసంపద కొల్లబోవునెడ బ్రాహ్మీతత్వమేమౌనొకో! 60

మేధావులు జీతం కోసం తరలిపోతున్నారు. ఇతరదేశాల్లో బాగా సంపాదిస్తున్నారనే కథలు విని మహాయోధులవలే విదేశాలకు పోతున్నారు. ఓ మాతృదేశమా!నీ మేధా సంపద కోల్పోతుంటే ఇంకా నీ విద్యావైభవం ఎక్కడమ్మా ?

: **శివశర్మోపాఖ్యానం**:

మ. కలడొక్కండు షడంగవైదికసుధాగర్భుండు; కర్మిష్ఠి;చు

క్కలసంఖ్యన్ గణియించునేర్పుగల విఖ్యాతుండు; సుశ్లోకుడై

తలలోనీశ్వరునిన్ భవానిని సదాధ్యానించు ప్రాజ్ఞుండు;కో

మల కీర్తిప్రభచే రహించు "శివశర్మా"ఖ్యుండు బ్రహ్మజ్ఞుడున్ 61

శివశర్మ అనే ఒక మహా పండితుడు ఉన్నాడు.చుక్కల్నికూడా లెక్కించగల నేర్పు ఉన్నవాడు. పొగడదగినవాడు.ఎల్ల వేళలా ఈశ్వరుణ్ణి, అమ్మవారినీ ధ్యానించే ప్రాజ్ఞుడు. బ్రహ్మజ్ఞానం గలవాడు. షడంగములు అభ్యసించినవాడు. మహా కర్మిష్ఠి .

సీ. నిత్యరుద్రార్చనా నియతి శోభిల్లెడి

నిగమానుభావుండు నిపుణమూర్తి

వేదవేదాంగాదివిషయపరిజ్ఞాన

విస్పష్ట సంపద్వివేకమూర్తి

భాషావిశేష సంభాషణా చాతుర్య

ధుర్యుడాతండు వైదుష్యమూర్తి

కావ్యపాఠములందు గౌరవప్రదుడని

ఖ్యాతినొందినయట్టి కావ్యమూర్తి

గీ. బ్రహ్మ వాఙ్మయరేఖ జిహ్వాగ్రమందు
వ్రాసిపంపగ వసుధలో వాసిగాంచి
వాఙ్మి వోలెనువర్తిల్లి వాగ్విభవము
వండివడ్డించు బ్రహ్మస్వభావి యతడు ! 62

నిత్యము పరమేశ్వరధ్యానంచేసేవాడు.వేదాభ్యాసపరుడు. వైదికవిద్యలేసంపదలుగా గలవాడు. గొప్ప భాషాభిజ్ఞుడు. కావ్యపాఠంలో గొప్పవాడు. సాక్షాత్తుగా సరస్వతీమూర్తి యనదగినవాడు.

సీ. పరమేశ్వరధ్యాన భాగ్యమొక్కటిదక్క
ప్రాప్తమైన ధనమ్ము పరకలేదు
నిగమానుసారియై నిత్యపూజలొనర్చు
లక్ష్యమొక్కటి గాక లవములేదు
పంచాక్షరీమంత్ర సంచితార్థముగాక
పలుతెరంగుల నొందు బలము లేదు
జలధీశ్వరునిముందు జపమొనర్చుట దక్క
సంపాదనంబొక చాయలేదు
గీ. కాసులేశమ్ము కంటను గాంచకున్న
నిండుమనమున నీశ్వరు నిలుపుకొనుచు
నీశ్వరేచ్ఛకు తలవంచి యిహముమరచి
తృప్తిగనుచుండె శివశర్మ తేజమరసి ! 63

శివశర్మ ప్రతిక్షణం పరమేశ్వరధ్యానంతో తృప్తిని పొందుతూ ఉంటాడు. ధనసంపాదనపై అతనికిదృష్టి లేదు. ఈశ్వరేచ్ఛ ఎలా ఉంటే అలా జరుగుతుందని నిర్లిప్తంగా రోజులు గడుపుకుంటు జపతపధ్యానాలపై తన దృష్టిని నిలిపి జీవనాన్ని నడుపుకుంటాడు.

శా. ధర్మార్థాదుల కామమోక్షముల సంధానించి యెవ్వండు లో
మర్మంబున్ గమనించి సాగును?సుసంపన్నత్వమే ధాత్రిలో
కూర్మిన్ మేలని యెంచునెవ్వడయినన్ కోర్కెల్ విదారించి స
ద్ధర్మమ్మే గతియంచు సాగుట మహత్కార్యం బసాధ్యంబగున్ 64

ధర్మార్థ కామమోక్షాలను సమన్వయించుకుని వాటిలో ఉన్న మర్మాన్ని గ్రహించి నడవగలవారు ఎవరున్నారు ? తక్కినవాటన్నిటిలోధర్మమే నామార్గమని, తనకెన్ని చీకుచింతలు ఎదురైనా నిశ్చయించుకుని నడవటం గొప్పదనం

శా. భుక్తిన్ గాంచెడి యుక్తిమాని నిరతమ్ముఁన్ పూజలన్ లీనమై
శక్తిస్తోమతలన్ని యీశ్వరకృపాసంపత్తిపై నుంచి స
న్ముక్తిన్ గోరుచు ముక్కు మూసుకుని నిర్మోహప్రభోద్విగ్న సం
యుక్తధ్యాననిమగ్నబుద్ధి యగుచున్ యోజించునీతండెటన్ 65

పూటగడిచే ఆలోచనచేయడు. తనశక్తిస్థోమత లన్నిటినీ శివానుగ్రహ సంపాదనకోసమే వినియోగిస్తాడు. కోరికల్ని నిరోధించే విధంగా బుద్ధిని నిలుపుకుంటు ముక్కు మూసుకుని ధ్యానం చేస్తుంటాడు.

మ. మునివృత్తిన్ భవబంధముక్తునివలెన్ మోదించుచున్ ధ్యానదీ
క్షను నిత్యమ్ము మునింగి యోగఫలవాంఛాలోలుడై జీవయా
త్రను గావించుచునుండె వానివరకున్ ధర్మంబెయీరీతి జీ
వన మేరీతి కుటుంబసభ్యులకు నవ్వారిన్ మదిన్ గాంచదే ? 66

శివశర్మ మునీశ్వరునివలే భవబంధాలకు దూరంగాఉంటున్నాడు. కుటుంబం పరిస్తితినిపట్టించుకోవటం లేదు.

శా. దేహంబంతట నీశ్వరుండు కొలువై దీపింపగా జీవ సం
దేహంబింతయు లేక నూపిరుల దేదీప్యమ్ముగా నీశుడే
బాహాటమ్ముగ నాట్యమాడగ పరిభ్రాంతి ప్రభారాశి నా
వాహమ్మొల్లక శాంతచిత్తమున సంభావించు సర్వేశ్వరున్ 67

రుద్రుడుకానివాడురుద్రునిఅర్చించలేడు అన్నట్లుగా శివశర్మ రుద్రరూపుడై ప్రశాంతంగా రుద్రుని సంభావించేవాడు

చం. ధరణిని "ధర్మసాధన ముదంచిత దేహము" దాని నిల్పగా
నరయడితండు; వీని నరయన్ పనిబూనునెవండు ? యైన నీ
శ్వరుని కృపారసమ్మొ మరి భక్తులభవ్యదయారసమ్మొ! కొం
దరు గమనించి భోజన విధంబులు సాయమొనర్చె వీనికిన్ 68

"శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అని ఆర్యోక్తి. అయినా అటువంటి శరీరాన్ని నిల్పుకునే ప్రయత్నాన్ని ఇతడు చేయటం లేదు. వీనిని కనిపెట్టాల్సిన అవసరం ఎవరికి ఉంటుంది ? అదియేమోగానీ ఆ ఈశ్వరుని దయావిశేషమో లేక భక్తుల ప్రేమాదరణమోగానీ కొందరు ఇతనికీ, ఇతని కుటుంబానికీ భోజనాలు ఏర్పాటుచేసేవారు.

ఉ. భూతదయావిశేషమున పుణ్యమతుల్ గమనించి వీనికిన్
చేతయినంతసాయమును జేయుచునుండిరి ; గ్రాసవాస ని

ర్మాత మహేశ్వరుండగుచు మన్ననజేయుచు బ్రోచుచుండగా
నీతడు దేహయాత్ర గడియించుచునుండె జనాదృతిన్ పురిన్ 69

భూతదయను కలిగిన కొందరు పుణ్యాత్ములు శివశర్మకు చేతయినంత సహాయం చేసేవారు. గ్రాసవాసాలను ఈశ్వరుడే అనుగ్రహించటం వలన ప్రజలు ఆదరించటంతో ఈతడు దేహయాత్ర చేయసాగాడు.

ఉ. వీనికితగ్గ పుణ్యమతి వీనికి భార్యగవచ్చె; నామెయున్
పూనిన ధర్మదేవతగబొల్చుచు భర్తృ పదానువృత్త స
మ్మాన ఫలానుభావ గుణమంజరి! యైహికభోగవాంఛలన్
మానసమందు నిల్పక నుమాపతి సేవల తృప్తి నొందెడిన్ 70

శివశర్మకుతగినభార్యలభించింది.భర్త అడుగుజాడల్లో నడుస్తూ ఐహిక వాంచలకు దూరంగా ఉంటూ అయ్యవారినీ అమ్మవారినీ సేవిస్తూ కాలం గడుపుతోంది.

మ. పతివోలెన్ సతి నిర్వికారజప సంపత్తిన్ గ్రహించెన్; జనా
దృతి బోనంబు లభించునాడు తిని తృప్తింజెందు నా దంపతుల్
మతిమంతుల్ మమకార దూరులగుచున్ మాహేశ్వరున్ గొల్చి స
ద్గతులొందన్ దలపోయుచుందురు మహద్భాగ్యంబు గుర్తించుచున్ 71

శివశర్మ భార్యకూడా భర్తను అనుసరిస్తూ ఎటువంటి వికారాలూలేని జపదీక్షను గ్రహించింది. ప్రజలెవరైనా ఇస్తే ఆ దంపతులు తిని తృప్తిపడేవారు. లేకుంటే అలాగే పస్తులుండేవారు. వారుఎవరిపైనా ఎటువంటి మమకారమూ లేకుండా మహేశ్వరుణ్ణి సేవిస్తూ ఉండేవారు. బుద్ధిమంతులు ఇలాగే చేస్తారు కదా!

సీ. పూదేనియలబీల్చు పొల్పారు తేటియై
శివభక్తి రసమాను చెలువుడితడు
పండు వెన్నెలతిను పక్షి చకోరమై
పరమేశ్వరునిగాంచి బ్రతుకునితడు
సూర్యతేజమునొంది చొక్కెడి పద్మమై
జలధీశ్వరునిగొల్చు జనుడితండు
స్వాతివానకు నీను సంద్రపుచిప్పయై
వారిధీశుభజించు భక్తుడితడు
గీ. శివుని కరుణారసంబును చేదుకొనెడి–
భక్త సిరియాళుడని జనుల్ ప్రస్తుతింప
పాశుపతదీక్ష చేపట్టి పరమశివుని–

గొల్చెశివశర్మ నిత్యమొక్కొక్కరీతి 72

శివశర్మ పాశుపతదీక్షతో రోజుకొక్కొక్కవిధంగా భక్తసిరియాళునివలె పరమేశ్వరుని సేవించసాగాడు.

శా. ఆకర్షించు విశేషముల్ పలువిధాలై ముందు నర్తించినన్
తాకన్ బోవక వెంటనంటక సమస్తంబున్ నిరోధించి యా
సోకుల్ జూడక చిందులన్ గనక కాసుల్ కోరబోకుండ లో
కైకారాధ్యునిపైన దృష్టినిడె సోహమ్మన్న భావమ్మునన్ 73

మనస్సును ఆకర్షించే విశేషాలు ఎన్నెన్నో ఎదురుగా నర్తిస్తున్నా వాటివంకైనా చూడకుండా శివశర్మ ఈశ్వరునిపై దృష్టి నిలిపి ఆరాధించసాగాడు.

ఉ. ధర్మపథానబోయెడి యుదాత్తుడు; వీనికి దానమిచ్చినన్
ధర్మబలంబు హెచ్చునని ధార్మికులందరు లో దలంచి స
త్కర్మఫలంబుగా నితనికై తినుబండము లిల్లువాకిలిన్
ధర్మయుతంబుగా నిడుచు తద్దయుగాచిరి చాలకాలమున్ 74

శివశర్మ ధర్మాత్ముడు; ఇతనికి దానమిస్తే ధర్మదేవత సంతోషిస్తుంది అని తలంచి అతనికి తినుబండారాలు , ఉండటానికి ఇల్లు వాకిలి సమస్తము ఏర్పాటుచేసి చాలాకాలం గ్రామస్తులు తోడ్పడ్డారు.

సీ. శివశర్మ యనినంత శివుడే యితండని
భక్తిగూడిన జనుల్ భక్ష్యమిచ్చె
శివశర్మ కిడినచో శివుడొప్పుననుబుద్ధి
భోగమొప్పగ జనుల్ భోజ్యమిచ్చె
శివశర్మతిననచో శివతృప్తియౌనని
వేలాదిపండ్లు నైవేద్యమిచ్చె
శివశర్మతృప్తియే శివతృప్తియనియెంచి
పుణ్యాత్ములెల్ల తాంబూలమిచ్చె
గీ. ఇట్టివాటిని గమనింపనట్టి ధర్మ
బుద్ధిగలవాడు శివశర్మ! పుడమియందు
కరుణవహియించి వీనికి కరువుదీర
భుక్తి నిడెనేమొ శంభు డామోదమంది 75

శివశర్మభక్తితాత్పర్యాలనుచూసిప్రజలు అతడు సాక్షాత్తుగా శివుదేననుకుని అతనికి సమర్పిస్తే శివునికి సమర్పించి నట్లేనని భావించి రకరకాల భక్ష్యాలు, భోజ్యాలు, ఫలాలు, తాంబూలాదులను అతనికి

సమర్పించుకునేవారు. బహుశా శివుడే శివశర్మయందు జాలిపడి అతనికి కరువులేకుండా భుక్తి సమస్తాన్నీ సమకూర్చాడేమో నన్నట్లుగా అతనికి సమస్త సంబారాలూ సమకూరాయి.

శా. బ్రహ్మాండమ్ము సృజించి యేలెడిమహాస్రష్టన్ మదిన్ దాల్చుచున్
బ్రహ్మానందము నొందు భక్తునకు సంప్రాప్తించు ద్రవ్యమ్ములున్
బ్రహ్మాండమ్మున తృప్తినిచ్చునట యీ భావప్రసంగమ్ము యం
బ్రహ్మల్ లోనదలంపబోరు విషయభ్రాంతిన్ వివర్తించుచున్ 76

ఈ బ్రహ్మాండాన్ని సృష్టించినవాణ్ణి నిత్యమూ స్మరించుకుంటూ ఆనందిస్తుంటే అతనికి లభించే వస్తువులుకూడా అందరికీ ఆనందాన్ని కలిగిస్తాయి. తెలివితక్కువవారు(యం బ్రహ్మలు) దీన్నిగ్రహించలేక వేరుగా ప్రచారం చేస్తారు.

సీ. శాశ్వతానందమ్ము సంతోషమిచ్చునో
దినవెచ్చములగోల తృప్తినిడునొ
పరమాత్మసేవయే భాగ్యమై తోచునో
కుక్షింభరత్వమే కుశలమగునొ
సర్వప్రదాత విశ్వాసమొందుటమేలొ
నశ్వరవిషయ విజ్ఞతయెమేలొ
అధ్యాత్మ చింతనాభ్యాస మొందుటమేలొ
లోకపంకిలమూను సోకుమేలొ
గీ. ఇట్టిచింతన చేయలేనట్టివారి
మాట చెవియొగ్గవలదురా మంచి యొకటి
యెల్లవేళల గౌరవముల్లసిల్ల
వాసిగాంచును వసుధ సంవర్ధమగుచు 77

ఏది మంచిదో ఏది కాదో తెలుసుకోలేనివారిమాటలను పట్టించుకొనవద్దు. మంచి అనేదొకటే నిలబడుతుంది

. **మానిని : శ్రీజలధీశ్వరు చింతనజేసిన చీకురవంతయు చేరదుగా**
పూజలొనర్చినపుణ్యజనుల్ పరిపూర్ణఫలమ్ములు పొందునిలన్
భూజనులున్ గడుపుణ్యులుతోడ్పడ పూజనొనర్చె విభూదియుతిన్
తేజితశక్తిమతిన్ శివశర్మ"సుధీవిభవమ్మది దీప్తిగొనన్ 78

శ్రీజలధీశ్వరస్వామినినమ్మినవారికిరవ్వంతైనాచింతకలగదు.ఆస్వామినిసేవించినవారుమంచిఫలితాన్నిపొందారు. శివశర్మకూడా అలానే స్వామిని సేవిస్తున్నాడు. ఈ క్రింది పద్యాలు స్వామి వారిని కీర్తించేవి.

మానిని: **కష్టములొంద సుఖమ్మొనగూర్చుచు గాచునుమాపతి కన్గొనుమా**
శిష్టజనావళి చింతలబాపు విశిష్టదయామతి జింతిలుమా
పుష్టినితుష్టిని పోడిమినిచ్చెడి భూతగణేశ విభుండితడే
యిష్టతగొల్చి భజించిన మేలొనరించు మహేశ్వరు డిజ్జగతిన్ 79

ప్రజలకుకష్టాలువస్తే ఆఉమాపతియేకాపాడుతాడు.ఆయనశిష్టజనరక్షణచేసేదయావంతుడు. ఆయనను సేవించిన వారికి మేలు కలుగుతుంది.

కవిరాజవిరాజితము : **శివశివశంకర సిద్ధినొసంగర చిన్మయతత్వ విశిష్టగుణా**
భవభయదూర శుభంకర శ్రీకర పార్వతివల్లభ పాలయమాం
భవదభిమాన కృపారసమానిన భాగ్యమదేకద పాహిశివా
యవిరళభక్తిని నర్చనసేయ మహత్వఫలంబిదు నాత్మభవా ! 80

ఓ పార్వతీవల్లభా ! మమ్మల్ని కాపాడవయ్యా!నీ అభిమానాన్ని పొందగల్గటమే అదృష్టం కదయ్యా !

మానిని : **అన్నము నీరము నద్భుతతేజమహత్వమునీవెమహాశివుడా**
పన్నగభూషణ భక్తవశంకర పాపవినాశ సుభద్రకరా
నిన్నుభజించిన నీకృపనొందిన నెవ్వగబాయును నిత్యమిలన్
సన్నిహితమ్ముగ సాగిలిమ్రొక్కెద సాధుజనావన శంకరయా! 81

ఓ శంకరా! నిన్ను సేవించితే ఎంతటి బాధయైనా దూరమైపోతుంది కదయ్యా! కనుక నీకివే మా మ్రొక్కులయ్యా!

మానిని : **ఐహికభోగములన్ని వృధాకద యవ్యయరూప మహాపురుషా**
పాహియుమాపతి భవ్య పరాత్పర ఫాలవిలోచన పాలయమాం
మోహవిదారక ముక్తివిధాయక పుణ్యమొసంగర భూవినుతా
దేహిమనోబలదివ్యవరప్రద! ధీవిభవాంబుధి! ధీరమతీ !! 82

మాలోనిమోహాన్ని దూరంచేయగల ఓ స్వామీ! మాకు బుద్ధిని ప్రసాదించవయ్యా!మనోబలాన్ని ఈయవయ్యా!

కవిరాజవిరాజితము : **పరమదయానిధి భక్తమనోన్మణి పాహియుమాపతి పాలయమాం**
నిరుపమ దివ్యగణేశమహేశ్వర నీదరిజేరగనిమ్ము శివా
దురితవిదూర నతుల్ గ్రహియింపర తుష్టినొసంగుచుతోడగుమా!
హరహరశంకర హైమవతీశ్వరయైంకృతరూపమహాత్మశివా 83

ఓపరమేశ్వరా!నీదయకుమేముపాత్రులయ్యే విధంగా మమ్ము గమనించవయ్యా! నిన్ను మేము శరణువేడుతున్నా మయ్యా! మాపాపాలను కడిగివెయ్యి స్వామీ! మాసేవలను గ్రహించి చివరకు మేము నీలోకానికి చేరేవిధంగా అనుగ్రహించవయ్యా !

వనమయూరము : **శ్రీజలధి నాయకుని సేవలు లభింపన్**
భూజనులు సర్వగుణ మోదము గడించున్
బీజముగ లోనొదిగి పెంపుగను భావాం
భోజమది యోగ్యులకు పుణ్యఫలయుక్తిన్ 84

(భ,జ,స,న,గ,గ,గణాలు;9వ అక్షరం యతి; దీనికి ఇందువదన అనికూడా పేరు)

శ్రీజలధీశ్వరస్వామిని సేవించగలగటం గొప్ప అదృష్టం .అసలు ఆ ఆలోచనయే ఒక పుణ్యఫలం .

వనమయూరము: **బాలసతి నోమగల భాగ్యము గడింపన్**
లీల సమకూరు సకలేచ్ఛలు తమంతన్
కాలగతినేలుకొనుగాదె శివశక్తుల్
మేలగును వారలను మేకొని భజింపన్ 85

బాలాదేవిని అర్చించగలగటం ఒక మహాద్భాగ్యం.శివశక్తులను పూజించటం ఎంతో మేలైన మార్గం.

వనమయూరము: **బాలపరమేశ్వరిని బంధువని కొల్వన్**
చాలముదమొంది వరసంపదలు గూర్చున్
కాలవిభుడైన కళకంఠునెద నిల్పన్
మేలుఘటియించి వరమిచ్చిధరబ్రోచున్ 86

బాలాపార్వతిని పూజిస్తే బహుసంపదలు లభిస్తాయి.పరమేశ్వరుని సేవిస్తే ఈ లోకంనుంచి తరింపజేస్తాడు.

వనమయూరము: **నిండుమదిగొల్చునెడ నెవ్వగల దీర్చున్**
గండుమగ డీశ్వరుని గాంచుమెదలోనన్
దండితనమీయగల దాతయతడే యౌ
గండముల పోనడచు కర్తయతడే యౌ ! 87

నిండుమనస్సుతో ఆ పరమేశ్వరుణ్ణి పూజించాలి.ధైర్యస్థైర్యాలను ఈయగల సమర్ధుడు ఆ పరమేశ్వరుడే

వనమయూరము: **దీక్షమెయి గొల్చునెడ దీవెనలనిచ్చున్**
భిక్షకునికైనను సుభిక్షమిడి బ్రోచున్
అక్షయముగా సుగతు లాదృతి నొసంగున్
మోక్షమిడజాలు గురుమూర్తి భవుడెందున్ 88

దీక్షతో ఈశ్వరుని సేవిస్తే భిక్షకుడుకూడా గొప్ప భాగ్యశాలి కాగలడు. జీవులకు ఆయనయే మోక్షప్రదాత.

మానిని: **శ్రీపరమేశ్వర చిన్మయరూప విశిష్టము నీదయచిత్రమయా**
కాపరివైననుగాంచు మహేశ్వర కష్టమడంచు మఖండముగా
నీపదపీఠిక నెయ్యెడ గొల్చెద నిండుదనంబున నిల్పవయా
హేపురుషోత్తమ హేమహనీయ మదీప్సితవాంఛల నీయవయా! 89

హేపరమేశ్వరా! నాకు నీవే కాపరివయ్యా! నేను నిత్యమూ నీపాదసేవచేస్తానయ్యా! మా కష్టాలు తీర్చవయ్యా!

మానిని: **నీదయయున్ననేకవిధంబుల నిల్చిహసింతుమునిక్కముగా**
నాదరిజేరి ఘనంబగు శక్తిని నాకొనగూర్పర నాగశివా
మోదముకల్గ విముక్తినియుక్తిని బుద్ధినొసంగు మమోఘముగా
ఖేదములన్ తొలగించిహరా ఘనకీర్తిగనన్ పులకింపవయా! 90

శంకరా!నీదయయుంటేఅనేకవిధాలుగామేముశక్తినిపొందగలం.మాకు బుద్ధిని,విముక్తిని ప్రసాదించవయ్యా

మహాస్రగ్ధర: **అభవున్ సేవించు భక్తుండనితర కమనీయైక భోగాలతోడన్**
శుభసంపత్తుల్ గడించున్ సుఖమెసగునటుల్ సొంపుపెంపై రహింపన్
ప్రభువున్ ధ్యానించుభక్తుల్ ప్రణతులనొసగన్ భద్రరూపుండుతానై
యభయంబిచ్చున్ మహాత్ముండగుశివు డభవుండై వరానీకమిచ్చున్ 91

ఈశ్వరార్చనచేస్తే అనేక శుభసంపదలు కలుగుతాయి.ఆయన భక్తులకు అభయప్రదానం చేయగలడు .

మహాస్రగ్ధర: **సకలంబీశానుడేగా సమయమయు దయస్కాంత శక్తిప్రభావుం**
డొకడే లోకాలలో వా డొకడెపరిణతుండొక్కడే దక్షుడౌ పా
లకుడై శోభిల్లుచున్ కాలగతి వినిమయోల్లాస బంధంబుతోడన్
ప్రకటామోదంబు నొందున్ భసిత హిమరుచిన్ భాసమానుండతండై 92

ఈశ్వరుడు సమయస్వరూపుడు.అన్నిలోకాలను పాలించే ప్రభువు ఆయన.కాలగతిని నిర్దేశించే వాడతడే.

మహాస్రగ్ధర : **జగదీశా సర్వలోకేశ జయజయ విభో శాశ్వతానందమూర్తీ**
సగుణాలంకారయుక్తా చతురమతియుతా శాంభవీసార్ధరూపా
భగవన్మూర్తీ యుమేశా పరమదయరహింపన్ కటాక్షింపరారా
వగపుల్ దీర్పన్ మహద్భావసమితియలరన్ బంధువైబ్రోవరావా 93

హేజగదీశ్వరా!మా బాధలను తీర్చి మమ్మల్ని కటాక్షించవయ్యా ! నీవు శాశ్వతానందమూర్తివి కదయ్యా !

మహాస్రగ్ధర: **తనలో సంకల్పమూనన్ తగినగతినదే తక్షణంబేర్పడంగా**
నొనగూర్పన్ జాలువాడైయుదధివిభుడనంతోత్సవంబుల్ రహింపన్
ఘనధీశాలుండనంగా కడుదయవలనన్ కాంక్షితంబిచ్చి భక్తుల్
కొనియాడంగా శివుండీ కువలయమున చీకున్ కడన్ ద్రోచి వెల్గున్ 94

ఈశ్వరుడు సంకల్పిస్తే చాలు.తక్షణం అది కార్యరూపాన్ని ధరిస్తుంది.అతణ్ని కీర్తిస్తే మనకోరికల్ని తీరుస్తాడు. లోకంలో మనకు చీకు చింతా లేకుండా చేస్తాడు. ఆయన గొప్ప బుద్ధిశాలి

మహాస్రగ్ధర: **మహిమోపేతుండవీవే మనుగడనొసగన్ మాకు కైవల్యమీయన్**
బహుసంపన్నుండ వీవే పలుతెరగులశోభా ప్రభావంబులీయన్
విహితోద్దీప్తుండవీవే వివిధఫలయుతాభీప్సితార్థంబొసంగన్
మహిలో పుణ్యాబ్ధివీవే మముదయగనుచున్ మాకుపుణ్యమ్మునీయన్ 95

ఈశ్వరుడుమహామహిమోపేతుడు.మనకుకైవల్యాన్నిప్రసాదించగలవాడు.సమస్తమైనమనోభీష్టాలను ఈయ గలడు ఆయన బహుసంపన్నుడు. అనేకరకాలైన ప్రభావాలుగలవాడు. ఈలోకంలో మన మనుగడకు ఆయనయే ఆధారభూతుడు.

మ. శివశక్తుల్ గమనింపనేకమగుచున్ కన్పింపగా గుండెలో
రవళించున్ ఘనమేఘ నిస్వనము తోరంబైన విద్యుల్లతా
నివహంబుల్ రసవర్షమున్ గురిసి వర్షింపన్ రసానంద సం
భవ కార్యానుభవమ్ము నింపెడిని భావాభ్రమ్ము శోభిల్లగన్ 96

శివశక్తులుఒక్కటైతేకోట్లాదిమేఘాలుగర్జిస్తాయి కోటికోటి మెరుపుతీగెలు తళత్తళలను నింపుతాయి. లోకమంతటా రసానందం కలుగుతుంది.అనేక రసభావాలు భూమ్యాకాశ పర్యంతము వ్యాపిస్తాయి.

మత్తకోకిల: **పాంచభౌతికమైనదేహము భర్గుడై రహియింపగా**
చంచలంబగునూర్పుపార్వతిచందమైపరమాత్మ దీ
పించునట్లు వెలుంగు దేహ మభేదభావము తోప రా
ణించు నిద్దర మానవాకృతి నేలుచున్ మహనీయమై 97

మానవశరీరం పరమేశ్వరుడైతే ఈ శరీరాన్ని బ్రతికించే ఊపిరి పార్వతీఅమ్మవారు. ఈ ఇరువురి కలయికతో సృష్టి వెలుగుతూ ఉంది.ఈ కలయికయే లోకాలను పాలిస్తూ ఉంది.

మ. రవితేజమ్ము శశాంకశీతలము తారాక్రాంతి హేమాద్రిహై
మ విలాసమ్ము వసంతలాస్యము జగన్మాయావినోదమ్ము సైం
ధవ గర్జారవతాండవమ్ము మెఱుపుల్ ధట్టించు మేఘధ్వనుల్

శివసంకల్పముచే జనించు ఫలముల్ సిద్ధిన్ ప్రసాదించెడిన్ 98

రవితేజస్సు, చంద్రశీతలం , తారకలకాంతులు, బంగారుపర్వతపు సౌందర్యం, వసంతరుతుశోభ, లోకంలోని మాయావిలాసం, మహాసముద్రపు ఘోషారావం, ఉరుములు, మెరుపులు ఇవన్నీ శివశంకల్పాలే.

ఉ. కన్నులు చూచునంతకు నెకాయెకి నీశ్వరలీల తోచుచున్
పున్నమివెన్నెలట్లు రసపోషణజేయునెడందలోన సం
పన్న సుగంధబంధుర శుభప్రదహేలల తీర్చిదిద్ది భా
స్వన్నవజీవ భావము ప్రవర్ధనజేయున దీశ్వరత్వమే! 99

కంటికి కనిపించే పున్నమివెన్నెలవంటి చక్కని ఆలోచనావిధానం అంతాకూడా ఈశ్వరతత్వమే.

అశ్వధాటి : అంబాపరాకుజగదంబాపరార్ధమిదుమంబామహత్వసుఖదా
డింబంబుపోనడచి డంబానుశీలుర విడంబంబడంచు జననీ
అంబాప్రపంచ సదనంబాలయంబగు కదంబావనీ విలసితా
పంబానువాదలయ చుంబానుఖేలన విధంబాను రాగమయివే 100

(త,భ,య,జ,స,ర,న,గ,గణాలు;1-7-14 యతిస్థానాలు.ప్రాస తప్పనిసరి. ప్రాసయతి వేయాలి)

అహంకారగర్వితులనుఅణచివేసేజగన్మాతా!నీకుజయం!బ్రహ్మాండమేఆలయంగాగలతల్లీనీకుజయం

అశ్వధాటి: కైలాసవాస భవలీలావిలాస నటహేలాకలాప విభవా
హాలాహలాహరణ కోలాహలా భుజగ మాలాంబరా శశిధరా
ఫాలాంబకా త్రిపురకాలాంతకా మదనలీలాంతకా సురనుతా
శూలాయుధా ప్రమథ జాలాధిపా తుహినశైలాత్మజానుగమనా! 101

కైలాసవాసా! హాలాహలాన్ని భుజించినవాడా! త్రిపురాసురులను మట్టుపెట్టినవాడా !నీకు జయం .

అశ్వధాటి : వేదాన్వయా విపులనాదాన్వయా సుజనమోదాన్వయా స్వరమయా
సౌదామినీప్రభ సుధాదాయినీ కవియశోదాయినీ త్రిభువనీ
ఔదార్యరూపగుణ సోదాహృతానుగత వాదాత్మికా త్రిణయనీ
పాదాలనుంటిని వినోదాలుచాలునిక నోదార్చిచేర్చుకొనవే! 102

వేదనాదమైనఓంకారస్వరూపా! ఓ త్రిభువనజననీ!మీపాదాల చెంత యున్నాను. చేర్చుకొనరే!

అశ్వధాటి : బాలాంబికా శివమనోలంబికా పరాశివాలంకృతా యరయవే
కాలాత్మికా సరసలీలాత్మికా త్రిగుణజాలాత్మికా పలుకవే
నీలాంబరీ సకలశాకాంబరీ కిరణమాలాంబరీ సురఝరీ
మూలాంబికా త్రిదశహేలాంబికాహృదయాలోలాంబికావరనుతా!103

ఓతల్లీనీవుదేవగణాలచేతకీర్తింపబడుతూంటావు.కోటికిరణాలకాంతికలదానవు. మమ్మల్ని కాపాడవే

అశ్వధాటి: **శ్రీశంకరా యఘవినాశంకరా కుజనపాశంకరా పురహరా**
ఈశా తమోగుణవినాశా పరాత్పర మహేశా శివా త్రిణయనా
ఈశాన్యదిక్పరిషదీశా సమస్త భువనేశా నమోభవహరా
ఆశావకాశముల నీశక్తివైభవము రాశీకృతంబగునురా!104

మహాపాపాలకు పాశం తగిలించి హరించే మహాదేవా!మాలోనిచీకట్లను తొలగించవయ్యా!

అశ్వధాటి: **నాపాలిగాధవిని కోపాలమాని యనుతాపాల దీర్చుముశివా**
పాపాలజేసితిని శాపాలనీయకు కృపాపాలనంబొసగరా
నీపాలినిల్చితిని దీపాలనుంచితిని నాపాలిచూపు నిడరా

హేపాలకా నిగమరూపాల కీర్తిగొని నాపాలి జాలినిడరా ! 105

ఓ శివదేవయ్యా! నేనెన్నెన్నో పాపాలు చేశాను. నాకు శాపాలనీయక దయచూపి నన్ను కాపాడవయ్యా!

అశ్వధాటి : **పంచాక్షరీ విమలపంచామృతాలు భవ పంచాననాలకిడుచున్**
పంచైకరూపము ప్రపంచమ్ము మాతనువు పంచానుభూతికిరవౌ !
సంచారవృత్తి నిలసంచారబంధమున పంచత్వమొంది తుదకున్

పంచాననుండ శివ పంచానుశీలగతి కించిత్ప్రసాదమిడరా! 106

పంచభూతాత్మికమైన మా దేహాలను నీలోనే కలుపుకుంటావు కదా! మా పాపాలనుకూడా హరించవయ్యా

అశ్వధాటి : **మోదాత్మికా ప్రణవనాదాత్మికా రసవినోదాత్మికా శివమయీ**
వేదాత్మికా సరసవాదాత్మికా యభవ తాదాత్మికా మణిమయీ
హ్లాదాత్మికా కవివినోదాత్మికా సగుణచోదాత్మికాసురనుతా

స్వాదాత్మతత్వమున తాదాత్మ్యమొందగల పూతాత్మశుద్ధినిడవే ! 107

హే ప్రణవనాదమయీ!మాకు పవిత్రమైన ఆత్మశక్తినీయవమ్మా! సంతోషాన్ని కలిగించవమ్మా!

అశ్వధాటి : **శ్రీశంకరా కలుషనాశంకరా కుమతిపాశంకరా పురహరా**
క్లేశాలబోనడచి ధీశాలివై హృదయకోశాన నిల్వుముభవా
లేశంబునీకరుణ నాశింతునామదిని శ్రీశాంభవీ పలుకవే

ఆశంసజేయుదు భవాశీస్సులొందుటకుకాశీనివాస వరదా! 108

పరమాత్మా! మా కష్టాలనణచి మాపైన ప్రేమనుంచి మా హృదయకోశంలో నిలువుమయ్యా!

అశ్వధాటి : **నీపాదమానితిని నాపాపమున్ దొలచి కాపాడునన్ను జననీ**
యేపుణ్యమేనెరుగ నీపూజదక్క మరి కాపుండవే త్రినయనీ

నీపోషణంబొసగి నీపుణ్యలోకమున దీపింపజేయగనవే

నైపుణ్యవంతునిగ నీపంచనుంచుకొని నాపుణ్యమున్ పెనుపవే 109

నేను ఎటువంటిపుణ్యాలు చేయలేదు. నిన్నుపూజించటం ఒక్కటే నే నెరుగుదును. నన్నుకాపాడవే జననీ !

భుజంగప్రయాతము : మహాశక్తిరూపం బుమాసన్నిభంబై

విహారంబుసేయున్ భువిన్ వీధులందున్

మహేంద్రాదులెల్లన్ సుమంత్రార్థ సిద్ధిన్

గ్రహించున్ మహాభక్తి కైవల్యమూర్తిన్ 110

ప్రపంచమంతటా శక్తిస్వరూపం విహరిస్తోంది.ఇంద్రాదిదేవతలందరు ఆశక్తిని మంత్రసిద్ధిచేత గ్రహిస్తున్నారు.

స్రగ్విణి : శక్తినీవేకదా సన్నుతింతున్ సదా

ముక్తిమార్గంబుగా ముందు నీవుందువే

భక్తులన్ గాచుచున్ భద్రమున్ గూర్తువే

యుక్తి నీరూపమై యుద్భవించున్ గదా 111

ఓ పరమేశ్వరా! శక్తిస్వరూపం నీవే కదా!భుక్తి, ముక్తి ప్రసాదించేదీ నీవే కదా !తెలివినిచ్చేవాడవు నీవే కదా!

స్రగ్విణి : ప్రాణమీవే శివా భాగ్యమీవే కదా

గౌణమీవే భవా గట్టునెక్కించవా

జాణవీవై ప్రభాశాలి వన్నింతువే –

పాణినీ రూపివై భాష నేర్పింతువే ! 112

ఓ పరమేశ్వరా! నీవే మా ప్రాణం.మాగుణం.మాతెలివి.మాతేజస్సు. మా సమస్తమూ నీవేనయ్యా!

భుజంగప్రయాతము : పరంజ్యోతి వీవే శివా భాగ్యదాతా

పరార్థానుభావా సుభద్రాభిమూర్తీ

వరాలిచ్చిబ్రోవన్ భవా!బంధువీవే!

పురారాతివీశా!మమున్ బ్రోవుమయ్యా 113

లోకులకు ప్రయోజనాన్నిచ్చే భాగ్యదాతవు నీవేకదయ్యా! మాకు వరాలిచ్చినా,మమ్మల్ని పోషించినా నీవేకదా

ఉ. కారుమొయిళ్ళుక్రమ్ముకొని గర్జిలినట్లు మనఃపథమ్ము పెం

పార నమశ్శివాయ యని భవ్యజపమ్మొనరించుచుండ క్రొ

క్కారు మెరుంగు లొయ్యన ప్రకాశిలినట్లు హృదంతరాళ బం

గారపు పంజరమ్మునసుఖమ్ముగ తేజము ప్రజ్జ్వరిల్లెడిన్ 114

కారుమబ్బులుఉరిమినంతదీక్షతోనామనస్సుపంచాక్షరీజపం చేస్తూండగా దివ్యతేజస్సులు నాకు తోచాయి.

మానిని : సాంబశివా నిను సన్నుతి జేసెద సద్గతినీయర సారనిధీ
అంబికనీకిదె యంజలినిచ్చెద నాత్మసుఖంబిడుమా జననీ
అంబుజలోచని యాదరమీయవె అద్భుతరూపిణి హైమవతీ
బింబఫలాధర ప్రీతినొసంగి యభీప్సితమీయర భిక్షపతీ 115

ఓసాంబశివా!నాకుసద్గతినీయవయ్యా!అమ్మా!నాకుఆత్మసుఖాన్నియ్యవమ్మా!మీరునాకోర్కె మన్నించండి

చం. అనిశివశర్మ యార్తిమెయి నర్చనజేయుచు నంజలించి యా
శుని నుతియించి లోనిలిపి శుద్ధమనస్కతతో స్తుతించుచున్
వినమితగాత్రుడై తనయభీప్సిత మీశ్వరతత్త్వమొందుటే
నని తపియించుచుండె మదినాతనిపై గురినిల్పి యేకతన్ 116

ఈవిధంగా శివశర్మ పరమేశ్వరుణ్ణిగురించి ధ్యానిస్తూ ఈశ్వరతత్వాన్ని పొందటమే లక్ష్యంగా పెట్టుకున్నాడు.

మ. శివశర్మన్ గమనించి యీశ్వరుడు నిక్షేపమ్ముగాకూర్చె సం
భవమౌ ద్రవ్యములన్ని సాధుజనసంబారమ్ము లందందు భ
క్తవరేణ్యుల్ గొనితెచ్చియిచ్చినవి యాఘ్రాణించి సంప్రీతి న
య్యవి తోడ్పై శివశర్మజీవితము నాయారీతి సాగించెడిన్ 117

శివశర్మ పరిస్థితుల్ని చూసి ఈశ్వరుడే అతని కుటుంబానికి కావాల్సిన వస్తువుల్ని సమకూర్చాడు. ఎలాగా అంటే భక్తులు తనకిచ్చినవాటిని తాను కేవలం ఆఘ్రాణించి వాటన్నిటిని శివశర్మ ఇంటికి వెళ్ళేట్లుగా అనుగ్రహించి ఆయనకు ప్రసాదించి తోడ్పడసాగాడు.

సీ. ఉప్పుపప్పులనిచ్చి యుద్వేగముడిగించు
కొని శంకరుని భక్తి గొలుచువారు
తండులంబులనిచ్చి తప్పుగాయుమటంచు
కొందలవడి భక్తి గొలుచువారు
శాకపాకములిచ్చి శంకరా గొనుమని
కూర్మిజూపుచు భక్తిగొలుచువారు
దీపధారకు నూనె తృప్తిగా సమకూర్చి
కోవెల శివభక్తి గొలుచువారు

గీ . శివునిముంగిట శివశర్మ శివుడె యనుచు
వానిభుక్తికి మరికొంత వరలజేసి
సాధుపరితృప్తి యని మది సంతసిలుచు
ద్రవ్యమిడుచుండె భక్తు లుదారు లగుచు 118

పరమేశ్వరార్పణం అనుకుంటూ శివునిపై భక్తితో ఉప్పు పప్పు,బియ్యం, శాకపాకాలు,నూనెలు ఇతరద్రవ్యాలు భక్తులు సమర్పిస్తున్నారు.మరికొంత శివశర్మకోసం అనికూడా ఇస్తున్నారు.అది సాధుతృప్తిగా భావిస్తున్నారు.

ఉ. రోజులుసాగుచుండె నవరోధములేకప్రశాంతరీతి సం
పూజితుడై శివుండు ఘనభోగవిశేషము లుల్లసిల్లగా
తేజమెలర్చుచున్ జనులు తృప్తినిగొల్వగ రాజమౌళి వి
భ్రాజితమూర్తియయ్యె నతిపావని శాంభవి కాంతులీయగన్ 119

ఈవిధంగారోజులుగడుస్తున్నాయి.ఈశ్వరుడుఅమ్మవారితోసహాప్రశాంతంగాపూజింపబడుతూతృప్తిగా ఉన్నాడు.

సీ. లోకాలచీకట్లు పోకార్ప రవిబింబ
ముదయించి ప్రతిరోజుముదముగూర్చు
గాసిజెందెడివారి కడగండ్ల నణగింప
నడుగువేయును దేవుడనుదినమ్ము
పగటిపూట రహించు భద్రాత్ములను రాత్రి
పగబట్టి దునుమాడ వగలుజూపు
సంధ్యవేళ కరాలు సాచిసాగు మహాబ్ధి
యలసియానక మౌన మలదుకొనును
గీ. సర్వసంగపరిత్యాగి సహనమూను
సాధుజనుని పరీక్షింప నుత్సాహపడిన
దండయాత్ర నెదుర్కొన తప్పదేమొ
స్థాణుపైనెత్తివచ్చు కందర్పు కరణి !! 120

కాలచక్రం కదలిపోతోంది.ప్రతిరోజువలెనే సూర్యోదయమౌతోంది.భక్తులకష్టాలను తొలగించేందుకు దేవుడు శ్రమ పడుతున్నాడు. పగటిపూట వెలిగిన జీవుల్ని రాత్రివేళల్లో వేటాడటానికి చీకటి ప్రయత్నిస్తోంది. సంధ్యా సమయంలోవేగంగాఅలలనువిసిరినసాగరంఅలసిపోయి ఆతరువాత వేగాన్ని తగ్గించుకుంది. వేటియందును ఆసక్తిలేని మహాదేవుడు ఒకవేళ సాధుజనులను పరీక్షించదలచుకుంటే ఒకప్పుడు తనను ఎదిరించటానికి యత్నించిన మన్మధుని దండయాత్రవలె ఇప్పుడుకూడా దండయాత్రను ఎదుర్కోవలసివస్తుందేమో !

మ. శివశర్మన్ పరికింపబూని శివుడే చింతించెనీరీతి మా
నవులేరీతిని జీవయాత్రగనునో నా సాయమున్ లేక నీ
శివశర్మాఖ్యుడు నిర్వికారుడగుచున్ చింతింపడే భుక్తి! లో
కుల దానంబులు లేనిచోబ్రతుకు సంకోచించుటన్ గానడే! 121

శివశర్మదీక్షను శివుడే పరీక్షించదలచాడు. తనసహాయంలేకుండా మానవులు ఎలా జీవించగలరో చూడాలను కున్నాడు. లోకుల దానధర్మాలు లభించకపోతే శివశర్మ పరిస్తితి యేమవుతుందో తెలుసుకోడేం అనుకున్నాడు

ఉ . వీనిని జూచువారలకు వేరొకభావముపుట్టజేసెదన్
మౌనముబూనువీనియెడ మంటరగిల్చెద లోకమందు స
న్మానమొనర్చువార లవమానముజేయగ రెచ్చగొట్టెదన్
వీనికఠోర దీక్ష పరివేక్షణజేసెదనంచు నెంచెడిన్ 122

ఈ శివశర్మను చూచినవారికి ఇతనిపై అభిమానానికి బదులు అసహ్యం పుట్టేట్లుగా చేస్తాను. మౌనంగా రోజులు గడుపుతున్నవానిపైలోకులకుమంటపుట్టేట్లుగాచేస్తాను.సన్మానంచేసినవారే అవమానం చేసేట్లుగా రెచ్చగొడతాను ఇతని కఠోరదీక్ష ఎంతటిదో చూస్తాను అని పరమేశ్వరుడు ఆలోచించాడు.

చం. ఫలితముగా జనావళి అభావ్యపుటూహల జేయసాగె నె
వ్వలనను వీనిజూచి పరిభావనజేయదలంచుచుండి యీ
టెలవలె మాటలాడి విఘటించెడి చేష్టల పోటులెత్తుచున్
కలవరపెట్టసాగిరి కకావికజేయుచు దూషణమ్ములన్ 123

ఈశ్వరసంకల్పం వల్ల ప్రజల్లో శివశర్మపట్ల తగని ఆలోచనలు రేకెత్తినవి. ఎవరు చూసినా ఇతణ్ణి అవమానించటం, ఈటెలవంటి మాటలతో గాయపడేవిధంగా మాట్లాడటం,అతనికి ఆందోళన కలిగేటట్లు గుచ్చుకునే మాటలు విసరటం చేయసాగారు.అతని మనసును ఆందోళనలకు గురిచేశారు.

మ. శివశర్మన్ సహియింపలేని జడులున్ చింతించె విభ్రాంతితో
నవమానమ్మొనరింప నెంచి కుటిలంబౌ యోజనల్ జేసి దై
వ విరుద్ధంబగు భావనల్ సలిపి గర్వంబొప్ప నీర్ష్యాళులై
యవినీతిన్ గుదిగుచ్చి వానిమెడకున్ హారమ్ము కైసేయగన్ 124

వివేకంలేని కొంతమంది శివశర్మను చూసి అతన్ని అవమానించాలని దుర్మార్గపు ఆలోచనలు చేశారు. అతడు దేవునికి అపచారంచేస్తున్నాడని ఆరోపించారు. మదించిన ఆజనం అతనిపై ఈర్ష్యతో పనికిమాలిన అవినీతి ఆరోపణలు చేయసాగారు.

ఉ. దేవునిపేరుచెప్పుకొని తిండి గడించుచునుండె వీడు; నా
దేవుడు వీనిచుట్టమొ ! యథేచ్ఛగ సోమరి వర్తనమ్మునన్
జీవిక సాగదీయుచు విశిష్టముగా నొక భక్తుడన్న సం
భావనగల్గ నాటకముపన్నుచునుండె సహింపరాదికన్ 125

ఓహో ఈ శివశర్మ దేవునిపేరుచెప్పుకుని హాయిగా తిని కూర్చుంటున్నాడురో ! ఆ దేవుడేమైనా వీడి చుట్టమా !ఇష్టం వచ్చినట్టు తింటూ, సోమరిపోతులా పనీపాటూ చేయకుండా తేరగా బతికేస్తున్నాడురో! పేద్ద నాటకం ఆడేస్తున్నాడు. వీడి నాటకాలు సాగనీయకూడదు అంటూ జనం శివశర్మపై తిరగబడ్డారు.

ఉ. మౌనముదాల్చి కూర్చొనిన మాన్యునిగా తలపోయవచ్చునే ?
నేనతిభక్తినుంటినని నేత్రములొగ్గిన బుద్ధిమంతుడే ?
దేనికినాసజేయనని తిండికిబూనిన నీతిమంతుడే ?

వీనికి పెట్టుటన్ బదులు వేరొకగ్రుడ్డికిపెట్టగాదగున్! 126

శివశర్మ మౌనంగాకూర్చోగానేమహాభక్తుడనిచెప్పేస్తామా!నేనుమహాభక్తితోజపంచేస్తున్నానని కళ్ళు మూసుకోగానేఆహా బుద్ధిమంతుడురా అనుకొని నమ్మేస్తామా ? నేను దేనికీ ఆశపడనని చెబుతూ తేరగా తింటానికి తయారైతే మంచి నీతిమంతుడురా అనుకుంటామా ? ఇలాంటి మోసగాడికి పెట్టేబదులు ఎవడైనా గుడ్డివాడికి పెట్టటం మంచిది అని జనం అనుకోసాగారు.

ఉ. మాయను మించినట్టి పెనుమాయ లెరింగిన సాధువేషగా
డీ యతిరాజు; బ్రాహ్మణ వరిష్ఠుడనంచును తేరతిండితో
కాయము నింపుకొంచు నతిగౌరవమొందుచు నున్నవాడు;చా

లీ యతిలోకగారవము లీతని నాటకముల్ త్యజింపుడీ ! 127

ఒహోహ్హో ! మహామాయను మించిన పెనుమాయలు తెలిసిన వేషగాడు ఈ సాధు యతిరాజు; బ్రాహ్మణుణ్ణి అని చెప్పుకుంటూతేరతిండితింటూ పొట్టపోసుకుంటున్నాడు; దానికితోడు మహాగర్వాన్ని చూపిస్తున్నాడు; ఇంకా చాలు; ఈ నాటకాలు వదిలిపెట్టించండి.అని జనం అనుకోసాగారు.

ఉ. రెక్కలు ముక్కలైన నొకరీతిగ డొక్కలు నిండవయ్యె ; ము
మ్ముక్కులు మూసి కూర్చొనెడిమూర్ఖుడు వీనికి మూడుపూటలున్
డొక్కలు నిండుచున్నవి కదుంగడు వింత వినోదమయ్యె గం

డక్కరివర్తనమ్మిది హుటాహుటి నాపుడు వీని చిత్రమున్ 128

ఈరోజుల్లోరెక్కలుముక్కలయ్యేట్లుగా పనిచేసినా డొక్కలు నిండటంలేదు. అలాంటిది ఈ మూర్ఖుడు ముక్కు మూసుకుని కూర్చొని నేను సాధువుని అనగానే వీడికి మూడుపూటలా డొక్కలు పుష్టిగా నిండుతున్నాయి. ఇది భలే వింతగా ఉంది. ఈ టక్కరిమాయలు హుటాహుటిగా ఆపించండి అని జనం చెప్పసాగారు.

ఉ. దేవుడు వీనికే హితుడ! దీనజనావళిపట్ల లేడ? యిం
దే వినుచుంటిమీ ఘనత; దేవుడు బ్రాహ్మలసొమ్మె? వీరలా

దేవునిముందు కూర్చొని విధేయతజూపుచు విందుభోజనం

బావురుమంచు జుఱ్ఱుకొను నంతటిపెత్తనమింక చాలురా ? 129

దేవుడు ఈ శివశర్మకు ఒక్కడికే హితుడా? దీనజనులపట్ల లేడా ? ఈ మాయమాటలు ఇక్కడే వింటున్నాం. దేవుడుబ్రాహ్మలసొత్తా?ఈబ్రాహ్మలందరూ దేవుడిముందు కూర్చొని స్తుతిపాఠాలు పలుకుతూ విందు భోజనాలనుఆవురావురుమనిజూఱ్ఱుకుంటూతింటారు.వీరిపెత్తనాన్ని సహించగూడదు అని జనం అనుకొంటున్నారు.

ఉ. వేరొకవర్ణజాతుడిట వీనినిబోలుచు తిష్ఠవైచినన్
తీరిచి వంటకమ్ములను తృప్తిగ పెట్టగలారె వానికీ
తీరున వస్తుజాలమును తిన్నగనెందరునీయజాలు? నీ

తీరు సమర్థమౌనె? వల దీతనికోసము దానధర్మముల్ ! 130

గుడిలోజేరి శివశర్మ భుజీస్తున్నట్లుగా ఇంకోవర్ణంవాడు ఎవడైనా కూర్చోగలడా అని, అతనికిచ్చినట్లుగా ఎందరికి వస్తువులు ఈయగలరని, ఈ పద్ధతి సరికాదనీ, ఇతనికోసం దానధర్మాలు చేయొద్దనీ ప్రజలు విమర్శించసాగారు.

మ. ఇతడా దేవుని జూచియుండదగు గానీ దాననేమయ్యె? బా
ధ్యతతో దానిని బోధజేసెనొ? వృథాయాసంబుతో వీనికిన్
మతిలేకుండపదార్థమిచ్చికొలువన్ మౌనంబుగాతృప్తియౌ

భృతినొందెన్ గదవీడు! వీనినిటు లుత్ప్రేక్షింపనేలా జనుల్ ! 131

శివశర్మదైవదర్శనాన్నిపొందియుండవచ్చు. కానీ దానివల్లఎవరికేమిలాభం? ఇతడు తాను దర్శించినదాని గురించి ఎవరికైనా బోధించాడా? అనవసరమైన ఆయాసంతో బుర్రలేకుండా వీడికి ఇంతింత పదార్థాన్ని ఇవ్వటం వల్ల వీడు మాట్లాడకుండాసుఖంగాకూర్చుని తింటున్నాడు. ఇంకా జనం వీణ్ణి సహించగూడదు అని జనులు అనుకోసాగారు.

ఉ. ఇంతటి దీక్షబూనునత డెన్నడునైన మహత్వశీలియై
చింతదొలంచెనే?జనుల చీకులు బాపెనె? సాధుమూర్తియై
వంతలదీర్చెనే! మహిమ వైభవమొప్పగ నింతజూపెనే?

వింతలుచాలు; వీనికథ వీడుము;హేతుపథాన బోవుడీ! 132

ఇంత దీక్ష చేపట్టినవాడు ఎప్పుడైనా తన మహిమల్ని చూపించి జనుల బాధల్ని తొలగించాడా ?కష్టాలు తీర్చాడా? సాధువుకావటంవలనప్రజలదిగుళ్లుతొలగించాడా ? పోనీ ఇంత జపం చేసి ఎప్పుడైనా తను

సాధించిన మహిమల్ని ప్రదర్శించాడా ? ఏమీలేదుకదా ! మరింకెందుకు ఈ మహానుభావుని సేవలు ? ఈ వింతలు ఆపండి. వీడి కథలు ఆపండి. సహేతుకంగా ఆలోచించి వీడి కట్టుకథలకు లొంగకుండా వ్యవహరించండి అని జనం అనుకోసాగారు.

ఉ. కర్మఫలమ్మటంచు మును కావ్యములందు వచించినట్లుగా
ధర్మము చెల్లుబాటగును ;దానధనంబులు వీనికిచ్చుటల్
ధర్మముగాదు; యాంగికవిధానపు లోపములున్నవారికిన్
ధర్మముసేయనొప్పగు యథార్థము; వీనికిదేల ? యాపుడీ! 133

ధర్మం అనేది కర్మఫలాన్ని బట్టి ఉంటుందని పూర్వం కావ్యాల్లో చెప్పినమాట యధార్థం. కాబట్టి వీనికి దానధర్మాలు చేయటం అనవసరం. ఏదైనా అవయవలోపం ఉన్న అంగవికలురకు ఏమైనా ఇస్తే పుణ్యం పురుషార్ధం. అంతేగానీ అన్నీ తిన్నగా ఉన్నవాడికెందుకయ్యా దానధర్మాలు? ఆపండి ! అని జనం ఆడిపోసుకోసాగారు.

తే.గీ. చదివి యుద్యోగమొనరించి పదిలమైన
జీవితము నొందగావచ్చు చింతలేక
నట్లుగాకున్న వేరొకండరసికొనుచు
బ్రతుకవచ్చునుగాని ఈ వరుస తగదు ! 134

చక్కగా చదువుకుని, ఉద్యోగం సంపాదించుకుని, చీకూచింతాలేకుండా భద్రమైన జీవితాన్ని గడుపుకోవచ్చు. లేదా ఇంకేదైనా వృత్తినిగడించి బ్రతుకవచ్చు. కానీ ఈ వరస ఇది మంచిదికాదు అని జనవాక్యం.

తే.గీ. అని విమర్శింప శర్మకాహారమేమి
దొరకలేదాయె నైనయథోచితముగ
గాలిభుజియించె శివశర్మ కనుగొనంగ
నతనిభార్యయు శోషిల్లి యవనిగూలె 135

ప్రజలు ఆ విమర్శ చేయటం వలన శివశర్మ కుటుంబానికి ఆహారం దొరకలేదు. అతడు గాలిని భుజించాడు. అతని భార్య మాత్రం నీరసించి కుప్పకూలిపోయింది.

తరలము : ప్రణవమందున దృష్టినిల్పిన భాగ్యశాలియతండగున్
త్రిణయనున్ మదిలోనదాల్చిన ధీరుడై వెలుగొందుటన్
కణకణన్ జఠరాగ్ని కాలుటొకింత శాంతి వహింపగా
యణగెనాకలి వహ్నికీలలు నా భవాని జపమ్మునన్ 136

శివశర్మ ఓంకారప్రణవ నాదంపైన దృష్టినుంచటంచేత ,పార్వతీపరమేశ్వరులపైననే మనస్సును కేంద్రీకరించటం వలన కణకణలాడే ఆకలి దానంతటదే శాంతించింది.

మత్తకోకిల : **ఐహికమ్ము దలంపనట్టి మహానుభావుడతండగున్**
సాహసమ్ముగ జీవయాత్రను సల్పునాతడు ధన్యుడౌ
పాహిపాహిమహేశ్వరాయను భాష తప్ప మరేదియు
త్సాహమీయదు వానిబుద్ధికి సన్నుతింపగ నెన్నడున్ 137

శివశర్మమనస్సులోపాహిపాహి మహేశ్వరా అనే మాట తప్ప ఇంకొకటి రాదు.అతడెప్పుడూ ఐహికాన్ని తలంచడు.

మత్తకోకిల : **ఏకదీక్షగడంగినమ్మి మహేశుగొల్చెడి సిద్ధుడై**
యేకులమ్ము మతమ్మునెంచని యేకలక్ష్యవిశాలుడై
ప్రాకటమ్ముగ నాత్మశుద్ధి ప్రభావమెరిగిన ధీరుడై
చీకుచింతలు లేక చిన్మయ చిత్తుడై శివుగొల్చెడిన్ 138

ఏకాగ్రతతో మహాదేవుణ్ణి సేవించే సిద్ధాత్ముడు శివశర్మ. అతనికి కులమతాలభేదం లేదు. ఆత్మశుద్ధిని నమ్మి చీకు చింతా లేకుండా పరమేశ్వరుని ధ్యానించే మహాభక్తుడతడు.

మత్తకోకిల : **ఈశ్వరుండు పరీక్షసేయగణించినన్ తనశాంతమున్**
శాశ్వతంబగుబుద్ధిదాల్చిన సజ్జనుం డశనంబుగా
నీశ్వరోదితమైనగాలి గ్రహించినిల్చిన మౌనియై
నశ్వరంబగు దేహవాంఛ లణంచి నిల్చె ప్రశాంతుడై 139

పరమేశ్వరుడే అతన్ని పరీక్షించదలంచినప్పుడు ఎంతో శాంతిని, సద్బుద్ధిని గ్రహించి ఆయన ప్రసాదించిన గాలిని మాత్రమే గ్రహించి మౌనంగా ఈశ్వరుణ్ణి ధ్యానిస్తూ, అశాశ్వతమైన దైహికవాంఛలను అణచుకొని నిలచాడు.

మత్తకోకిల : **కన్నుమూసినగాని కాంచిన కాలరూపుడె గన్పడున్**
మిన్నుమన్నునునేకమైన నుమేశుడే కనులంబడున్
అన్నముండిన లేకపోయిన నాతడే తనప్రాణమౌ
నన్నవానికి తిరుగులేదిల నంబికాపతి మెచ్చినన్ 140

శివశర్మ కళ్ళుమూసినా తెరిచినా పరమేశ్వరుణ్ణే చూస్తున్నాడు. సర్వప్రకృతిలోనూ అతనికి శివుడే కనబడుతున్నాడు అన్నం ఉన్నా లేకపోయినా శివుణ్ణే తనాప్రాణం అనుకుని ధ్యానిస్తున్నాడు. అటువంటప్పుడు ఆశివుడే మెచ్చినప్పుడు ఎవరికైనా తిరుగు ఎలా ఉంటుంది ? ఉండదు.

మానిని : **ఎట్టివికారము లేవియులేక మహేశ్వరునే మదినెంచె నతం**
డెట్టి తనూదిత హీనగుణంబుల నెంచకనీశ్వరునే తలచెన్
గట్టిగబీల్చిన గాలిని నిల్పి ప్రగాఢమనోబల కందరుడై
గట్టిసమాధి యుగంబున నీశ్వరుగాంచెడి భక్త శిఖామణియౌ ! 141

శారీరకమైనభ్రాంతులకులొంగకుండాసంతోషంతోఈశ్వరుణ్ణేమనస్సులోతలచుకుంటూఊపిరిబిగబట్టి కుండలిని ని ప్రేరేపించి నిశ్చలసమాధి స్థితిలో ఆత్మదర్శనం చేసుకుంటూ శివశర్మ ఇహలోక ధ్యాసలేకుండా దీక్షలో ఉన్నాడు నిర్వికారచిత్తంతో నిశ్చలసమాధిస్థితిలో పరమేశ్వరుణ్ణి ధ్యానించసాగాడు.

సీ. ఐహికభ్రాంతుల యవసరమ్ములగోల
నరయదలంపని యాదిమూర్తి
ఏకాగ్రదీక్షతో నేకేశ్వరునిపైన
బుద్ధినిల్పిన మహాపుణ్యమూర్తి
దేహయాత్రవిధమ్ము తృప్తిగాగడియించు
దృష్టినొందనియట్టి దివ్యమూర్తి
చుట్టుప్రక్కలనెట్టి శోధనంబులుసాగు
చుండెనో యెరుగని శుద్ధమూర్తి
గీ. వాంఛలన్నవిలేక విశ్వాసమలరి
శాశ్వతమ్మగు వెలుగులో సంచరించు
ఋషివరేణ్యుని శివశర్మ నెరుగ గలరె
తుచ్ఛమనుజులు హీన సంతుష్ట ఘనులు ! 142

శివశర్మకు ఐహికభ్రాంతులు లేవు.ఎల్లవేళలా యజ్ఞస్వరూపుని భావించటమే అతనిపని. ఏకాగ్రతతో ఈశ్వరధ్యానంతోనే అతనికి కాలసమాప్తి అవుతుంది. దైనందినకృత్యాలు ఎలా జరుగుతాయా అనే దిగులు ఆయనకు లేదు. ఎన్నడూ తన పరిసరాలను పట్టించుకునేవాడు కాదు.ఎటువంటి కోరికలున్నూ లేనివాడు.శాశ్వతమైన వెలుగులో సంచరించేవాడు.అటువంటి ఋషి తుల్యుణ్ణి తుచ్ఛమానవులు తెలుసుకోలేరు.

శా. కామక్రోధవికారముల్ గనదు; లోకమ్మింతయున్ జూడదే
సామాన్యున్ వలె చింతలొందదు;మహాసౌమ్యత్వమున్ పూని ని
ష్కామాద్యున్నత కర్మముల్ సలుపుచున్ సర్వేశ్వరధ్యాన వి
ద్యా మంత్రాద్భుత శక్తి లోగొనుచు తాత్పర్యంబు గైసేసెడిన్ 143

శివశర్మకుకామక్రోధాదివికారాలులేవు.లోకంఎలాఉందోపట్టించుకోదు.అందరు సామాన్యుల వలెచింత పొందడు. మహామంచి మనస్సుతో ఏకోరికలు, ప్రయోజనాలు, ఆశించకుండా తోచిన మంచిపనులు చేసుకుంటూ సర్వేశ్వర ధ్యానంతో, భక్తిప్రపత్తులతో కాలం గడుపుకుంటున్నాడు.

ఉ. లోకులువీని సోమరిగ లోకవిరుద్ధునిగా గణించినన్
లోకసుఖమ్ము నీశ్వరునిలోగలదంచు నెఱింగి వానినే
లౌకికదేహమందు గను లక్ష్యముతో వరదీక్షనొందు సు
శ్లోకుని కీయరాదనుచు లుబ్ధులు పల్కిన లోటు గల్గెనే ? 144

లోకులంతా శివశర్మను చూచి బ్రాహ్మడని, లోకంపోకడతెలియనివాడని, ఎగతాళిచేసినా శాశ్వతమైనసుఖం ఈశ్వరునివల్లనే లభిస్తుందని తెలుసుకున్నవాడు కనుక ఆయన లుబ్ధులు ఎలా పలికినా లోటును పొందలేదు.

చం. తనువది భూమిపై గలదు ; ధర్మమెరింగిన బుద్ధి యూర్ధ్వమం
దున సురలోకమందున మహోన్నతి నుండె నెరుంగనట్టి భూ
జనులు కుబుద్ధులై యితని సంగతి తేల్తుమటంచు హేతువా
దనమును మీటినన్ నిజము దాగునె! హేతువు దీని మించునే ? 145

శివశర్మశరీరంభూమిమీదఉంది.ధర్మంతెలిసినఆయనబుద్ధి ఆకాశంలోసురలోకంలోఉంది. దుష్ట మనస్తత్వం చేతహేతువాదంఅనిచెప్పుకుంటూఈయనసంగతితేలుస్తామనిబయలుదేరినవారివల్ల ఏమవుతుంది

సీ. నిత్యసంతోషియై నియమదీక్షలనిల్పి
నీచవాంఛలదృష్టి నోచలేదు;
ఊపిరిబిగబట్టి యుత్తేజముప్పొంగ
దీపించెనేగాని దిగులు లేదు;
ఈశ్వరధ్యానియై యింతింత వెలుగొందు
చుండెనేగాని పస్తుండలేదు;
ఆత్మదర్శనమున నానందమునుబొంది
యాకలియనుమాట నరయలేదు;
గీ. ఉన్నతంబైన దీక్షలో నొదిగియున్న
ధర్మ శివశర్మ పైకెత్తి దాడిసేయ

నతని కేలోప మొదవక నపహసించె

దుష్టతనమది దుర్మార్గ దురితుల నిల !! 146

శివశర్మనిత్యసంతోషిగానియమదీక్షలలోఉండేవాడు.నీచవాంఛలుకోరుకోలేదు.హఠయోగంతో(బ్రహ్మతాదాత్మ్యాన్నిపొందాడుగానీదిగులుచెందలేదు.ఈశ్వరధ్యానంతో,ఆత్మదర్శనంతోఆనందపడ్డాడుగానీఆకలిఅనిఅలమటించలేదు.అతనిపైకిదండెత్తినా అతనికేమాత్రమూ లోపం కలుగలేదు.దుష్టత్వం దుర్మార్గుల్ని చూసి అపహాస్యం చేసింది.

సీ. పఙ్గ్వంధులకు మూక బధిరాంగవికలుర
కింతసాయంబగుటెంతొ మేలు;
జడదీనజనులకు సాధుసచ్ఛీలుర
కింతసాయంబగుటెంతొ మేలు;
స్త్రీబాలవృద్ధాది హీనబలశాలుర
కింతసాయంబగుటెంతొ మేలు;
దేవుడే దిక్కను దీనజనావళి
కింతసాయంబగుటెంతొ మేలు;
గీ. మానవత్వమ్ముతో మంచితనము కలుగు
వారికీ లక్షణంబులు వరలుచుండు;
నాస్తికత్వమ్ము హేతువిన్యాసమనుచు

తూలనాడుట దౌర్భాగ్య దురితముగద ! 147

కుంటి,గ్రుడ్డి,మూగ,చెవిటివంటిఅంగవికలురకు,.మందమతులకు, మంచి ప్రవర్తన గలవారికీ, పేదవారికీ తప్పక సాయంచేయాలి. స్త్రీ,బాల,వృద్ధులకు, దీనజనులకు సాయం చేయాలి.మానవత్వం ఉన్నవారికీ, మంచివారికీ ఇవి సహజ గుణాలు.కానీ నాస్తికత్వం హేతువాద విశేషం అని తూలనాడటం మంచిపనికాదు.

మానిని: నమ్మిభజించిన నవ్యయుడైన జనావనుడీశుడు నారమిడున్
నమ్మినవారికి నాశములేదు వినమ్రతనుండిన నాణెమగున్
అమ్మనుగొల్చిన హాయిలభించు సహాయమొసంగెడు నంబికయే

సమ్మతినొంద నసాధ్యములేదు ప్రశాంతి మనస్విని సత్కృపయే ! 148

నమ్మకంతో సేవిస్తే ఈశ్వరుడు అన్నపానీయాలు ఇస్తాడు;నమ్మినవారికి నాశం లేదు.విధేయత ఉండటం చాలా మంచిది అమ్మను సేవిస్తే సుఖసంతోషాలు కలుగుతాయి. అసాధ్యం ఉండదు. ప్రశాంతత ఆవిడ అనుగ్రహమే

మానిని : **నీటను ముంచిన నిల్పిన నీవని నిండుమనంబున నిల్చినచో**
మేటిమగండయి మేదిని గాచుచు మేలు నొసంగు నమేయగతిన్
చేటునుమాపెడి చిన్మయమూర్తి విశిష్టకృపామతి శ్రీ శివుడే
సూటిగనాతనిసూటినెఱింగి యశోన్నతినొందుటశోభనమౌ ! 149

నీటముంచినా పాలముంచినా నీవేనని నిశ్చయమైన మనస్సుతో ఆ పరమాత్ముణ్ణి నమ్మి సేవిస్తే ఆయన తప్పకుండా కాపాడుతాడు. ఆయనను తెలుసుకొని ఆరాధిస్తే మనకు శుభఫలితాలు కలుగుతాయి.

చం. విధి విపరీతమౌననుట వేయికివేయివిధాల సత్యమే
విధికెదురీది యెవ్వరునభీప్సిత సిద్ధి గడింపలేరు;య
ద్విధిని గణించి దానిని వివేకముతో గమనింపగల్గుచో
విధియనుకూలమౌను; పరివేదనబాపి సుఖంబొసంగెడిన్ 150

విధి ఎప్పుడూ విపరీతంగానే ఉంటుంది. విధికెదురీది ఎవ్వరూ గెలవలేరు. కనుక విధి నిర్ణయం గ్రహించి దానికి అనుకూలంగా నడుచుకుంటే మనకు కష్టం ఉండదు. బాధ కలగదు. ఎందుకంటే అందుకు సిద్ధమి ఉన్నాం కదా!

చం. విధిగమనంబెరింగెడివివేకము వేయిగజాలశక్తి ; స
ద్విధియని దుర్విధానమని వేయివిధంబుల తూలనాడుటల్
బధిరునితో ప్రసంగమగు; బంధురమౌ చతురత్వముండినన్
విధిని సహించి వర్తిలుము; వేదన కల్గదు ; సంతసంబగున్ 151

విధివిలాసాన్ని తెలుసుకోగలగటం వెయ్యియేనుగుల బలం వంటిది; విధి నిర్ణయంలో మంచి చెడులుండవు. తెలివి ఉంటే విధి నిర్ణయం ప్రకారం నడుచుకోవాలి.

చం. కనుగొననెవ్వరిట్టివగు కష్టములన్ భరియింపజాలు ? భూ
జనులెవరైన నివ్విధిని సాగుట యున్నదె? ముక్కుసూటిగా
జనియెడి దీక్షనొందగల సాహసమెవ్వడొనర్చు నీతనిన్
పనిగొని తూలనాడి పరిభావమొనర్చిరి బుద్ధిహీనతన్ 152

లోకంలో ఇటువంటి కష్టాలనుకోరి యెవరు అనుభవించగలరు ?ఇంతటి నియమనిష్టలతో ఆచరించటం ఎవరివల్లనూ కాదు. ఇటువంటి మహానుభావుణ్ణి పనిగట్టుకుని బాధించారు. ఇది బుద్ధిహీనతకాదా !

శా. బ్రహ్మాండమ్ము సృజించువాని నెదలో భావించి సేవించుటే
బ్రహ్మజ్ఞానము; లోకవర్ణ మరయన్ బ్రహ్మీపదంబానుటే
బ్రహ్మత్వమ్మితగాని దూరుట సహింపన్ బోలునే ? వీరలే

బ్రహ్మజ్ఞుల్ ధరలోన; లోకసుఖముల్ వర్ధిల్లు నివ్వారిచే !! 153

సమస్త బ్రహ్మాండాన్నీ సృష్టించినవాణ్ణి గుర్తించి సేవించటమే బ్రహ్మజ్ఞానం.మనలో ఉన్న వర్ణభేదాల్లో బ్రహ్మపదాన్ని ఉపాసిస్తేనే బ్రహ్మత్వం సిద్ధిస్తుంది.ఆ విధంగా జీవిస్తున్న శివశర్మను నిందించటం సహించరాని విషయం.

గీ. ఇట్టి వేదాంత భాగ్యమ్ము నెవరుబొందు
నట్టివారలె బ్రహ్మజ్ఞులగును గాని
యన్యజనులెల్ల సామాన్యయజనశీలు
రవని దలపోయ కులభేదమసలు లేదు ! 154

బ్రహ్మజ్ఞానాన్ని పొందగలభాగ్యవంతులే జ్ఞానులు.తక్కినవారందరు కేవల వైదికవృత్తినిర్వాహకులు మాత్రమే

ఉ. ఇంక పరీక్ష చాలునని యీశ్వరుడాత్మ దలంచెనేమొ; చా
లింక విమర్శనాస్త్రములు హీనత మానుడటంచు లోకులున్
వంకరమాటలాడు జనవైఖరిద్రుంచి మహాభిమానులై
శంకలువీడి మెచ్చె శివశర్మను నాతని బ్రహ్మతత్వమున్ 155

ఇంకా పరీక్షించవద్దని పరమేశ్వరుడనుకున్నాడేమో ! కొందరు లోకులు ముందుకువచ్చి ఈ విమర్శలు చాలు; వంకరమాటలు ఆపండి అంటూ ప్రజలమాటల్ని అడ్డుకుని అభిమానంతో శివశర్మ బ్రహ్మత్వాన్ని మెచ్చుకున్నారు

సీ. ఎక్కడెక్కడివారలేతెంచి శివశర్మ
భక్తితత్వముజూచి పరవశించె
స్థిరచిత్తముననున్న శివశర్మనటగాంచి
యన్నిమతములవార లవధరించె
గాఢయోగస్థితి గదలకయున్నట్టి
వానిని దర్శించి వందనమిడె
మనుజరూపుననున్న మాహేశ్వరుండని
మన్నించి జనులెల్ల మంగళమిడె
గీ. బాలజలధీశ్వరుని ముందు పరవశించి
యుండె శివశర్మ! యింటిలో నొడలు మరచి
వాని భార్యయు పడియుండె– వారి జన్మ
మీశ్వరేచ్ఛను గడియించె నిహపరమ్ము! 156

ఎక్కడెక్కడివాళ్ళూ వచ్చి శివశర్మను చూసి పరవశించారు.అందరూ అతనికి నమస్కరించారు. మానవరూపంలో ఉన్న శివుడే అన్నారు.అతడు బాలాజలధీశ్వరునిముందు ధ్యానంలో ఉన్నాడు.అతనిభార్య ఇంట్లో పడిపోయి ఉంది.

తే.గీ. ఒక్క శివశర్మ లోకాన నున్ననేమి ?
మునిజనుండయి యెందైన పోవనేమి !
పుణ్యజనులకు వెలితియా భూమిలోన
కాదు కాదాత దత్యంత కర్మజీవి ! 157

ఒకశివశర్మ భూమ్మీదఉంటే ఎంత ?పోతే ఎంత ? పుణ్యాత్ములకు లోకంలో యేమైనా తక్కువా ? అనుకోరాదు అతడు మహాకర్మజీవి. అటువంటివారి దర్శనం,స్పర్శనం, భాషణం పుణ్యకారకాలు.

మ. శివశర్ముండొక తత్వచింతన గుణోత్సేకుండు; వేదాంత వై
భవ సారంబత డీశ్వరార్చనకళా పారంగతుండుర్విలో
శివశక్తిన్ తలదాల్చి నిల్చుకొను సచ్చీలుండు యోగాగ్నిచే
భవబంధమ్ముల ద్రెంచుకొన్న ఘనుడై భాసిల్లె సిద్ధాత్ముడై ! 158

శివశర్మతాత్వికచింతన గలవాడు.వేదాంతసారాన్ని గ్రహించినవాడు. పరమేశ్వరుణ్ణి ఆరాధించటంలో పండితుడు. అమ్మవారిశక్తిని తలదాల్చినవాడు.భవబంధాల్ని తెంచుకున్న మహాయోగి.

తే.గీ. లోకులతనినిగూర్చి లోలోననేమి
తలచి మాట్లాడుచున్న యథార్థమునకు
వానికిదియేమి పట్టని వైనమయ్యె
మనసు జలధీశ్వరునిగూడి మనుటవలన 159

లోకులు శివశర్మను గురించి యేమనుకుంటున్నా ,అతనికి ఇవేమీ పట్టలేదు.ధ్యానంలోనే ఉన్నాడు.

ఉ. ఈశ్వరు డాతనిన్ గని వరిష్ఠగుణాత్మకుడైన వీని కే
నీశ్వరలోకవాస మొనరించుచు నాదరి జేర్చుకొందు; లో
కేశ్వర యంచు దీక్షగొని నన్నిటు నెమ్మది నిల్పుకొంటచే
శాశ్వతమైన ముక్తినిడి సత్యముజూపెద నంచు నెంచెడిన్ 160

పరమేశ్వరుడు శివశర్మనుజూచి వీని నడవడిలో ఎటువంటి లోపమూలేదు.నిరంతరం నన్నే నమ్ముకొన్నాడు. కనుక ఇతనికి శాశ్వతమైన ముక్తిని ప్రసాదిస్తాను అనుకొన్నాడు.

మ. స్థిరచిత్తమ్మున గొల్చుచున్న నతనిన్ చేయెత్తిదీవించె శాం
కరి కళ్యాణి భవాని బాల "నరుడా! కళ్యాణమౌనీకు! శం
కరు నాశీర్వచనంబునొందితివి యింకన్ నీవు కైలాస మం
దిరమున్ జేరి సుఖింపరా!" యనుచు నాదేశించె నాశీస్సుగా 161

ఈశ్వరధ్యానంలో స్థిరంగా మునిగియున్న శివశర్మను అమ్మవారు "కైలాసానికి రమ్మ"ని ఆశీర్వదించింది .

ఉ. చిక్కనికాంతి నింపుకొని శ్రీ శివశర్మ విముక్తినొందగా
దిక్కగుశంకరున్ గనుచు దేవరమూర్తి నిదర్శనమ్ముగా
మ్రొక్కి సదాశివాయనుచు మోకరిలెన్ గుడిలోన ! వెల్గు సౌ
రెక్కి రహించుచున్ పలవరించుచు నీశునిలో కరంగెడిన్ 162

అమ్మవారిఆదేశంప్రకారం ముక్తిని పొందటానికి శివశర్మ పరమేశ్వరునివైపు ముఖాన్ని ఉంచి మోకరిల్లాడు. అతని ప్రాణం శివునిలో కలిసిపోయింది.

ఉ. ఈశుడు కాంతివంతుడయె నీ శివశర్మని హంసజేర; వి
శ్వేశుడు నెమ్మదిన్ గని రహించె ప్రభాకరునట్లు భాగ్య సం
దేశము నిచ్చుచున్ "తనవిధిన్ గమనించిన సత్యశీలికిన్
నాశము కల్గబోదు యఘునాశముదప్ప ధరాతలమ్మునన్"! 163

శివశర్మ హంస తనను కలవటం వల్ల ఈశ్వరుని వెలుగు పెరిగింది.అప్పుడు శివుడు సూర్యునిలా ప్రకాశిస్తూ అన్యాపదేశంగా ప్రజలకు ఒక సందేశం ఇచ్చాడు. తనవిధిని తాను నిర్వహించిన సత్యశీలికి ఎన్నటికీ నాశనం కలగదు. అతడు పాపవిముక్తుడవుతాడు అని ఆ సందేశం.

తరలము: చమురులుండిన యంతకాలము చక్కగానొకదీపమున్
తమముజీల్చి వెలుంగులిచ్చు నుదారతత్వము బూనుచున్
క్రమముగా పరమాత్మజేరుటకై తపించుచు లీనమై
సమయమింత లభించినప్పుడు శంకరున్ దరిజేరెడిన్ 164

(న,భ,ర,స,జ,జ,గ,గణాలు;1-12 యతి)

చమురున్నంతకాలం దీపం వెలుగుతుంది . చీకట్లను చీల్చి సమర్ధవంతంగా వెలుగులు నింపుతుంది. ఆ చమురు అయిపోతే దీపం కొండెక్కుతుంది. అంటే మలిగిపోతుంది. అనగా తన ధర్మం తీరినతరువాత చిన్నదీపం పెద్దదీపంలో కలిసిపోతుంది. పరమాత్మునిలో లీనమౌతుంది. అలాగే శివశర్మ జీవితం జరిగిపోయింది.

ఉ. చేసిన కర్మపాకమున చిక్కును జీవుడు దేహమందు ను
చ్ఛ్వాసముతోడ సత్త్వగుణ సంపదనొందిన దీప్తిహెచ్చి యా
వాసిత జీవకాంతి పరివర్తనతో పరమాత్మజేరు; లే
దా సుఖనిద్రలో దవిలి తథ్యముగా పతనోన్ముఖుండగున్ 165

చేసుకున్న కర్మవల్ల జీవుడు దేహాన్ని ధరిస్తాడు. ఊపిరిద్వారా సాత్వికగుణాలను పెంచుకుంటే జీవకాంతి పెరుగుతుంది.దానివల్ల పరమాత్మను చేరుతాడు.లేదా నిద్రలోనే మలిగిపోతాడు.

మ. చిఱుకాంతిన్ పెదకాంతిలోగలిపి సచ్చిద్రూపుడౌ యీశ్వరున్
కఱకంఠున్ పరమాత్ము జేరుటకునై గ్రాలున్ గదాదివ్వె! ని
వ్వెఱపాటింతయులేక నిత్యమతనిన్ వీక్షించుచున్ శంకరా
దఱిజేరన్ వరమీయరా యనగ తత్త్వంబొప్ప దీపించెడిన్ ! 166

జీవునిలోఉన్నచిన్నదీపం ఈశ్వరునిలోనిపెద్దదీపంలో కలవటానికి ప్రయత్నిస్తుంది. అందుకోసమే నిత్యమూ ఈశ్వరుణ్ణి వెతుకుతూ అతనిలో లీనం కావాలని ఆశిస్తుంది.

ఉ. దివ్వె వెలుంగజేయగల ధీయుతు డుండిన కాంతివంతమై
దివ్వె వెలుంగు; లేనపుడు దీప్తి యణంగి తమోవిలీనమై
యవ్వలితీర మానక సహాయమొకింతయులేక భూతమై
నవ్వులపాలగున్ దిశలు నవ్వుచు హేళనసేయ కట్టెయై 167

మనిషిలోపలనున్నదీపాన్నివెలిగించుకోగలబుద్ధిమంతుడైతే ఆదీపంకాంతివంతమౌతుంది.లేకపోతేఅవ్వలి తీరాన్ని చేరలేక,సహాయపడే దిక్కులేక, దిక్కులు నవ్వుతూ హేళన చేస్తుంటే ఈ కట్టె భూతంగా మారి నవ్వులపాలవుతుంది.

ఉ. కట్టెనుజూచి యగ్ని వెస కాల్పదలంచును; లోనజేరి య
ట్టట్టె క్రమంబుగా పెరిగి టప్పునగూల్చి విబూదిజేసి లో
గుట్టునుబీల్చివైచి యనుకూలతనంతయు నారగించి పొ
మ్మెట్టుల బోదువో యనుచు మేకొని వీడు మృతావశేషమున్ 168

విగతజీవమైన కట్టెను చూసి అగ్ని వెంటనే దహించాలని చూస్తుంది. లోపల ప్రవేశించి మొత్తాన్ని పీల్చివేయాలని చూస్తుంది.ఆతరువాత మృతావశేషాన్నివదిలేసిఅగ్నివెళ్ళిపోతుంది.కనుక జీవంఉన్న ఈ నాలుగునాళ్ళే జీవి భోగం.

ఉ. దేహమువీడుచుండి ఘనదీప్తిమెయిన్ శివశర్మజీవి సం
దేహములేక నాత్మభవు దివ్యపదమ్ముల బుద్ధినిల్పి యా
వాహనజేసి తన్మయత భాసిలగా నుతియించె నిట్లు స
మ్మోహపరంపరా కలిత మోదమనంబును జాగరించుచున్ 169

దేహాన్నివిడుస్తూశివశర్మజీవం పరమేశ్వరునిపై దృష్టినుంచి సంతోషంతో , తన్మయత్వంతో ఇలా స్తుతించింది

పంచచామరం: జయమ్ములోకనాయకా!దిశాప్రశాంత పాలకా!
భయమ్ముదీర్చి కావరా!శుభప్రదా!మహేశ్వరా!
నయమ్మెరుంగజాలరా!వినమ్రునై భజింతురా !
రయమ్మునన్ కరాంబుజాను రాగభావమీయరా! **170**

పంచచామరం: దయామయా! సమస్తమున్ సదాయనుగ్రహింపరా !
ప్రియంకరా! మహేశ్వరా! యభీష్టమిచ్చి బ్రోవరా!
వియత్తలంబు డిగ్గిరా! సుభిక్షమిచ్చు దేవరా!
త్రయంబకా! జగద్ధితా! వరప్రదాయకా!శివా! **171**

పంచచామరం: భవాంబుధిన్ తరింపగల్గు భాగ్యమిచ్చి బ్రోవరా
శివుండవై భవుండవై విశేషపుణ్యదాతవై
భువిన్ ప్రశాంతినీయరా ప్రభో! దయన్ వహింపరా
శివైక్యమిచ్చి కావరా! విశిష్టముక్తిదాయకా! **172**

పంచచామరం: మహాశివా! మహేశ్వరా! ప్రమాదముల్ నశింపగా
సహాయమిచ్చి బ్రోవరా! ప్రశాంతిగూర్ప రమ్మురా!
రహించు భక్తిభావనావిరాజమానచేతనన్
మహాప్రభో భజింతునిన్ను మౌనమేల దేవరా! 173

పంచచామరం: త్రిలోకముల్ వెలుంగజేయు తేజమీవె శంకరా
యలౌకికాత్మవీవెరా మహాత్మ చేదుకొమ్మురా
వెలుంగుదారి జూపరా రవిప్రభల్ రహింపరా
విలాసమింకజాలు నా యభీష్టసిద్ధినీయరా! **174**

చం. అని శివశర్మ జీవమిటులా పరమాత్ముని లోదలంచుచున్
తనువునువీడి యీశ్వరపదాంబుజముల్ స్పృశియించి వానిలో
ఘనతరమై వెలింగె నతికాంతియుతమ్ముగ చంచలద్యుతుల్
ఘనతర మేఘమాలికల గర్భమునందు విలీనమౌనటుల్ 175

పరమేశ్వరుని తనలో తలచుకుంటూ శివశర్మ జీవం గొప్పకాంతుల్ని వెదజల్లుతూ ఆయనలో కలిసిపోయింది.

చం. మెఱుపులనీను కాంతివలె మేకొని యా శివశర్మ భార్య క్రొ
మ్మెఱుగులనీనుచున్ పతినిమించిన భక్తిని భర్తతోడ చె
చ్చెఱ పరమేశ్వరున్ గలిసె! సిద్ధి గడించిన వీరలిర్వురున్
చిఱుదరహాసమై వెలిగె శ్రీజలధీశ్వరు మోముపై నటన్ 176

శివశర్మ భార్య దేహంనుంచి కూడా మెఱపుల వంటి కాంతి వెలుగులను ప్రసరిస్తూ భర్తవెలుగులతో కలిసి ఈశ్వరునిలో మిళితమయ్యింది. వీరిద్దరి ఆత్మకాంతులు జలధీశ్వరుని ముఖంపై నాట్యమాడాయి.

ఉ. లోకులమాటలెన్నక ప్రలోభములన్ గణియింపకుండ నే
వ్యాకులపాటునొందక నవారితభక్తిప్రపత్తు లూనుచున్
భీకర జీవితాంబుధిని పోడిమిదాటి విముక్తినొందె నౌ
రా! కులదంపతుల్ గుణవిరాజితు లీశ్వరలీల పండగన్ 177

లోకులు ఈ విధంగా మాట్లాడినా లెక్కచేయకుండా, మనోవ్యాకులత పొందకుండా నిశ్చలమైన భక్తిప్రపత్తులతో జీవితమనే మహాసముద్రాన్ని తిన్నగాదాటి పరమేశ్వరుని అనుగ్రహాన్ని పొంది జీవన్ముక్తిని సాధించారు .

మందాక్రాంత : శ్రీవార్ధీశా! సుగుణవరదా! చిన్మయానందరూపా
సేవాభాగ్యంబొసగుము శివా! చింతలన్ దీర్చవయ్యా!
కావన్ రారా! జలధివిభుడా! కామితార్థమ్ములీరా!
జీవంబీవే యగుదువుగదా! చిద్విలాసస్వరూపా! 178

మందాక్రాంత : కాశీవాసా! నిగమవినుతా! కామితార్థప్రదాతా !
శ్రీశైలేశా! భవభయహరా! సిద్ధసంకల్పధీరా!
ఆశావాసా! అమరవినుతా! యంజలింతున్ మహేశా!
క్లేశంబెల్లన్ తొలగునటు నీ లీలలన్ జూపుమీశా! **179**

మందాక్రాంత : ముక్కంటీ నీవిభవమెసగన్ ముక్తిసంపత్తి నిమ్మా!
పెక్కండ్రీ భూతలమునశివా! ప్రీతిసేవింపనుండెన్
మ్రొక్కంగా కామితములొసగన్ మ్రోలనే నిల్చుతండ్రీ!
దిక్కౌనీవే జలధివిభుడా! దీనబంధూ! దయాళూ! **180**

మందాక్రాంత : కాపాడంగా తగుదువుగదా! గౌరిగంగాధరేశా!
తాపోద్రేకం బణచుముశివా! దర్పగర్వాపహారీ!

ప్రాపౌనీవే సకలజగతీ భాగ్య సంపత్ప్రదాతా !
నీపైభక్తిన్ నిలిపితినిటన్ నిర్మలానందమూర్తీ! 181

మందాక్రాంత: బాలాంబా మా మొరలువినవే భద్రమీవే మదంబా!
జాలమ్మేలా తనయులము మా సంగతిన్ గానరావే
పాలింపంగా గనవెజననీ భాగ్యసంపన్నశీలీ!
మేలింపొందన్ గలుగునటులక్ష్మీ కృపంజూడుమమ్మా! 183

మంగళమహాశ్రీ: శ్రీలు రహియింప భవసేవలొనరింప తమ చిత్తముల దీక్షగొనువారల్
కాలగమనంబున సుఖమ్ములొనగూడగ వికాసమునుబొందిసుఖియించున్
లీల పరమేశ్వరుని లేఖనములెట్లయిన లెస్స ఫలితమ్ము లిల కల్గున్
బాలజలధీశ్వరుని పాలనము నొందిన శుభంబులవి కొల్లలుగ జేరున్ 184

హే పరమేశ్వరా!నిన్ను సేవించాలని మనసులోభావించినవారికి కాలగమనంలో చక్కని సుఖం లభిస్తుంది. ఇంతకుముందు పరమాత్మ ఏమనిలిఖితం వ్రాసినా, శివపూజవలన ఆ లిఖితం మారిపోతుంది. శుభఫలితాలు కలుగుతాయి. శ్రీబాలా జలధీశ్వరస్వామి వారిని సేవిస్తే కోకొల్లలుగా శుభములు లభిస్తాయి.

ఇతి శమ్ .

ఇదికృష్ణాతీరవాసి–వేదవేదాంగవిపులపురాణేతిహాస–
సంస్కృతకావ్యవ్యాఖ్యానమహోదధీ–కవిశిఖామణి–వైదిక ధర్మకర్మచింతామణి–ఘంటసాలపురశిరోమణి –
శ్రీమచ్చింతలపాటిలక్ష్మీనృసింహశాస్త్రివర్యులకుమారుడు:కావ్యవిమర్శనామర్మజ్ఞ– సహజకవితా కళాభిజ్ఞ –
కావ్యకళాప్రపూర్ణ–మోహనమురళీకృష్ణశర్మచేవ్రాయబడిన“సిరిదివ్వెలు”కావ్యము –
– తృతీయాశ్వాసము –
సంపూర్ణము.

సిరిదివ్వెలు

ఈ కావ్యంలోని 3 ఆశ్వాసాలలోనూ ఉపయోగించిన ఛందస్సులు-
వాటి లక్షణాలు

1.**శార్దూలం**: మ,స,జ,స,త,త,గ; 1-13 యతి

2. **మత్తేభం** : స,భ,ర,న,మ,య,వ; 1-14 యతి

3. **ఉత్పలమాల**: భ,ర,న,భ,భ,ర,వ; 1-10 యతి

4.**చంపకమాల**: న,జ,భ,జ,జ,జ,ర ; 1-11 యతి

5.**సీసం**:ప్రతిపాదానికి6ఇంద్రగణాలు+2సూర్యగణాలు;1-3;5-7గణాదియతిస్థానాలు

6.**తేటగీతి:**ప్రతిపాదానికి:1సూ+2ఇం+2సూ.గణాలు;1-4గణాదిని యతి;

7.**ఆటవెలది**:1.3 పాదాలలో 3సూ+2ఇం.గణాలు; 2,4 పాదాలలో 5సూర్యగణాలు.

1-4 గణాదిని యతి స్థానం .

8. **కందం**: 1).గగ, భ,జ,స,నల, అనే చాతుర్మాత్రాగణాలను వాడుతారు.2). 1-3 పాదాలలో ఏవైనా 3 గణాలు, 2-4 పాదాలలో ఏవైనా 5 గణాలు ఉంటాయి.3).తొలి పాదాదిని దీర్ఘాక్షరం ఉంటే 4 పాదాలలోనూ దీర్ఘాక్షరాలే ఉండాలి.4). 2-4 పాదాలు గురువుతో అంతం కావాలి.5). బేసి గణం జగణం ఉండరాదు.6). 2-4 పాదాలలో 3వ గణం జగణం కానీ, నల కానీ ఉండాలి.7). 2-4 పాదాలలోనే యతి ఉంటుంది.8). అది 1-4 గణాల ఆద్యక్షరంతో నిలపాలి.

9.**కవిరాజవిరాజితము**: 1నగణము+ 6జగణములు+1వగణము; 1-8-14-20 స్థానాల్లో యథి నిలపాలి. ప్రాస ఉంటుంది. ప్రాసయతి వేయరాదు.

10.**మానిని:** 7భగణములు+1గురువు. 1-7-19 యతి. ప్రాస ఉంటుంది.

11.**మందాక్రాంత** : మ,భ,న,త,త,గగ ;1-11 యతి.ప్రాస ఉంటుంది. ప్రాసయతి లేదు

12. **శిఖరిణీ:** మ,భ,న,స,భ,వ;1-13 యతి; ప్రాస ఉంది.ప్రాసయతి లేదు.

13.**పంచచామరము** : జ,ర,జ,ర,జ,గ ;1-10 యతి;ప్రాస ఉంటుంది.ప్రాసయతి లేదు

14. **లయగ్రాహి** : భ,జ,స,న,భ,జ,స,న,భ,య;2-10-18-26యతి స్థానాలు. ప్రాసయతి వేయాలి. ప్రాస కూడా నిలపాలి.

15. **ఉత్సాహ** : 7సూర్యగణాలు+1గురువు;1-10 యతి.ప్రాస పాటించాలి. ప్రాసయతి కూడదు.

16. **మత్తకోకిల :** ర,స,జ,జ,భ,ర: 1-11యతి;ప్రాస ఉంటుంది.ప్రాసయతి కూడదు.

17. **అనుష్టుప్** : 4 పాదాలుంటాయి. పాదానికి 8 అక్షరాలుంటాయి. ప్రతిపాదంలోను 5వ అక్షరం లఘువు ఉండాలి. అన్నిటిలో 6వ అక్షరం గురువు ఉండాలి. 1-3 పాదాల్లో 7వ అక్షరం గురువే కావాలి. 2-4 పాదాల్లో 7వ అక్షరం లఘువే కావాలి.

18. **వసంతతిలకం** : త,భ,జ,జ,గగ;1-11 యతి. ప్రాస ఉంటుంది. ప్రాసయతి లేదు.

19. **మంజుభాషిణి** : స,జ,స,జ,గ ;1-9 యతి. ప్రాసవేయాలి. ప్రాసయతిలేదు.

20. **తోటకం** : 4 సగణాలు;1-9 యతి.ప్రాస ఉంది. ప్రాసయతి లేదు.

21. **భుజంగప్రయాతం** :4 యగణాలు; 1-8 యతి.ప్రాస ఉంది. ప్రాసయతి లేదు.

22. **స్రగ్విణి** : 4రగణాలు;1-7 యతి.ప్రాస ఉంది. ప్రాస యతి లేదు.

23. **వనమయూరం** :భ,జ,స,న,గగ; 1-9 యతి. ప్రాస ఉంది. ప్రాసయతి లేదు.

24. **మహాస్రగ్ధర**: స,త,త,న,స,ర,ర,గ;1-9-16 యతులు.ప్రాసఉంది. ప్రాసయతి లేదు

25. **మంగళమహాశ్రీ** : భ,జ,స,న,భ,జ,స,న,గగ;1-9-17 యతులు.ప్రాస ఉంది.ప్రాస యతి లేదు.

26. **క్రౌంచపదం** :భ,మ,స,భ,న,న,న,య;1-11-19యతులు.ప్రాస ఉంది.ప్రాసయతి లేదు

27. **లాక్షణీ:** భ,న,న,న,న,భ,న,న,స;1-16యతి.ప్రాస ఉంది .ప్రాసయతి లేదు.

28. **లాటీవిటము**:4సగణములు,+మ,త,య;1-13యతి.ప్రాస ఉంది .ప్రాసయతి లేదు

29.**ధ్రువకోకిల(తరలము):**న,భ,ర,స,జ,జ,గ;1-12యతి.ప్రాసఉంది.ప్రాసయతి లేదు

30.**అభినవతామరసము(తోవకము):**స,జ,జ,య;1:8యతి. ప్రాసఉంది.ప్రాసయతి లేదు.

31.**పాలాశదళము** :5నగణాలు అనగా 15 లఘువులు+గ గ;1-11 యతి. ప్రాసఉంది.ప్రాసయతి లేదు

32.**మణిగణనికరము**:4 నగణములు+1సగణం;1-9యతి. ప్రాసఉంది.ప్రాసయతి లేదు

33. **వంశస్థము**:జ,త,జ,ర;1-8యతి. ప్రాసఉంది.ప్రాసయతి లేదు

34. **తురగము**: 4 నగణములు+స,జ,జ,గ;1-15యతి. ప్రాసఉంది.ప్రాసయతి లేదు

35. **కమలవిలసితము** : 4నగణములు+గ గ;1-9యతి. ప్రాసఉంది.ప్రాసయతి లేదు

36.**అశ్వధాటి:**త,భ,య,జ,స,ర,న,గ;1-7-14యతి.ప్రాసఉండాలి.ప్రాసయతివేయాలి

వీటిలోప్రత్యేకఛందస్సులనుతొలిగాఉపయోగించినసందర్భంలోతాత్పర్య వివరణలో వాటిలోని ఛందో విశేషాలు వివరించబడినవి.

డా. చింతలపాటి మురళీకృష్ణ ఇప్పటికి చేసిన రచనలు :

1.చీకటిలో సిరివెన్నెల (వచనకవితా సంపుటి) ముద్రితం
2.సిరిమువ్వలు (వచనకవితా సంపుటి) ముద్రితం
3.సిరిమల్లెలు (333 పద్యాలతో శ్రీవేంకటేశ్వర త్రిశతి) ముద్రితం
4.సిరికోవెల(305 పద్యాలతో శ్రీకాకుళాంధ్ర మహావిష్ణుచారిత్రక ఐతిహ్యం) ముద్రితం
5.సిరిదివ్వెలు(606పద్యాలతోజలధీశ్వరస్వామిమహిమలు) ముద్రితం
6.తెలుగుతేజం(10శీర్షికలు:150పద్యాలఖండకావ్యం) ముద్రితం

7.సిరిహేలలు-(ఆస్ట్రేలియా గోల్డ్ కోస్ట్ స్పందనతో వచనకవితా సంపుటి) అముద్రితం

8.సిరిచింతన (108పద్యాలు-కామేశ్వరీ శతకం) అముద్రితం

9.శ్రీ సూర్య శతకం(108పద్యాలు- కరోనా నేపథ్యం) అముద్రితం
10.సిరితేజం (108.శ్రీ సింహాచల నరసింహ శతకం) ముద్రితం

11.సిరివైఖరి (25శీర్షికలు-333 పద్యాల ఖండకావ్యం) అముద్రితం
12.వాఙ్మయి(25 శీర్షికలు–337 పద్యాల ఖండకావ్యం) ముద్రితం

13.అస్త్రాలయ శతకం (120 పద్యాలు) అముద్రితం

14.లహరి (10 శీర్షికలు -132 పద్యాల ఖండకావ్యం) అముద్రితం
15.మేఘసందేశం(10 శీర్షికలు–142 పద్యాల ఖండకావ్యం) ముద్రితం

16.వెన్నెల(9 శీర్షికలు-148 పద్యాల ఖండకావ్యం) ముద్రితం

17.కథాకేళి (25 కథల సంపుటం) అముద్రితం

18.సిరివెలుగులు(అధ్యాత్మిక వచన గ్రంథం) అముద్రితం

19.**శ్రీలక్ష్మణయతీంద్రులరచనలు:అనుశీలనము**-పరిశోధన ముద్రితం

20.కవితాత్మ (6 శీర్షికలు :108పద్యాలు) అముద్రితం

21. సిరికిరణాలు (ఖండకావ్యం) అముద్రితం
22. కింపురుష (పద్యకావ్యం) ముద్రితం
23. సిరిగీతిక (ఖండకావ్యం) ముద్రితం
24. కచ్ఛపి (ఖండకావ్యం) ముద్రితం
25. సో2హం(పద్యకావ్యము) ముద్రితం

ఇప్పటికి గ్రంథస్థం చేసిన పద్యాలు మొత్తం :5,000 పద్యాలు



రచయిత గురించి.....

డా. చింతలపాటి మోహన మురళీ కృష్ణ సుప్రసిద్ధ పద్యకవి. ఇప్పటికి మూడువేలకు పైగా పద్యాలను వ్రాసి యున్నారు. 20 రచనలను చేశారు. శ్రీ లక్ష్మణయతీంద్రుల రచనలపై పరిశోధనావ్యాసానికి P.hD., పట్టా పొందారు. వచనకవితలు, కథారచనలు, పత్రికా రచనలు, వార్తావ్యాఖ్యలు, రేడియోకార్యక్రమాలు, ఎన్నెన్నోచేశారు. తెలుగు కావ్యాల గురించి, భాషావిశేషాల గురించి, భారత, భాగవత, రామాయణాలపై 300 పైగా వీడియోలను యూట్యూబులో ఉంచారు. తెలుగు పంచకావ్యాల గురించి ఆస్ట్రేలియానుంచి నెలలతరబడి ఉపన్యాసాలు చేశారు. వీరి తెలుగు తేజం ఖండకావ్యం మండలిఫౌండేషన్ వారి అవార్డును గెలుచుకొంది. సహజకవితాకళాభిజ్ఞ, కావ్యకళాప్రపూర్ణ బిరుదులను పొందారు. వాస్తు జ్యోతిష, పండితులుగా ఏభైయేళ్ళ నుండి సేవలను అందిస్తున్నారు. వీరి శ్రీమతి బాలకృష్ణ కుమారి తెలుగు భాషా సాహిత్యాలలో M.A., చేసి 40 సం.ల పాటు గజటెడ్ హెడ్మాస్టర్‌గా పనిచేశారు. రచనలలో మురళీకృష్ణ గారికి సహకరిస్తుంటారు.